www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

మంగళవారం | 19-8-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 164 | గుంటూరు సిటీ

Guntur | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, శ్రావణమాసం, బహుళపక్షం, తిథి: ఏకాదశి మ.3:33 తదుపరి ద్వాదశి, నక్షత్రం: ఆర్ద్ర రా.1:08 తదుపరి పునర్వసు, వర్జ్యం: ఉ.10:09-11:41, దుర్ముహూర్తం: ఉ.8:33-9:23, రా.10:19-11:04, అమృతఘడియలు: మ.3:32-5:04, రాహుకాలం: మ.3:00-4:30, సూర్యోదయం: 6:02, సూర్యాస్తమయం: 6:34

ఐకానిక్‌గా రాజధాని నిర్మాణాలు

యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టండి

మరే ప్రాంతానికీ ఇన్ని భౌగోళిక అనుకూలతలు లేవు.. కాలుష్య రహిత పరిశ్రమలకు ప్రాధాన్యం

త్వరలో అమరావతికి బయో ఇంజనీరింగ్ వర్సిటీ.. సీఆర్డీఏ అథారిటీ భేటీలో చంద్రబాబు వెల్లడి

904 కోట్లతో రాజధాని గ్రామాలకు వసతులు.. అమరావతిలో కీలక ప్రాజెక్టులకు ఎస్పీవీ ఏర్పాటు

మంగళగిరిలో గోల్డ్ క్లస్టర్ కోసం భూసమీకరణ.. మొత్తం 9 ప్రతిపాదనలకు అథారిటీ ఆమోదం

పురపాలక శాఖ మంత్రి నారాయణ వెల్లడి 3



సీఈసీ జ్ఞానేశ్‌పై అభిశంసన?

ఇండియా కూటమి పార్టీల యోచన

ఆరోపణలకు సమాధానం చెప్పకుండా జ్ఞానేశ్ ఎదురు దాడికి దిగడంపై ఆగ్రహం

సీఈసీ కాదు.. బీజేపీ అధికార ప్రతినిధి

అవకతవకల్లేవని ఈసీ అఫిడవిట్ ఇస్తే.. ఉన్నాయని ఇచ్చేందుకు మేం సిద్ధం: కాంగ్రెస్

2022లో మా పార్టీ మద్దతుదారుల ఓట్లను తొలగించడంపై 18 వేల అఫిడవిట్లు దాఖలు

వాటిపై ఈసీ ఏ చర్యా తీసుకోలేదు: ఎస్పీ

రాజకీయ యజమానుల్ని మెప్పించే బదులు సీఈసీ రాజీనామా చేయాలి: తృణమూల్

ప్రతిపక్షంపై ఈసీ యుద్ధం: సీపీఎం

న్యూఢిల్లీ, ఆగస్టు 18: ఎన్నికల సంఘ ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ మీద పార్లమెంటులో అభిశంసన తీర్మానం ప్రవేశపెట్టాలని ప్రతిపక్ష కూటమి యోచిస్తోంది. ఓటర్ల జాబితాల్లో భారీ ఎత్తున అవకతవకలు జరుగుతున్నాయని ఇండీ కూటమి కొద్ది వారాలుగా ఆందోళన చేస్తున్న సంగతి తెలిసిందే. ఇదంతా ప్రతిపక్షాలు ఉద్దేశపూర్వకంగా చేస్తున్న ప్రచారమని, అన్ని పార్టీల ప్రమేయంతోనే ఓటర్ల జాబితా రూపు దిద్దుకుంటుందని, ఏ దశలోనూ అభ్యంతరం చెప్పకుండా ఇప్పుడు అవకతవకలు అంటే ఎలా అని ప్రధాన కమిషనర్ ఎదురుదాడికి దిగారు. ఓటర్ల జాబితాలో అవకతవకలు ఉన్నాయని భావిస్తే ప్రమాణపూర్వకంగా అఫిడవిట్ సమర్పించాలని ఆదివారం విలేకరుల సమావేశంలో డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో ప్రధాన కమిషనర్‌పై అభిశంసన తీర్మానాన్ని ప్రవేశపెట్టాలని ప్రతిపక్షం యోచిస్తోంది. తీర్మానం ఏ సభలో ప్రవేశపెట్టాలన్నా కనీసం 50 మంది ఎంపీల మద్దతు కావాలి. ఉభయ సభల్లో మూడింట రెండు వంతుల మెజారిటీతో నెగ్గాలి. అది సాధ్యమైన విషయం కాకపోయినా ఎన్నికల సంఘం మీద ఒత్తిడి తేవడానికి

మిగతా 2వ పేజీలో...



'ఎస్ఐఆర్'కు వ్యతిరేకంగా పార్లమెంట్ ఆవరణలో ఇండియా కూటమి ఎంపీల నిరసన. చిత్రంలో ఖర్గే, అఖిలేశ్ యాదవ్, అభిషేక్ బెనర్జీ తదితరులు

ఉపరాష్ట్రపతి పదవికి తిరుచీ శివ!

తమిళనాడు డీఎంకే ఎంపీ పేరు తెరపైకి.. ఇండియా కూటమి వ్యూహాత్మక నిర్ణయం 2

ఎన్‌డీఏ అభ్యర్థికి జగన్ జై!

రాధాకృష్ణన్‌కు మద్దతు కోసం రాజ్‌నాథ్ ఫోన్

సానుకూలంగా స్పందించిన మాజీ సీఎం 13

ఓటు చోరీకి ఆయుధంగా ఎస్ఐఆర్

రెండో రోజు యాత్రలో రాహుల్ ధ్వజం 2



అక్కడెక్కడో, అప్పుడెప్పుడో ఎన్నికల్లో రిగ్గింగ్ చేస్తున్న వీడియో దొరికిందా? దానిని ఒంటిమిట్ట, పులివెందుల జడ్పీటీసీ పోలింగ్‌కు ముడిపెట్టేయడమే!

వాగులో నీరు పొంగిందా? అయితే... ఒక ఊరు మొత్తం మునిగిందని హోరెత్తించడమే!

రాజధాని ప్రాంతంలో భారీ వర్షాలకు పొలాల్లో నీరు నిలబడిందా? ఇంకేముంది... 'వరదలో మునిగిపోయిన అమరావతి' అని సంబరాలు చేసుకోవడమే!

ప్రకాశం బ్యారేజీకి ఉన్న 70 గేట్లలో ఒక్కటి మొరాయించి, మిగిలిన 69 గేట్ల ద్వారా వరదనీరు స్వేచ్ఛగా దిగువకు పోతున్నా సరే... 'పనిచేయని గేటు... విజయవాడ మునిగిపోతుంది' అని బెంబేలెత్తించడమే!

వైసీపీ సోషల్ సైకో బ్యాచ్ మళ్లీ రెచ్చిపోతోంది! 'కాదేదీ తప్పుడు ప్రచారానికనర్హం' అంటూ పెట్టుబడులు, వర్షాలు, ఎన్నికలు ఇలా ప్రతి అంశాన్నీ బురదచల్లేందుకు వాడుకుంటోంది. అసత్యాలు, అర్ధసత్యాలు, వక్రీకరణలతో జగన్ రోత మీడియా తప్పుడు కథనాలను ప్రచురించడం... వాటిని అందుకుని సైకో బ్యాచ్ సోషల్ మీడియాలో హోరెత్తించడం! మార్ఫింగ్, ఏఐ ఫొటోలతో కూటమి నేతల కుటుంబ సభ్యుల వ్యక్తిత్వ హననానికి దిగడమూ పెరిగిపోయింది.

శాడిస్టు సైకోలు!

ఫేక్ ప్రచారంతో రెచ్చిపోతున్నారు

జగన్ రోత పత్రికలో తప్పుడు రాతలు

సోషల్ మీడియాలో కుళ్లు పోస్టులు

పొలాల్లో నీరు చూపి అమరావతి మునకంటూ ప్రచారం

బెంగాల్ రిగ్గింగ్ వీడియోకు పులివెందులతో ముడి

ఏ అంశాన్నీ వదలకుండా అసత్యాలు, వక్రీకరణలు

కూటమి నేతలు, కుటుంబ సభ్యులపైనా దాడి

ఫేక్ ప్రచారంలో భాగమవుతున్న ఉద్యోగులు

కఠినంగా వ్యవహరించకుంటే తీవ్ర నష్టమే!

సమగ్ర కథనం 14లో

అమరావతి మునిగిపోయిందంటూ... వ్యంగ్య వ్యాఖ్యలు జోడిస్తూ సోషల్ మీడియాలో పోస్టు పెట్టిన సుభాష్ చంద్రబోస్ తిరుపతిలో వాణిజ్య పన్నుల శాఖ అధికారిగా పని చేస్తున్నారు. 'అమరావతి కోసం మూడు రిజర్వాయర్లు ఎందుకు? అమరావతినే రిజర్వాయర్‌గా కడితే పోలా?' అంటూ మరో పోస్టు పెట్టారు. వైసీపీ అధికారంలో ఉండగా... ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడాలంటేనే గజగజ వణికిపోయేవారు. ప్రభుత్వ కార్యాలయాల్లో అప్రకటిత ఎమర్జెన్సీనే. మరి ఇప్పుడో..!?



విషం చిమ్మేవారితో జాగ్రత్త!

రాజధాని కోసం పొన్నూరును ముంచామంటారు 14

ప్రకాశం బ్యారేజీ ప్రమాదంలో పడిందంటారు

ప్రభుత్వాన్ని అప్రతిష్ఠపాలు చేయాలనేదే లక్ష్యం

చొరవతో నాయకులు, మంత్రులు తిప్పికొట్టాలి

నేతలకు సీఎం దిశా నిర్దేశం

రాష్ట్రాభివృద్ధికి సహకరించండి

కేంద్ర మంత్రులకు లోకేశ్ అభ్యర్థన

నిర్మల, నడ్డా, గడ్కరీ, పురీ, సానోవాల్, జైశంకర్, వైష్ణవ్, పీయూష్‌లతో భేటీ

యూరియా కొరత తీర్చండి.. కానూరు-బందరు రోడ్డు విస్తరించండి

డేటా సిటీ స్థాపనకు చేయూతనివ్వండి.. బీపీసీఎల్ రిఫైనరీకి సహకరించండి

దుగరాజపట్నం పోర్టు అభివృద్ధి చేయండి.. విదేశాల్లోని 35 లక్షల మంది ప్రవాసాంధ్రుల సంక్షేమానికి బీమా స్కీంలు విస్తరించండి

ప్లాస్టిక్ పార్క్‌కు సహకరించండి.. విశాఖలో నైపర్ శాశ్వత క్యాంపస్ ఏర్పాటు చేయండి.. క్వాంటమ్ వ్యాలీకి రూ.1,000 కోట్లివ్వండి

టాటా ఇన్నోవేషన్ హబ్‌కు మరో 300 కోట్లు.. కేంద్ర మంత్రులకు వినతులు

ఎల్లుండికల్లా 29 వేల టన్నుల యూరియా అందిస్తామని నడ్డా హామీ

న్యూఢిల్లీ, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి సహకరించాలని కేంద్ర మంత్రులకు రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్, విద్యా శాఖల మంత్రి లోకేశ్ విజ్ఞప్తి చేశారు. సోమవారం ఢిల్లీలో కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమం, ఎరువులు, రసాయనాల శాఖల మంత్రి జేపీ నడ్డా.. ఉపరితల రోడ్డు రవాణాశాఖ మంత్రి నితిన్ గడ్కరీ.. విదేశాంగ మంత్రి జైశంకర్.. పెట్రోలియం మంత్రి హర్దీప్ సింగ్ పురీ.. షిప్పింగ్, ఓడరేవులు, జలరవాణా శాఖల మంత్రి సర్బానంద సోనోవాల్.. రైల్వే, ఐటీ, ఎలక్ట్రానిక్స్

మిగతా 13వ పేజీలో...



ఎన్‌డీఏ ఉపరాష్ట్రపతి అభ్యర్థి రాధాకృష్ణన్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న మంత్రి లోకేశ్. చిత్రంలో కేంద్ర మంత్రులు పెమ్మసాని, రామ్మోహన్ నాయుడు



నంద్యాల జిల్లాలో ఎద్దులేరు వరదలో ట్రాక్టర్ ప్రయాణం

వాయు గండం!

కళింగపట్నానికి 110 కి.మీ. దూరంలో కేంద్రీకృతం

నేటి ఉదయం తీరం దాటే అవకాశం 12

నాలుగు జిల్లాల్లో కుంభవృష్టి కురిసే అవకాశం

ఓడరేవుల్లో మూడో నంబరు భద్రతా సూచిక

ముంబైలో రెడ్ అలర్ట్

భారీ వర్షాలతో అతలాకుతలం 11

రవాణా సేవలకు అంతరాయం

రంగంలోకి ఎన్డీఆర్ఎఫ్, సైన్యం


రేపు మెగా డీఎస్సీ జాబితా?

తొలుత సర్టిఫికెట్ల పరిశీలనకు సంబంధించి అభ్యర్థుల లిస్టు 2

హైదరాబాద్ రథయాత్రలో విషాదం

ఇనుప రథానికి తగిలిన కరెంటు వైరు 11

ఐదుగురి మృతి.. నలుగురికి గాయాలు



వైట్‌హౌస్‌లో ట్రంప్‌తో జెలెన్‌స్కీ భేటీ

భారత్ నుంచి అమెరికాకు.. పెరిగిన ఎగుమతులు

7 రెట్ల మేర వృద్ధి.. ట్రంప్ ప్రతీకార సుంకాల వల్లే

వ్యాపారాన్ని పోగొట్టుకోకుండా ఉండేందుకు రాయితీలూ ఇస్తున్న ఎగుమతిదారులు 11

అవసరమైతే ఉక్రెయిన్‌కు అమెరికా దళాలు

శ్వేతసౌధంలో జెలెన్‌స్కీతో భేటీలో ట్రంప్ హామీ

సీఈసీపై అభిశంసన?

(మొదటి పేజీ తరువాయి)

పనికొస్తుందని విపక్షం భావిస్తోంది. తాము లేవనెత్తిన ప్రశ్నలకు జవాబులు ఇచ్చే బదులు ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్.. బీజేపీ అధికార ప్రతినిధిగా మాట్లాడారని ఇండియా కూటమి ధ్వజమెత్తింది. ఒక్క ప్రశ్నకూ ఆయన సమాధానం ఇవ్వలేదని, ఒక రాజ్యాంగ సంస్థకు ప్రతినిధిగా వ్యవహరించే బదులు ఆయన ఒక పార్టీ ప్రతినిధిగా వ్యవహరించారని మండిపడింది. ఎన్నికల ప్రక్రియను నిజాయితీగా నిర్వహిస్తున్నామని ప్రజలకు వివరించే బదులు ప్రతిపక్ష నేతలపై దాడులు చేసేందుకే సీఈసీ ఆదివారం మీడియా సమావేశం ఏర్పాటు చేశారని విమర్శించింది. ఇండియా కూటమి తరపున పలువురు ఎంపీలు సోమవారం విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ ఎంపీ గౌరవ్ గొగోయ్ మాట్లాడుతూ.. బిహార్ ఓటర్ల జాబితా నుంచి తొలగించిన 65లక్షల మంది పేర్లను విడుదల చేయాల్సిందేనని సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలపై ఎన్నికల ప్రధాన కమిషనర్ ఎలాంటి వివరణా ఇవ్వలేదన్నారు. రాహుల్‌గాంధీని అఫిడవిట్ దాఖలు చేయాలని చెప్పడమే తప్ప మహదేవపుర నియోజకవర్గంలో ఓట్ చోరీపై సీఈసీ స్పందించలేదన్నారు. ఓటర్ల జాబితాలో ఎలాంటి అవకతవకలులేవని ఎన్నికల సంఘం అఫిడవిట్ ఇస్తే అవకతవకలున్నాయని అఫిడవిట్ ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. దేశంలో ఎన్నికల ప్రక్రియను నిజాయితీగా జరిపించడమనే రాజ్యాంగ విధిని నిర్వర్తించడంలో ఎన్నికల సంఘం పూర్తిగా విఫలమైందన్నారు. బీజేపీని ప్రశ్నించిన వారిపై ఎన్నికల సంఘం బెదిరింపులకు దిగుతోందని ఆరోపించారు. ఎన్నికల కమిషనర్లు అన్ని పార్టీల ప్రయోజనాలను సమానంగా కాపాడేందుకు సిద్ధంగా లేరన్నారు. బిహార్‌లో ఓట్ల తొలగింపు, మహదేవపురలో నకిలీ ఓటర్లను అనుమతించడం, మహారాష్ట్రలో 5నెలల్లో 75 లక్షల మంది ఓటర్లను చేర్చడం, 45 రోజుల్లో సీసీటీవీ ఫుటేజ్‌ను తొలగింపు, ఆధార్‌ను అనుమతించకపోవడంపై సమాధానమివ్వకుండా సీఈసీ తప్పించుకున్నారని గొగోయ్ విమర్శించారు. సమాజ్‌వాదీ పార్టీ మద్దతుదార్ల ఓట్లను తొలగించడం మీద తాము 2022లో 18 వేల అఫిడవిట్లు దాఖలు చేశామని ఆ పార్టీ నేత రాంగోపాల్‌యాదవ్ ప్రస్తావించారు. ఎన్నికల సంఘం తాము సమర్పించిన 18 వేల అఫిడవిట్లపై ఏచర్య తీసుకుందని ప్రశ్నించారు. డూప్లికేట్ ఓటర్ ఐడీ కార్డుల గురించి తమ పార్టీ అధినేత మమతా బెనర్జీ ఫిబ్రవరిలోనే ప్రశ్నించినా ఏ చర్యా తీసుకోలేదని తృణమూల్ ఎంపీ మహువా మొయిత్రా అన్నారు. ఎన్నికల సంఘం కీలుబొమ్మలా వ్యవహరిస్తోందన్నారు. రాజకీయ యజమానులను మెప్పించే బదులు ఎన్నికల కమిషనర్ ఉద్యోగానికి రాజీనామా చేయాలని సలహా ఇచ్చారు. బిహార్‌లో ప్రతిపక్షాల ఓటర్ అధికార యాత్ర నుంచి దృష్టి మళ్లించేందుకే ప్రధాన కమిషనర్ విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారని ఆర్జేడీ ఎంపీ మనోజ్ ఝా అన్నారు. ప్రధాన కమిషనర్ పదవిలో ఉండే యోగ్యతను కోల్పోయారని ఆయన ప్రతిపక్ష పార్టీలపైనే యుద్ధం ప్రకటించారని సీపీఎం ఎంపీ జాన్ బ్రిట్టాస్ అన్నారు. న్యూఢిల్లీ నియోజకవర్గంలో 42వేల ఓట్లను తొలగించారని ఆప్ ఎంపీ సంజయ్‌సింగ్ తెలిపారు.



బిహార్‌లో ఎస్ఐఆర్‌కు వ్యతిరేకంగా పార్లమెంటు ఆవరణలో విపక్ష ఎంపీల ఆందోళన



ఓట్ల చోరీపై ఈసీకి స్టాలిన్ ఏడు ప్రశ్నలు

చెన్నై, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ఓట్ల చోరీ అంశంపై కేంద్ర ఎన్నికల సంఘానికి తమిళనాడు సీఎం స్టాలిన్ ఏడు ప్రశ్నలు సంధిస్తూ సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. "ఇంటింటి సర్వే తర్వాత భారీ స్థాయిలో ఓట్ల తొలగింపు ఎలా జరిగింది? కొత్త ఓటర్ల నమోదు ప్రక్రియలో యువ ఓటర్లను పరిగణనలోకి తీసుకున్నారా? బిహార్ ఓటర్ల జాబితా సమయంలో పాటించిన నిబంధనలు ఇతర రాష్ట్రాల ఓటర్ల జాబితా తయారీలోనూపాటిస్తారా? ఆధార్‌ను ఈసీ ఎందుకు వ్యతిరేకిస్తోంది?"అని ప్రశ్నించారు.

ఉపరాష్ట్రపతి పదవికి 'ఇండియా' అభ్యర్థి తిరుచీ శివ!

తమిళనాడు డీఎంకే ఎంపీ పేరు తెరపైకి..



న్యూఢిల్లీ, ఆగస్టు 18 : ఇండియా కూటమి ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా తమిళనాడుకు చెందిన డీఎంకే రాజ్యసభ సభ్యుడు తిరుచీ శివను ఎంపికచేసినట్టు తెలిసింది. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నాయకత్వంలో జరిగే పక్షాల భేటీలో ఆయన పేరును ఖరారు చేస్తారని సమాచారం. అధికార ఎన్డీయే కూటమి ఉపరాష్ట్రపతి పదవికి ఇప్పటికే తమ అభ్యర్థిగా మహారాష్ట్ర గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ పేరును ఖరారుచేసిన విషయం తెలిసిందే. త్వరలో తమిళనాడు అసెంబ్లీకి ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఎన్డీయే వేసిన ఈ ఎత్తుకు ఇండియా కూటమి పై ఎత్తు వేయాలని యోచిస్తోంది. ఈ నేపథ్యంలోనే శివ పేరు తెరపైకి వచ్చింది. రాధాకృష్ణన్ అభ్యర్థిత్వంతో ప్రాంతీయంగా తలెత్తే రాజకీయ సమస్యను దీనివల్ల అధిగమించవచ్చునని ఇండియా శిబిరం భావిస్తోంది. అలాగే.. తమిళనాడుకు చెందిన నేతను ఎంపిక చేయడం వల్ల దక్షిణాది రాష్ట్రాల నుంచి అదనపు మద్దతు పొందవచ్చుననేది ఒక ఆలోచన. కాగా.. రాధాకృష్ణన్ అభ్యర్థిత్వం విషయంలో తమిళనాడులోని అధికార డీఎంకే కూటమిలో చీలిక తలెత్తింది. ఆయనకు మద్దతు ఇచ్చేది లేదని డీఎంకే ఇప్పటికే తేల్చేయగా, భాగస్వామ్య పక్షం ఎండీఎంకే మాత్రం రాధాకృష్ణన్‌కు అభినందనల సందేశం పంపించింది. ప్రతి ఒక్కరినీ రాజకీయాలకు అతీతంగా గౌరవించే సంస్కారం కలిగిన తమిళ నేత కావడం వల్ల రాధాకృష్ణన్ అభ్యర్థిత్వాన్ని బలపరుస్తున్నట్టు ఎండీఎంకే నేత వైగో వెల్లడించారు. ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో నామినేషన్ల దాఖలుకు ఈ నెల 22 చివరి గడువు. వచ్చేనెల 9న పోలింగ్ జరుగుతుంది.

రేపు సీపీ రాధాకృష్ణన్ నామినేషన్!

న్యూఢిల్లీ, ఆగస్టు 18: ఎన్డీయే ఉపరాష్ట్రపతి అభ్యర్థి సీపీ రాధాకృష్ణన్ సోమవారం ఢిల్లీ చేరుకున్నారు. ప్రధాని మోదీని కలిశారు. సాయంత్రం రాధాకృష్ణన్ ఎన్డీయే పార్టీల నేతల సమావేశంలో పాల్గొన్నారు. ఆయన బుధవారం నామినేషన్ వేసే అవకాశం ఉంది. ఈ కార్యక్రమంలో ప్రధాని మోదీ, కేంద్రమంత్రులతో పాటు ఎన్డీయే పాలిత రాష్ట్రాల సీఎంలు, ఉప ముఖ్యమంత్రులు, కీలక నాయకులు పాల్గొంటారని సమాచారం.

సర్వేపల్లి అంతటివాడు కావాలనే ఆ పేరు పెట్టాం

- ఇప్పుడదే నిజమైంది.. సీపీ రాధాకృష్ణన్ తల్లి భావోద్వేగం



చెన్నై, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): 'మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ అంతటివాడు కావాలని ఆకాంక్షించే తన కుమారుడికి ఆయన పేరు పెట్టామని, ఆ నమ్మకం ఇప్పుడు నిజమైందని ఎన్డీఏ తరపున అభ్యర్థి అయిన సీపీ రాధాకృష్ణన్ మాతృమూర్తి జానకి అమ్మాళ్ భావోద్వేగానికి గురయ్యారు. తిరుప్పూర్‌లో నివాసముంటున్న జానకి అమ్మాళ్ వద్దకు సోమవారం బీజేపీ నేతలు, కార్యకర్తలు తరలివెళ్లి ఆమెకు మిఠాయిలు పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడారు. తన కుమారుడిని ఉపరాష్ట్రపతి పదవికి సిఫారసు చేసిన బీజేపీకి, ప్రధాని మోదీకి ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

చైనా పెట్టుబడులకు గేట్లు బార్లా!

- ట్రంప్ టారిఫ్‌ల నేపథ్యంలో డ్రాగన్‌తో భారత్ దోస్తీ

న్యూఢిల్లీ: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్‌పై 50 శాతం సుంకాలను విధించిన నేపథ్యంలో మోదీ సర్కారు చైనాతో వాణిజ్య, రాజకీయ సంబంధాలను పునరుద్ధరించుకునేందుకు ప్రయత్నిస్తోంది. ఇందులో భాగంగా చైనా పెట్టుబడులకు గతంలో మూసేసిన గేట్లను మళ్లీ తెరవాలనుకుంటోంది. పునరుత్పాదక ఇంధనం, మాన్యుఫాక్చరింగ్, ఎలక్ట్రానిక్స్ వంటి ప్రాధాన్యేతర రంగాల్లో చైనా కంపెనీల విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల (ఎఫ్‌డీఐ)కు త్వరితగతిన అనుమతులు మంజూరు చేయాలని ఆదేశాలిచ్చినట్లు సమాచారం. ప్రస్తుతం కేంద్రం వద్ద దాదాపు 200 చైనా ఎఫ్‌డీఐ ప్రతిపాదనలు పెండింగ్‌లో ఉన్నాయి. 2020లో గల్వాన్ ఘర్షణ తర్వాత చైనాతో రాజకీయ, ఆర్థిక సంబంధాలు బాగా దెబ్బతిన్నాయి. మన సర్కారు చైనా పెట్టుబడులపై ఆంక్షలు విధించింది. కానీ, అమెరికా సుంకాల పోరును తట్టుకునేందుకు ద్వైపాక్షిక సంబంధాల పునరుద్ధరణకు ఇరు దేశాలు మళ్లీ నడుం బిగించాయి. చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీ సోమవారం భారత్‌కు రావటం ఇందుకు మొదటి అడుగుగా చూడవచ్చు.

రేపు మెగా డీఎస్సీ జాబితా?

- తొలుత సర్టిఫికెట్ల పరిశీలనకు సంబంధించి అభ్యర్థుల లిస్టు
- అనంతరం తుది ఎంపిక

అమరావతి, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ-2025కు సంబంధించిన అభ్యర్థుల కీలక జాబితా బుధవారం విడుదలయ్యే అవకాశం కనిపిస్తోంది. ఇప్పటికే టెట్ మార్కుల సవరణపై పలుమార్లు అభ్యంతరాలు స్వీకరించిన పాఠశాల విద్యాశాఖ.. క్రీడల కోటాకు సంబంధించిన జాబితా కూడా రావడంతో సర్టిఫికెట్ల పరిశీలనకు ఎంపికైన అభ్యర్థుల జాబితాలను విడుదల చేయాలని నిర్ణయించింది. సర్టిఫికెట్ల ఎంపిక జాబితా అంటే దాదాపుగా ఉద్యోగాలు పొందిన వారి జాబితాగానే భావించాలి. 16,347 పోస్టులు భర్తీ చేస్తుండగా, అంతే సంఖ్యలో అభ్యర్థులను సర్టిఫికెట్ల పరిశీలనకు పిలవనున్నారు. వారిలో ఎవరివైనా సర్టిఫికెట్లు సక్రమంగా లేకపోతే, ఆ సంఖ్యకు సమానంగా తర్వాత మెరిట్ జాబితాలో ఉన్న అభ్యర్థులను పిలుస్తారు. ఇలా 16,347 మంది సర్టిఫికెట్ల పరిశీలన పూర్తిచేసిన తర్వాత ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థుల తుది జాబితా విడుదల చేయనున్నట్టు అధికారులు చెబుతున్నారు. అయితే, బుధవారం విడుదలయ్యే సర్టిఫికెట్ల పరిశీలన జాబితాలతోనే ఎవరు ఉద్యోగాలు ఎంపికయ్యారనే విషయంపై స్పష్టత వస్తుంది. కానీ.. అధికారులు మాత్రం ఇది సర్టిఫికెట్ల పరిశీలన జాబితా మాత్రమేనని, తుది జాబితా తర్వాత విడుదల చేస్తామని చెబుతున్నారు.

క్వార్ట్జ్ కేసులో..కాకాణికి బెయిల్

- పలు షరతులు విధించిన హైకోర్టు

అమరావతి, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): వైసీపీ నేత కాకాణి గోవర్ధన్‌రెడ్డికి హైకోర్టులో ఉపశమనం లభించింది. క్వార్జ్ అక్రమ మైనింగ్ కేసులో కోర్టు ఆయనకు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. రూ.2 లక్షలతో రెండు పూచీకత్తులు సమర్పించాలని.. ట్రయల్ ముగిసేవరకు పాస్‌పోర్ట్‌ను దర్యాప్తు అధికారి (ఐవో) వద్ద జమ చేయాలని స్పష్టం చేసింది. కేసు దర్యాప్తు ముగిసి.. చార్జిషీటు దాఖలు చేసేవరకు నెల్లూరు జిల్లాలో ప్రవేశించడానికి వీల్లేదని తేల్చిచెప్పింది. ఐవో అనుమతి లేకుండా ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలను దాటి వెళ్లకూడదని స్పష్టం చేసింది. చార్జిషీటు వేసేవరకు ప్రతి ఆదివారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 మధ్య ఏదో ఒక సమయంలో ఐవో ముందు హాజరుకావాలని పేర్కొంది. దర్యాప్తునకు సహకరించాలని, కేసులో సాక్షులను ఏవిధంగా కూడా ప్రభావితం చేయడానికి వీల్లేదని పేర్కొంది. కేసుపై ఎలక్ట్రానిక్, ప్రింట్ మీడియాతో మాట్లాడకూడదని, కేసు వివరాలు తెలిసినవారిని ప్రలోభపెట్టడం గానీ, భయభ్రాంతులకు గురిచేయడం గానీ చేయరాదని ఆదేశించింది. కింది కోర్టులో దర్యాప్తునకు సహకరించాలని.. అక్కడ సాక్షులను విచారించే సమయంలో సహేతుక కారణం లేకుండా పదేపదే వాయిదాలు కోరితే.. బెయిల్ రద్దవుతుందని తేల్చిచెప్పింది. అలాగే కోర్టు విధించిన షరతులను ఉల్లంఘిస్తే సుమోటోగా బెయిల్ రద్దవుతుందని.. లేదంటే బెయిల్ రద్దు కోసం పోలీసులు పిటిషన్ వేసుకోవచ్చని స్పష్టం చేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ వై.లక్ష్మణరావు సోమవారం ఉత్తర్వులు ఇచ్చారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో నెల్లూరు జిల్లా పొదలకూరు మండలం వరదాపురం గ్రామపరిధిలో ప్రభుత్వ భూమిని ఆక్రమించి, అక్రమంగా క్వార్జ్ ఖనిజాన్ని తవ్వి తరలించారని జిల్లా మైనింగ్ శాఖ డిప్యూటీ డైరెక్టర్ బాలాజీనాయక్ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా ఈ ఏడాది ఫిబ్రవరి 16న కాకాణి గోవర్ధన్‌రెడ్డి, మరికొందరిపై పొదలకూరు పోలీసులు కేసు నమోదు చేశారు. ట్రయల్ కోర్టు బెయిల్ నిరాకరించడంతో కాకాణి హైకోర్టును ఆశ్రయించారు. ఇటీవల వాదనలు ముగియడంతో తీర్పును రిజర్వ్ చేసిన న్యాయమూర్తి.. కాకాణికి షరతులతో బెయిల్ మంజూరు చేస్తూ సోమవారం నిర్ణయం వెల్లడించారు.

లోకం తీరు



తొలగించిన 65 లక్షల మంది ఓటర్ల పేర్లను వెల్లడించిన ఈసీ

- సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు చర్యలు

పట్నా, ఆగస్టు 18: బిహార్‌లో చేపట్టిన ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) లో భాగంగా తొలగించిన 65 లక్షల మంది ఓటర్ల పేర్లను ఎన్నికల సంఘం (ఈసీ) సోమవారం బహిర్గతం చేసింది. సుప్రీంకోర్టు ఆదేశాల నేపథ్యంలో ఈ పరిణామం చోటు చేసుకుంది. పెద్ద ఎత్తున ఓట్ల తొలగింపుపై కొద్దిరోజులుగా విపక్షాలు ఆరోపణలు గుప్పిస్తున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే ఓటరు జాబితా నుంచి తొలగించిన పేర్లను ఈనెల 19 నాటికి బహిర్గతం చేసి.. 22 నాటికి ఆ నివేదికను దాఖలు చేయాలంటూ సుప్రీంకోర్టు ఆదేశాలివ్వడంతో ఈసీ అధికారులు చర్యలు చేపట్టారు. 'అన్ని పోలింగ్ బూత్‌ల వారీగా 'ఏఎస్‌డీ' (గైర్హాజరు, బదిలీ చేసిన, చనిపోయిన) ఓటర్ల పేర్లను ఈసీ ప్రచురిస్తోంది. అలాగే ఆన్‌లైన్‌లోనూ ఈ వివరాలను చూసుకోవచ్చు' అని ఎన్నికల అధికారులు తెలిపారు.

ఓటు చోరీకి ఆయుధంగా ఎస్ఐఆర్

బిహార్‌లో రెండోరోజు ఓటరు అధికార యాత్రలో రాహుల్

ఔరంగాబాద్/గయా జీ, ఆగస్టు 18: బిహార్‌లో చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక విస్తృత సవరణ (ఎస్ఐఆర్) అనేది ఓట్లను దొంగిలించేందుకు వాడుతున్న ఆయుధమని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ఆరోపించారు. ఓట్ల చోరీని అడ్డుకొని 'ఒక వ్యక్తి.. ఒక ఓటు'ను పరిరక్షించేందుకు తమ పోరాటం కొనసాగుతుందని ప్రకటించారు. ఈ మేరకు గత లోక్‌సభ ఎన్నికల్లో ఓటు వేసి.. ప్రస్తుత ఎస్ఐఆర్‌లో భాగంగా ఓటుహక్కును కోల్పోయిన పలువురితో తాను మాట్లాడిన వీడియోను రాహుల్ తన వాట్సాప్ చానల్‌లో పోస్ట్ చేశారు. బిహార్‌లోని ససారాం నుంచి చేపట్టిన ఓటరు అధికార యాత్ర ప్రారంభం సందర్భంగా వారితో రాహుల్ మాట్లాడారు. దేశంలో ఓటు చోరీ జరుగుతోందని చెప్పడానికి వీడియోలో తన పక్కన నిలబడ్డ వారే సజీవ సాక్ష్యమన్నారు. వారంతా 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఓటుహక్కును వినియోగించుకున్నారని, కానీ.. అసెంబ్లీ ఎన్నికలు వచ్చేసరికి వారి గుర్తింపు, ఉనికి కూడా లేకుండా భారత ప్రజాస్వామ్యం నుంచే తొలగింపునకు గురయ్యాయని తెలిపారు. వారి పేర్లను రాహుల్ వెల్లడించారు. వారిలో మాజీ సైనికుడు, రైతు అయిన రాజ్ మోహన్ సింగ్(70) కూడా ఉన్నారని తెలిపారు. ఓట్ల తొలగింపులో ఈసీ మాజీ సైనికులను వారు వదిలిపెట్టలేదని మండిపడ్డారు. అనంతరం ఔరంగాబాద్‌లో మరికొందరు బాధితులను కలుసుకున్న వీడియోను రాహుల్ గాంధీ పోస్ట్ చేశారు. "గత నాలుగైదు ఎన్నికల్లో ఓటు వేసినవారి ఓటుహక్కును కూడా దొంగిలించారు. కారణం అడిగితే.. పైనుంచి ఆదేశాలు ఉన్నాయని చెబుతున్నారు" అని రాహుల్ తెలిపారు. ఏదో ఒకరోజు ఇండియా కూటమి అధికారంలోకి వస్తుందని, ఓటు చోరీకి పాల్పడ్డందుకు సీఈసీపై, ఇద్దరు ఎన్నికల కమిషనర్లపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈసీ నేరాన్ని బయట పెట్టిన తనను అఫిడవిట్ అడుగుతున్నారని, కానీ.. దేశం మొత్తం వారినే అఫిడవిట్ అడిగే పరిస్థితి వస్తుందని అన్నారు. తమకు కొద్దిగా సమయమిస్తే.. ప్రతి అసెంబ్లీ స్థానం, లోక్‌సభ స్థానంలో ఓట్ల చోరీని బయటపెడతామని చెప్పారు. కాగా, ఓట్లు తొలగించామంటూ రాహుల్‌వీడియోలో పేర్కొన్న వక్తుల వివరాలను తమకు అందజేయాలని ఈసీ కోరింది.



ఓటర్ అధికార్ యాత్రలో రాహుల్ గాంధీ

కువైత్‌లో పెరుగుతున్న కల్తీ సారా మృతులు

- ఇప్పటిదాకా 30 మంది కన్నుమూత... వీరిలో ఏడుగురు ప్రవాసాంధ్రులు

(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

కువైత్‌లో కల్తీ సారా తాగి మరణిస్తున్న వారి సంఖ్య రోజు రోజుకు పెరుగుతోంది. ఇప్పటి వరకు దాదపు 30 మంది మరణించారు. వీరిలో ఏడుగురు ఏపీకి చెందిన వారని అధికారులు తెలిపారు. నలుగురు తూర్పు గోదావరి జిల్లాకు చెందిన వారు కాగా, మిగిలిన ముగ్గురు ఉమ్మడి కడప జిల్లాకు చెందిన వారు ఉన్నారని సమాచారం. మరో వైపు కల్తీ సారా ఘటనలో 40 మంది భారతీయులతో పాటు 160 మంది బాధితులు వివిధ ఆసుపత్రులలో చికిత్స పొందుతున్నారు. వీరిలో కొందరికి కంటి చూపు శాశ్వతంగా పోయిందని, మరికొందరికి కిడ్నీలు దెబ్బతిన్నాయని వైద్యులు తెలిపారు. మరోవైపు, ఈ ఘటనను తీవ్రంగా పరిగణించిన ప్రభుత్వం కల్తీ సారా కారకులపై ఉక్కుపాదం మోపుతోంది. ఈ క్రమంలో బంగ్లాదేశ్‌కు చెందిన దెలోరా ప్రకాశ్ అనే ప్రవాసీయుడు సారా విక్రయిస్తున్నాడని గుర్తించిన పోలీసులు అతనితో పాటు, ఆయన నేతృత్వంలో పనిచేసే భారత్, నేపాల్‌కు చెందిన 67 మందిని అరెస్టు చేశారు.

రష్యా చమురును భారత్ అమ్ముతోంది!

- ట్రంప్ సలహాదారు అక్కసు

న్యూఢిల్లీ, ఆగస్టు 18: రష్యా ముడిచమురును దిగుమతి చేసుకుని.. దాన్ని అధిక విలువగల ఉత్పత్తులుగా మార్చి ప్రపంచదేశాలకు ఎగుమతి చేయడం ద్వారా భారతదేశం రష్యాకు క్లియరింగ్ హౌస్‌లా వ్యవహరిస్తోందని.. పుతిన్‌కు కావాల్సిన డాలర్లను ఇస్తోందని.. ట్రంప్ సలహాదారు పీటర్ నవరో మండిపడ్డారు. రష్యాను ఆర్థికంగా ఒంటరిని చేయాలన్న అంతర్జాతీయ ప్రయత్నాలకు భారత్ గండికొడుతోందని 'ఫైనాన్షియల్ టైమ్స్' వార్తాసంస్థకు రాసిన వ్యాసంలో ధ్వజమెత్తారు.

బిహార్ ఓటర్ల జాబితాపై ఉభయ సభల్లో విపక్షాల ఆందోళన

చర్చలు లేకుండానే వాయిదా

న్యూఢిల్లీ, ఆగస్టు 18: బిహార్‌లో చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణపై చర్చించాలని డిమాండు చేస్తూ సోమవారం ఉభయసభల్లో విపక్షాలు ఆందోళన చేశాయి. దాంతో ఎటువంటి చర్చలు లేకుండానే సభలు వాయిదా పడ్డాయి. లోక్‌సభ ప్రారంభం కాగానే స్పీకర్ ఓం బిర్లా ప్రశ్నోత్తరాలను చేపట్టారు. వివిధ శాఖల మంత్రులు సమాధానాలు ఇచ్చేందుకు సిద్ధంకాగా ప్రతిపక్ష సభ్యులు నినాదాలు చేశారు. గందరగోళం నడుమే ఆరు ప్రశ్నలకు జవాబులు ఇచ్చారు. సీట్లలో కూర్చోవాలని స్పీకర్ కోరినా సభ్యులు పట్టించుకోలేదు. సభ్యులు నినాదాలను కొనసాగిస్తుండడంతో ఈ శక్తిని ప్రజల సమస్యల పరిష్కారానికి ఉపయోగించాలని వ్యాఖ్యానించారు. ప్రభుత్వ ఆస్తికి నష్టం కలిగిస్తే చర్యలు ఉంటాయని హెచ్చరించారు. అయినా సభ్యులు వినకపోవడంతో సభను వాయిదా వేశారు. తిరిగి సభ సమావేశమయినప్పుడు కూడా ఇదే పరిస్థితి కనిపించింది. సభ్యులు వెల్‌లోకి వచ్చి ఓట్ చోర్- గద్దీ చోడ్ అంటూ నినాదాలు చేశారు. దాంతో స్పీకర్ స్థానంలో కూర్చొన్న బీజేపీ సభ్యురాలు సంధ్యా రాణి సభను వాయిదా వేశారు. రాజ్యసభలోనూ ఇదే పరిస్థితి కనిపించింది. డిప్యూటీ చైర్మన్ హరివంశ్ తొలుత నాగాలాండ్ గవర్నర్ లా గణేశన్ మృతికి సంతాపం తెలుపుతూ తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. అనంతరం వివిధ అంశాలపై విపక్ష సభ్యులు ఇచ్చిన 19 వాయిదా తీర్మానాలను తిరస్కరించారు. బిహార్ ఓటర్ల జాబితాపై నిరసన తెలుపుతూ విపక్ష సభ్యులు ఆందోళన చేశారు. బిహార్ ఓటర్ల జాబితాపై చర్చ జరగాలని డిమాండు చేశారు. సభాపతి అంగీకారం తెలపకపోవడంతో విపక్ష సభ్యులు నినాదాలు చేస్తూ వాకౌట్ చేశారు.

లోక్‌సభలో జన విశ్వాస్ బిల్లు-2.0

కేంద్ర ప్రభుత్వం సోమవారం లోక్‌సభలో జన విశ్వాస్ (నిబంధనల సవరణ) బిల్లు-2.0ను ప్రవేశపెట్టింది. చిన్నపాటి నేరాలకు సంబంధించిన 16కేంద్ర చట్టాల్లోని 288 నిబంధనలను 'నేర' పరిధి నుంచి తప్పించేందుకు ప్రతిపాదనలు చేశారు. ఇంతకుముందు కేంద్రం 2023లో ఇదేవిధంగా 19 మంత్రిత్వ శాఖలు, విభాగాల పరిధికి చెందిన 42 కేంద్ర చట్టాల్లోని 183 నిబంధనలు నేర రహితం చేస్తూ చట్టాన్ని రూపొందించింది. తాజాగా మరో జన విశ్వాస్ (నిబంధనల సవరణ) బిల్లు-2025ను కేంద్ర మంత్రి గోయల్ దిగువ సభలో ప్రవేశపెట్టారు. సులభతర వాణిజ్య విధానాన్ని ప్రోత్సహించే ఉద్దేశంతో దీన్ని తీసుకొచ్చినట్లు చెప్పారు. ఆ తర్వాత బిల్లును సెలక్ట్ కమిటీ పరిశీలన కోసం పంపారు.



అంతరిక్షం నుంచి తాను తీసిన ఫొటోలను మోదీకి చూపెడుతున్న శుభాన్షు

శుభాన్షుపై ప్రత్యేక చర్చ

మిషన్ 'ఏఎక్స్-4' ద్వారా అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి వెళ్లి వచ్చిన భారత తొలి వ్యోమగామి శుభాన్షు శుక్లా గౌరవార్థం సోమవారం లోక్‌సభలో ప్రత్యేక చర్చను చేపట్టారు. అంతకుముందు ఆయన ప్రధాని మోదీని కలిశారు. బిహార్‌లో ఎస్ఐఆర్ గురించి విపక్షాల ఆందోళన మధ్యనే శుక్లా ఘనతపై లోక్‌సభలో చర్చ జరిగింది. దేశంలోని ప్రతి బిడ్డకు శుభాంశు శుక్లా స్ఫూర్తిగా మారారని, ఆయనలా ఎదగాలని, అంతరిక్ష యాత్రలు చేయాలని ప్రతి ఒక్కరూ కలలు కంటున్నారని కేంద్ర శాస్త్ర, సాంకేతిక శాఖ సహాయ మంత్రి జితేంద్ర సింగ్ తెలిపారు. శుభాంశుపై చర్చను బహిష్కరిస్తూ విపక్ష సభ్యులు సభ నుంచి వెళ్లిపోయిన తీరును తీవ్రంగా తప్పుబట్టారు. ఇది అత్యంత దురదృష్టకరమని రాజ్‌నాథ్ వ్యాఖ్యానించారు. కాగా, శుక్లాపై ప్రత్యేక చర్చలో విపక్షం పాల్గొనబోదని, తనకు ముందే తెలుసని కాంగ్రెస్ సీనియర్ నేత శశిథరూర్ వ్యాఖ్యానించారు. అయినప్పటికీ.. అంతరిక్ష హీరో, గ్రూప్ కెప్టెన్ శుభాంశు శుక్లాను ప్రశంసించకుండా ఉండలేనన్నారు.

ధర్మస్థల వివాదంలో కీలక మలుపు!

- ఫిర్యాదు వెనుక ఇతరుల ప్రోత్సాహం?
- చట్టవిరుద్ధంగా మృతదేహాలు పాతిపెట్టినట్టు చెప్పాలని ఒత్తిడి
- సిట్ ఎదుట మాజీ కార్మికుడి వెల్లడి!

బెంగళూరు, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): ధర్మస్థల వివాదంలో కీలక పరిణామం చోటుచేసుకున్నట్టు తెలుస్తోంది. వందలాది మృతదేహాలను పాతిపెట్టినట్టు ఫిర్యాదు చేసిన మాజీ పౌర కార్మికుడు సిట్ ఎదుట...ఫిర్యాదు వెనుక కొందరి ప్రోత్సాహం ఉందని, పుర్రెను కూడా వారే సమకూర్చారని చెప్పినట్టు తెలిసింది. మాజీ పౌరకార్మికుడు చేసిన ఫిర్యాదు మేరకు నమోదైన కేసును సిట్ అధికారులు దర్యాప్తు చేస్తున్న విషయం తెలిసిందే. అతను చూపించిన అటవీప్రాంతంలో 15 రోజులపాటు తవ్వకాలు జరిపారు. శనివారం నుంచి తవ్వకాలకు బ్రేక్ పెట్టిన సిట్ అధికారులు ఫిర్యాదుదారుడిని సోమవారం విచారించారు. విచారణలో ఫిర్యాదుదారుడు.. తాను 2014 నుంచి 2023 వరకు తమిళనాడులో కుటుంబంతో పాటు ఉన్నానని, ఆ తర్వాత ఓ బృందం తనను సంప్రదించి, ధర్మస్థలలో మృతదేహాలు పాతిపెట్టిన అంశం గురించి వివరాలు కోరిందని చెప్పాడు. చట్టప్రకారమే మృతదేహాలను పూడ్చానని వారికి మాజీ పౌర కార్మికుడు తెలిపాడు. కానీ చట్ట విరుద్ధంగా వాటిని పాతిపెట్టినట్లు చెప్పాలని 2023 డిసెంబరు నుంచి ఆ బృందం ఒత్తిడి తెచ్చింది. ఆ తరువాత అదే బృందం మాజీ పౌర కార్మికుడిని కర్ణాటకకు తీసుకొచ్చింది. ఆ బృందమే ఓ పుర్రెను సమకూర్చింది. ఆ పుర్రెను తీసుకువెళ్లి కార్మికుడు.. చట్టవిరుద్ధంగా మృతదేహాలను పూడ్చిపెట్టినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసుల ముందు ఏం చెప్పాలనేది ప్రతిరోజూ అతనికి ముగ్గురు సలహాలు ఇచ్చేవారు. అంతా వారు చెప్పినట్లే చేశానని సిట్‌కు మాజీ పౌర కార్మికుడు వివరించినట్టు సమాచారం. సిట్ అధికారులు ఫిర్యాదుదారుడు చెప్పిన అంశాలను రికార్డు చేసినట్టు తెలిసింది. కానీ ఈ విషయమై అధికారికంగా ఎటువంటి ప్రకటన చేయలేదు. ఈ వ్యవహారం సోమవారం కర్ణాటక అసెంబ్లీలో రచ్చకు దారితీసింది.

ట్రాఫిక్ జాంలో చిక్కుకుంటే

టోల్ ఎందుకు కట్టాలి?

- ఎన్‌హెచ్‌ఏఐకి సుప్రీంకోర్టు ప్రశ్న.. టోల్ వసూలును సమర్థించలేమని వ్యాఖ్య
- అంతకుముందు ఆ హైవేపై నెల పాటు టోల్ వసూలు చేయొద్దన్న కేరళ హైకోర్టు



న్యూఢిల్లీ, ఆగస్టు 18: ప్రయాణికులు ట్రాఫిక్‌జామ్‌లో చిక్కుకొని అవస్థలు పడిన సందర్భాల్లో టోల్ రుసుము ఎందుకు చెల్లించాలని సుప్రీంకోర్టు సోమవారం భారతీయ జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్ఏఐ)ని ప్రశ్నించింది. 65 కి.మీ. దూరం ప్రయాణానికి 12 గంటల సమయం తీసుకున్న సందర్భాల్లోనూ టోల్ రుసుము కింద రూ.150 చెల్లించాలా అని అడిగింది. రోడ్డు సరిగ్గా లేకపోవడంతో కేరళలోని త్రిస్సూర్ జిల్లా పలియెక్కర టోల్ ప్లాజా వద్ద నాలుగు వారాల పాటు రుసుము వసూలు చేయకూడదని ఈ నెల 6న కేరళ హైకోర్టు ఆదేశాలు ఇచ్చింది. రోడ్డు పనులు జరుగుతుండడంతో 554 నెంబరు జాతీయ రహదారిలో ఎడపల్లి- మన్నుతి మధ్య ప్రయాణం దారుణంగా మారింది. అందువల్ల నెల రోజుల పాటు టోల్ రుసుము వసూలును సస్పెండ్ చేస్తున్నట్టు హైకోర్టు ఆదేశాలు ఇచ్చింది. దీన్ని సవాలు చేస్తూ దాఖలయిన అప్పీలుపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్.గవాయ్, జస్టిస్ కె.వినోద్ చంద్రన్, జస్టిస్ ఎన్.వి.అంజారియాల ధర్మాసనం విచారణ చేపట్టింది. గంట ప్రయాణానికి అదనంగా 11 గంటలు తీసుకుంటే టోల్ రుసుము ఎందుకు చెల్లించాలని జస్టిస్ గవాయ్ ప్రశ్నించారు. ఎన్‌హెచ్ఏఐ తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదిస్తూ లారీ ప్రమాదానికి గురయిన కారణంగా ట్రాఫిక్ జామ్ ఏర్పడిందని, ఆ ప్రమాదం దైవఘటన అని చెప్పారు. ఇందుకు జస్టిస్ వినోద్ చంద్రన్ అంగీకరించలేదు. ఆ ప్రమాదం దైవఘటన కాదని, రోడ్డుపై ఉన్న గుంతలో లారీ దిగబడడం వల్లనే ట్రాఫిక్ జామ్ ఏర్పడిందని గుర్తు చేశారు. 11గంటల ట్రాఫిక్ జామ్‌లో కూడా టోల్ వసూలు ఏ రకంగానూ సమర్థించలేమన్నారు. తీర్పును వాయిదా వేశారు.



అలిపిరి నడక మార్గంలో చెత్త సేకరించి, తీసుకెళుతున్న సేవకులు

మన గుడి-మన బాధ్యత

- తిరుమల నడక మార్గాలు, సందర్శనీయ స్థలాలను శుభ్రపరిచిన సేవా సంస్థ
- వారంరోజుల్లో దాదాపు 4 టన్నుల చెత్తసేకరణ

తిరుమల, ఆగస్టు18(ఆంధ్రజ్యోతి): నంద్యాలకు చెందిన 'మనఊరు-మనగుడి-మనబాధ్యత' సంస్థ వ్యవస్థాపకుడు శివకుమార్ ఆధ్వర్యంలో దాదాపు వంద మంది సేవకులు దేశంలోని వివిధ క్షేత్రాల్లో పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా టీటీడీ అనుమతి తీసుకున్న వీరు.. ఈ నెల 12వ తేదీ నుంచి సోమవారం వరకు అలిపిరి, శ్రీవారిమెట్టు నడక మార్గాలు, శిలాతోరణం, వేదపాఠశాల వంటి వివిధ ప్రాంతాల్లో చెత్తను సేకరించారు. ప్రధానంగా ప్లాస్టిక్ తొలగింపుపై దృష్టిసారించి వారంరోజుల్లో 3 నుంచి 4 టన్నుల చెత్తను సేకరించి తొలగించారు. ఈసందర్భంగా ఫౌండర్ శివకుమార్ 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ.. తాను ఓ ప్రభుత్వ ఉద్యోగినని, కొంతకాలంగా వారణాశి, అరుణాచలం, శ్రీశైలం, శ్రీకాళహస్తి వంటి ప్రముఖ పుణ్య క్షేత్రాల్లో చెత్తను తొలగిస్తూ సేవ చేస్తున్నామన్నారు. ఇందులో భాగంగా తిరుమలలోనూ స్వచ్ఛత కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు.

సెప్టెంబరు 24న శ్రీవారికి
సీఎం పట్టువస్త్రాల సమర్పణ

- సెప్టెంబరు 28న గరుడ సేవ
- అక్టోబరు 2వరకు తిరుమలలో బ్రహ్మోత్సవాలు

తిరుమల, ఆగస్టు18(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది తిరుమలలో జరిగే బ్రహ్మోత్సవాల్లో తొలిరోజు సెప్టెంబరు 24న ముఖ్యమంత్రి చంద్రబాబు శ్రీవారికి పట్టువస్త్రాలు సమర్పిస్తారని టీటీడీ ఈవో శ్యామలరావు తెలిపారు. అక్టోబరు 2 వరకు బ్రహ్మోత్సవాలు జరుగుతాయని, సెప్టెంబరు 28న గరుడసేవ ఉంటుందని చెప్పారు. బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై సోమవారం తిరుమలలోని అన్నమయ్య భవనంలో అదనపు ఈవో వెంకయ్య చౌదరి, కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ హర్షవర్ధనరాజు, జేఈవో వీరబ్రహ్మం, సీవీఎస్వో మురళీకృష్ణతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. రద్దీని అంచనా వేసి తగిన భద్రతా ఏర్పాట్లు చేయాలని సూచించారు.

- మరే ప్రాంతానికీ ఇన్ని భౌగోళిక అనుకూలతలు లేవు
- అందువల్లే ప్రతి నిర్మాణం ఐకానిక్‌గా ఉండాలి
- కాలుష్య రహిత పరిశ్రమలకు అధిక ప్రాధాన్యం
- త్వరలో అమరావతికి బయో ఇంజనీరింగ్ వర్సిటీ
- సీఆర్డీఏ అథారిటీ భేటీలో చంద్రబాబు వెల్లడి
- 904 కోట్లతో రాజధాని గ్రామాలకు వసతులు
- పురపాలక శాఖ మంత్రి నారాయణ వెల్లడి



సీఆర్డీఏ సమీక్షా సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారాయణ, అధికారులు

ఐకానిక్‌గా రాజధాని నిర్మాణాలు

యుద్ధప్రాతిపదికన నిర్మాణ పనులు చేపట్టండి

అమరావతి, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ఈ సీజన్‌లోనే నిర్మాణాలు పూర్తిచేసి రాజధానికి ఒక రూపం తీసుకురావాలని సీఆర్డీయే అధికారులను ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. దీని కోసం రాజధాని పనులను యుద్ధప్రాతిపదిక చేపట్టాలని, ఆ వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో ఉంచాలని సూచించారు. అమరావతి సచివాలయంలో సీఎం చంద్రబాబు అధ్యక్షత జరిగిన 51 సీఆర్డీఏ సమావేశం జరిగింది. దేశంలో మరే ప్రాంతానికీ లేని భౌగోళిక పరమైన సానుకూలతలు అమరావతికి ఉన్నాయని, అందువల్ల ఇక్కడ చేపట్టే నిర్మాణాలన్నీ ఐకానిక్‌గా ఉండాలని ఈ సందర్భంగా సీఎం దిశానిర్దేశం చేశారు. "ప్రతి ప్రాజెక్టు పరిధిలోనూ ఆర్థిక కార్యకలాపాలు జరిగేలా ప్రణాళికలు ఉండాలి . ఎస్పీవీ ద్వారా చేపట్టే స్పోర్ట్స్ సిటీ లాంటి ప్రాజెక్టులను అంతర్జాతీయ ప్రమాణాలతో చేపట్టాలి. రివర్ ఫ్రంట్,రోప్ వే , ఇన్నర్ రింగ్ రోడ్లను అనుసంధానించాలి. త్వరలోనే ప్రతిష్ఠాత్మక బయో ఇంజనీరింగ్ యూనివర్సిటీ అమరావతికి రానుంది." అని చంద్రబాబు తెలిపారు. ఆ వివరాలు మంత్రి పి. నారాయణ మీడియాకు తెలిపారు.

తొమ్మిది ప్రతిపాదనలకు ఓకే..

రాజధాని అమరావతి పరిధిలోని 29 గ్రామ పంచాయతీల్లో డ్రయిన్లు, నీటి సరఫరా, ఇతర మౌలిక సదుపాయాల కోసం రూ.904 కోట్లతో పనులు చేపట్టేందుకు సీఆర్‌డీఏ అథారిటీ ఆమోదం తెలిపింది. ఎల్పీఎస్ జోన్స్ క్రిటికల్ ఇన్‌ఫ్రా అండ్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ కింద ఈ పనులు చేపట్టనున్నారు. 9 ప్రతిపాదనలకు అథారిటీ ఆమోదం తెలిపారు. అమరావతిని అనుసంధానిస్తూ కృష్ణానదిపై నిర్మించే ఐకానిక్ వంతెనకు అద్భుతమైన డిజైన్ ఎంపిక చేయాలని సీఎం ఆదేశించారు. సంప్రదాయ కూచిపూడి నృత్య భంగిమ సహా వేర్వేరు డిజైన్లను పరిశీలించాలని సూచించారు. రాజధానిలో చేపట్టే వివిధ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులకు స్పెషల్ పర్పస్ వెహికల్(ఎస్పీవీ) ఏర్పాటుకు సీఆర్డీఏ అథారిటీ తన ఆమోదం తెలియజేసింది. రాజధానిలో చేపట్టనున్న గ్రీన్ ఫీల్డ్ ఎయిర్‌పోర్టు, ఎన్టీఆర్ విగ్రహం, స్పోర్ట్స్ సిటీ, స్మార్ట్ ఇండస్ట్రీస్ , రివర్ ఫ్రంట్, ఇన్నర్ రింగ్ రోడ్డు, రోప్ వే లాంటి ప్రాజెక్టులకు ఎస్పీవీని ఏర్పాటు చేసేందుకు అంగీకారం తెలిపింది. మంగళగిరిలోని ఆత్మకూరు వద్ద 78.01 ఎకరాల్లో గోల్డ్ క్లస్టర్ ఏర్పాటు కోసం భూ సమీకరణ చేయాలన్న ప్రతిపాదనను అథారిటీ ఆమోదించింది. గోల్డ్ క్లస్టర్ వల్ల రూ. 5 వేల కోట్ల మేర పెట్టుబడులు వచ్చే అవకాశం ఉందని, 20 వేల మందికి ఉద్యోగ అవకాశాలు వస్తాయని అథారిటీ అభిప్రాయం వ్యక్తం చేసింది. ల్యాండ్‌పూలింగ్‌లో పట్టాభూములతోపాటు అసైన్డ్‌భూములను కూడా సేకరించారు. అయితే, సర్టిఫికెట్లలో అసైన్డ్ భూమి అని ప్రస్తావన చేయొద్దంటూ భూదాతలు చేస్తున్న విజ్ఞప్తికి సీఎం చంద్రబాబు సానుకూలంగా స్పందించారు. యాజమాన్య ధ్రువీకరణ సర్టిఫికెట్‌లో ఆ పదాన్ని తొలగించాలన్న సూచనకు సీఆర్డీఏ ఆమోదం తెలిపింది. రాజధానిలో సీవరేజ్ వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌ను రూ.411 కోట్లు, వాటర్ డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను రూ.376.60 కోట్లతో ఏర్పాటు చేసేందుకు అథారిటీ అంగీకరించింది. విట్, ఎస్ఆర్ఎం యూనివర్సిటీలకు అదనపు భూ కేటాయింపులు చేసేందుకు సమ్మతించింది.. ఈ నెల 21న జరిగే క్యాబినెట్‌లో పెట్టి ఆమోదం తెలపనున్నారు.

రూ.904 కోట్లలో దేనికి ఎంత...?

రూ. 64.35 కోట్లు	కోర్ క్యాపిటల్ పరిధిలోని గ్రామ కంఠాల్లో తాగునీటి సరఫరాలోని 30% గ్యాప్ భర్తీ..
రూ. 110.72 కోట్లు	మురుగునీటిని శుద్ధపరిచి బయటకి పంపడంలోని 100% గ్యాప్ భర్తీ..
రూ. 330.04 కోట్లు	40 శాతం మేర ఉన్న రహదారుల గ్యాప్ భర్తీ.
రూ. 12.25 కోట్లు	వీధి దీపాల విషయంలో ఉన్న 10 శాతం గ్యాప్ భర్తీ
మిగిలిన సొమ్ము ఏడేళ్లపాటు ఆపరేషన్, నిర్వహణ ట్యాక్స్ చెల్లింపులకు..	

అమరావతి మునకపై వైసీపీ దుష్ప్రచారం

- మార్చి 31కి 4 వేల గృహాలు పూర్తి : నారాయణ

2026, మార్చి 31 కల్లా దాదాపు 4 వేల గృహాలను పూర్తి చేసి అధికారులకు అప్పగిస్తామని పురపాలకశాఖ మంత్రి పి.నారాయణ తెలిపారు. అమరావతి మునిగిపోతోందని దుష్ప్రచారం చేసేవారు, ఇక్కడకు వచ్చి ఎక్కడ మునిగిందో చూపించాలని సవాల్ చేశారు. "రాజధాని పనుల్లో భాగంగా చేపట్టిన బ్రిడ్జి నిర్మాణ సమయంలో వచ్చిన మట్టిని కాలువలో వేయడంతో నీరు నిలిచింది. దానిని గుర్తించి వెంటనే సీఆర్‌డీఏ అధికారులు క్లియర్ చేశారు. ఎక్కడ ఇళ్లు కట్టుకోవాలన్నా గుంతలు తవ్వుతారు. వర్షం వస్తే ఆ గుంతల్లోకి నీళ్లు రావా?. అలాగే, ఐకానిక్ టవర్స్ నిర్మాణం కోసం చుట్టూ గుంతలు తవ్వాం. అక్కడ వాన వస్తే నీళ్లు నిలవకుండా ఎలా ఉంటాయి?. వాస్తవం ఇది కాగా, ఐకానిక్ టవర్లలోకి నీరు వచ్చాయంటూ వైసీపీ నేతలు దుష్ప్రచారం చేస్తున్నారు." అని మంత్రి మండిపడ్డారు. "అమరావతి క్యాపిటల్ సిటీ డిజైన్ చేసినప్పుడు సీడ్ క్యాపిటల్‌కు కుడి, ఎడమ పక్కల రెండు బ్రిడ్జిలు నిర్మించాలనుకున్నాం. దానిలో భాగంగా వైకుంఠపురం వద్ద ఐకానిక్ బ్రిడ్జి వస్తుంది." అని నారాయణ వివరించారు. అమరావతిలో ఏడీసీ, సీఆర్‌డీఏలు పనులు చేస్తున్నాయని మంత్రి తెలిపారు. రాజధానికి అదనపు భూసమీకరణ విషయంలో మంత్రివర్గ ఉప సంఘంలో చర్చించి త్వరలోనే క్యాబినెట్‌కు తీసుకువస్తామన్నారు. కరకట్ట రోడ్డుపై 2 వైపులా రివర్టింగ్ వాల్ కట్టాలా లేదా అనే దానిపై నిర్ణయం తీసుకోవాల్సి ఉందని తెలిపారు. సీడ్ యాక్సిస్ రోడ్డును అనుసంధానిస్తూ వై ఆకారంలో మరో రోడ్డును మంగళగిరి వైపు కలుపుతామని పేర్కొన్నారు. ఔటర్ రింగ్ రోడ్డు పనులు కేంద్ర ప్రభుత్వం చేపడుతుందని తెలిపారు.

పెద్దారెడ్డి విషయంలో..
సింగిల్ జడ్జి ఉత్తర్వులపై పోలీసుల అప్పీల్

- నేడు విచారణకు హైకోర్టు ధర్మాసనం అంగీకారం

అమరావతి, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నేత, మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి తాడిపత్రిలోని తన ఇంటికి వెళ్లి నివాసం ఉండేందుకు తగిన భద్రత కల్పించాలని ఆదేశిస్తూ సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వులను పోలీసులు హైకోర్టు ధర్మాసనం ముందు అప్పీల్ చేశారు. సోమవారం కోర్టు విచారణ ప్రారంభమైన వెంటనే ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది(ఎస్‌జీపీ) ఎస్.ప్రణతి స్పందిస్తూ.. సింగిల్ జడ్జి ఉత్తర్వులను సవాల్ చేస్తూ పిటిషన్ వేశామని.. మంగళవారం విచారణ జరపాలని అభ్యర్థించారు. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం ఇందుకు అంగీకరించింది. తాడిపత్రిలోని తన ఇంటికి వెళ్లేందుకు భద్రత కల్పించాలని కోర్టు ఆదేశాలు ఇచ్చినప్పటికీ పోలీసులు అమలు చేయడం లేదని పేర్కొంటూ పెద్దారెడ్డి హైకోర్టులో కోర్టుధిక్కరణ పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. దీనిపై విచారణ జరిపిన సింగిల్ జడ్జి.. పెద్దారెడ్డి సోమవారం (18న) తాడిపత్రిలోని ఆయన ఇంటికి వెళ్లి నివాసం ఉండేందుకు భద్రత కల్పించాలని పోలీసులను ఆదేశించారు. ఉదయం 10 నుండి 11 గంటల మధ్య తాడిపత్రి వెళ్లేందుకు పెద్దారెడ్డికి అనుమతి ఇచ్చారు. కాన్వాయ్‌లో 5 వాహనాలకు మించి ఉండకూడదని.. అనుచరులను రెచ్చగొట్టడానికి వీల్లేదని.. ఇంటివద్ద ఏ సమయంలో కూడా 50-60 మందికి మించి ఉండడానికి వీల్లేదని స్పష్టం చేశారు. అధికార పార్టీ నేత, పిటిషనర్ మధ్య ఘర్షణ వాతావరణాన్ని నిరోధించేందుకు అదనపు బలగాలను ఏర్పాటు చేయాలంటూ మధ్యంతర ఉత్తర్వులిచ్చారు. వీటిని పోలీసులు సవాల్ చేశారు.

ఎస్ఐ నిజంగా సెలవులోనే ఉన్నారా!

- రిజిస్టర్ తెప్పించి హాజరు పరిశీలిస్తాం: హైకోర్టు
- కోర్టు నోటీసు స్వీకరణలో ఎస్ఐ వైఖరిని తప్పుబట్టిన ధర్మాసనం

అమరావతి, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): ప్రాసిక్యూషన్స్ పూర్వ డైరెక్టర్ జల్లా సుదర్శన్‌రెడ్డి అరెస్ట్ సందర్భంగా అనుచితంగా ప్రవర్తించారనే వ్యవహారంలో కోర్టు ఇచ్చిన నోటీసులను స్వీకరించే విషయంలో కడప జిల్లా లక్కిరెడ్డిపల్లి ఎస్ఐ మోహన్ వైఖరిని హైకోర్టు తప్పుపట్టింది. ఆ ఎస్ఐ వారంరోజులుగా సెలవులో ఉన్నారని అక్నాలడ్జ్‌మెంట్‌పై పోస్టుమెన్ పేర్కొనడంపై సందేహం వ్యక్తం చేసింది. అధికారి సూచించకుండా అక్నాలడ్జ్‌మెంట్‌పై ఆ విధంగా రాసేందుకు దేశంలో ఏ పోస్టుమెన్‌కైనా ధైర్యం ఉంటుందా అని ప్రశ్నించింది. ఇది నమ్మశక్యంగా లేదని పేర్కొంది. ఆ ఎస్ఐ సెలవులో ఉన్నారా?లేదా? తేల్చేందుకు హాజరు రిజిస్టర్ తెప్పించుకుంటామని హెచ్చరించింది. ఈ దశలో ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది (ఎస్‌జీపీ) టి.విష్ణుతేజ స్పందిస్తూ... అసలు ఏమి జరిగిందో తెలుసుకొని, వివరాలు కోర్టు ముందు ఉంచేందుకు సమయం ఇవ్వాలని అభ్యర్థించారు. అయితే, ఎస్ఐకి నోటీసులు అందినట్లుగానే భావిస్తున్నామని ధర్మాసనం పేర్కొంది. కౌంటర్ దాఖలు చేస్తారా?లేదా? అనేది ఎస్ఐ ఇష్టమని తెలిపింది. తదుపరి విచారణ నాటికి ప్లీడింగ్స్ పూర్తి చేయాలని ఇరువైపుల న్యాయవాదులను ఆదేశించింది. విచారణను సెప్టెంబరు 2వ తేదీకి వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఆర్.రఘునందనరావు, జస్టిస్ టీసీడీ శేఖర్‌తో కూడిన ధర్మాసనం సోమవారం ఉత్తర్వులు ఇచ్చింది.

ఉగ్ర కార్యకలాపాలను అణచివేస్తాం: మాధవ్



విజయనగరం దాసన్నపేట, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఉగ్రవాద కార్యకలాపాలను అణచివేస్తుందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ అన్నారు. పార్టీ పగ్గాలు చేపట్టిన తరువాత తొలిసారి ఉత్తరాంధ్ర పర్యటనలో భాగంగా విజయనగరం వచ్చిన ఆయన పార్టీ జిల్లా నాయకులు, కార్యకర్తలతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన ఆయన మాట్లాడుతూ... 'విజయనగరంతో పాటు అన్నమయ్య, సత్యసాయి జిల్లాల్లో ఉగ్రవాద కార్యకలాపాలు వెలుగు చూడడం ఆందోళన కలిగిస్తోంది. నిఘా వ్యవస్థలు మరింత జాగృతితో వ్యవహరించాలి. బోగస్ ఓటర్ల విషయంలో రాహుల్ గాంధీ చేసిన ఆరోపణలకు ఆధారాలుంటే చూపాలి. లేదంటే ఆయన జాతికి క్షమాపణ చెప్పాలి. కేంద్ర ప్రభుత్వ పథకాలు ప్రజల్లోకి తీసుకువెళ్తాం. కడప జిల్లాలో ఇటీవల జరిగిన స్థానిక ఎన్నికల్లో జగన్‌కు కోలుకోలేని దెబ్బ తగిలింది. ఇప్పటికైనా ప్రతిపక్ష నాయకులు చౌకబారు విమర్శలు మానుకోవాలి' అని మాధవ్ హితవు పలికారు.

మాంసం అభివృద్ధి సంస్థ చైర్మన్‌గా ప్రకాశ్ నాయుడు

అమరావతి, ఆగస్టు18 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ మాంసం అభివృద్ధి సంస్థ చైర్మన్‌గా సింగనమల నియోజకవర్గానికి చెందిన ప్రకాశ్‌నాయుడును ప్రభుత్వం నియమించింది. ఈమేరకు సోమవారం అధికారికంగా ఉత్తర్వులు జారీ అయ్యాయి.

స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం పంట రుణాలివ్వాలి: రాజశేఖర్

రాష్ట్రంలో పంటలు సాగు చేసే రైతులకు ఈ ఏడాది స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం పంట రుణాలివ్వాలని వ్యవసాయశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బీ రాజశేఖర్ జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్లకు స్పష్టం చేశారు. అలాగే పంట సాగు హక్కు పత్రం(సీసీఆర్సీ) ఉన్న కౌలు రైతులకు లక్ష్యం మేరకు రుణాలివ్వాలని కోరారు. సోమవారం మంగళగిరిలోని వ్యవసాయ శాఖ డైరెక్టరేట్‌లో పంట రుణాల పంపిణీపై సమీక్ష జరిపారు. వ్యవసాయ శాఖ డైరెక్టర్ డిల్లీరావు, రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ కన్వీనర్ భాస్కరరావు పాల్గొన్నారు.

పేదల ఇళ్ల నిర్మాణానికి 126.84 కోట్లు మంజూరు

రాష్ట్రంలో పేదల ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం రూ.126.84 కోట్లు మంజూరు చేసింది. రుణ బిల్లు సమర్పించడం ద్వారా ఈ మొత్తాన్ని తీసుకోవడానికి పరిపాలనానుమతిస్తూ గృహ నిర్మాణ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

అంటువ్యాధుల వ్యాప్తిని నివారించండి

- సమస్యాత్మక ప్రాంతాల్లో మరింత అప్రమత్తంగా ఉండాలి
- సీజనల్ వ్యాధులపై టెలికాన్ఫరెన్స్‌లో మంత్రి సత్యకుమార్

అమరావతి, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాల నేపథ్యంలో రాష్ట్రంలో అంటువ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అధికారులను ఆదేశించారు. గతంలో నమోదైన కేసుల ఆధారంగా గుర్తించిన సమస్యాత్మక ప్రాంతాల్లో మరింత అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు. సీజనల్ వ్యాధులపై జిల్లాల్లో తాజా పరిస్థితులపై మంత్రి సత్యకుమార్ సోమవారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా క్షేత్రస్థాయిలో పరిస్థితులపై అధికారులు మంత్రికి వివరించారు. డెంగీ, మలేరియా, టైఫాయిడ్ వంటి వ్యాధులు ప్రబలకుండా ఇతర శాఖలతో సమన్వయంతో చేసుకుంటూ పనిచేయాలని మంత్రి అధికారులకు సూచించారు. వచ్చే నెల వరకూ రాష్ట్రంలో వర్షాలు పడే అవకాశం ఉన్నందున సీజనల్ వ్యాధుల నియంత్రణకు చర్యలు తీసుకోవడంలో అలసత్వం ప్రదర్శించవద్దన్నారు. జిల్లాల ఆరోగ్యశాఖ అధికారులు కేసులు నమోదవుతున్న తీరుపై మండలాల వారీగా ఎప్పటికప్పుడు సమీక్ష నిర్వహించాలన్నారు. తాగునీరు కలుషితం కాకుండా చూడాలన్నారు. వైద్యులు, పారా మెడికల్ సిబ్బంది విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని దిశానిర్దేశం చేశారు. వైద్యుల సూచించిన మేరకు ప్రసవ తేదీల ఆధారంగా.. గర్భిణుల వివరాలు సేకరించి, వారికి సకాలంలో వైద్య సేవలందేలా చూడాలని మంత్రి సూచించారు. దీనికోసం ఆశాలు, ఏఎన్ఎంల సహకారం తీసుకోవాలన్నారు.

లంచాధికారికి పెన్షన్ కట్..

గతంలో కర్నూలు జిల్లా వైద్యాధికారిగా పనిచేస్తూ రూ.30 వేలు లంచం తీసుకున్న ఒక డాక్టర్‌పై చర్యలకు తీసుకోవాలని మంత్రి సత్యకుమార్ సోమవారం ఆదేశించారు. 2020లో పదవీ విరమణ చేసిన ఆ వైద్యుడికి ఫించను మొత్తంలో 75 శాతాన్ని ప్రభుత్వం చెల్లిస్తోంది. ఇకపై పెన్షన్ నిలిపివేయనుంది.

హాస్టళ్లలో నాణ్యమైన ఆహారం, విద్య అందించాలి

- మెనూ అమలు పర్యవేక్షణకు విద్యార్థులతో కమిటీలు: మంత్రి డోలా

విశాఖపట్నం, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): సాంఘిక సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులకు నాణ్యతతో కూడిన ఆహారం, విద్య అందించాలి. ఉన్నత ప్రమాణాలు నెలకొల్పాలి' అని మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి పేర్కొన్నారు. స్థానిక గీతం విశ్వవిద్యాలయంలో తొమ్మిది జిల్లాల అధికారులతో ప్రాంతీయ సదస్సును సోమవారం నిర్వహించారు. హాస్టళ్లకు సంబంధించిన పలు అంశాలపై సాంఘిక సంక్షేమ శాఖ డైరెక్టర్ లావణ్య వేణి, ముఖ్య కార్యదర్శి ఎంఎం నాయక్‌లతో కలసి ఆయన జిల్లాల వారీగా సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, 'హాస్టళ్లలోని విద్యార్థులకు వార్డెన్‌లే గార్డియన్‌లుగా వ్యవహరించాలి. హాస్టల్‌లో చదివిన ఏ విద్యార్థీ టెన్త్, ఇంటర్‌లో ఫెయిల్ కావడానికి వీల్లేదు. హాస్టల్‌లో శత శాతం సీట్ల భర్తీ వచ్చే ఏడాది నుంచి జరగాలి. ఈ ఏడాది వరకూ కనీసం 75 శాతం సీట్లు భర్తీ కావాలి. హాస్టళ్ల విద్యార్థులకు ప్రతి నెలా క్రమం తప్పకుండా ఆరోగ్య తనిఖీలు చేయించాలి. మెనూ అమలు పర్యవేక్షణకు విద్యార్థులతో కమిటీలు ఏర్పాటు చేయాలి' అని అన్నారు. అధికారులకు కేటాయించిన లక్ష్యాల మేరకు హాస్టళ్లను తనిఖీ చేసి నివేదికలు అందించాలని ముఖ్యకార్యదర్శి ఎంఎం నాయక్ ఆదేశించారు. సమావేశంలో విశాఖ జిల్లా ఉప సంచాలకులు కె.రామారావు, రాష్ట్ర కార్యాలయ డీడీ లక్ష్మీ సుధ, ఉత్తరాంధ్ర, గోదావరి జిల్లాల అధికారులు పాల్గొన్నారు.

అధిక ధరలకు ఎరువులమ్మితే కేసులు: మంత్రి అచ్చెన్న

అమరావతి, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): ఎరువులు అధిక ధరలకు అమ్మితే వ్యాపారులపై కేసులు నమోదు చేయాలని వ్యవసాయ అధికారులను మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశించారు. సోమవారం విజయవాడ క్యాంపు కార్యాలయంలో వ్యవసాయ శాఖ డైరెక్టర్ డిల్లీరావు, మార్క్‌ఫెడ్ ఎండీ మనజీర్ జిలానీ, సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. 'ప్రైవేట్ వ్యాపారులు ఎక్కువ రేట్లకు ఎరువులు అమ్ముతున్నట్లు మా దృష్టికి వచ్చింది. అలాంటి వ్యవహారాలు కొనసాగితే కఠిన చర్యలు తీసుకుంటాం. ఎరువుల కోసం రైతులు ఇబ్బందులు పడుతున్న ప్రాంతాలకు త్వరగా ఎరువులు సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలి. కేంద్రం నుంచి వేగంగా రాష్ట్రానికి వచ్చేలా మంత్రి లోకేశ్ కేంద్ర మంత్రితో చర్చించారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. అన్ని ప్రాంతాలకూ అందేలా చూస్తాం' అని మంత్రి అచ్చెన్న హామీ ఇచ్చారు.

రాష్ట్రానికి సీఎం చంద్రబాబు ఐకాన్

- అభివృద్ధిలో దేశంలోనే ఏపీ ముందుంది
- దోచుకోవడానికి, దాచుకోవడానికి కేరాఫ్ వైసీపీ: మంత్రి సవిత
- శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండలో ట్రాక్టర్ ర్యాలీ



శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండలో నిర్వహించిన ట్రాక్టర్ ర్యాలీలో పాల్గొన్న మంత్రి సవిత

పెనుకొండ టౌన్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు ఆంధ్రప్రదేశ్‌కు ఓ ఐకాన్ అని మంత్రి సవిత అన్నారు. శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండలో సోమవారం నిర్వహించిన 'అన్నదాత సుఖీభవ' విజయోత్సవ ర్యాలీలో ఆమె పాల్గొన్నారు. టీడీపీ శ్రేణులు, రైతులు వందలాది ట్రాక్టర్లతో ఈ ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, 'ఇదొక మంచి ప్రభుత్వం అనడానికి ఏడాదిపాలనలో జరిగిన అభివృద్ధి, అమలైన సంక్షేమ పథకాలు నిదర్శనం. వైసీపీ ప్రభుత్వం దోచుకోవడానికి, దాచుకోవడానికి అన్నట్లుగా ఐదేళ్ల పాలన కొనసాగించింది. సీఎం చంద్రబాబు ఆధ్వర్యంలో అభివృద్ధిలో ఏపీ దేశంలోనే ముందు ఉంది. ఎన్నికలలో ఇచ్చిన అన్ని హామీలను మా నాయకుడు చంద్రబాబు ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నారు. ప్రతి గ్రామాన్ని అభివృద్ధి చేస్తాం. గతంలో రైతులను ఇబ్బంది పెట్టారు. నాశిరకం ఎరువులు, విద్యుత్ సమస్యలతో రైతులు నట్టేట మునిగారు. కూటమి అధికారంలోకి రాగానే రైతుల పక్షాన నిలబడింది. వారికి అన్నిరకాల సౌకర్యాలు సమకూర్చుతున్నాం. అన్నదాత సుఖీభవ నగదు 50 లక్షల మందికి జమ అయింది' అని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొల్లకుంట అంజినప్ప తదితరులు పాల్గొన్నారు.

ఉద్రిక్తతల నడుమ 'చలో కరేడు'

- రైతు, ప్రజాసంఘాల నాయకుల అరెస్ట్

ఉలవపాడు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ఉద్రిక్తతల నడుమ మధ్య రైతు, ప్రజాసంఘాల నాయకులు సోమవారం తలపెట్టిన 'చలో కరేడు' కార్యక్రమం ముగిసింది. నెల్లూరు జిల్లా ఉలవపాడు మండలంలోని కరేడు ప్రాంతంలో ప్రభుత్వం ఇండోసోల్ సోలార్ కంపెనీ కోసం బలవంతపు భూసేకరణ చేపడుతోందని పేర్కొంటూ.. ఈ నిరసన కార్యక్రమానికి పిలుపునిచ్చారు. కరేడు, చుట్టుపక్కల గ్రామాల్లో పోలీస్ 30 యాక్ట్, 144 సెక్షన్లు అమల్లో ఉన్నందున 300 మంది పోలీసులు బందోబస్తు చేపట్టారు. ఇండోసోల్ కంపెనీ కరేడు నుంచి వెళ్లిపోవాలని సోమవారం ఉదయం రైతులు, గ్రామస్థులతో కలిసి శివాలయంలో పూజలు చేసి, స్వామివారి వద్ద ఓ వినతిపత్రాన్ని ఉంచారు. పచ్చని పొలాలతో కళకళలాడుతున్న గ్రామం జోలికి రావద్దని ఉద్యమ నేతలు హెచ్చరించారు. మరోవైపు కరేడులోకి వెళ్లేందుకు ప్రయత్నించిన సీపీఎం, ప్రజాసంఘాలు, రైతు కూలీ సంఘం నేతలను పోలీసులు అదుపులోకి తీసుకొని కందుకూరు, వలేటివారిపాలెం, లింగసముద్రం పోలీస్‌స్టేషన్లకు తరలించారు. భూములను కార్పొరేట్ కంపెనీలకు అప్పజెప్పడానికి ప్రభుత్వం ప్రజలను ప్రలోభాలతో మోసం చేసేందుకు ప్రయత్నిస్తోందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు విమర్శించారు.

రెండు మూడేళ్లలో
అమరావతిలో పులసలు పడతాం: కేతిరెడ్డి

- మేం దమ్మున్నోళ్లం... మాది దమ్మున్న పార్టీ: అనంత

రాజమహేంద్రవరం, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): 'రెండు మూడేళ్లలో అమరావతిలో పులస చేపలు పడతాం. మీ అందరికీ పంచిపెడతాం. ఇక్కడ గోదావరి పొంగినట్టు అక్కడ వరద పొంగుతోంది' అని వైసీపీ మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి అన్నారు. రాజమండ్రి కేంద్ర కారాగారంలో ఉన్న వైసీపీ ఎంపీ మిథున్‌రెడ్డిని సోమవారం వైసీపీ మాజీ ఎమ్మెల్యేలు కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి, అనంత వెంకట్రామిరెడ్డి, సుగాని బాలసుబ్రహ్మణ్యం ములాఖత్‌లో కలిశారు. అనంతరం కేతిరెడ్డి విలేకరులతో మాట్లాడుతూ అమరావతిపై విద్వేషపూరిత వ్యాఖ్యలు చేశారు. మాజీ ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ... 'మేం దమ్మున్న వాళ్లం. మా పార్టీ దమ్మున్న పార్టీ. అన్ని ఎన్నికలు పెడితే తేల్చుకోవడానికి సిద్ధంగా ఉన్నాం' అని అన్నారు.

విశాఖలో తుపాకీ కాల్పుల కలకలం

- బొగ్గు దొంగతనాలకు పాల్పడే ఇరువర్గాల మధ్య పాతకక్షలు
- కాల్పుల్లో ఒకరికి తీవ్ర గాయాలు, కేజీహెచ్‌కు తరలింపు
- ఘటన వెనుక మాజీ పోలీసు కానిస్టేబుల్ ఉన్నట్లు అనుమానం
- పోలీసుల అదుపులో నిందితులు?

మహారాణిపేట (విశాఖపట్నం), ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): విశాఖ వన్‌టౌన్ ప్రాంతంలో ఆదివారం అర్ధరాత్రి తుపాకీ కాల్పుల ఘటన కలకలం రేపింది. తూటా తగిలి గాయపడిన యువకుడు ఆస్పత్రిపాలయ్యాడు. ఈ ఘటన వెనుక మాజీ కానిస్టేబుల్ హస్తమున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. వివరాలివీ.. వన్‌టౌన్ ప్రాంతానికి చేపల రాజేష్, వాసుపల్లి నరేష్ స్నేహితులు. గోడ నూకరాజు, జంపా దిలీప్ మరో వర్గం. వీరంతా బొగ్గు దొంగతనాలకు పాల్పడుతూ ఉంటారు. ఇరువర్గాల మధ్య పాత కక్షలున్నాయి. ఆదివారం రాత్రి పది గంటల సమయంలో నలుగురూ వన్‌టౌన్‌లోని చిలకపేట వద్ద కూర్చుని మద్యం సేవిస్తున్నారు. ఈ క్రమంలో మాటామాటా పెరిగి రాజేష్‌పై నూకరాజు కత్తితో దాడికి యత్నించాడు. రాజేష్ ఆ కత్తి లాక్కుని నూకరాజుపై ప్రతిదాడికి యత్నించగా నూకరాజు పారిపోయాడు. మళ్లీ రాత్రి 11 గంటల సమయంలో నలుగురూ అదే ప్రదేశానికి చేరుకున్నారు. ఈసారి నూకరాజు తుపాకీ తీసుకొచ్చి రాజేష్‌ను కాల్చాడు. పొట్ట దిగువ భాగంలో తూటా దిగడంతో రాజేష్ కుప్పకూలిపోయాడు. అతడిని కేజీహెచ్‌కు తరలించగా, వైద్యులు శస్త్ర చికిత్స నిర్వహించి ఐసీయూలో ఉంచారు. అయితే ఈ ఘటన వెనుక ఒక మాజీ కానిస్టేబుల్ హస్తం ఉన్నట్టు భావిస్తున్నారు. 2013 బ్యాచ్‌కు చెందిన ఆ కానిస్టేబుల్ పోర్టులో బొగ్గు లోడింగ్, అన్‌లోడింగ్ వ్యాపారం చేస్తున్నారు. గత అక్టోబరు నుంచి ఉద్యోగానికి వెళ్లడం లేదు. బొగ్గు దొంగతనాలకు సంబంధించి రాజేష్‌తో అతడికి విభేదాలు ఉన్న నేపథ్యంలో నూకరాజుకు తుపాకీ ఇచ్చి పంపించింది అతడేనని పోలీసులు అనుమానిస్తున్నారు. అతడు కూడా పరారీలో ఉన్నాడు. అది నాటు తుపాకీనా, సాధారణ తుపాకీనా అనేది ఇంకా ధ్రువీకరించలేదు. నూకరాజు, దిలీప్‌లను శ్రీకాకుళంలో పోలీసులు అదుపులోకి తీసుకున్నట్టు తెలిసింది.



కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న రాజేష్

మూడు వాహనాలు ఢీ
నలుగురు మృతి...10మందికి గాయాలు

- అంతా బళ్లారి వాసులు.. శ్రీసత్యసాయి జిల్లాలో ఘటన

తనకల్లు, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): మూడు వాహనాలు ఒకదానికొకటి ఢీకొన్న ఘటనలో నలుగురు మృతిచెందారు. మరో పదిమంది గాయపడ్డారు. శ్రీసత్యసాయి జిల్లా తనకల్లు మండలం మండ్లిపల్లి వద్ద సోమవారం ఈ ప్రమాదం జరిగింది. బళ్లారికి చెందిన 13 మంది టెంపో ట్రావెల్ వాహనంలో అరుణాచలం, తిరుమల-తిరుపతి క్షేత్ర సందర్శనకు వెళ్లారు. దైవ దర్శనం అనంతరం సోమవారం తిరుగు ప్రయాణమయ్యారు. వీరు ప్రయాణిస్తున్న వాహనం తనకల్లు మండలం మండ్లిపల్లి వద్ద ముందు వెళ్తున్న మరో టెంపో ట్రావెల్‌ను ఓవర్‌టేక్ చేయబోయింది. అదే సమయంలో కదిరి నుంచి మదనపల్లికి వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఎదురుగా వచ్చింది. ఈ క్రమంలో మూడు వాహనాలు ఢీకొన్నాయి. బళ్లారివాసులు ప్రయాణిస్తున్న వాహనంలోని అనసూయమ్మ (50), జాహ్నవి(4), డ్రైవర్ మణికంఠ(42), నాగేంద్రప్ప (58) మృతిచెందారు. ఆర్టీసీ బస్సు, మరో టెంపో ట్రావెలర్‌లో ఉన్నవారు సురక్షితంగా బయట పడ్డారు.



ఘటనా స్థలంలో ప్రమాదానికి గురైన వాహనాలు

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

జీఎస్టీ ప్రక్షాళన!

ప్రధాని ఎర్రకోట ప్రసంగంలో జాతీయతనూ, దేశభక్తినీ రగల్చే వ్యాఖ్యలు ఉత్తేజాన్నివ్వడంతోపాటు, వస్తుసేవల పన్ను (జీఎస్టీ) విధానంలో మార్పు తేబోతున్నామన్న హామీ ఈ దేశ సగటు మనిషిని కచ్చితంగా సంతోషపెట్టి ఉంటాయి. దీపావళికి జీఎస్టీ పండుగ రాబోతున్నదనీ, ఆ రోజున గొప్ప బహుమతి ఇవ్వబోతున్నామని ప్రధాని ఎర్రకోటమీద నుంచి వ్యాఖ్యానించారు. వెనువెంటనే, ఆర్థిక మంత్రిత్వశాఖ నుంచి మీడియాకు లీకులు అందాయి. ప్రస్తుతం ఉన్న నాలుగురకాల జీఎస్టీ శ్లాబుల్లో 12, 28శాతం తొలగిపోయి, 5, 18శ్లాబులు మిగుల్తూ జీఎస్టీ 2.0 ఆవిర్భవించబోతున్నదని మీడియా కథనాల సారాంశం. కేంద్ర ఆర్థికశాఖ పరోక్షంగా అందించిన సమాచారాన్ని కాచివడబోసి, పాలు, పన్నీరు నుంచి టీవీలు, వాషింగ్ మెషీన్ల వరకూ ఎన్నిరకాల ఉత్పత్తుల ధరలు తగ్గవచ్చునో మీడియా అంచనాలు కడుతోంది. సుంకాల యుద్ధాలో, విదేశాలతో చేసుకోవాల్సి వస్తున్న వాణిజ్య ఒప్పందాలో, సొంతబలం లేని స్థితిలో ముంచుకొస్తున్న రాష్ట్రాల ఎన్నికలో.. ఎవరు ఏ కారణాలు చెబుతున్నప్పటికీ, జీఎస్టీ సమూల ప్రక్షాళనకు ప్రభుత్వం సిద్ధపడినందుకు సంతోషించాలి, అభినందించాలి.

కేవలం శ్లాబుల కుదింపు, పన్నురేట్ల తగ్గింపులే కాక, జీఎస్టీ వ్యవస్థను సమూలంగా సంస్కరించే పని జరుగుతోందట. పన్ను ఎగవేతలను రూపుమాపి, బోగస్ ఇన్వాయిస్‌లతో ఇన్‌పుట్ టాక్స్ క్రెడిట్‌ను దిగమింగే అకృత్యానికి కూడా అడ్డుకట్టవేస్తారట. రిటర్నులు, రిఫండ్ల ప్రక్రియలు అతివేగంగా జరిగిపోతాయట. మొత్తానికి అటు అమ్మకందారు, ఇటు కొనుగోలుదారు కళ్ళలో ఆనందాన్ని చూడాలని ఆర్థికశాఖ అనుకుంటోందని అర్థం. 2017లో జీఎస్టీ వ్యవస్థను ప్రవేశపెడుతున్నప్పుడు పాలకులు దానిని ఏ రీతిన కీర్తించారో మనకు తెలుసు. ఆ తరువాత అది చక్కనిదీ, సరళతరమూ (గుడ్ అండ్ సింపుల్) కాదని తేలిపోయింది. జీఎస్టీ వసూళ్ళు దాదాపు రెండులక్షల కోట్లకు చేరి, ఏటా పదిశాతానికి పైగా వృద్ధి కనబడుతున్నా, పన్ను రేట్లు, వివిధ శ్లాబులలోకి వచ్చే వస్తువులు, సేవల విషయంలో సామాన్యులకు తీవ్రమైన అసంతృప్తి ఉంది. రేట్ల నిర్ణయంలో కేంద్రం అమానవీయంగా వ్యవహరిస్తోంది. ఆరోగ్య ఉత్పత్తులు–సేవలు, ఔషధాలు, వెన్న, నెయ్యి, పాలు వంటి నిత్యావసరాలపైనా జీఎస్టీ హెచ్చు స్థాయిలో ఉండటం ఏ విధంగానూ సమర్థనీయం కాదు.

గత ఏడాది సెప్టెంబరులో కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్‌తో జరిగిన ఓ సమావేశంలో, తమిళనాడులోని ఓ హోటల్ చైన్ యజమాని వివిధరకాల ఆహారోత్పత్తులపై వేర్వేరు జీఎస్టీ రేట్ల గురించి చేసిన వ్యాఖ్యలు క్రీమ్ బన్ వీడియోగా ఎంతో ప్రాచుర్యం పొందాయి. 'క్రీమ్ బన్ మీద 18శాతం జీఎస్టీ ఉంటే, విడిగా బన్ మీద అస్సలు లేదు..., మా హోటల్‌కు వచ్చిన కస్టమర్లు, బన్ను, క్రీము వేరువేరుగా ఇస్తే మేమే దానిమీద పూసుకొని తింటామని అంటున్నారు మేడమ్' అంటూ నిజాన్నీ, నిష్ఠూరాన్నీ సమానపాళ్ళలో మేళవించి వ్యాఖ్యానించాడాయన. ఆ తరువాత ఆర్థికమంత్రికి అవమానమో, ఆగ్రహమో కలిగినందున, విడిగా కలిసి క్షమాపణలు చెప్పకున్న మరో వీడియో వెలుగుచూసింది. ఇక, రాజస్థాన్‌లోని జైసల్మేర్‌లో జరిగిన 55వ జీఎస్టీ సమావేశం పాప్‌కార్న్ ఫ్లేవర్, దానిలోని చక్కెర, మసాలా స్థాయిలను బట్టి మూడురకాల పన్నులు నిర్ణయించడంతో నెటిజన్లు ప్రభుత్వాన్ని తీవ్రంగా ట్రోల్ చేశారు. జీవిత బీమా (లైఫ్ ఇన్సూరెన్స్), ఆరోగ్య బీమా (హెల్త్ ఇన్సూరెన్స్) ప్రీమియంలపై 18శాతం జీఎస్టీ వసూలు చేయడాన్ని వ్యతిరేకిస్తూ కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు లేఖ రాయడం కలకలం రేపింది. సామాన్యులకు అవసరమైన బీమా ప్రీమియంలపై జీఎస్టీని తగ్గించాలంటూ ఉద్యోగ సంఘాలు దీర్ఘకాలంగా డిమాండ్ చేస్తూ, నాయకులకు విన్నపాలు సమర్పిస్తున్నాయి. ప్రీమియం చెల్లింపులపై జీఎస్టీని పూర్తిగా రద్దుచేయాలని పార్లమెంట్‌లో విపక్షాలు అడిగినప్పుడు జీఎస్టీ రాకమునుపు కూడా ప్రీమియంపై పన్ను ఉన్నదంటూ ప్రభుత్వం ప్రతివిమర్శ చేసింది. ప్రతీదానినీ రాజకీయం చేయవద్దని విపక్షాన్ని హెచ్చరించింది. ఇప్పుడు ప్రీమియంపై కూడా పన్ను తగ్గించబోతున్నారనీ, సగటు మనిషి ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న పెట్రోలియం ఉత్పత్తులనూ జీఎస్టీ పరిధిలోకి తెచ్చి మంటను ఉపశమింపచేస్తారనీ వింటున్నాం. ప్రజల ప్రతీ అవసరాన్నీ దృష్టిలో పెట్టుకొని, రేట్లనూ, శ్లాబులనూ చక్కదిద్దాలనీ, న్యాయమైన, హేతుబద్ధమైన పన్ను విధానం రూపొంది, అమ్మకందారుల, వినియోగదారుల ప్రశంసలు అందుకోవాలని ఆశిద్దాం.

మహిళా సాధికారతే లక్ష్యంగా...

రాష్ట్రంలో డ్వాక్రా మహిళల జీవనాభివృద్ధికి కూటమి ప్రభుత్వం అనేక ప్రణాళికలు రూపొందించి, వాటిని విజయవంతంగా అమలు చేస్తోంది. 'బటన్ నొక్కాలి.. కానీ సాయం అందకూడదు.. హామీలు ఇవ్వాలి.. వాటిని అమలు చేయకూడదు' అన్న చందంగా గత పాలకుల పనితీరు ఉండేది. యువత, మహిళాభివృద్ధిని వారు విస్మరించారు. ఈ పరిస్థితిని చంద్రన్న ప్రభుత్వం పూర్తిగా మార్చేసింది.

మహిళలకు ఆస్తిహక్కు, రాజకీయాల్లో 9 శాతం రిజర్వేషన్లు వంటివి గత ఎన్టీఆర్ ప్రభుత్వం కల్పించగా, స్థానిక సంస్థల ఎన్నికల్లో పదవులు, కళాశాలల్లో యువతులకు 33 శాతం రిజర్వేషన్లు వంటివి ప్రస్తుత చంద్రన్న ప్రభుత్వం అమలుచేస్తోంది. డ్వాక్రా మహిళలను పారిశ్రామికవేత్తలుగా ప్రోత్సహించేందుకు 'మహిళా MSME పార్కులు' ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం ఇప్పటికే చర్యలు చేపట్టింది. స్త్రీ నిధి రుణాలను రూ.3.5 లక్షల నుంచి రూ.5 లక్షలకు, వడ్డీ రాయితీని రూ.3 లక్షల నుంచి రూ.10 లక్షలకు, అలాగే వారికి వడ్డీ రుణాలను రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచింది. గ్రామైక్య మహిళా సంఘాలకు బ్యాంకు లింకేజీని రూ.3 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు పెంచి, అందులో రూ.10 లక్షల మేర వడ్డీ రాయితీని అందిస్తోంది. ఇవేకాక, 'స్ఫూర్తి' పథకం ద్వారా స్వయం సహాయక సంఘాలకు 90 శాతం సబ్సిడీతో రూ.5 కోట్ల వరకు రుణం ఇచ్చే కార్యక్రమాన్ని తొలి విడతగా 11 జిల్లాల్లో ప్రభుత్వం అమలు చేస్తోంది. గతంలో ఎన్నడూ లేని విధంగా స్వయం సహాయక సంఘాలకు ఎలాంటి పూచీకత్తూ లేకుండా రుణాలు అందించడంతో పాటు, నెలవారీ వాయిదాల్లో మహిళలు తిరిగి జమ చేస్తున్న విధానాన్ని 'మన సంఘం–మన లెక్కలు' యాప్ ద్వారా చంద్రన్న ప్రభుత్వం ఆన్‌లైన్‌లో పొందుపరుస్తోంది. ఈ విధానంతో అవినీతికి అడ్డుకట్ట వేస్తోంది.



'బటన్ నొక్కాలి.. కానీ సాయం అందకూడదు.. హామీలు ఇవ్వాలి.. వాటిని అమలు చేయకూడదు' అన్న చందంగా గత పాలకుల పనితీరు ఉండేది. ఈ పరిస్థితిని చంద్రన్న ప్రభుత్వం పూర్తిగా మార్చేసింది. స్త్రీ శక్తి, స్త్రీ నిధి రుణాలు, స్ఫూర్తి, ఉన్నతి వంటి పథకాలతో పాటు మహిళా MSME పార్కులను ఏర్పాటు చేసి మహిళలకు ఆర్థికంగా చేయూతనిస్తోంది.

'స్త్రీ శక్తి' పథకం మహిళలకు ఎంతో ఉపయోగకరమైనది. ఆర్థిక ఇబ్బందుల వల్ల ఉద్యోగాలు, పనులకు వెళ్లలేని మహిళలకు ఈ ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం ఎంతో ఉపశమనాన్ని కలిగిస్తోంది. ఈ సదుపాయం వల్ల మహిళలు ఇతర సామాజిక కార్యక్రమాల్లోనూ సులభంగా పాల్గొనగలుగుతున్నారు. సమాజంతో మమేకమవుతున్నారు. ఏపీఎస్ఆర్టీసీ నడిపే మొత్తం 11,449 బస్సుల్లో 8,458 బస్సులను చంద్రన్న ప్రభుత్వం ఈ పథకం కోసం కేటాయించడం సంతోషకరం. మహిళల భద్రత కోసం అన్ని బస్సుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, మహిళా కండక్టర్లకు బాడీవోర్న్ కెమెరాలు అందించాలని ఆదేశించడం మహిళల భద్రతపై కూటమి ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనం.

గ్రామీణ ప్రాంతాల్లో డ్వాక్రా సంఘాల ఆధ్వర్యంలో రూపొందిస్తున్న ఉత్పత్తులకు మార్కెటింగ్ సదుపాయాన్ని కల్పించాలనే ఉద్దేశంతో నాబార్డు, ఫ్లిప్‌కార్ట్, కేతి, ఫార్మ్ వేద వంటి సంస్థలతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంది. తద్వారా జాతీయ, అంతర్జాతీయ మార్కెట్లలో డ్వాక్రా సంఘాలు తమ ఉత్పత్తులను విక్రయించి, లబ్ధి పొందే అవకాశం ఉంటుంది. డ్రోన్ల కేటాయింపుల్లో కూడా స్వయం సహాయక సంఘాలకు రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తూ, 80శాతం సబ్సిడీతో మహిళలకు డ్రోన్లను అందజేస్తోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 14 నెలల కాలంలో రూ.35,291 కోట్ల ఆర్థిక సాయాన్ని అందించడంతో పాటు, 4,551 కోట్ల బ్యాంక్ లింకేజీలను శ్రీనిధి ద్వారా డ్వాక్రా సంఘాలకు అందించింది. 'ఉన్నతి' పథకం కింద ఎస్సీ, ఎస్టీ మహిళలకు రూ.253 కోట్ల సాయాన్ని అందిస్తూ వారి అభివృద్ధికి బాటలు వేస్తోంది. ప్రతి స్వయం సహాయక సంఘానికి ఒక యునిక్ ఐడీ కేటాయించి రుణాల మంజూరు, సంక్షేమ పథకాలు అందించడంలో ఎలాంటి అవకతవకలు జరగకుండా పకడ్బందీగా చంద్రన్న ప్రభుత్వం అమలు చేస్తోంది. స్వయం సహాయక సంఘాల్లో మరింతగా పారదర్శకత పెంపొందించేందుకు 'క్రెడిట్ స్కోర్' విధానాన్ని ప్రవేశపెట్టేందుకు, CIF ఫండ్ ట్రాకింగ్ అప్లికేషన్‌ను సిద్ధం చేసేందుకు కూటమి ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. స్త్రీ నిధి నుంచి రుణాలు తీసుకున్న మహిళలు ఏదైనా కారణంతో మరణిస్తే వారి రుణంలో గరిష్ఠంగా రూ.2 లక్షలు మాఫీ చేయడంతో పాటు, అప్పటి వరకు వారు చెల్లించిన రుణం మొత్తాన్ని నామినీకి తిరిగి చెల్లించే అవకాశం ఉంది. ఈ రుణ బీమా సదుపాయాన్ని మరింతగా విస్తరించి, స్వయం సహాయక సంఘాల్లోని మహిళలకు కూడా దాన్ని వర్తించేలా ప్రస్తుత ప్రభుత్వం చర్యలు తీసుకుంది.

'పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ'లో రిసోర్స్ పర్సన్‌లుగా పనిచేసే వారికి గత ప్రభుత్వం మూడు సంవత్సరాల కాల పరిమితిని విధించింది. కూటమి ప్రభుత్వం ఆ కాల పరిమితిని రద్దు చేసి, వారికి ఉద్యోగ భద్రత కల్పించింది. 'డిజిటల్ లక్ష్మి' పథకం ద్వారా స్వయం సహాయక సంఘాల సభ్యులకు 'కామన్ సర్వీస్ సెంటర్ల' నిర్వహణ బాధ్యతలను, ట్యాబ్‌ల పంపిణీ కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం చేపట్టింది. అంతేకాదు, గ్రామీణ ప్రాంతాల్లోని డ్వాక్రా సంఘాల మహిళలకు రూ.50 వేల విలువైన 'ఎగ్ కార్ట్'లను ప్రభుత్వం ఉచితంగా అందజేస్తోంది. ఇలా డ్వాక్రా సంఘాల నుంచి గ్లోబల్ బ్రాండ్ల వరకు మహిళలను భాగస్వాములను చేస్తూ, తెలుగు ఆడపడుచుల శక్తిని ప్రపంచానికి కూటమి ప్రభుత్వం చాటిచెబుతోంది.

• ఆచంట సునీత
'తెలుగునాడు అంగన్‌వాడీ డ్వాక్రా సాధికార సంస్థ' రాష్ట్ర అధ్యక్షురాలు

ఫెడరల్ : రాజ్యాంగ పీఠికకు మరో చేర్పు

భారత జాతీయ జాగృతిలో కీలక పాత్ర వహించిన వలసపాలన వ్యతిరేక ఆలోచనారంగంలో విశాల దృక్పథమూ, ముందుచూపుతో ప్రశస్త భావాలు ప్రభవించాయి. అయితే 1947లో భారత స్వాతంత్ర్య విజయం అనంతరం వలసపాలనానంతర రాజ్య వ్యవస్థ అత్యున్నత స్థాయిలో అధికార పోరాటం కారణంగా ఆ సమున్నత భావాలలో కొన్ని నిలదొక్కుకోలేకపోయాయి. అధికారంలో పాలుపంచుకోవడంలో ఫెడరల్ కేంద్రం, రాష్ట్రాల మధ్య అనివార్యమైన సర్దుబాట్లు అనేది ఆ భావాలలో ప్రముఖమైనది. మత ప్రాతిపదికన జరిగిన దేశ విభజన, దాని విషమ పర్యవసానాలు ప్రాంతీయమైన రాజకీయ గతిశీలతను కనిపించకుండా చేశాయి. ఆ రాజకీయ శక్తిశీలతే స్వతంత్ర భారతదేశాన్ని ఒక సమాఖ్య రాజ్యంగా రూపొందించే విషయమై వలసపాలన వ్యతిరేక జాతీయవాదులలో వినూత్న ఆలోచనలకు ప్రేరణనిచ్చింది. ప్రజాస్వామ్య సమాజం, సమాఖ్య వ్యవస్థ విషయమై స్వాతంత్ర్య సమర నాయకుల సృజనాత్మక భావాలు స్వతంత్ర భారతదేశ ప్రస్థానంలో సాకారమవలేదు. అవకపోగా అలక్ష్యానికి గురయ్యాయి. ఇపుడు ఆ సమున్నత దార్శనికతల సృజనాత్మక పునరుద్ధరణకు మనం పూనుకోవాల్సిన అవసరమున్నది.

భారత రాజ్యాంగ పీఠిక నుంచి 'సెక్యులర్' (లౌకిక), 'సోషలిస్ట్' (సామ్యవాద) అనే పదాలను తొలగించివేసే విషయాన్ని పరిశీలించాలని ఇటీవల రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ పెద్దలు సూచించారు. ఎమర్జెన్సీ చీకటి రోజులలో ప్రధాని ఇందిర ప్రభుత్వం రాజ్యాంగానికి 42వ సవరణ ద్వారా రాజ్యాంగ పీఠికలో ఆ రెండు పదాలు చేర్చింది. 'సెక్యులర్'ను తొలగించడం, హిందూ గణతంత్ర రాజ్య ఏర్పాటు ప్రతిపాదకులకు ఒక ప్రతీకాత్మక విజయమవుతుంది. 'సోషలిస్ట్'ను చరిత్ర చెత్తబుట్టపాలు చేయడం సామాజిక–ఆర్థిక అసమానతలు అంతుపొంతు లేకుండా పెచ్చరిల్లిపోవడాన్ని నిస్సిగ్గుగా వేడుక చేసుకుంటున్న యుగానికి సముచితమైనది కావచ్చు.

సెక్యులరిజం, సోషలిజం రెండిటినీ కేంద్రీకృత రాజ్య వ్యవస్థ అధికారానికి సైద్ధాంతిక ఆధారాలుగా ఇందిరా గాంధీ పరిగణించారు. ఆ దృక్పథంతోనే ఆమె ఆ రెండు భావనలను రాజ్యాంగ పీఠికలో చేర్చారు. అయితే ఈ రెండు సైద్ధాంతిక పునాదులు బీటలు వారడంతో మత పరమైన మెజారిటేరియన్‌వాదం ఆ రెండింటిని కేంద్రీకృత నిరంకుశాధికారాన్ని పెంపొందించుకుని, పటిష్ఠం చేసుకునేందుకు చక్కగా ఉపయోగించుకున్నది. రాజ్యాంగ పీఠికలోని ప్రతీకాత్మకతకు ప్రాముఖ్యత ఉన్నట్టయితే ఆ పీఠిక నుంచి రెండు పదాలను తొలగించడం కాకుండా మరొక పదాన్ని అదనంగా చేర్చడం విజ్ఞతాయుతంగా ఉంటుంది, సందేహం లేదు.

నవంబర్ 15, 1948న రాజ్యాంగ సభలో కేటీ షా అధికరణ 1కి ఒక సవరణ ప్రతిపాదించారు. 'ఇండియా షల్ బి ఏ సెక్యులర్, ఫెడరల్, సోషలిస్ట్ యూనియన్ స్టేట్స్'గా ప్రకటించాలని ఆ సవరణ పేర్కొన్నది. ఆ దశలో రాజ్యాంగ పీఠికపై ఇంకా చర్చ ప్రారంభం కాలేదు. మొదటి అధికరణను సవరించడం ద్వారా భావి భారత్



akbar

మన స్వాతంత్ర్యోద్యమ నాయకులు, ఉదార భారత సమాఖ్య రాజ్యాన్నే ప్రగాఢంగా ఆకాంక్షించారు. వలసపాలన కాలం నాటి కేంద్రీకృత రాజ్యవ్యవస్థను కొనసాగించాలని వారు ఎంత మాత్రం భావించలేదు. ప్రాంతీయ తత్వాలు వారి స్వభావానికి విరుద్ధం. మన గణతంత్ర రాజ్య సంస్థాపన సందర్భంలోనే వారి ఉదాత్త దార్శనికతను కోల్పోయాం. ఫలితంగా సంభవించిన నష్టాన్ని నిజాయితీగా అర్థం చేసుకోవాలి. కేంద్రీకృత నిరంకుశాధికారానికి వ్యతిరేకంగా ప్రజాస్వామ్యం, సమాఖ్య విధానం పురోగతికి అది ఒక ఆవశ్యక షరతు.

స్వరూపస్వభావాలకు ఒక స్పష్టత నివ్వాలని కేటీ షా భావించారు. 'అధికరణ 1లోని 'యూనియన్' అనే పదం ఏక కేంద్రక ప్రభుత్వం (యూనిటరీ గవర్నమెంట్) అని భావించడానికి దారితీయకూడదు. ఎవరూ అలా పొరపడకుండా ఉండాలంటే మొదటి అధికరణలోని మొదటి నిబంధనలోనే 'ఫెడరల్ యూనియన్' అని స్పష్టం చేయాలని నేను భావిస్తున్నానని' షా అన్నారు.

కేటీ షా ప్రతిపాదనకు డాక్టర్ అంబేడ్కర్ రెండు అభ్యంతరాలు తెలిపారు. 'రాజ్యాంగం అనేది రాజ్య వ్యవస్థలోని వివిధ విభాగాలను క్రమబద్ధీకరించడానికి ఉద్దేశించిన ఒక వ్యవస్థ' అని ఆయన అన్నారు. 'ప్రభుత్వ విధానం ఏమిటి? సమాజాన్ని ఎలా వ్యవస్థీకరించాలి మొదలైన విషయాలను రాజ్యాంగం నిర్దేశించదు' అని అంబేడ్కర్ అన్నారు. 'సోషలిస్ట్' అనే పదానికి సంబంధించినంతవరకు షా సవరణ అనవసరం' అనేది అంబేడ్కర్ రెండో ఆక్షేపణ. అయితే 'సెక్యులర్', 'ఫెడరల్' అనే పదాల గురించి ఆయనేమీ చెప్పలేదు. రాజ్యాంగంలోని ఆదేశిక సూత్రాలు తమ సారంలోను, లక్ష్యంలోను సామ్యవాద స్ఫూర్తిలేనివి అయితే సామ్యవాదం మరింకేమవుతుందనేది నేను అర్థం చేసుకోలేకపోతున్నాను' అని అంబేడ్కర్ అన్నారు.

'ఫెడరల్' అనే పదాన్ని చేర్చాలన్న కేటీ షా వివేకవంతమైన సూచనను రాజ్యాంగ సభ తిరస్కరించిందని మరి చెప్పనవసరం లేదు. దీనిపై మహబూబ్ అలీ బైగ్ అనే సభ్యుడు ప్రతిస్పందిస్తూ 'ముసాయిదా రాజ్యాంగ నిర్మాతల మనసులో ఏక కేంద్రక ప్రభుత్వ భావన ఉండి ఉంటుందని, అయితే దాన్ని వారు సమాఖ్య అని చెప్పుతున్నారని' విస్మయం వ్యక్తం చేశారు. భారత ప్రభుత్వం యూనిటరీ ప్రభుత్వంగా కాకుండా ఫెడరల్ ప్రభుత్వంగానే ఉండితీరాలి. భవిష్యత్తులో అధికార లాలసులు ఏక కేంద్రక ప్రభుత్వాన్ని ఫాసిస్ట్ లేదా సంపూర్ణ నియంతృత్వ ప్రభుత్వంగా మార్చివేసేందుకు అవకాశమున్నదని పేర్కొంటూ కనుక మనం ఇప్పుడే ఫెడరేషన్ అనే సరైన మాటను చేర్చితీరాలని ప్రతిపాదించారు. బైగ్ ప్రతిపాదించిన ఈ సవరణ కూడా తిరస్కృతమయింది.

కేటీ షా చాలా పట్టుదల మనిషి. అధికరణ 1లోని మొదటి నిబంధనకు ఆయన మరో సవరణ ప్రతిపాదించారు. అన్ని రాష్ట్రాలు సమమైనవే అన్నది ఆ సవరణ సారాంశం. ఈ కొత్త సవరణను ప్రతిపాదిస్తూ తన తొలి సవరణ ప్రతిపాదనపై డాక్టర్ అంబేడ్కర్ అభ్యంతరాలను త్రోసిపుచ్చారు. 'రాజ్యాంగం అనేది ప్రభుత్వంలోని వివిధ విభాగాలను క్రమబద్ధం చేసే వ్యవస్థ మాత్రమే' అన్న విషయాన్ని తాను వినడం ఇదే మొదటిసారి అని షా అన్నారు. 'ఇండియన్ యూనియన్ నిజమైన సమాఖ్య రాజ్యంగా ఉండి తీరాలంటే అందులో అంతర్భాగంగా ఉన్న అన్ని రాష్ట్రాలు ఎటువంటి మినహాయింపులు లేకుండా సమమైనవే అన్న విషయాన్ని రాజ్యాంగంలో చేర్చడం చాలా చాలా ముఖ్యమని కేటీ షా నొక్కి చెప్పారు. షా సవరణతో పాటు దాన్ని సమర్థిస్తూ హరివిష్ణు కామత్ ప్రతిపాదించిన సవరణను కూడా రాజ్యాంగ సభ తిరస్కరించింది.

సుభాస్ చంద్రబోస్ కాంగ్రెస్ అధ్యక్షుడుగా 1938లో ఏర్పాటు చేసిన జాతీయ ప్రణాళికా సంఘంలో చేరాలని రాధాకమల్ ముఖర్జీ, మేఘనాథ్ సాహాతో పాటు కేటీ షాను కూడా ఆహ్వానించారు. తమ తమ రంగాలలో మేరునగ శిఖరాలు అయిన ఈ ముగ్గురు విద్యావేత్తలు పరిపూర్ణ సమాఖ్యావాదులు. స్వాతంత్ర్య సమరంలో సుభాస్ బోస్, పండిట్ నెహ్రూ ఇరువురితోను షా సన్నిహితంగా కలిసి పనిచేశారు. 1952లో ప్రథమ సార్వత్రిక ఎన్నికలలో కేటీ షా స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేశారు. ప్రత్యర్థి అయిన కాంగ్రెస్ అభ్యర్థి చెప్పుకోదగిన ప్రముఖుడు కానప్పటికీ షా పరాజితుడు అయ్యారు. డాక్టర్ అంబేడ్కర్ సైతం ఆ ఎన్నికలలో అనామక కాంగ్రెస్ అభ్యర్థి చేతుల్లో ఓడిపోయారు. 1952లో రాష్ట్రపతి పదవికి జరిగిన ఎన్నికలలో కేటీ షా స్వతంత్ర అభ్యర్థిగా కాంగ్రెస్ అభ్యర్థి రాజేంద్రప్రసాద్‌పై పోటీచేసి ఓడిపోయారు. జాతీయ ప్రణాళికా సంఘంలో షాకు సహచరుడు, బెంగాల్ నుంచి లోక్‌సభకు ఎన్నికైన మేఘనాథ్ సాహా రాష్ట్రపతి పదవి ఎన్నికలలో పోటీ చేయమని కేటీ షాను ప్రోత్సహించారు. వలసపాలన వ్యతిరేక పోరాట ఆశయాలు, లక్ష్యాలకు విజేత కంటే ఎక్కువగా నిబద్ధుడు అయినప్పటికీ కేటీ షా ఓడిపోయారు.

రాజ్యాంగ పీఠికలోని మాటలు మనోరంజితమైనవీ, స్ఫూర్తిదాయకమైనవీ. 'ఫెడరల్' అనే మాటను అదనంగా చేర్చడం వల్ల ఆ భావనలు మరెంతో అర్థవంతమవుతాయి. సమాఖ్య విధానాన్ని చిత్తశుద్ధితో అమలుపరచాల్సిన అవసరమున్నది. త్వరలోనే దేశ వ్యాప్తంగా జనాభా గణన జరగనున్నది. ఆ తరువాత నియోజకవర్గాలను పునర్ వ్యవస్థీకరిస్తారు. దీని వల్ల హిందీ రాష్ట్రాల ప్రాధాన్యం పెరిగి దక్షిణాది రాష్ట్రాలు తమ రాజకీయ పలుకుబడిని కోల్పోవచ్చునే భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఈ కారణంగా సమాఖ్య పాలనా పద్ధతిని చిత్తశుద్ధితో అమలుపరిచేందుకు మరింత శ్రద్ధ చూపవలసిన అవసరమున్నది. శక్తిమంతమైన భారతదేశం సమాఖ్య తరహా రాజ్యం మాత్రమే అవుతుంది.

కశ్మీర్, ఈశాన్య రాష్ట్రాలలో వేర్పాటువాద ధోరణులు పెచ్చరిల్లిపోయాయి. తమిళ, కన్నడ, మరాఠీ, బెంగాలీ స్వాభిమానాలు మళ్లీ ప్రకోపిస్తున్నాయి. భారత రాజకీయాల భావి తీరుతెన్నులకు అవి సూచకాలు కాదా? మహాద్రష్టలైన మన స్వాతంత్ర్యోద్యమ నాయకులు, వినూత్న, ఉదార భారత సమాఖ్య రాజ్యాన్నే ప్రగాఢంగా ఆకాంక్షించారు. వలసపాలన కాలం నాటి కేంద్రీకృత రాజ్యవ్యవస్థను కొనసాగించాలని వారు ఎంతమాత్రం భావించలేదు. ప్రాంతీయ తత్వాలు వారి స్వభావానికి విరుద్ధం. మన గణతంత్ర రాజ్య సంస్థాపన సందర్భంలోనే వారి మానవీయ దార్శనికతను కోల్పోయాం. ఫలితంగా సంభవించిన నష్టాన్ని నిజాయితీగా అర్థం చేసుకోవాలి. కేంద్రీకృత నిరంకుశాధికారానికి వ్యతిరేకంగా ప్రజాస్వామ్యం, సమాఖ్య విధానం పురోగతికి అది ఒక ఆవశ్యక షరతు.


■ సుగత బోస్
హార్వర్డ్ విశ్వవిద్యాలయం

('ది న్యూ ఇండియన్ ఎక్స్‌ప్రెస్' సౌజన్యం)

ఆదివాసీలపై మతం రుద్దవద్దు!

భారతదేశానికి అసలు వారసులైన ఆదివాసులపై నేటి హిందూ మతోన్మాదులు మతం రంగు పులిమేందుకు ఉవ్విళ్లూరుతున్నారు. 'ఆదివాసుల మతం ఏమిటి?' పేరుతో భంగ్యా భూక్యా రాసిన వ్యాసానికి (ఆంధ్రజ్యోతి: 24–07–25) స్పందనగా కాయం నవేంద్ర 'ఆదివాసీలు ముమ్మాటికీ హిందువులే' పేరుతో రాసిన వ్యాసం (12–08–25) అసత్యాలతో, ఆదివాసీ సమాజాన్ని గందరగోళపరిచేలా ఉన్నది. కాయం నవేంద్ర రాసినట్టు ఆదివాసీలు ఏ మతానికీ 'శాఖ' కాదు, ఏ మతంలోనూ అంతర్భాగం కాదు. వారికి వారే ఒక ప్రత్యేక వృక్షం.

భారతదేశంలోని ఆదివాసీలు తమ స్వంత మత, సాంస్కృతిక, సామాజిక వ్యవస్థలతో స్వతంత్ర గుర్తింపును కలిగి ఉన్నారు. వారు హిందూ మతంలో భాగం కాదు. వారిని ఒక ప్రత్యేక సమాజంగా గుర్తించాలి. భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికి మత స్వేచ్ఛను (ఆర్టికల్ 25), సాంస్కృతిక స్వయం ప్రతిపత్తిని (ఆర్టికల్ 29, 30) హామీ ఇస్తుంది. ఈ హక్కులు ఎవరి చరిత్రను, మతాన్ని, సంప్రదాయాన్ని వక్రీకరించి మరొక మతంలో బలవంతంగా కలపడానికి అనుమతించవు.



హిందూ శాస్త్రాలతో (వేదాలు, పురాణాలు), కర్మకాండలతో (యజ్ఞాలు, మంత్రాలు) పోల్చినపుడు ఆదివాసీల విశ్వాసాలు (ప్రకృతి ఆరాధన, ఆత్మల పూజ) మౌలికంగా భిన్నమైనవి. ఆదివాసీలు హిందూ మతంలో ఎప్పటి నుంచో భాగం అనే వాదన చారిత్రకంగా అసత్యం. ప్రాచీన వేద సాహిత్యంలో నిషాదులు, కిరాతులు, పులిందులు, శబరులు వంటి అరణ్యవాసులు హిందూ కులవ్యవస్థకు వెలుపలివారిగా వర్ణించబడ్డారు, నాగరికతకు దూరంగా చూపబడ్డారు.

మధ్యయుగంలో ఆదివాసీలు స్వతంత్ర రాజ్యాలను స్థాపించారు. గోదావరి పరిసరాల్లోని కోయ రాజ్యాలలో 12వ శతాబ్దం నుండి స్థానిక పాలన వ్యవస్థ ఉన్నది. వీరి దేవతలు పుట్ట పెన్, గంగమ్మ, భూమతల్లి. వీరి పూజలు అడవి గూడెంలో మాత్రమే. బస్తర్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, తెలంగాణలో 14వ శతాబ్దం నుండి 1948 వరకు విస్తరించిన గోండు రాజ్యాలలో దండకారణ్య మహాపూజ, జంతు బలి, నృత్యాలు ఉన్నాయే గాని హిందూ పద్ధతులు లేవు. జార్ఖండ్, బిహార్, బెంగాల్, ఒడిశాలోని సాంతాళ్ రాజ్యాలు మరాంగ్ బురు, జాహెర థాన్ మతాలను పాటించాయి. రాజస్థాన్, మధ్యప్రదేశ్, గుజరాత్‌లలో విస్తరించిన భీల్ సమాజం వనం, నదుల ఆరాధనను పాటిస్తాయి. మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్‌లలోని బైగా తెగ భూమిపూజ, ప్రకృతి సంరక్షణను పాటిస్తుంది. కుల వ్యవస్థను తిరస్కరిస్తుంది. జానపద కథల్లో మహాదేవ్ బైగా రూపంలో ఉంటాడు, కానీ హిందూ సంప్రదాయాలు భిన్నం. ప్రకృతి ఆరాధన (nature worship) ప్రపంచవ్యాప్త ప్రాచీన మతాల లక్షణం. దానిని హిందూ 'పంచభూతాల'తో కలపడం చరిత్ర వక్రీకరణ. ఆదివాసీ తెగ చట్టాలు (వారి వివాహం, వారసత్వం, పూజలు ఇవన్నీ) హిందూ ధర్మశాస్త్రాలకు (మనుస్మృతి మొదలైనవాటికి) భిన్నంగా ఉంటాయి. ఆదివాసులు ఎప్పుడూ హిందూవులే అనే హిందూత్వ వాదుల వాదన తర్కానికి నిలబడదు. భారత రాజ్యాంగమూ వారిని ప్రత్యేకంగా గుర్తిస్తుంది. ఆర్టికల్ 342 ప్రకారం ఎస్టీ గుర్తింపు మతం ఆధారంగా కాదు. అనేక కోర్టు తీర్పులూ ఇదే విషయాన్ని నిర్ధారిస్తున్నాయి. బ్రిటిష్ వారి కంటే ముందు కూడా తెగలు స్వతంత్ర సంప్రదాయాలను కలిగి ఉన్నాయి. వారు హిందూ పండుగల్లో పాల్గొనడం సాంస్కృతికం మాత్రమే తప్ప, మత ఏకీకరణ కాదు. ఆదివాసులను హిందూ మతంలో కలపడం అంటే వారి చరిత్రను చెరిపేయడం, భవిష్యత్తును దోచుకోవడం.

ప్రాచీన సింధూ నాగరికత వారసత్వమైన ఈ భారతదేశ ఆదివాసీలే ఆది బౌద్ధులు. ఈ ఆదివాసీలే స్వతంత్ర గణతంత్ర కళింగులు, నాగాజాతి బిడ్డలు. సామ్రాట్ అశోక చక్రవర్తితో సామ్రాజ్యవాదానికి దీటుగా పోరాడి కళింగ యుద్ధం చేశారు. యుద్ధం తర్వాత మారిన అశోకుడు వారి నుంచి బౌద్ధం స్వీకరించాకే బహుజన చక్రవర్తి అయ్యాడు. కాలక్రమంలో వలస ఆర్యన్ రాజుల దాడుల్లో సంస్కృతిని పోగొట్టుకున్న సింధూ నాగరికత ప్రజలు హిందువులు అయ్యారు. వలస బ్రాహ్మణిజ పాలనలో వేద చరిత్ర మొదలై బౌద్ధం అంతరించింది. సంస్కృతి దాడిని తట్టుకోలేని ఆదివాసీలు కొందరు అడవుల్లోకి పారిపోయారు, కొందరు బ్రాహ్మణీకరణ చెందారు. నాగా జాతి (నాగుల) చావు కోసమే జనమేజయుని యాగం అని వారి పురాణాల్లోనే రాసుకున్నారు. అందుకే ప్రాచీన సింధూ నాగరికత వారసులు, ప్రకృతి ఆరాధకులైన ఆదివాసీలకు మతమే లేదు.

○ వజ్జ వెంకటేశ్వర్లు

'స్వదేశీ' నినాదం కాదు, విధానం కావాలి!

ఎర్రకోటమీద నుంచి ప్రధాని నోట 'స్వదేశీ' నినాదం వినిపించినందుకు సంతోషించాల్సిందే. మరి, దానిని ఆచరణ సాధ్యం చేయాల్సింది ఎవరు? ప్రజలు స్వదేశీకోసం పాటుపడాలంటున్నారు పాలకులు. కానీ, పాలకులే విదేశీ వస్తువులను ప్రజలకు అందుబాటులో ఉంచి, వాటిని వినియోగింపజేస్తున్నారు. స్వదేశీ వస్తువులేవో, విదేశీ వస్తువులేవో గుర్తించగలిగేంత పరిజ్ఞానం దేశంలోని వినియోగదారులందరికీ ఉంటుందా?!

'స్వదేశీ వస్తువులనే వినియోగించాలి' అన్న వాట్సాప్ మెసేజ్ కనపడినా లేదా నినాదం వినపడినా పౌరుల్లో జాతీయభావం ఉప్పొంగుతుంది. స్వయం సమృద్ధి కాంక్ష కనిపిస్తుంది. ఎర్రకోట నుంచి ఆ నినాదం వినిపించినప్పుడు చాలా మంది చప్పట్లు కొట్టారు. "స్వదేశీ' మాట మాట్లాడే ముందు విదేశాల నుంచి దిగుమతులు ఆపేయడానికి మనం సిద్ధమేనా?' అలా సిద్ధపడితే, అమెరికా అధ్యక్షుడు విధిస్తోన్న 50 శాతం టారిఫ్‌ల బాధలే ఉండవు. గత ఆర్థిక సంవత్సరంలో మన ఎగుమతులు రూ.68 లక్షల కోట్లు కాగా, దిగుమతులు రూ.76 లక్షల కోట్లు. నిజానికి ఎగుమతుల కన్నా దిగుమతులే ఎక్కువ. దాదాపు 8 లక్షల కోట్ల రూపాయలు!

మన వస్తువులను స్వీకరిస్తున్న దేశాలు కూడా స్వదేశీ నినాదాన్ని ఇస్తూ వాటిని అడ్డుకుంటే ఇక్కడి రైతులు, ఇతర ఉత్పత్తిదారుల పరిస్థితి ఏంటి? అదీగాక మన దేశంలోకి దిగుమతి చేసుకుంటున్న వస్తువులను నిలిపేయడానికి ప్రభుత్వాలు సిద్ధంగా ఉన్నాయా? ఈ మధ్య కాలంలో రోడ్లపై తిరుగుతున్న విదేశీ కార్లలో బీవైడీ అనే చైనా ఎలక్ట్రిక్ కార్ బాగా పాపులర్ అయ్యింది. గతంలో ఎంజీ అనే కార్ కూడా చైనా నుంచి వచ్చినదే. ఇక హ్యుందాయ్, కియా, హోండా, క్రెటాలతో పాటు బీఎండబ్ల్యూ, మెర్సిడెస్ వంటి లగ్జరీ కార్ల సంస్థలన్నీ విదేశాలకు సంబంధించినవే. వీటి దిగుమతులను ప్రభుత్వం నిలిపేయగలదా? ఈ కార్ల దిగుమతి సుంకాల ద్వారా కేంద్ర ప్రభుత్వానికి వేల కోట్ల రూపాయల ఆదాయం చేకూరుతోంది. మందుబాబుల మందు మొదలుకొని, ప్రాణాధార మందులు, చిన్న చిన్న ఆట వస్తువుల వరకు కూడా మనం భారీగా దిగుమతి చేసుకుంటున్నాం. ఈ దిగుమతుల ద్వారా మంచి ఆదాయం సమకూరుతోంది. దిగుమతులను నిలిపేయకుండా ప్రభుత్వ పెద్దలు, ప్రముఖులు, మేధావులు 'స్వదేశీ' నినాదాన్నిచ్చి, ప్రజలను స్వదేశీ వస్తువులే వినియోగించాలని ఎలా కోరగలరు? ఇది అర్థరహితం కాదా? విదేశీ బ్యాంక్‌లు, విదేశీ ఇన్సూరెన్స్ సంస్థలను వ్యాపారం చేసుకోమని దేశంలోకి ఆహ్వానించి, ఇప్పుడు స్వదేశీ కంపెనీలతో మాత్రమే మీ వ్యవహారాలు నడపండి అని ప్రజలకు ఈ పాలకులు పిలుపు ఇవ్వగలరా?

నూతన ఆర్థిక విధానాలకు తలుపులు బార్లా తెరిచి, విదేశీ సంస్థలకు భారతదేశం ఆహ్వానం పలుకుతున్నదని చెప్పినది ప్రభుత్వాలా, ప్రజలా? ఇప్పటికీ ఎఫ్‌డీఐకి అర్రులు చాస్తూ ఆహ్వానిస్తున్నది ప్రజలా? ప్రభుత్వాలా?



నూతన ఆర్థిక విధానాలకు తలుపులు బార్లా తెరిచి, విదేశీ సంస్థలకు భారతదేశం ఆహ్వానం పలుకుతున్నదని చెప్పినది ప్రభుత్వాలా, ప్రజలా? ఇప్పటికీ ఎఫ్‌డీఐకి అర్రులు చాస్తూ ఆహ్వానిస్తున్నది ప్రజలా? ప్రభుత్వాలా? మనదేశంలో తయారైన సి–విటమిన్ ట్యాబ్లెట్లను కూడా (అమెరికా హెచ్చరించగానే) ఇక్కడి అవసరాలను కూడా లెక్కజేయకుండా అమెరికాకు ఎగుమతి చేసింది ఈ ప్రభుత్వాలే కదా. 'డిపార్ట్‌మెంట్ ఆఫ్ కామర్స్' అనుమతి లేనిదే విదేశీ వస్తువుల దిగుమతి జరుగుతుందా? మారిన పరిస్థితుల్లో ఆన్‌లైన్ వ్యాపారాలు పెరగడం వల్ల 'ఇంటర్నేషనల్ ఆన్‌లైన్ సప్లయింగ్ స్టోర్స్'ను ఏర్పాటు చేసింది ప్రభుత్వమే కదా?! ఇలాంటి వ్యాపార అభివృద్ధి కోసం 'ఇండియా ట్రేడ్ ప్రమోషన్ ఆర్గనైజేషన్'ను, దాని కోసం 'ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కౌన్సిల్' అనే సంస్థను ఏర్పాటు చేసినది మన ప్రభుత్వమే కదా! వీటన్నిటినీ మించి ప్రభుత్వానికి రావాల్సిన నిధుల కోసం ఎక్స్‌పోర్ట్ అండ్ ఇంపోర్ట్ వ్యవహారాలను కస్టమ్స్ డిపార్ట్‌మెంట్ చక్కబెట్టడం లేదా? అనేక వస్తువులను దిగుమతి చేసుకోనిదే పూట గడిచే పరిస్థితి లేని పరస్పర ఆధారిత ఆర్థిక వ్యవస్థలుగా దేశాల పరిస్థితిని మార్చింది ప్రభుత్వాల వ్యవహారాలేగా!

ఆర్థిక స్వయం సమృద్ధి సాధిస్తే దేశం రాజకీయ స్వేచ్ఛ సాధించే అవకాశం ఉన్నదని నాటి స్వాతంత్ర్య సమరయోధులు భావించి, స్వదేశీ నినాదాన్ని ప్రాచుర్యంలోకి తీసుకొచ్చారు. స్వదేశంలో అన్ని సమకూరాలంటే యువతకు ప్రత్యామ్నాయ ఉపాధి వృత్తివిద్యా కోర్సుల ద్వారా ఉపాధి చూపాలని నాటి బ్రిటిష్ ప్రభుత్వాన్ని మన నాయకులు డిమాండ్ చేశారు. ఇప్పుడు ఇంజనీరింగ్ తప్ప ఇతర ఒకేషనల్ కోర్సులు ఏవీ ప్రత్యామ్నాయంగా అందుబాటులో లేవు. ప్రభుత్వాలు ఆ వైపు దృష్టి పెట్టడమే లేదు. స్వాతంత్ర్యానంతరం కూడా జవహర్‌లాల్ నెహ్రూ ఆధ్వర్యంలో విదేశీ కంపెనీలన్నింటినీ విలీనం చేసి స్వదేశీ సంస్థలుగా ఏర్పాటు చేశారు. ఇనుము, ఉక్కు కర్మాగారాలు, చమురు శుద్ధి కర్మాగారాలు స్థాపించుకోకపోతే మనుగడ అసాధ్యమని భావించి బ్రిటన్, రష్యా, వెస్ట్ జర్మనీ వంటి దేశాల సహకారంతో వాటిని మన దేశంలో స్థాపించారు. కాబట్టే నేడు ఉక్కును ఎగుమతి చేసే దేశాల్లో భారత్ అగ్రగామిగా ఉంది. 'మంగళ్ యాన్ మిషన్' సక్సెస్‌ఫుల్‌గా ప్రయోగిస్తున్న నేటి భారత్ '1962 నాటి స్వదేశీ విధానం'లో నిర్ణయమేనని మర్చిపోకూడదు. విదేశీ వస్తువులను బహిష్కరించాలనో, స్వదేశీ వస్తువులనే కొనుగోలు చేయాలనో పాలకులు నినాదాలు ఇవ్వడం కాదు, స్వదేశంలో మంచి నాణ్యమైన, చవకైన, ఇతర దేశాల వస్తువులతో పోటీపడగల స్థాయిలో వస్తూత్పత్తి మెరుగుపడాలి. ఆ రకమైన వాతావరణాన్నీ, పరిస్థితులనూ ఏర్పరచాలి, స్వదేశీని అన్ని విధాలుగా ప్రోత్సహించాలి. తద్వారా విదేశీ వస్తువులు వాటంతటవే దిగుమతి కావడం ఆగిపోతాయి.

◆ జి. తిరుపతయ్య

పీ-4.. పితలాటకం!





పట్టని ప్రజాప్రతినిధులు

ప్రభుత్వం చెబుతున్నట్లుగా పీ-4 అమలు కావడం లేదని జిల్లాల వారీగా గణాంకాలను పరిశీలిస్తే అర్థమవుతోంది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మానస పుత్రికపై.. ప్రజా ప్రతినిధులు అంతగా దృష్టి సారిస్తున్న దాఖలాలు లేవు. ఒకరిద్దరు మినహా బంగారు కుటుంబాలను దత్తత తీసుకుంటున్నట్లు ప్రకటించలేదంటే వారికి ఈ పథకం అమలు పట్ల ఉన్న చిత్తశుద్ధి తెలియజేస్తుంది.

రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పీ-4 కార్యక్రమం అమలులో అధికార యంత్రాంగం మల్లగుల్లాలు పడుతోంది. పేదరిక నిర్మూలనే లక్ష్యంగా ప్రైవేటు, ప్రజల భాగస్వామ్యంను ప్రభుత్వం తీసు కొచ్చింది. వడపోతల అనంతరం పల్నాడు, బాపట్ల, గుంటూరు జిల్లాల పరిధిలో 1,85,223 బంగారు కుటుంబాలను నిర్ధారించారు. తొలి విడతలో మూడు జిల్లాల్లో 52,489 బంగారు కుటుంబాల దత్తత కార్యక్రమం నిర్వహించాలని అధికార యంత్రాంగం కసరత్తు చేస్తోంది. కానీ, మార్గదర్శ కుల ఎంపికలో మాత్రం.. జిల్లాకు 4 వేల మందిని మాత్రమే ఎంపిక చేసి.. దత్తత కార్యక్రమంలో పీ-4 సార్థకత ఇదేనంటూ అధికారులు నిట్టూరుస్తున్నారు.

మూడు జిల్లాల్లో 1,85,223 బంగారు కుటుంబాలు

- తొలి విడతలో 52,489 కుటుంబాల దత్తత
- జిల్లాకు 4 వేల మంది మార్గదర్శకుల గుర్తింపు
- స్వచ్ఛందంగా దత్తతకు ముందుకు రాని వైనం
- అసలు పట్టనట్లు ప్రజాప్రతినిధుల వ్యవహారం

(తెనాలి, ఆంధ్రజ్యోతి)

రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యాల మేర పీ-4 ముందుకు సాగుతున్న పరిస్థితి కానరావడం లేదు. ఎంపిక గడువు ముగిసినా అవసరం మేర మార్గదర్శకులు దొరకని పరిస్థితి నెలకొంది. మూడు జిల్లాల్లో అతి కష్టం మీద 12,695 మార్గదర్శకులను గుర్తించడంలో.. అధికార యంత్రాంగం నానా యాతన పడినట్లు తెలుస్తోంది. వీరందరూ బంగారు కుటుంబాలను దత్తత తీసుకుంటారా లేదా అన్న చర్చ జరుగుతోంది. కొన్ని చోట్ల బలవంతంగా మార్గదర్శకులుగా మారుస్తున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. స్వచ్ఛందంగా మార్గదర్శకులుగా నమోదు చేసుకుంటున్న వారి సంఖ్య నామమాత్రమేనని సమాచారం. అధికారులు కొందరిని బలవంతంగా మార్గదర్శకులుగా నమోదు చేశారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

అధికారులపై ఒత్తిడి

ఒక్కో అధికారి ఒక బంగారు కుటుంబాన్ని దత్తత తీసుకోవాలని ఉన్నతాధికారులు ఒత్తిడి తెస్తున్నారన్న ప్రచారం జరుగుతోంది. ఆగస్టు 15 కల్లా మార్గదర్శకుల ఎంపిక పూర్తి చేయాలని ప్రభుత్వం జిల్లా ఉన్నతాధికారులకు లక్ష్యాలను నిర్దేశించిన సంగతి తెలిసిందే.

జిల్లాల వారీగా పథకం తీరు ఇలా..

పల్నాడు జిల్లాలో 79,068 బంగారు కుటుంబాల ఎంపిక జరిగింది. ఇందులో 2,14,225 మంది కుటుంబ సభ్యులు ఉన్నారు. 52,308 కుటుంబాలను (మిగతా 6వ పేజీలో)



ప్రసంగిస్తున్న గుంటూరు ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ కే శ్రీనివాసులు, అరుణ కుమారి, లత

ఎన్ని బార్లకైనా దరఖాస్తు చేసుకోవచ్చు..

- గుంటూరు, పల్నాడులో 159 బార్ల లైసెన్స్‌లకు ఆహ్వానం
- గీత కార్మికులకు మరో 15 కేటాయింపు
- మూడేళ్ల కాలపరిమితి
- గుంటూరు ఎక్సైజ్ శాఖ డీసీ డాక్టర్ కె.శ్రీనివాసులు

గుంటూరు కార్పొరేషన్/నరసరావుపేట, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): గుంటూరు, పల్నాడు జిల్లాలలో మొత్తం 159 బార్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు గుంటూరు ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ కె.శ్రీనివాసులు తెలిపారు. సోమవారం గుంటూరులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. గుంటూరు జిల్లాలో 110, పల్నాడు జిల్లాలో 49 బార్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నా మన్నారు. ఆఫ్‌లైన్, ఆన్‌లైన్, హైబ్రిడ్ మోడల్ మూడు విధానాల ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తామని చెప్పారు. సెప్టెంబర్ 1 నుంచి 2028 ఆగస్టు 31 వరకు మూడేళ్ల కాల పరిమితికి.. ఒక వ్యక్తి ఎన్ని బార్ లైసెన్స్‌లకు అయినా.. దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. బార్‌కి కనీసం నాలుగు దరఖాస్తులు వస్తేనే లాటరీ తీస్తామని స్పష్టం చేశారు. 50వేలలోపు జనాభా ఉంటే.. రూ.35 లక్షలు, 5 లక్షల లోపు జనాభా ఉన్న ప్రాంతాల్లో రూ.55 లక్షలు, అంతకు పైన జనాభా ఉంటే రూ.75 లక్షలు లైసెన్స్ ఫీజు ఉంటుందన్నారు. ఏడాదిలోగా ఆరు వాయిదాల్లో చెల్లించుకోవచ్చు అన్నారు. ప్రతి దరఖాస్తు, ప్రొసెసింగ్ ఫీజు రూ.5.10 లక్షలు (మిగతా 6వ పేజీలో)

జగనన్న ముద్దు.. రజినీ మాకొద్దు!

- మాజీ మంత్రికి వ్యతిరేకంగా అసమ్మతి సమావేశం
- చిలకలూరిపేటలో నాయకత్వ మార్పునకు డిమాండ్

6



సీఎం పర్యటనకు సంబంధించి అధికారులకు సూచనలు చేస్తున్న కలెక్టర్ నాగలక్ష్మీ

సీఎం పర్యటన ఏర్పాట్లపై కలెక్టర్ పరిశీలన


మంగళగిరి, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు మంగళ, బుధ వారాల్లో మంగళగిరిలో పర్యటించనున్నారు. ఈ పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మీ సోమవారం పరిశీలించారు. మొదటి రోజు మంగళగిరి సీకే కన్వెన్షన్‌లో జరిగే జీరో పావర్టీ పీ-4 కార్యక్రమంలో సీఎం చంద్రబాబు పాల్గొంటారు. దీనికి సంబంధించి సీకే కన్వెన్షన్‌లో సీటింగ్ ఏర్పాట్లు, సభా స్థలి, పీఏ సిస్టం, మీడియా గ్యాలరీ, వాహనాల పార్కింగ్ తదితర ఏర్పాట్లను కలెక్టర్ తనిఖీ చేశారు. 20న మంగళగిరి ఎన్ఆర్ఐ ఫ్లైఓవర్ సమీపంలో మయూరి టెక్ పార్కులో రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌ను సీఎం ప్రారంభించనున్నారు. అక్కడి ఏర్పాట్లను కలెక్టర్ నాగలక్ష్మీ పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి కార్యక్రమాల కోఆర్డినేటర్ పెందుర్తి వెంకటేశ్వరరావు, జిల్లా ఎస్పీ సతీశ్‌కుమార్, ప్రణాళికా శాఖ జాయింట్ సెక్రెటరీ అనంత శంకరరావు, ఏపీటీఎస్ సీఈవో ఎ.సూర్యతేజ, సంయుక్త కలెక్టర్ ఎ.భార్గవతేజ, తెనాలి సబ్‌కలెక్టర్ సంజనా సింహా, సీఎంవో కార్యాలయ అధికారి ఇక్బాల్ సాహెబ్ తదితరులున్నారు.

కొలువుల ఎర.. నిరుద్యోగులు విలవిల



- కలెక్టరేట్, వర్సిటీలో ఉద్యోగాలంటూ రూ.లక్షల్లో వసూళ్లు
- గుంటూరు నుంచి విశాఖ వరకు విస్తరించిన మాఫియా
- కీలకంగా డ్వామా మాజీ ఉద్యోగి..

'కలెక్టర్ ఆఫీసులో జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగం కేవలం రూ. 2 లక్షలు.. ఆచార్య ఎన్‌జీ రంగా వర్సిటీలో కంప్యూటర్ ఆపరేటర్ ఉద్యోగం రూ.లక్షన్నరే.. నోటి మాటతో నమ్మాల్సిన పని లేదండీ.. ఇదిగో జాయింట్ కలెక్టర్ ఇచ్చిన అపాయింట్మెంట్ ఆర్డర్. మీకు ఇదే నేరుగా పోస్టులో వస్తుంది.' ఇదీ.. నిరుద్యోగులకు ఎరవేస్తున్న ఓ ముఠా తీరు.



ఫోన్ పే ద్వారా నగదు బదిలీ చేసినట్లు ఉన్న ఆధారం

మా నాన్న ఇంటికి రావొద్దంటున్నాడు..



మా నాన్న దివ్యాంగుడు. నాకు ఉద్యోగం వస్తుందన్న ఆశతో అప్పు తెచ్చి రూ. 2 లక్షలు ఇచ్చాను. నన్ను మోసం చేశారు. అప్పు ఇచ్చిన వాళ్ల మా నాన్న ఇం ట్లో అన్నం తింటుంటే బయటకు లాక్కొచ్చి కొట్టారు. మా నాన్న డబ్బులు తీసుకోకుండా ఇంటికి రావద్దు అం టున్నాడు. మొదట్లో ఎస్పీ చెప్పారని నగరంపాలెం పో లీసులు బాగానే స్పందించారు. మోసం చేసిన వ్యక్తిని పిలిపించి విచారించారు. ఈ నెల 10న డబ్బులు కడ తానని ఒప్పుకున్న వ్యక్తి మళ్లీ స్పందించడం లేదు. చచ్చిపోవాలని ఉంది.

- ఎ.చిరంజీవి, నర్సీపట్నం

గుంటూరు సిటీ, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): గుంటూరు, ఒంగోలు, విశాఖపట్నం తదితర ప్రాంతాల్లోని కొందరు ఒక ముఠాగా ఏర్పడి.. నిరుద్యోగులకు కుచ్చు టోపీ పెడుతున్నారు. గుంటూరు డ్వామా కార్యాలయంలో పనిచేసిన ఓ మాజీ ఉద్యోగి ఈ వ్యవహారంలో కీలకంగా వ్యవహరిస్తున్నట్లు సమాచారం. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన యువతను మోసం చేసినట్లు ఆరోపణలు వస్తున్నాయి.

వలలో చిక్కిన నర్సీపట్నం యువకులు..

అనకాపల్లి జిల్లా నర్సీపట్నంకు చెందిన ఇద్దరు యువకులు చిరంజీవి, పూర్ణ ఉద్యోగం కోసం (మిగతా 6వ పేజీలో)

మాజీ మంత్రి అంబటిపై ఎస్పీకి ఫిర్యాదు

- మార్ఫింగ్ వీడియోలు పోస్ట్ చేయటం సిగ్గుచేటు
- డీసీఎంఎస్ చైర్మన్ వడ్రాణం హరిబాబు ధ్వజం

పోలీసు నిఘాలో పట్టుబడ్డ 15 మంది గంజాయి ముఠా

డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు

- ముగ్గురికి రూ. 30 వేలు జరిమానా విధించిన కోర్టు

6

బండారుపల్లి సొసైటీ అధ్యక్షుడి నియామకంలో వివాదం

- ప్రమాణ స్వీకారం చేస్తే ఉపేక్షించేది లేదన్న టీడీపీ శ్రేణులు

పెరిగిన ప్రయాణాలు

- విజయవంతంగా స్త్రీ శక్తి పథకం
- పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్‌లలో జీరో ఫేర్ టిక్కెట్ల జారీలే అత్యధికం
- 45 నుంచి 60 శాతానికి పెరిగిన మహిళల ఆక్యుపెన్సీ

8

మంగళగిరి.. గోల్డ్ హబ్

గోల్డ్‌హబ్ ఎక్కడంటే

మంగళగిరి - తెనాలి రోడ్డు వెంబడి అక్షయపాత్ర భవన సముదాయానికి దక్షిణంగా ఆత్మకూరు ప్రాంత పరిధిలోకి వచ్చే భూముల్లో ఈ గోల్డ్ హబ్‌ను ఏర్పాటుచేయబోతున్నారు. ఆత్మకూరు సర్వే నెంబర్లు 133, 134, 135, 136 లలో ఉన్న ప్రభుత్వ ఖాళీ, ఎసైన్డ్ భూముల్లో ఈ జెమ్స్ అండ్ జ్యూయలరీ పార్కు ఆవిష్కృతం కానుంది. అతిత్వరలోనే ఈ జ్యూయలరీ పార్కు నిర్మాణ పనులను ఆరంభించేందుకు అధికారులు సిద్ధం కావాలని మంత్రి లోకేశ్ ఇప్పటికే ఆదేశాలను ఇచ్చారు. నగరంలో చేనేత, స్వర్ణకార వృత్తిదారులు పెద్దసంఖ్యలో వుండడంతో అటు చేనేత కార్మికుల కోసం మెగా హ్యాండ్లూమ్ పార్కు...ఇటు స్వర్ణకారవృత్తిదారులకోసం జెమ్స్ అండ్ జ్యూయలరీ పార్కును ఏకకాలంలో నిర్మించేవిధంగా లోకేశ్ అడుగులు ముందుకు వేస్తున్నారు. అంతా అనుకున్నట్టు జరిగితే మంగళగిరిలో ఏర్పాటుకాబోతున్న జ్యూయలరీ పార్కే ముంబైను దాటేసి దేశంలో కెల్లా అతిపెద్ద జ్యూయలరీ పార్కుగా అవతరించే అవకాశం ఉంది.



మంగళగిరిలో గోల్డెన్ హబ్ ఏర్పాటుకోసం రాష్ట్రప్రభుత్వం ఎంపిక చేసిన ప్రదేశమిదే



రూ.5 వేల కోట్లతో దేశంలోనే అతిపెద్దది

- 78 ఎకరాల్లో జెమ్స్ అండ్ జ్యూయలరీ పార్కు
- 20 వేల మంది స్వర్ణకారులకు ఉపాధి
- 51వ సీఆర్డీయే అథారిటీ సమావేశంలో నిర్ణయం
- ఇప్పటికే గోల్డ్‌స్మిత్ ఫౌండేషన్ ఏర్పాటు
- స్వర్ణకారులకు ఆధునిక డిజైన్లపై ఉచిత శిక్షణ
- మంత్రి లోకేశ్ కృషితో మారుతున్న రూపురేఖలు



గోల్డ్‌స్మిత్ ఫౌండేషన్ భవనం

(ఆంధ్రజ్యోతి - గుంటూరు, మంగళగిరి)

దేశంలోనే అతిపెద్ద గోల్డ్ హబ్ మంగళగిరిలో ఏర్పాటు కానుంది. సుమారు 78 ఎకరాల విస్తీర్ణంలో ఇంచుమించు 20 వేల మందికిపైగా ఉపాధి కల్పించే విధంగా ఈ గోల్డ్ హబ్‌ను అత్యంత ప్రతిష్టాత్మకంగా రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేయబోతోంది. రూ.5 వేల కోట్ల భారీ బడ్జెట్‌తో ప్రభుత్వం ఓ ప్రణాళికను ఇప్పటికే రూపొందించింది. ఈ భారీ ప్రాజెక్టుకు వ్యూహకర్త, రూపకర్త అంతా స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర మంత్రి నారా లోకేశే..! 2024 ఎన్నికలకు ముందే లోకేశ్ మంగళగిరి ప్రజలకు దీనిపై హామీ ఇచ్చారు. చేనేత కేంద్రమైన మంగళగిరిలో చేనేత తరువాత ఎక్కువమంది స్వర్ణకార వృత్తిపై ఆధారపడి జీవిస్తున్న సంగతిని లోకేశ్ గుర్తించారు. ప్రస్తుతం మంగళగిరిలో సుమారు ఎనిమిది వేల మందికిపైగా ఈ స్వర్ణకార వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నారు. ఇందులో 80 శాతం మంది చేనేత వర్గానికి చెందినవారే ఉన్నారు. దీంతో మంగళగిరిని (మిగతా 6వ పేజీలో)

గోల్డ్‌హబ్ పనితీరు ఇలా..

మంగళగిరిలో ఆవిష్కృతం కానున్న ఈ గోల్డ్ హబ్‌లో రత్నాలు, బంగారంతో కూడిన ఆభరణాలను అత్యంత నైపుణ్యంగా తయారు చేస్తారు. ఈ పార్కులో తయారయ్యే ఆభరణాలకు తరుగు కూడా చాలా తక్కువ స్థాయిలోనే ఉంటుంది. సాధారణంగా తరుగును పది శాతంగా వృత్తిదారులు, వ్యాపార సంస్థలు లెక్కిస్తుంటాయి. కానీ ఈ పార్కులో కొనుగోలుదారులకు తరుగు దాదాపు మూడు శాతంగా మాత్రమే ఉండే అవకాశం కలుగుతుంది. కొనుగోలుదారులకు ఇదో పెద్ద వెసులుబాటు. పార్కులో ముక్కుపుడక మొదలుకొని వడ్రాణం వరకు అన్నీ రకాల మోడళ్లలో ఆభరణాలు చాల వేగంగా తయారవుతాయి. ఇందుకు అవసరమైన అత్యాధునికమైన మిషనరీ అంతా పార్కులో అందుబాటులో ఉంటుంది. ఎన్ఏబీయల్ గుర్తింపు పొందిన టెస్టింగ్ ల్యాబ్‌లతో సహా అన్నీ అవసరమైన సౌకర్యాలు అందుబాటులో ఉంటాయి. ఈ జ్యూయలరీ పార్కు నుంచి ఎగుమతులు కూడా అంతర్జాతీయ స్థాయిలో ఉంటాయి. రాష్ట్రం నుంచే కాకుండా దేశంలోని ఇతర ప్రాంతాల నుంచి కూడా పెద్ద పెద్ద జ్యూయలరీ షో రూమ్‌ల నుంచి కూడా పెద్దస్థాయిలో ఆర్డర్లు తీసుకుని వారికి అన్నీరకాల సరికొత్త మోడళ్లలో బంగారు, రత్నాలతో కూడిన ఆభరణాలను తయారుచేసి ఇస్తారు.



జెమ్స్ అండ్ జ్యూయలరీ పార్కు (ఊహచిత్రం)

ఇప్పటికే దేశంలో నవీముంబైతో పాటు కోల్‌కతా, సూరత్, కోయంబత్తూరు వంటి నగరాల్లో ఈ జ్యూయలరీ పార్కులు ఉన్నాయి. వీటిలో ముంబైలోని జ్యూయలరీ పార్కు వ్యాపార రీత్యా అతిపెద్ద వాణిజ్య కేంద్రంగా కూడా వెలుగొందుతోంది.

పీ-4.. పితలాటకం!

(5వ పేజీ తరువాయి)

తొలి విడతలో దత్తత తీసుకునేలా నిర్ణయించారు. ఇందులో 27,760 కుటుంబాలను దత్తతకు 4,202 మంది మార్గదర్శకులను గుర్తించినట్లు అధికారులు తెలిపారు.

- బాపట్ల జిల్లాలో 57,388 బంగారు కుటుంబాలను గుర్తించారు. 1,44,569 మంది కుటుంబ సభ్యులున్నారు. 49,151 బంగారు కుటుంబాల దత్తత ప్రక్రియ చేపట్టనున్నారు. వీటిలో 8,179 కుటుంబాలకు 4,212 మార్గదర్శకులను గుర్తించారు.

-గుంటూరు జిల్లాలో 1,00,314 బంగారు కుటుంబాలను గుర్తించగా వీటిలో 2,77,330 మంది కుటుంబ సభ్యులు ఉన్నారు. 83,764 కుటుంబాల దత్తతకు ఏర్పాటు చేస్తున్నారు. ముందుగా 16,550 కుటుంబాల దత్తత ప్రక్రియ ప్రారంభించాలని అధికార యంత్రాంగం నిర్ణయించింది. 4,281 మార్గదర్శకులను ఎంపిక చేశారు.

కొలువుల ఎర.. నిరుద్యోగులు విలవిల

(5వ పేజీ తరువాయి)

అక్కడ ఉన్న ఒక వ్యక్తిని కలిశారు. అతని సూచన మేరకు గుంటూరులోని ఓ వ్యక్తి దగ్గరకు వారు వచ్చారు. గుంటూరు కలెక్టర్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగం ఇప్పిస్తానని చిరంజీవి వద్ద రూ. 2 లక్షలు, పూర్ణ వద్ద రూ. 1.70 లక్షలు అతను తీసుకున్నాడు. ఇదంతా ఈ ఏడాది ఏప్రిల్, మే నెలల్లో జరిగింది. ఫోన్ పే ద్వారా నగదును బదిలీ చేశారు. గుంటూరు వ్యక్తి నగదు బదిలీ సమయంలోనే జాగ్రత్త వహించాడు. ఆ సొమ్మును బంగారం వ్యాపారికి బదిలీ చేయించాడు. కొంత మాత్రం తన ఖాతాతోపాటు, వాళ్ల సోదరి అకౌంట్‌కు బదిలీ చేయించుకున్నారు. నగదు తీసుకునే సమయంలో పది రోజుల్లోనే నియామకపు ఉత్తర్వులు ఇప్పిస్తామని హామీ ఇచ్చారు.

నకిలీ నియామక ఉత్తర్వులు

నిరుద్యోగులను నమ్మించడం కోసం ఈ ముఠా నకిలీ నియామక ఉత్తర్వులను తయారు చేసింది. అందులో గుంటూరు జాయింట్ కలెక్టర్ పేరు నిరుద్యోగులకు చూపించారు. జేసీ సంతకం దగ్గర మహిళా అధికారి పేరు ఉండడంతో.. అనుమానం వచ్చి ఇదేమిటి అని అడగగా.. మరొకరు కూడా అదే పోస్టులో ఉన్నట్లు నమ్మించే ప్రయత్నం చేశారు. పది రోజుల్లో చిరునామాకు నియామకపు ఉత్తర్వులు వస్తాయని చెప్పినట్లు బాధితులు చెబుతున్నారు. ఉత్తర్వులు రాకపోవడంతో బాధితులు గుంటూరుకు చెందిన వ్యక్తికి ఫోన్ కాల్ చేయగా స్పందన లేదు. మోసపోయమని తెలుసుకున్న బాధితులు జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశారు.

వర్సిటీలో పరీక్ష కూడా పెట్టారు..

ఉద్యోగాల పేరుతో గుంటూరుకు చెందిన వ్యక్తి చాలా మందిని మోసం చేసినట్లు తెలుస్తోంది. మరొక మహిళ కూడా అదే వ్యక్తిపై ఈ మధ్య కాలంలో జిల్లా కలెక్టర్‌కు, ఎస్పీకి ఫిర్యాదు చేశారు. ఎన్‌జీ రంగా వర్సిటీలో కంప్యూటర్ ఆపరేటర్ ఉద్యోగం ఇప్పిస్తానని ఆమెను ఏకంగా యూనివర్సిటీకి తీసుకెళ్లారు. కంప్యూటర్ పరీక్ష కూడా నిర్వహించినట్లు బాధితురాలు చెబుతోంది. దీంతో ఉద్యోగం సంగతి వాస్తవమేనని నమ్మి.. నగదు ముట్టజెప్పినట్లు తెలుస్తోంది. ఈ ముఠా గుంటూరు, ఒంగోలు, విశాఖపట్నం జిల్లాల్లో ఇటువంటి మోసాలకు పాల్పడినట్లు సమాచారం.

ఎన్ని బార్లకైనా దరఖాస్తు చేసుకోవచ్చు..

(5వ పేజీ తరువాయి)

చెల్లించాలన్నారు. దరఖాస్తుదారుడికి వయసు కనీసం 21 ఏళ్లు ఉండాలి అన్నారు. జిల్లా ఎక్సైజ్ శాఖ అధికారి అరుణకుమారి, సీఐ లత పాల్గొన్నారు.

గౌడ కార్మికులకు 15 బార్లు

గుంటూరు, పల్నాడు జిల్లాల్లో గౌడ, గౌడ్ సంఘీలకు మొత్తం 15 షాపులు కేటాయించడం జరిగిందని గుంటూరు ఎక్సైజ్ శాఖ డీసీ శ్రీనివాసులు తెలిపారు. గుంటూరు కలెక్టరేట్‌లో జిల్లా జేసీ భార్గవ్ తేజ, పల్నాడు కలెక్టరేట్లో అధికారులు గౌడ సామాజిక వర్గాలకు సంబంధించిన ప్రాంతాలను ఎంపిక చేసినట్లు ఆయన తెలిపారు. గుంటూరులో 10 బార్లను కేటాయించగా..గౌడకు 7, గౌడ్‌కు మూడు షాపులు కేటాయించామన్నారు. పల్నాడు జిల్లాలో కేటాయించిన 5 షాపుల్లో గౌడకు 3, గౌడ్‌కు 2 షాపులు నిర్ణయించినట్లు వెల్లడించారు. ఈ సామాజిక వర్గాలకు బార్ లైసెన్సు ఫీజు రూ.27.50 లక్షలుగా నిర్ణయించారు. సాధారణ బార్లకు ఏడాదికి లైసెన్సు ఫీజు రూ.55 లక్షలుగా ఉంది. ఏటా లైసెన్సు ఫీజును పెంచనున్నారు. రెండో ఏడాది రూ 60.50 లక్షలు, మూడవ ఏడాది రూ.66.55 లక్షలుగా లైసెన్సు ఫీజును ప్రభుత్వం నిర్ణయించింది. పల్నాడు జిల్లాలో బార్ లైసెన్సులకు బుధవారం కలెక్టర్ పి.అరుణ్‌బాబు గెజిట్ విడుదల చేయనున్నారు. ఈ మేరకు ఏర్పాట్లపై ఆయన కలెక్టరేట్‌లో ఎక్సైజ్ అధికారులతో సమీక్షించారు. ఈ నెల 29 సాయంత్రం 5 గంటలలోపు దరఖాస్తు చేసుకోవాలని, 30న బార్లకు లాటరీ తీయనున్నారు.

పోలీసు నిఘాలో పట్టుబడ్డ 15 మంది గంజాయి ముఠా



పట్టుబడిన గంజాయి ముఠా సభ్యులతో డీఎస్పీ జనార్ధనరావు

తెనాలి క్రైం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : పోలీసుల ప్రత్యేక నిఘాతో 15 మంది సభ్యులు గల రెండు గంజాయి ముఠాలను అదుపులోకి తీసుకున్నట్లు తెనాలి డీఎస్పీ బీ జనార్ధనరావు వెల్లడించారు. సోమవారం త్రీ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో జరిగిన విలేకర్ల సమావేశంలో పట్టుబడిన ముఠాల వివరాలను వివరించారు. పట్టణంలోని సుందరయ్య కాలనీలో టీఆర్పీ చర్చి ప్రాంతంలోని ఖాళీ స్థలంలోని చెట్ల మధ్యలో గంజాయి ముఠా ఉందన్న సమాచారంతో త్రీ టౌన్ సీఐ రమేష్‌బాబు ఆధ్వర్యంలో పోలీసులు ఆకస్మిక దాడి చేసి 8 మంది నిందితులను అదుపులోకి తీసుకున్నారు. మరో నిందితుడు పరారయ్యాడు. ఇందులో ప్రధాన నిందితుడు బిహార్ రాష్ట్రానికి చెంది ప్రస్తుతం పొన్నూరులో నివాసం ఉంటున్న మృత్యుంజయకుమార్ బీహార్ నుంచి తక్కువ ధరకు గంజాయి కొనుగోలు చేసి తెనాలి ప్రాంతంలో అత్యధిక ధరకు చిన్న చిన్న ప్యాకెట్లుగా మార్చి అమ్మకాలు సాగిస్తున్నాడు. ఇతని వద్ద గంజాయి కొనుగోలు చేసిన యువకులు తాము గంజాయికి బానిసలై ఆదాయం కోసం అమ్మకాలు చేపడుతున్నారు. అదుపులోకి తీసుకున్న నిందితుల్లో పట్టణ ప్రాంతానికి చెందిన కరికట్ల మధు, దాది షణ్ముఖ, పఠాన్ మహ్మద్ ఫరీద్‌ఖాన్, ఆకుల మారన్న, సయ్యద్ సైదా, ఆరెమళ్ల విజయ్‌కుమార్, నిమిది సంతోష్‌కుమార్‌లు ఉన్నారు. పోలీసులను చూసి పారిపోతున్న వీరిని వెంబడించి పట్టుకోవడంలో సాహసం చేసిన సీఐ రమేష్‌బాబు, సిబ్బంది పీ మురళి, డీ సురేష్, ఎస్ జైకర్, అబ్దుల్ సలాంను డీఎస్పీ అభినందించారు. నిందితుల నుంచి 1.750 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని వారిని కోర్టుకు హాజరు పరిచినట్లు డీఎస్పీ తెలిపారు. కొల్లిపర పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన మరో గంజాయి కేసులో ఏడుగురు వ్యక్తులను రూరల్ సీఐ ఆర్ ఉమేష్ ఆదివారం సాయంత్రం అదుపులోకి తీసుకున్నారని డీఎస్పీ తెలిపారు. ఈ ముఠాలో ఐదుగురు గంజాయి అమ్మకందారులతో పాటు ఇద్దరు గంజాయి తాగుతున్న వారిని కొల్లిపర డంపింగ్ యార్డు వద్ద ఉండగా అదుపులోకి తీసుకోవడం జరిగింది. వీరి నుంచి 1.600 కిలోల గంజాయి 4 బైక్‌లు స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. పట్టుబడిన వారిలో కృష్ణా జిల్లా బిల్లపాడుకు చెందిన పంది నాగయుగంధర్‌బాబు, కృష్ణా జిల్లా గుడివాడ ముబారక్ సెంటర్‌కు చెందిన షేక్ రకీబ్, గుంటూరు జిల్లా ఉప్పలపాడుకు చెందిన పాత నేరస్తుడు రామిశెట్టి శ్యాం, ఇదే గ్రామానికి చెంది గతంలో రెండు కేసుల్లో నిందితుడిగా ఉన్న దుగునూరి మోహన్‌తేజ, 16 దొంగతనాల కేసులో నిందితుడిగా ఉన్న కొల్లిపర మండలం తూములూరుకు చెందిన కనపర్తి సుందరరావు, పోలీసుల దాడి సమయంలో గంజాయి సేవిస్తున్న షేక్ అబ్దుల్ కరీమ్, తూములూరుకు చెందిన విష్ణుమొలకల భరత్‌కుమార్‌లను అదుపులోకి తీసుకుని కోర్టుకు హాజరు పరిచడం జరిగిందని డీఎస్పీ వెల్లడించారు. ఈ ముఠాని అదుపులోకి తీసుకోవడంలో చాకచాక్యంగా వ్యవహరించిన తెనాలి రూరల్ సీఐ ఆర్ ఉమేష్, కొల్లిపర సీఐ పీ కోటేశ్వరరావు, సిబ్బంది పోతురాజు, రామకోటేశ్వరరావు, మురళి, నాంచారయ్య, రమేష్, నాగబాబు, నాగరాజులను డీఎస్పీ బీ జనార్ధనరావు ప్రత్యేకంగా అభినందించారు.

విద్యార్థుల క్రమశిక్షణే ఉన్నత శిఖరాలకు బాట



విద్యార్థులు, తల్లిదండ్రులను ఉద్దేశించి మాట్లాడుతున్న కిట్స్ కళాశాల చైర్మన్ కోయ సుబ్బారావు

వట్టిచెరుకూరు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులను విద్యతో పాటు క్రమశిక్షణే వారిని ఉన్నత శిఖరాలకు చేరుస్తుందని కళాశాల చైర్మన్ కోయ సుబ్బారావు అన్నారు. సోమవారం బీటెక్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలు పొందిన విద్యార్థినీ విద్యార్థులు వారి తల్లిదండ్రులతో కిట్స్ కళాశాల ప్రాంగణం కిక్కిరిసి పోయింది. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ కోయ సుబ్బారావు మాట్లాడుతూ నిష్ణాతులైన ఫ్యాకల్టీ అధ్యాపకుల బోధనతో పాటు విద్యార్థుల్లో

చైర్మన్ కోయ సుబ్బారావు

క్రమశిక్షణకు తమ కళాశాల ప్రాధాన్యం ఇస్తుందన్నారు. అందువల్లనే సుదూర ప్రాంతాల నుంచి విద్యార్థులు, తల్లిదండ్రులు తమ కళాశాలను ఎంచుకోవ టమే అందుకు నిదర్శనమన్నారు. విద్యార్థులు మంచి ఉపాధి అవకా శాలు సాధించేందుకు అవసరమైన శిక్షణను నిపుణులైన అధ్యాపకులు అందించటం ద్వారానే సాధ్యమవుతుందన్నారు. విద్యార్థుల్లో సృజనా త్మకతను వెలికి తీయడానికి వివిధ రకాల ఇన్నోవేషన్ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. తమ కళాశాలలోని విద్యార్థులకు ఉపాధి కల్పనే ధ్యేయంగా కాకుండా స్వయంగా కంపెనీలు స్థాపించేందుకు అవసరమైన నైపుణ్యాలను వివిధ స్టార్టప్ కంపెనీల సహకారం అందిస్తున్నామన్నారు. కళాశాల సెక్రటరి కోయ శేఖర్ మాట్లాడుతూ విద్యార్థులు సాంకేతిక అంశాలపై ఎక్కువ అధ్యయనం చేయడం అలవర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పీ బాబు, అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ కే హరిబాబు విద్యార్థులకు వారి కోర్సుల వివరాలను, పరీక్షల విధానం, శిక్షణ తరగతుల నిర్వహణ తదితర అంశాలను వివరించారు.

మాజీ మంత్రి అంబటిపై ఎస్పీకి ఫిర్యాదు

● మార్ఫింగ్ వీడియోలు పోస్ట్ చేయటం సిగ్గుచేటు ● డీసీఎంఎస్ చైర్మన్ వడ్రాణం హరిబాబు ధ్వజం

గుంటూరు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): పులివెందులలో ఎన్నికలు స్వేచ్ఛగా జరిగితే పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో 2023లో జరిగిన ఎన్నికల వీడియోను మార్ఫింగ్ చేసి సోషల్ మీడియాలో మాజీ మంత్రి అంబటి రాంబాబు పోస్ట్ చేసి దుష్ప్రచారం చేస్తున్నారని ఆయనపై చర్యలు తీసుకోవాలంటూ ఎస్పీ సతీష్‌కుమార్‌కు డీసీఎంఎస్ చైర్మన్ వడ్రాణం హరిబాబు సోమవారం ఫిర్యాదు చేశారు. అనంతరం హరిబాబు మీడియాతో మాట్లాడుతూ ఎక్కడో జరిగిన వీడియోలను మార్ఫింగ్ చేసి పులివెందుల ఉప ఎన్నికలంటూ దుష్ప్రచారం చేసిన మాజీ మంత్రి అంబటి రాంబాబు సిగ్గుపడాల్సిన విషయం అన్నారు. గత ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పినా జగన్మోహన్ రెడ్డి అండ్ కో బ్యాచ్ తీరు మారలేదని ధ్వజమెత్తారు. సోషల్ మీడియాలో ఫేక్ వీడియోలు పెట్టి టీడీపీపై బురదజల్లడమే వైసీపీ నేతలు ధ్యేయంగా పెట్టుకున్నారని దుయ్యబట్టారు. ఫేక్ వీడియోలు, ఫేక్ వార్తలు ప్రసారం



మార్ఫింగ్ వీడియోలను మీడియాకు చూపుతున్న వడ్రాణం హరిబాబు

చేసి ప్రజలను తప్పుదోవ పట్టించడం పరిపాటిగా మారిపోయిందని మండిపడ్డారు. రాష్ట్రంలో జగన్ రెడ్డి బ్యాచ్ క్షుద్ర రాజకీయాలు మానుకోకపోతే పోతే రాబోయే రోజుల్లో శ్రీకృష్ణ జన్మస్థానంలో కూర్చోవడం అంబటి రాంబాబుకి కూడా తప్పదని హెచ్చరించారు.

మంగళగిరి.. గోల్డ్‌హబ్

(5వ పేజీ తరువాయి)

చేనేతకు, బంగారు వ్యాపారానికి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అతిపెద్ద కేంద్రంగా మలచాలన్న పట్టుదల లోకేశ్‌లో కలిగినట్టయింది. ఈ పట్టుదలతోనే ప్రతిపక్షంలో ఉన్నప్పుడే మంగళగిరిలో వీవర్‌శాలను ఏర్పాటు చేసి మంగళగిరికి చేనేతకు అంతర్జాతీయ మార్కెటింగ్ లభించేలా ఓ వ్యూహాత్మకమైన పథకాన్ని అమలు చేశారు. దాంతోపాటు దేశంలోనే ఓ అతిపెద్ద గోల్డ్ హబ్‌ను మంగళగిరిలో ఏర్పాటు చేయిస్తానని లోకేశ్ హామీ ఇచ్చారు. మంగళగిరిలో అతిపెద్ద గోల్డ్ హబ్ రాబోతుందని ముందుగా ఆంధ్రజ్యోతి ఈ ఏడాది ఫిబ్రవరి ఒకటవ తేదీన ప్రధాన సంచికలో మంగళగిరిలో మినీ దుబాయ్ పేరిట ప్రత్యేక కథనాన్ని ప్రచురించింది. అప్పట్లో ఈ కథనం రాష్ట్రంలో ఓ హట్ టాపిక్‌గా మారింది. నేడది కార్యరూపాన్ని దాల్చబోతుంది. సోమవారం జరిగిన సీఆర్‌డీఏ 51వ అథారిటీ సమావేశంలో.. ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. మంగళగిరిలో జెమ్స్ అండ్ జ్యూయలరీ పార్కును ఏర్పాటు చేస్తున్నట్టు రాష్ట్ర మునిసిపల్ శాఖమంత్రి పి నారాయణ ప్రకటించారు.

గోల్డ్‌హబ్ కోసం... గోల్డ్‌స్మిత్ ఫౌండేషన్!

త్వరలో పెద్ద స్థాయిలో ఆవిష్కృతం కానున్న ఈ జెమ్స్ అండ్ జ్యూయలరీ పార్కు కోసం ఇప్పటి నుంచే స్వర్ణకారులను సిద్ధం చేసే పనిని లోకేశ్ నెత్తి మీద వేసుకున్నారు. ఇందుకోసం ఆయన తన సొంత ఖర్చులతో ఎల్ఎన్ గోల్డ్‌స్మిత్ ఫౌండేషన్ పేరిట ఓ సంస్థను స్థాపించి.. ఆ సంస్థ ఆధ్వర్యంలో నగరంలోని స్వర్ణకారులందరికీ ఆధునిక డిజైన్ల తయారీపై శిక్షణను ఇప్పించబోతున్నారు. ఇందుకోసం నగరంలోని గౌతమబుద్ధ రోడ్డు వెంబడి ఓ అయిదంతస్తుల భవనాన్ని అద్దెకు తీసుకున్నారు. ఈ భవనంలో ఆధునిక మిషనరీపై స్వర్ణకారులకు నిపుణులైన డిజైనర్లతో శిక్షణను ఇప్పిస్తారు. ఈ ఫౌండేషన్ కోసం గుంటి నాగరాజు, గాజుల శ్రీనివాసరావు, పడవల మహేష్, మండవ హారిక అనే అయిదుగురితో డైరెక్టర్ల బృందాన్ని కూడా ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఈ ఫౌండేషన్‌లో 77మంది సభ్యులుగా ఉన్నారు. ఈ ఫౌండేషన్ ఆధ్వర్యాన 670 మంది స్వర్ణకారులకు ఆధునిక మోడళ్లలో ఆభరణాల తయారీకి శిక్షణను ఇస్తారు. శిక్షణ పూర్తి చేసుకున్న వృత్తిదారులకు చేతినిండా పని కల్పించే బాధ్యతను కూడ లోకేశ్ వ్యక్తిగతంగా భుజాన వేసుకున్నారు. ఆయన తన పలుకుబడిని వినియోగించి రాష్ట్రంలోని ప్రముఖ బంగారు నగల షోరూమ్‌ల నుంచి ఆర్డర్లను ఈ గోల్డ్‌స్మిత్ ఫౌండేషన్‌కు ఇప్పించేందుకు కృషి చేస్తున్నారు.

గోల్డ్ హబ్‌కు భూ సమీకరణే..

అమరావతి రాజధానిలోని మంగళగిరి నియోజకవర్గంలో ఆత్మకూరు వద్ద గోల్డ్ క్లస్టర్ ఏర్పాటు ప్రతిపాదన కొద్ది రోజుల్లోనే కార్యరూపం దాల్చనుంది. ఇప్పటికే సర్వే నంబర్ల వారీగా ఈ క్లస్టర్ ఏర్పాటుకు అవసరమైన భూమిని సీఆర్‌డీఏ, రెవెన్యూ అధికారులు కలిసి గుర్తించారు. ఇక్కడ భూముల ధర ఎక్కువగా ఉన్న దృష్ట్యా భూసేకరణ చేస్తే రైతులకు నష్టం వాటిల్లే అవకాశం ఉండటంతో అమరావతి రాజధానిలో వలే భూ సమీకరణ చేయాలని సీఆర్‌డీఏ నిర్ణయించింది. ఇందుకోసం ల్యాండ్ పూలింగ్ స్కీమ్ నిబంధనలను కూడా కొత్తగా రూపొందించింది. వాటి గురించి త్వరలోనే రైతులకు గ్రామసభల ద్వారా తెలియజేసి వారి ఆమోదంతో భూములను తీసుకోనుంది. ఇక్కడ ప్రత్యేక ఎకో సిస్టం వచ్చేలా మౌలిక సదుపాయాలు కూడా ఏర్పాటు చేయాలని తాజాగా సీఎం చంద్రబాబు నాయుడు ఏపీసీఆర్‌డీఏ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కాగా ల్యాండ్ పూలింగ్ స్కీం వల్ల గోల్డ్ క్లస్టర్‌కు భూములు ఇచ్చే రైతులకు మేలు జరుగుతుంది. ఐదు నుంచి పదేళ్ల పాటు వార్షిక కౌలు, సకల సదుపాయాలతో అభివృద్ధి చేసిన లేఅవుట్లలో నివేశన, వాణిజ్య స్థలాలు వస్తాయి. ఇంకా మరికొన్ని రాయితీలు కూడా లభించే అవకాశం ఉంది.

జగనన్న ముద్దు.. రజినీ మాకొద్దు!

● మాజీ మంత్రికి వ్యతిరేకంగా అసమ్మతి సమావేశం ● చిలకలూరిపేటలో నాయకత్వ మార్పునకు డిమాండ్

చిలకలూరిపేట, ఆగస్టు18 (ఆంధ్రజ్యోతి): జగనన్నే ముద్దు, రజినీ మాకొద్దు అని ప్లకార్డులు చేతబూని నినదిస్తూ మాజీ మంత్రి విడదల రజనీకి వ్యతిరేకంగా ఆదివారం రాత్రి పట్టణంలోని ఒక ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో వైసీపీలోని ఒక వర్గం వారు సభ నిర్వహిం చారు. మాజీ మంత్రి రజినీ అరాచకాలు, అవినీతిపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ప్రధానంగా మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ బి.చిన్న మాట్లాడుతూ చిలకలూరిపేటలో రజిని నాయకత్వంలో తాము పనిచేయబోమని స్పష్టం చేశారు. తామంతా పార్టీ ఉన్నతి కోసం కృషి చేస్తా మని, నాయకత్వ మార్పు చేయాలని పార్టీ అధిష్టానాన్ని కోరారు. వీఏలను అడ్డంపెట్టుకుని దోచుకోవటమే లక్ష్యంగా రజిని అరాచకం సాగిందని, అక్రమంగా సంపాదించడం తప్ప రజిని చేసింది ఏమీ లేదని విమర్శించారు. ఐదు సంవత్సరాల్లో ఆమె చేసిన అరాచకాలు అన్ని ఇన్ని కాదని, సొంత పార్టీ వారిపైనే అనేక అక్రమ కేసులు పెట్టించారన్నారు. రియల్ ఎస్టేట్ వెంచర్లు, బైపాస్ రోడ్డు కాంట్రాక్టర్లు, ప్రభుత్వాసుపత్రి కాంట్రాక్టర్లు, మైనింగ్, భూదందాలు, కరోనా సమ యంలో పలు ఆస్పత్రుల వారి నుంచి అక్రమ వసూళ్లు, విద్యుత్ శాఖ లో ఉద్యోగాల పేరుతో అక్రమ వసూళ్లకు పాల్పడిన చరిత్ర రజనీదన్నారు.



సభలో పాల్గొన్న వైసీపీ అసమతి వర్గం నాయకులు

ప్రకాశం బ్యారేజికి కొనసాగుతున్న వరద



ప్రకాశం బ్యారేజి దిగువకు ప్రవహిస్తున్న వరదనీరు

తాడేపల్లి టౌన్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాల కారణం గా ఎగువ ప్రాజెక్టుల నుంచి నీటిని విడుదల చేస్తుండడంతో ప్రకా శం బ్యారేజి వద్ద కృష్ణా నది వరద ఉధృతి కొనసాగుతోంది. ఎగు వన పులిచింతల, ప్రధాన వాగుల నుంచి 2,51,783 క్యూసెక్కుల వరద నీరు ఇన్‌ఫ్లోగా నమోదు అయిందని ఇరిగేషన్ జేఈ రాజేష్ తెలిపారు. బ్యారేజి రిజర్వాయర్‌లో 10 అడుగుల నీటి మట్టం కొన సాగుతుండగా దిగువకు 2,48,450 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు ఇరిగేషన్ శాఖ జేఈ రాజేష్ తెలిపారు. తూర్పు డెల్టా కా ల్వకు 2,817, పశ్చిమ డెల్టాకు 516 క్యూసెక్కులు వదులుతుండగా గుంటూరు చానల్‌కు నీటి విడుదల నిలిపివేసినట్టు జేఈ తెలిపారు.

గోల్కొండ ఎక్స్‌ప్రెస్‌కు తాత్కాలికంగా కొండపల్లిలో స్టాపేజ్ తొలగింపు

గుంటూరు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): నిత్యం గుంటూరు - సికింద్రాబాద్ మధ్యన రాకపోకలు సాగించే గోల్కొండ ఎక్స్‌ప్రెస్‌కు కొండపల్లి రైల్వేస్టేషన్‌లో తాత్కాలికంగా నిలుపుదల సౌకర్యాన్ని తొలగించనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో ఏ శ్రీధర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ రైలుకు అక్టోబరు 19 నుంచి నవంబరు 18వ తేదీ వరకు కొండపల్లిలో నిలుపుదల ఉండదన్నారు.

చెన్నై ఎక్స్‌ప్రెస్‌కి నాయుడుపేటలో స్టాపేజ్ సదుపాయం

నిత్యం గుంటూరు మీదగా ప్రయాణించే నంబరు. 12604 చర్లపల్లి - చెన్నై సెంట్రల్ చెన్నై ఎక్స్‌ప్రెస్‌కి ఈ నెల 19వ తేదీ నుంచి నాయుడుపేటలో నిలుపుదల సౌకర్యాన్ని కల్పిస్తున్నట్లు సీపీఆర్‌వో తెలిపారు.ఈ రైలు నాయుడుపేటకు వేకువజామున 3.03కు చేరుకొని 3.05కి బయలుదేరి వెళుతుంది.

డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు

● రూ. 30 వేలు జరిమానా విధించిన కోర్టు

తాడికొండ, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): మద్యం సేవించి వాహనా లు నడిపే వారికి భారీ జరిమానాలను మంగళగిరి కోర్టు జడ్జి వి ధించారు. ఆదివారం తాడికొండ పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ త ని ఖీలు చేపట్టారు. వాహనాలను తనిఖీలు చేస్తున్న క్రమంలో ముగ్గు రు వాహనదారులు మద్యం సేవించి వాహనాలు నడు పుతున్నట్లు పోలీసులు గుర్తించారు. వారిపై కేసు నమోదు చేసి సో మవారం మంగళగిరి కోర్టులో హాజరు పరిచారు. మద్యం సేవించి వాహనం నడిపినందుకు ఒక్కొక్క వాహనదారుడికి రూ. 10 వేల చొప్పున ముగ్గురికి కలిపి రూ. 30 వేలు జరిమానాను జడ్జి విధించారు.

క్వాంటమ్‌పై ఉన్నత విద్యా ఫ్యాకల్టీకి శిక్షణ

అమరావతి, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): ఉన్నత విద్యా ఫ్యాకల్టీకి క్వాంటం టెక్నాలజీస్‌పై శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు ఉన్నత విద్యామండలి చైర్మన్ కె.మధుమూర్తి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. 2026 మార్చి నాటికి 500 మందిని మాస్టర్ ట్రైనర్లుగా తయారుచేసి వారి ద్వారా 50వేల మంది విద్యార్థులకు శిక్షణ ఇవ్వడం లక్ష్యమన్నారు. దీనివల్ల అమరావతి క్వాంటం వ్యాలీ మిషన్‌లో భాగంగా లక్ష మందికి ఉద్యోగాలు లభిస్తాయని, వందల సంఖ్యలో స్టార్టప్‌లు వస్తాయన్నారు. జైపూర్ ఎంఎన్ఐటీ, కేంద్ర సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ, ఐబీఎం, టీసీఎస్, ఐఐటీ మద్రాస్, కేంద్ర ఎలక్ట్రానిక్స్ అండ్ ఐటీ శాఖలతో కలిసి శిక్షణ కార్యక్రమం ప్రారంభించామని వెల్లడించారు.

జనాభా లెక్కల కోసం సమన్వయ కమిటీ

అమరావతి, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో జనాభా లెక్కల సంబంధిత కార్యకలాపాలు, ప్రణాళికల కోసం ఉన్నతాధికారులతో ప్రత్యేక సమన్వయ కమిటీని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ మేరకు సీఎస్ కె.విజయానంద్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. దేశవ్యాప్తంగా రెండు దశల్లో జనాభా లెక్కల ప్రక్రియను నిర్వహించనున్నారు. మొదటి దశలో 2026 ఏప్రిల్ నుంచి సెప్టెంబరు మధ్య ఏదైనా 30 రోజుల వ్యవధిలో ఇంటింటి వివరాలు సేకరిస్తారు. 2027లో రెండో దశలో జనాభా గణన చేపట్టనున్నారు. రెండు దశలకు అవసరమైన ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని అన్ని రాష్ట్రాలకు కేంద్ర సెన్సెస్ ఆపరేషన్ డైరెక్టర్, సిటిజన్ రిజిస్ట్రేషన్ డైరెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో సీఎస్ నేతృత్వంలో 12 మంది సభ్యులతో సమన్వయ కమిటీని ఏర్పాటు చేశారు. కమిటీకి సీఎస్ చైర్మన్‌గా, జీఏడీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ స్టేట్ కో-ఆర్డినేటర్‌గా, మెంబర్‌గా ఉంటారు. వీరితో పాటు రెవెన్యూ స్పెషల్ సీఎస్, పంచాయతీరాజ్ శాఖ ముఖ్య కార్యదర్శి, ప్లానింగ్ ముఖ్య కార్యదర్శి, మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి, పాఠశాల విద్య కార్యదర్శి, ఐటీ సెక్రటరీ, గ్రామ, వార్డు సచివాలయాల డైరెక్టర్, పంచాయతీరాజ్ శాఖ కమిషనర్, మున్సిపల్ శాఖ కమిషనర్, సర్వే సెటిల్‌మెంట్ కమిషనర్, సెన్సెస్ ఆపరేషన్ డైరెక్టర్లను సభ్యులుగా నియమించారు.

రేపు డిగ్రీ అడ్మిషన్లకు నోటిఫికేషన్

అమరావతి, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): డిగ్రీ అడ్మిషన్లకు బుధవారం నోటిఫికేషన్ జారీచేయనున్నట్లు ఉన్నత వి ద్యామండలి ఓ ప్రకటనలో తెలిపింది. అదే రోజు ఆన్‌లైన్‌లో డిగ్రీ అడ్మిషన్లకు దరఖాస్తులు స్వీకరించేందుకు షెడ్యూలు జారీచేస్తామని పేర్కొంది. ఆఫ్‌లైన్‌లోనూ దరఖాస్తులు తీసుకుంటామని ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించింది. దానిపై మండలి ఎలాం టి స్పష్టతా ఇవ్వలేదు.

భూకబ్జాలపై నివేదికివ్వండి : కలెక్టర్

గురజాలటౌన్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): గురజాల నియోజకవర్గ పరిధిలో భూకబ్జాలపై త్వరగా నివేదిక ఇవ్వాలని జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు అధికారులను ఆదేశించారు. సోమవారం రాత్రి పట్టణంలోని ఆర్డీవో కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. అనంతరం అధికారులతో సమావేశమయ్యారు. గత వైసీపీ ప్రభుత్వంలో నియోజకవర్గంలో ప్రభుత్వ భూముల ఆక్రమణపై నివేదిక ఇవ్వాలన్నారు. రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. అవినీతికి తావు లేకుండా సమస్యలను పరిష్కరించాలన్నారు. ఈ సమావేశంలో గురజాల ఆర్డీవో మురళీకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.20 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	123, 132, 142
చికెన్ విత్ స్కిన్(కిలో)	230.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	240.00

42,285 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు సోమవారం 44,541 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 42,285 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 7,059 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	9500	13500
నెంబరు. 5	10000	13200
273	---	---
341	10000	14600
4884	---	---
సూపర్ 10	10000	13200
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	10000	14500
షార్క్-1	----	---
బ్యాడిగి	10000	13000
దేవనూరు డీలక్స్	10000	13300
ఆర్మూరు	9800	11200

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
ఏసీ కామన్ వెరైటీ		
334	9500	13600
నెంబరు. 5	10000	13500
273	---	---
341	11000	14800
4884	10000	12800
ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	10000	14200
బ్యాడిగి 355	10000	13100
దేవనూర్ డీలక్స్	10500	13500
ఆర్మూరు	---	---
తాలుకాయలు	5000	7200

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ

అర్జీలను త్వరగా పరిష్కరించాలి

● డీఆర్వో ఖాజావలీ
● ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 198 అర్జీలు
● పరిష్కరించాలంటూ ఆదేశాలు


అర్జీదారులతో మాట్లాడుతున్న డీఆర్వో షేక్ ఖాజావలీ, డిప్యూటి కలెక్టర్ గంగరాజు తదితరులు

గుంటూరు(తూర్పు), ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చే ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించి, వాటిని త్వరిత గతిన పరిష్కరించాలని అధికారులను డీఆర్వో ఖాజావలీ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. కార్యక్రమానికి 198 అర్జీలు వచ్చాయి. కలెక్టర్, జేసీ అందుబాటులో లేకపోవడంతో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు ఎం.గంగరాజు, లక్ష్మికుమారి, ఆర్డీవో శ్రీనివాసరావు, డ్వామా పీడీ శంకర్, డీపీవో సాయికుమార్ కలసి ఆయన అర్జీలను స్వీకరించారు. అనంతరం ఖాజావలీ మాట్లాడుతూ అర్జీదారుని సమస్యను పరిష్కరించిన విధానాన్ని క్షుణ్ణంగా తెలిపి, అధికారి పని తీరు మీద ఫీడ్ బ్యాక్ అందించాలన్నారు. అర్జీదారుని దరఖాస్తుని రిజిస్టర్‌లో తప్పక నమోదు చేయాలన్నారు. ప్రభుత్వ కారాలయాల్లోని ఫైల్స్‌ను ఈపీటీఎస్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. అనంతరం కారుణ్య నియామకాల ద్వారా జిల్లా ఆస్పత్రుల సేవల సమన్వయ శాఖలో 8 మందికి, లీగల్ మెట్రాలజీలో ఒకరికి ఉద్యోగ నియామక పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ, హౌసింగ్ పీడీలు విజయలక్ష్మి, ప్రసాదు, సీపీవో శేషశ్రీ, ఎల్‌డీఎం మహిపాల్‌రెడ్డి, మెప్మా పీడీలు విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిటీ హాళ్లలో అవినీతిపై విచారణ జరిపించాలి

తెనాలి, గుంటూరు కార్పొరేషన్ పరిధిలో కొందరు గిరిజన ఉద్యోగులు సంఘాలను స్థాపించి వాటి ద్వారా కమ్యూనిటీ హాలు నిర్మించారని, వాటిపై వచ్చే ఆదాయాన్ని వ్యక్తిగత అవసరాలకు వాడుకుంటున్నారని జిల్లా గిరిజన భవన్ సంక్షేమ కమిటీ నాయకులు డీఆర్వోకు ఫిర్యాదు చేశారు. ఆ భవనాలను అద్దెలకిచ్చి ఆ నిధులను ట్రైబల్ వెల్ఫేర్ అధికారికి జమ చేయడం లేదన్నారు. రైల్వే, టుబాకో, ఇతర ప్రభుత్వ సంస్థల్లో పని చేస్తున్న ఉద్యోగులు ఈ అవినీతికి పాల్పడుతున్నారని అన్నారు. వారి అవినీతిపై విచారణ జరిపించాలని డీఆర్వోను కోరారు. ఆ కమ్యూనిటీ హాళ్లను గిరిజనుల సమావేశాలకు, ఇతర కార్యక్రమాలకు వినియోగించేలా ఆదేశాలు ఇవ్వాలన్నారు. వినతి పత్రం అందజేసిన వారిలో శివానాయక్, సంజయ్, శంకరరావు, ఉమామహేశ్వరరావు, వెంకట్రామయ్య తదితరులు ఉన్నారు.

రామాలయ నిర్మాణం అడ్డుకుంటున్న వారిపై చర్యలు తీసుకోవాలి

పాతగుంటూరు, ఆలీనగర్ ఒకటో లైన్లో తలపెట్టిన రామాలయ నిర్మాణాన్ని కొంతమంది ఉద్దేశ్యపూర్వకంగా అడ్డుకుంటున్నారని శ్రీ చిన్నరాముల వారి అభివృద్ధి కమిటీ సభ్యులు డీఆర్వోకు ఫిర్యాదు చేశారు. ఆ స్థలం కమిటీకి చెందిందని, కాకపోతే ఆ పక్క స్థలం వారు ఆ స్థలాన్ని మాకు వదిలివేయాలని బెదిరిస్తున్నారని వాపోయారు. పైగా గొడవలకు దిగుతున్నారని తెలిపారు. ఉన్నతాధికారులు స్పందించి ఒరిజినల్ డాక్యుమెంట్లను పరిశీలించి ఆ స్థలంలోనే రామాలయ నిర్మాణానికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

బీసీలకు 50 శాతం రిజర్వేషన్లను అమలు చేయాలి

రాబోయే స్థానిక సంస్థలు ఎన్నికల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్‌లను అమలు చేయాలని కోరుతూ బహుజన సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో అర్జీ అందజేశారు. 2013 జూలైలో బీసీలకు 34 శాతం రిజర్వేషన్‌తో అప్పటి ముఖ్యమంత్రి కిరణ్ కుమార్‌రెడ్డి సర్పంచ్ ఎన్నికలు నిర్వహించారన్నారు. ఆ తర్వాత 2014లో 50 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తానని చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చారన్నారు. కానీ కొంతమంది దీనిపై కోర్టుకు వెళ్లి ఈ ప్రక్రియని అడ్డుకున్నారన్నారు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన జగన్‌మోహనరెడ్డి 34 శాతం నుంచి 24 శాతానికి తగ్గించి ఎన్నికలు జరిపారని గుర్తు చేసుకున్నారు. దీంతో దాదాపు 17 వేల మంది బీసీ నాయకులు పదవులను కోల్పోయారన్నారు. తిరిగి అధికారంలోకి వచ్చి చంద్రబాబునాయుడు నాటి హామీ మేరకు 50 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో వాసు, ఎస్ బాబురావు, ఎస్‌కే అహ్మద్ సాదిక్, తన్నీరు, సాంబయ్య, ఏడుకొండలు, మణి కుమారి, డేవిడ్ విలియన్స్ తదితరులు ఉన్నారు..

ఉద్యోగం ఇప్పిస్తానని మోసం చేశాడు...


చిరంజీవి

గుంటూరు, కలెక్టరేట్‌లో సబార్డినేట్ ఉద్యోగాన్ని ఇప్పిస్తామని చెప్పి రూ 3.70 లక్షలు తీసుకుని మోసం చేసారని నర్సీపట్నంకు చెందిన ఏ చిరంజీవి ప్రజా సమస్యల పరిష్కార వేదికలో డీఆర్వోకు ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పండిట్ నాగార్జున అనే వ్యక్తి కలెక్టరేట్‌లో ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పడంతో డబ్బులు ఇచ్చానని చెప్పారు. సంయుక్త కలెక్టర్ వద్ద ఉద్యోగాలను భర్తీ చేయాల్సి ఉందని నమ్మించారన్నారు. దీంతో ఫోన్ పే ద్వారా రూ.1.10 లక్షల చెల్లించానని, మిగిలిన డబ్బులను కలెక్టరేట్‌లోని శంకరన్ సమావేశం వద్ద ఇచ్చానని తెలిపారు. ఆ తరువాత కలెక్టరేట్‌లో పలు కార్యాలయాలకు తిప్పుతూ కంప్యూటర్ వర్క్ గురించి చూపించి, ఉన్నతాధికారుల దొంగ సంతకంతో తప్పుడు నియామకపత్రం చేతిలో పెట్టి ఉడాయించారని వాపోయాడు. దీనిపై నగరంపాలెం స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే డబ్బులు ఇస్తామని అంగీకరించాడని, కానీ ఇంత వరకు డబ్బులు ఇవ్వలేదన్నారు. ప్రభుత్వ ఉద్యోగం వస్తుందని ఆశపడి అప్పుచేసి డబ్బులు కడితే మోసం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి మోసం చేసిన నాగార్జున నుంచి డబ్బులు ఇప్పించాలని కోరారు.


స్పందన నిర్వహిస్తున్న మేయర్ రవీంద్ర, కమిషనర్ తదితరులు

విభాగాధిపతులే అర్జీల పరిష్కారం చూడాలి : మేయర్

గుంటూరు కార్పొరేషన్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): డయల్ యువర్ కమిషనర్ కి అందిన అర్జీల పరిష్కారానికి విభాగాధిపతులే క్షేత్ర స్థాయి పరిశీలనకు వెళ్లాలని,అర్జీల పరిష్కార పురోగతిపై కమిషనర్ చాంబర్ కు ఎప్పటికప్పుడు నివేదిక ఇవ్వాలని మేయర్ రవీంద్ర, కమిషనర్ ఆదేశించారు. సోమవారం నగరపాలక సంస్థ కమిషనర్ చాంబర్‌లో జరిగిన డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమంలో మేయర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రజలు ఇస్తున్న అర్జీల శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని మేయర్ కోవెలమూడి రవీంద్ర, కమిషనర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు. అనంతరం కౌన్సిల్ సమావేశ మందిరంలో పీజీఆర్ఎస్ కార్యక్రమం ద్వారా ప్రజల నుండి అర్జీలు తీసుకొని మేయర్, కమిషనర్ అధికారులతో మాట్లాడుతూ క్షేత్ర స్థాయి అధికారులు ఆర్జీలను నేరుగా వెళ్లి పరిశీలించి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. పారిశుధ్యం, తాగునీటి సరఫరా, రోడ్ల ఆక్రమణ వంటి సమస్యల పరిష్కారం కోసం ప్రజలు కార్యాలయానికి వస్తున్నారని, అవి స్థానికంగానే పరిష్కారం చేయాలన్నారు. పరిష్కారం అనంతరం ఫిర్యాదికి సమాచారం తెలియచేయాలన్నారు. కార్యక్రమంలో సిటి ప్లానర్ రాంబాబు, ఇంచార్జి ఎస్ఈ సుందర్రారామిరెడ్డి, ఇంచార్జి ఎంహెచ్‌ఓ రామారావు, ఆయా విభాగ సూపరిండెంట్లు పాల్గొన్నారు.

సుప్రీంకోర్టు ఆదేశాలను అమలు చేయండి

● మేయర్, కమిషనర్లకు వినతిపత్రం

గుంటూరు కార్పొరేషన్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): వీధి కుక్కల నియంత్రణకు ఇటీవల సుప్రీం కోర్టు ఇచ్చిన ఆదేశాలను గుంటూరు నగర పాలక సంస్థ పరిధిలో అమలు చేయాలని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ గుంటూరు బ్రాంచ్ సభ్యులు కోరారు. సోమవారం గుంటూరు నగర పాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్) లో, మేయర్ కోవెలమూడి రవీంద్ర (నాని), కమిషనర్ పులి శ్రీనివాసులుకు వీధి కుక్కల సమస్యల పరిష్కారానికి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సుబ్బారాయుడు యార్లగడ్డ, డాక్టర్ రామ్ తారకనాథ్, డాక్టర్ సతీష్ కుమార్, బీ సుబ్బయ్య, కే వెంకటకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

శివారుల్లో మౌలిక వసతులకు ప్రాధాన్యం

● కమిషనర్ పులి శ్రీనివాసులు

గుంటూరు కార్పొరేషన్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ పరిధిలోని శివారు ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. సోమవారం గోరంట్ల, ఇన్నర్ రింగ్ రోడ్, రవీంద్ర నగర్ తదితర ప్రాంతాల్లో పర్యటించి, మౌలిక వసతుల కల్పన, తాగునీటి సరఫరా, ఆక్యుపెన్సీ కోసం దరఖాస్తు చేసుకున్న భవనాలను పరిశీలించి, అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుతం కృష్ణా నదికి వరద నీరు వస్తున్నందున నగరంలో ప్రజలు తాగునీటిని కాచి చల్లార్చి వాడుకోవాలని తెలియ చేస్తూ, ప్రతి సచివాలయం పరిధిలో శాంపిల్స్ తీయాలని ఎమినిటీ కార్యదర్శులను ఆదేశించారు. గోరంట్ల, ఇన్నర్ రింగ్‌రోడ్ చుట్టుపక్కల నివాసాలు పెరుగుతున్నందున ఆయా ప్రాంతాల్లో ఖాళీ స్థలాల్లో నీరు నిలిచి నివాసితులకు దోమలు, పురుగులతో ఇబ్బందులు పడుతున్నారని, స్థల యజమానులచే స్థలాన్ని శుభ్రం చేసుకునేలా తెలియచేయాలని, స్పందించని వాటికి జీఎంసీ బోర్డులను ఏర్పాటు చేయాలని ప్రజారోగ్య అధికారులు, కార్యదర్శులను ఆదేశించారు. పర్యటనలో డీఈఈ శ్రీనివాస్, పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్, ప్రజారోగ్య అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

నార్ల ఆడిటోరియం ప్రాంతంలో ఆక్రమణలు తొలగించండి

● అధికారులను ఆదేశించిన మేయర్, కమిషనర్

గుంటూరు కార్పొరేషన్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): నార్ల ఆడిటోరియం, పరిసర ప్రాంతాల్లో సమగ్ర సర్వే చేసి, ఆక్రమణలు ఉంటే తొలగించుకోవడానికి నోటీసులు ఇవ్వాలని గుంటూరు మేయర్ కోవెలమూడి రవీంద్ర, కమిషనర్ పులి శ్రీనివాసులు పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక గార్డెన్స్‌లోని నార్ల ఆడిటోరియాన్ని వారిద్దరూ స్థానిక పెద్దలతో కలిసి పరిశీలించారు. ఇప్పటి వరకు జరిగిన నిర్మాణం, పెండింగ్ అంశాలపై చర్చించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఆడిటోరియం అభివృద్ధిపై ప్రభుత్వం నుంచి వచ్చిన రిమార్క్సని క్షేత్ర స్థాయిలో పరిశీలించామన్నారు. వారి వెంట సిటీ ప్లానర్ రాంబాబు, ఇంచార్జి ఎస్ఈ సుందరరామిరెడ్డి, డీఈఈ రమేష్ బాబు, ఏఈ చైతన్య ఉన్నారు.


నార్ల ఆడిటోరియం పరిశీలిస్తున్న మేయర్ రవీంద్ర, కమిషనర్ పులి శ్రీనివాసులు తదితరులు

21న నల్ల చీరలతో నిరసనలు

● అంగన్వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కుమారి

గుంటూరు(తూర్పు), ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి) : ఆల్ ఇండియా ఫెడరేషన్ ఆఫ్ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ (సీఐటీయూ) పిలుపు మేరకు అంగన్వాడిల సమస్యలు పరిష్కారానికి ఈ నెల 21న దేశవ్యాప్త నిరసనలో భాగంగా జిల్లాలోని అన్ని మండల కేంద్రాల్లో అంగన్వాడీలు, హెల్పర్లు నల్ల చీరలతో నిరసన తెలపాలని అంగన్వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు ఏవీఎన్ కుమారి పిలుపునిచ్చారు. పాత గుంటూరు సీఐటీయూ కార్యాలయంలో జరిగిన యూనియన్ జిల్లా సమావేశంలో ఆమె మాట్లాడారు. అంగన్వాడీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ బడ్జెట్లో నుంచి జీతాలు పెంచాలన్నారు. తల్లికి వందనం, వితంతు పెన్షన్, ఎస్టీ, ఎస్సీలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు, ఇతర సంక్షేమ పథకాలను అమలు చేయాలన్నారు. జిల్లా గౌరవ అధ్యక్షురాలు జీ.రమణ మాట్లాడుతూ గ్రాడ్యుటీ, గతంలో ఇచ్చిన టీఏ, డీఏ బిల్లుల జీవోని అమలు చేయాలని, ఖాళీ పోస్టులను భర్తీ చేయడంతో పాటు తదితర డిమాండ్ల సాధన కోసం అన్ని మండల కేంద్రాల్లో అంగన్వాడీలు నల్ల చీరలతో మానవహారాలు నిర్మించి, ఎమ్మార్వోకి వినతిపత్రం ఇవ్వాలని కోరారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీనారాయణ, రత్న మంజుల, చిన్న వెంకాయమ్మ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఏవిఎన్ కుమారి, పాల్గొన్న అంగన్‌వాడీలు

ఉద్యోగుల సమస్యలపై క్యాబినెట్ సబ్ కమిటీ ఏర్పాటు చేయాలి

గుంటూరు(తూర్పు), ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలపై క్యాబినెట్ సబ్ కమిటీ ఏర్పాటు చేయాలని ప్రభుత్వ ఉద్యోగుల సంఘ జిల్లా అధ్యక్షుడు సయ్యద్ చాంద్ బాషా ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. కమిటి ద్వారా ఉద్యోగులు, పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న డిఏలను, ఐఆర్ 29శాతంను విడుదల చేయాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న 25వేల కోట్ల బకాయిలకు చట్టబద్ధత కల్పించాలన్నారు. ఈనెల 20న జరిగే రాష్ట్ర స్థాయి జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశంలో ఉద్యోగుల సమస్యలపై చర్చ జరగాలని కోరారు.

ఊపిరితిత్తులపై అవగాహన పెంచుకోవాలి

● పల్మనాలజిస్ట్ డాక్టర్ అనూష మోదేపల్లి

గుంటూరు, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం సమాజంలో అనేక ఇబ్బందులకు కారణమవుతున్న ఊపిరితిత్తుల పట్ల ప్రజలు మరింత అవగాహన పెంచుకోవాలని సీనియర్ పల్మనాలజిస్టు డాక్టర్ అనూష్ మోదేపల్లి తెలిపారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో జరిగిన ఆరోగ్యసభలో ఆమె ప్రసంగించారు. ఊపిరితిత్తుల విషయంలో మనం జాగ్రత్తలు తీసుకుంటూ అవి ఆరోగ్యంగా ఉండేలా చూసుకోవాలన్నారు. దగ్గు, కఫం, ఛాతి పట్టి వేయడం లాంటి లక్షణాలు కనబడితే వెంటనే పల్మనాలజిస్టను కలవాలన్నారు, సాధారణంగా దగ్గు సమస్య 15 రోజులకు మించి ఉంటే వెంటనే అది ఊపిరితిత్తులకు సంబంధించిన సమస్యగా భావించి పల్మనాలజిస్టును సంప్రదించాలని సూచించారు. కాలుష్య వాతావరణంలో ఉండవలసిన సందర్భాలలో, జనసంద్రంలో ఉండవలసిన సందర్భాలలో, బయటకు వెళ్ళినప్పుడు మాస్కుని ధరిస్తే మంచిదన్నారు. దగ్గు, జ్వరం, కఫం లాంటి లక్షణాలు కనపడిన వెంటనే పల్మనాలజిస్టను సంప్రదించాలన్నారు. గురక సమస్య వల్ల సరైన నిద్ర లేకపోవడం, మెదడుకు తగిన ఆక్సిజన్ అందకపోవటం వల్ల ఒక్కొక్కసారి ప్రాణాంతకం అయ్యే అవకాశం ఉందన్నారు. గురక సమస్యలు తేలికగా తీసుకోకుండా వెంటనే తగు వైద్యం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, టీవీ సాయిరామ్, సుబ్బారావు, నూరుల్ అహ్మద్ తదితరులున్నారు.

ఏపీ కుమ్మర శాలివాహన సంక్షేమ సంఘం జిల్లా కమిటీ ఏర్పాటు

గుంటూరు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ కుమ్మర శాలివాహన సంక్షేమ సంఘం జిల్లా కమిటీని అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు తుగ్గిలి నాగేంద్ర నాయకత్వంలో నియమించినట్లు జిల్లా నాయకులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంఘం జిల్లా నూతన అధ్యక్షుడిగా ఇందుర్తి వెంకట శివన్నారాయణ, పట్టణ అధ్యక్షుడిగా యనగందల పూర్ణ చంద్రరావు, యువజన విభాగం అధ్యక్షుడిగా మామిళ్లపల్లి సుబ్బారావు, పట్టణ మహిళ అధ్యక్షురాలిగా చిరతనగళ్ల భూలక్ష్మిని నియమించినట్లు పేర్కొన్నారు. రాష్ట్ర కమిటీ తరుపున పేరేపి ఈశ్వర్, పద్మ నాగేశ్వరరావు, పారెళ్ల బసవేశ్వరరావు, బెజవాడ ఆదిశేషయ్య హాజరై నూతన కమిటీ నియామకాన్ని సజావుగా నిర్వహించారని తెలిపారు.

రైల్వే డీసీఎం-2గా వినయ్‌కాంత్ బాధ్యతల స్వీకారం

గుంటూరు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : గుంటూరు రైల్వే డివిజనల్ కమర్షియల్ మేనేజర్-2గా డీ.వినయ్‌కాంత్ బాధ్యతలు చేపట్టారు. పట్టాభిపురంలోని రైల్‌వికాస్ భవన్‌లో ఉన్న కమర్షియల్ విభాగంలో సోమవారం ఆయన ఛార్జ్ తీసుకొన్నారు. అనంతరం డివిజనల్ రైల్వే మేనేజర్ సుధేష్ణ సేన్‌ని మర్యాదపూర్వకంగా కలిశారు. డీఆర్ఎం మాట్లాడుతూ గుంటూరు రైల్వే డివిజన్‌లో కమర్షియల్ ఆపరేషన్స్‌ని మరింత విస్తృతం చేయడంపై దృష్టి సారించాలన్నారు.


డీఆర్ఎం సుధేష్ణ సేన్‌ని మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేస్తున్న వినయ్‌కాంత్

ఒంగోలు భక్తులచే ప్రత్యేక పూజలు

పెదకాకాని, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయం ఎదుట గల శ్రీ దశావతార వెంకన్న దివ్య క్షేత్రంలో సోమవారం ప్రత్యేక పూజలు జరిగాయి. శ్రావణమాసం సందర్భంగా ఒంగోలు వాస్తవ్యులు శ్రీ సాయి సేవా బృందం వారు శ్రీ దశావతార వేంకటేశ్వర స్వామి దేవస్థానంలోని శ్రీ మహాలక్ష్మి అమ్మవారికి శ్రావణ పట్టి సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త పూర్ణ భాస్కర్ రావు దంపతులు, అర్చకులు, వేద పండితులు, భక్తులు పాల్గొన్నారు.


దశావతార వెంకన్నను దర్శించిన ఒంగోలు భక్త బృందం

వీడియో లీకేజీ కేసులో న్యాయం చేయండి

● అదనపు ఎస్పీని ఆశ్రయించిన సూఫియా

గుంటూరు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్, తెలుగు మహిళా నాయకురాలు గుడిపల్లి వాణిల మధ్య జరిగిన ఫోన్ సంభాషణకు సంబంధించిన వీడియో లీకేజీ కేసులో తనకు న్యాయం చేయాలని తెలుగు మహిళా కార్యకర్త, ఆ కేసులో అనుమానితురాలైన షేక్ సూఫియా కోరారు. ఈ మేరకు సోమవారం ఆమె జిల్లా ఎస్పీ కార్యాలయాన్ని ఆశ్రయించారు. ఎస్పీ అందుబాటులో లేకపోవడంతో ఆమె అదనపు ఎస్పీని కలిసి ఫిర్యాదు చేశారు. ఈ కేసులో తన ప్రమేయం లేనప్పటికీ తనను బలి పశువు చేయాలని చూస్తున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. వారి సంభాషణలు వీడియో రికార్డు చేసినప్పటి నుంచి బయటకు రిలీజ్ చేసే వరకు జరిగిన పరిణామాలన్నింటిని తాను వివరించానని తెలిపారు. ఎమ్మెల్యే వీడియో లీక్ కేసులో నిజమైన దోషులను గుర్తించి వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం ఆమె మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ కార్యాలయానికి వెళ్లి ఫిర్యాదు చేశారు. మహిళా పక్షపాతి అయిన సీఎం చంద్రబాబు తనకు న్యాయం చేయాలని ఆమె ఓ వీడియోను కూడా విడుదల చేశారు.

సీఎం కాన్వాయ్ వాహనాల బిల్లులు చెల్లించడం లేదు

గుంటూరు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : గత వైసీపీ ప్రభుత్వ హయాంలో 2018 నుంచి ఇప్పటివరకు ముఖ్యమంత్రి కాన్వాయ్‌కు ఏర్పాటు చేసిన వాహనాల కిరాయి చెల్లించడం లేదంటూ అసోసియేషన్ నాయకులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు సోమవారం గుంటూరు టాక్సీ డ్రైవర్స్ అండ్ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సీహెచ్ హనుమంతరావు జిల్లా ఎస్పీ కార్యాలయాన్ని ఆశ్రయించారు. 2018 నుంచి ఇప్పటివరకు జిల్లాలో ముఖ్యమంత్రుల పర్యటనకు సంబంధించి ఆయా కాన్వాయ్‌లకు వాహనాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఆర్టీఏ అధికారుల ఆదేశాల మేరకు తాము వాహనాలను సమకూరుస్తున్నట్లు తెలిపారు. ఆయా కాన్వాయ్ వాహనాల బిల్లులు ఇప్పటివరకు 19 లక్షల వరకు పెండింగ్ ఉందన్నారు. తమకు రావాల్సిన బిల్లుల బకాయిలను తక్షణం చెల్లించకుంటే ధర్నాకు దిగుతామని ఆయన హెచ్చరించారు.

కార్లు, ట్రాక్టర్లు బాడుగకు పెడతామని మోసం

గుంటూరు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : గుంటూరు నగరపాలక సంస్థ కార్యాలయంలో కార్లు , ట్రాక్టర్లను కాంట్రాక్ట్ పద్దతిన అద్దెకు పెట్టిస్తానని చెప్పి తనను ఓ ముఠా మోసం చేసిందని ప్రత్తిపాడు పరిధిలోని తిమ్మాపురం గ్రామానికి చెందిన పొదిలి శ్రీనివాసరావు సోమవారం ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేశాడు. బాధితుడు ఫిర్యాదు మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. తిమ్మాపురం గ్రామానికి చెందిన తోట నవీన్, అజయ్, పొత్తూరు చెందిన అర్జున్ నాయుడు తోపాటు మరికొందరు గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్‌లో కార్లు, ట్రాక్టర్లు అద్దెకు పెట్టిస్తామని చెప్పి తన నుంచి 30 లక్షల రూపాయలతో రెండు కార్లు, రెండు ట్రాక్టర్లను కొనుగోలు చేయించారని శ్రీనివాసరావు తెలిపారు. ఆ వాహనాలను నగరపాలక సంస్థకు బాడుగకు పెట్టలేదని, వాటిని వేరే వారికి విక్రయించుకున్నారని తెలిసిందన్నారు. దీనిపై 2023లో ప్రత్తిపాడు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా నవీన్, రహమతుల్లా, ఓం సాయి ప్రకాష్, అవినాష్, కార్తీక్ , టిక్కు, శివ నాగేశ్వరరావు, మణికంఠ తదితరులను అరెస్టు చేశారని, అయితే ఆ కేసులో నాగమణి, శ్రావణ్‌లతోపాటు మరికొందరు నిందితులను అరెస్టు చేయాల్సి ఉందన్నారు. మొత్తం మీద వాహనాల తాలూకా కోటి పాతిక లక్షల వరకు తనకు డబ్బులు రావాల్సిందని అయితే ఒక పైసా కూడా ఇప్పించలేదని శ్రీనివాసరావు ఆవేదన వ్యక్తం చేశారు.

కోడె దూడల అపహరణ ముఠాపై చర్యలు తీసుకోవాలి

గుంటూరు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : కోడె దూడలను అపహరిస్తున్న ముఠాను పట్టించినా ఇంతవరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదని ఆయా వ్యాపారులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం ఆయా వ్యాపారులు ఎస్పీని కలసి ఫిర్యాదు చేశారు. తాను ఆనందపేట 7వ లైనులో ఉంటూ కోడే దూడలు మారు వ్యాపారం చేస్తుంటానని షాబుద్దీన్ తెలిపారు. మూడు నెలల నుంచి తన కోడేదూడలను కొట్టముల నుంచి దొంగలు దొంగలిస్తున్నారని చెప్పారు. ఇటీవల సుమారు 5 మంది కోడె దూడను దొంగిలిస్తుండగా అది చూసిన తాను, తన స్నేహితుడైన షేక్ ఇర్ఫాన్ కలిసి వారిని పట్టుకునేందుకు ప్రయత్నించగా నలుగురు పారిపోగా షేక్ ఇమ్రాన్ అనే దొంగను పట్టుకుని పాతగుంటూరు పోలీసు స్టేషన్‌లో అప్పగించామన్నారు. ఇమ్రాన్‌ను విచారించగా పారిపోయిన నలుగురు దొంగలు చానా, న్యాబి, ఎజాస్, బషీ అని, దొంగిలించిన కోడె దూడలను స్కార్పియో వాహనంలో హైదరాబాద్ తీసుకువెళ్ళి అమ్ముతుంటామని చెప్పాడన్నారు. గతంలో వీరిపై పాత గుంటూరు పోలీసు స్టేషన్‌లో సుమారు ఆరు కేసులు పెట్టినట్లు తెలిపారు. అయినప్పటికీ ఒక్క కేసులో కూడా చర్యలు తీసుకోలేదన్నారు. తమ కుటుంబాలు రోడ్డున పడకుండా తగిన చర్యలు తీసుకుని న్యాయం చేయాలని వారు కోరారు.

శంకర్ విలాస్ బ్రిడ్జిని త్వరగా పూర్తి చేస్తాం

● పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి
● ట్రాఫిక్ డైవర్షన్ ప్రాంతాల పరిశీలన


ట్రాఫిక్ అధికారితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గల్లా మాధవి

గుంటూరు, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి) : గుంటూరు నగరంలో శంకర్ విలాస్ బ్రిడ్జి నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి చెప్పారు. శంకర్ విలాస్ బ్రిడ్జి నిర్మాణ పనుల నేపథ్యంలో చేపట్టిన ట్రాఫిక్ డైవర్షన్ తీరుతెన్నులను ఆమె సోమవారం పరిశీలించారు. ద్విచక్రవాహనంపై పట్టాభిపురం, గుజ్జనగుండ్ల, కొరిటెపాడు, బ్రాడీపేట, శ్యామలా నగర్ రైల్వే గేట్, కంకరగుంట ఆర్‌యూబీ, జేకేసీ కాలేజీ రోడ్డు, ఐటీసీ ప్రాంతాలలో ఆమె పర్యటించారు. స్థానికులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని పశ్చిమ ట్రాఫిక్ సీఐ సింగయ్యకు సూచించారు. ముఖ్యమైన రోడ్డు జంక్షన్ల వద్ద అదనపు సిబ్బందిని నియమించడంతో పాటు, వాహనాల రాకపోకలు సజావుగా సాగేందుకు సమర్థవంతమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎమ్మెల్యే మాధవి మాట్లాడుతూ శంకర్ విలాస్ బ్రిడ్జి నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. పనులు పూర్తయిన తర్వాత నగరంలో ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. అప్పటివరకు ప్రజలు కొంత సహనం పాటించి సహకరించాలని కోరారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు తక్షణమే పరిష్కారం చూపేలా సంబంధిత అధికారులను నిరంతరం మానిటరింగ్ చేస్తానని ఎమ్మెల్యే మాధవి భరోసా ఇచ్చారు.

ప్రజా రాజధాని అమరావతిపై వైసీపీ తప్పుడు ప్రచారం

● ఏపీఐడీసీ చైర్మన్ దేగల ప్రభాకర్


మాట్లాడుతున్న దేగల ప్రభాకర్

గుంటూరు, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): ప్రజా రాజధాని అమరావతిపై వైసీపీ తప్పుడు ప్రచారం చేస్తోందని ఏపీఐడీసీ చైర్మన్ దేగల ప్రభాకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. టీడీపీ గుంటూరు కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం చేపట్టిన అన్నదాత సుఖీభవ, స్త్రీశక్తి వంటి పథకాలకు ప్రజల నుంచి విశేషమైన స్పందన చూసి జగన్‌రెడ్డి నిద్రలేని రాత్రులు గడుపుతున్నారని ఆయన ఎద్దేవా చేశారు. మద్యం కుంభకోణంలో జగన్ పాత్రపై వస్తున్న ఆరోపణల నేపథ్యంలో ప్రజల దృష్టిని మళ్లించేందుకు తప్పుడు ప్రచారానికి శ్రీకారం చుట్టారని మండిపడ్డారు. ఆగస్టు 11 నుంచి వారం రోజులపాటు భారీ వర్షాలు కురుస్తున్నాయి. సుమారు 16 సెం.మీ.లకు పైగా వర్షపాతం నమోదైంది. అయినా ఎక్కడైనా ఏ కార్యాలయమైనా మునిగిపోయిందా? అని ప్రశ్నించారు. సచివాలయానికి వెళ్లే మార్గంలో ఎక్కడా చుక్క నీరు నిల్వలేదన్నారు. హైకోర్టుగానీ, విద్యా సంస్థలుగానీ, ప్రభుత్వ కార్యాలయాలుగానీ ఏ ఒక్క దాని కార్యకలాపాలకు ఎటువంటి ఆటంకాలు కలగలేదన్నారు. రాజధాని మునిగిపోయిందంటూ కుట్రలు చేస్తూ పెట్టుబడులు రాకుండా చేసేందుకు జగన్ రెడ్డి ప్రయత్నం చేస్తున్నారన్నారని ఆరోపించారు. ఫేక్ ప్రచారాలతో ప్రజల్లో లేనిపోని అపోహలు సృష్టించవద్దని హితవు పలికారు.

ప్రభుత్వం మారేందుకు చోదకశక్తిగా అమరావతి రైతాంగ పోరాటం

● సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల

గుంటూరు(తూర్పు), ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రాజకీయ చిత్రపటం మారడానికి అమరావతి రైతాంగ పోరాటం చోదకశక్తిగా పని చేసిందని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు అన్నారు. జిల్లా 26వ మహాసభలలో భాగంగా, మల్లయ్యలింగం భవనంలో రెండవ రోజు సోమవారం జరిగిన ప్రతినిధుల సభను ఆయన ప్రారంభించి ప్రసంగించారు. ఈ పోరాటంలో భారత కమ్యూనిస్టు పార్టీ జిల్లా కమిటీ కీలక భూమికను పోషించిందని గుర్తు చేసుకున్నారు. పోరాట ఫలితంగా రాష్ట్రంలో ప్రభుత్వం మారిందని, కానీ అమరావతి రైతుల ముఖచిత్రం మాత్రం ఇంకా మారలేదన్నారు. అమరావతి రైతుల రిటన్‌బుల్ ప్లాట్ల అభివృద్ధికి ప్రభుత్వం శ్రీకారం చుట్టలేదన్నారు. ఇంటి నిర్మాణానికి అవసరమైన పద్ధతిలో ప్లాట్లను యుద్ధప్రాతిపదికన అభివృద్ధి చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. జిల్లాలో స్పిన్నింగ్ మిల్లులు శిథిలావస్థకు చేరుతున్నాయని, కోల్డ్ స్టోరేజీలు నష్టాల బాటపడుతున్నాయని, ఎంఎస్ఎంఈలు మూసివేతకు గురౌతున్నాయన్నారు. రాష్ట్రానికి తలమానికంగా ఉన్న విశాఖ స్టీల్ ఫ్యాక్టరీతో పాటు రాష్ట్రంలోని వివిధ వ్యవస్థలు ప్రైవేటుపరం అవుతుంటే ఈ రాష్ట్రాన్ని ఎలా అభివృద్ధి చేస్తారని ప్రశ్నించారు. జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ మాట్లాడుతూ రానున్న రోజుల్లో రైతులు, కార్మికులు, వ్యవసాయ కార్మికులు, ఉద్యోగులు, విద్యార్థి, యువజన, మహిళల సమస్యల పరిష్కారం కోసం మరిన్ని పోరాట కార్యక్రమాలకు రూపకల్పన చేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో బొల్లిమంత కృష్ణ, వెలుగూరి రాధాకృష్ణమూర్తి, చల్లా చిన ఆంజనేయులు, బందెల నాసర్, ఈశ్వరరావు, పచ్చల శివాజీ, ఆదేశ్వరరావు, సింగారావు, పుప్పాల సత్యనారాయణ, శశి, ముప్పాళ్ళ శివశంకర్ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ముప్పాళ్ల నాగేశ్వరరావు

ఆధునిక సౌకర్యాలతో వెల్‌నెస్ సెంటర్ అభివృద్ధి

● చీఫ్ మెడికల్ ఆఫీసర్ కోటేశ్వరరావు


ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న డాక్టర్ కోటేశ్వరరావు

గుంటూరు మెడికల్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): మారుతున్న కాలానికి అనుగుణంగా అత్యాధునిక వైద్య సదుపాయాలతో సెంట్రల్ గవర్నమెంట్ హెల్త్ స్కీమ్ (సీజీహెచ్ఎస్) వెల్‌నెస్ సెంటర్‌ను మరింతగా అభివృద్ధి చేస్తామని సీజీహెచ్ఎస్ చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ టీసీహెచ్ కోటేశ్వరరావు తెలిపారు. సోమవారం నగరంపాలెంలోని సంస్థ కార్యాలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన లాబొరేటరీ, ఇంజెక్షన్, బీపీ పరీక్షా కేంద్రాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ కోటేశ్వరరావు మాట్లాడుతూ కార్పొరేట్ ఆసుపత్రులకు దీటుగా, ఆరోగ్య కేంద్రాలను, కేంద్ర ప్రభుత్వ సహకారంతో మరింత మెరుగైన స్థితికి తీసుకువస్తామన్నారు. సీనియర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వి విద్య మాట్లాడుతూ రోగుల ఆరోగ్య సంక్షేమమే తమ లక్ష్యమన్నారు. సీజీహెచ్ఎస్ లోకల్ అడ్వైజరీ కమిటీ మెంబర్ గుమ్మడి సీతారామయ్యచౌదరి మాట్లాడుతూ. సీజీహెచ్ఎస్‌లో మెరుగైన, నాణ్యమైన వైద్య సేవలు అందుతున్నాయన్నారు. ఉద్యోగులు, పెన్షనర్ల లో ఆరోగ్య సంరక్షణ పట్ల అవగాహన కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సీనియర్ నర్సింగ్ ఆఫీసర్ బి.హేమా సుందరి, ఫార్మాసిస్టు అయేషా బేగం, పెన్షనర్లు పాల్గొన్నారు.



పిడుగురాళ్ల మార్కెటింగ్ సొసైటీ గోడౌన్‌లో నిల్వవున్న ఎరువుల బస్తాలు

ఆర్‌ఎస్కేలకు.. ఎరువుల సరఫరా ఎప్పుడు!?

గ్రామాల్లో రైతుల ఇబ్బందులు

పిడుగురాళ్ల, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): రైతు సేవా కేంద్రాలకు ఎరువుల సరఫరా ఇప్పటికీ జరగలేదు. నాగార్జున సాగర్ ఆయకట్టు పరిధిలో పల్నాడులోని గురజాల, మాచర్ల ప్రాంతాల్లో మెట్ట భూముల్లో గత నెలలోనే పత్తి సాగు చేయగా, వచ్చే నెల మొదటి వారంలోగా మిరప నారు సాగు చేసేందుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. మిగిలిన మాగాణి భూములలో గత పది రోజులుగా రైతులు వరినాట్లు వేయడం ముమ్మరంగా సాగించారు. బోర్లు, బావులు ఉన్న మాగాణి భూముల్లో 20 రోజుల క్రితమే వరినాట్లు వేయగా సాగర్ ఆయకట్టు పరిధిలో కొద్దిరోజులుగా వరినాట్లు సాగుచేయడం రైతులు వేగవంతం చేశారు.

ఎప్పుడు వస్తాయో..

పల్నాడు ప్రాంతంలో గురజాల, మాచర్ల నియోజకవర్గాల పరిధిలో సుమారు 108 రైతు సేవా కేంద్రాలు ఉన్నాయి. సుమారు 25 వేల హెక్టార్లకు పైగా మాగాణి భూములుండగా ఇప్పటికే 11 వేల హెక్టార్లలో వరినాట్లు పూర్తయ్యాయి. కానీ, ఆయా రైతు సేవా కేంద్రాలకు ఇప్పటి వరకు ఒక్క బస్తా కూడా ఎరువు చేరలేదు. దీంతో రైతులు వరి నాట్లు వేసినా సకాలంలో ఎరువులు చల్లేందుకు అందు బాటులో లేకపోవడంతో ఆందోళన చెందుతు న్నారు. సమీప పట్టణాల్లోని ప్రైవేటు ఎరువుల దుకాణాలు, మన గ్రోమోర్ సెంటర్లు, మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో ఎరువులు, పురుగు మందుల విక్ర యాలు జరుగుతూనే ఉన్నాయి. ప్రతి గ్రామంలోని రైతు సేవా కేంద్రాలకు ఎరువులు రాకపోవడంతో.. మండల కేంద్రాలకు పరుగులు తీస్తున్నారు. అద నపు బాడుగ ఖర్చు భరిస్తున్నారు. మార్క్‌ఫెడ్ కేంద్రాలలో డీఏపీ, 20-20-20, 10-26-10, 28-28-28 రకాల ఎరువులు మాత్రమే అందుబాటులో వున్నా యి. పల్నాడు ప్రాంతంలో వరితో పాటు పత్తి, మిరప, మొక్కజొన్న సాగు చేస్తున్న రైతులలో ఎక్కువ మంది గోదావరి కంపెనీ యూరియానే అడుగుతున్నారు. ప్రైవేటు దుకాణాలకు అంతగా సరఫరా లేకపోవడంతో డిమాండ్ తలెత్తు తోంది.

డ్రెయిన్ల పారుదల కాక రైతుల అవస్థలు

అధికారులకు విన్నవించినా ఫలితం శూన్యం

పారేదెలా..

గుర్రపుడెక్క తొలగేదెలా..!



గుడ్డికాయలంక డ్రెయిన్‌లో ఏపుగా పెరిగిన జమ్మిగడ్డి, గుర్రపుడెక్క

రేపల్లె, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): అధికారులు, ప్రజాప్రతినిధుల ప్రకటనలు ఆర్భాటాలేనని మరోసారి రుజువైంది. రేపల్లె నియోజకవర్గంలో ప్రధాన డ్రెయిన్‌లు తూటికాడ, జమ్మిగడ్డి ఏపుగా పెరిగి మురుగు నీరు పారుదల లేక.. పంట పొలాల్లో వర్షపునీరు తిష్టవేయడం ఇందుకు అద్దం పడుతోంది. వైసీపీ ప్రభుత్వంలో కనీసం డ్రెయిన్లను పట్టించుకున్న పాపాన పోలేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక.. అధికారులకూ రైతులు సమస్యలను విన్నవించుకున్నా.. పట్టించుకున్న దాఖలాలు లేవు. డ్రెయినేజీ అధికారులకు పలుమార్లు విన్నవించుకున్నా.. కార్యాలయం వద్ద ధర్నా చేసినా కనీస స్పందన లేదంటూ మునుసుబువారిపాలెం, రేపల్లె, ఉప్పూడి రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రేపల్లె మండలంలోని పెనుమూడి, అరవపల్లి, గుడ్డికాయలంక, నగరంమండలంలో గంగోలు, మంగళగుంట, తోటపల్లి ఎక్స్‌టెన్షన్, చెరుకుపల్లి మండలం గూడవల్లి మెయిన్, కావూరు, నిజాంపట్నం మండలం కూచినపూడి, అడవులదీవి, నిజాంపట్నం డ్రెయిన్లలో ఏపుగా గుర్రపుడెక్క పెరిగిపోయింది. ఈ డ్రెయిన్ల కింద సుమారుగా 70 ఎకరాలు పైనే వరి సాగు చేస్తున్నారు. నాలుగురోజులుగా కురుస్తున్న వర్షాల కారణగా డ్రెయిన్‌లో మురుగు పారుదల కాక పంట పొలాల్లోనే వర్షపు నీరు నిలిచిపోయింది. దీంతో వేసిన వరినాట్లు మునిగిపోయి రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. పొలాలు బీడుగా మారిపోతున్నాయంటూ వేలాది రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైన ఉన్నతాధికారులు దృష్టి సారించి పూడికతీత చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

బండారుపల్లి సొసైటీ అధ్యక్షుడి నియామకంలో వివాదం

- ప్రమాణ స్వీకారం చేస్తే ఉపేక్షించేది లేదన్న టీడీపీ శ్రేణులు
- సొసైటీ ఎదుట ఆందోళన చేసిన నాయకులు
- వాయిదా పడిన ప్రమాణస్వీకారం



బండారుపల్లి సొసైటీ ఎదురుగా ఆందోళనలు వ్యక్తం చేస్తున్న టీడీపీ శ్రేణులు

తాడికొండ(బండారుపల్లి)ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బండారు పల్లిలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం అధ్యక్షుడి నియామకంలో టీడీపీలోని వర్గ విభేధాలు బయటపడ్డాయి. బండారుపల్లి సొసైటీకి అధ్యక్షుడిగా గుంటుపల్లి పానయ్యను నియమించినట్లు ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. దీంతో పానయ్య సోమవారం సొసైటీ అధ్యక్షుడి బాధ్యతలు స్వీకరించటానికి సిద్దపడ్డారు. ఈ క్రమంలో టీడీపీలోని మరో వర్గం నుంచి తీవ్ర వ్యతిరేకత వచ్చింది. సొసైటీ అధ్యక్షుడి ప్రమాణ స్వీకారం చేస్తే ఉపేక్షించేది లేదంటు టీడీపీ శ్రేణులు సొసైటీ వద్ద ఆందోళనలు చేపట్టారు. సొసైటీ అధ్యక్షుడి నియమాకంలో సీనియర్ నాయకులు, కార్యకర్తలను సంప్రదించకుండానే పదవులు కట్టబెట్టారంటూ విషయం కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ వద్దకు ఆదివారం చేరింది. నామినేటెడ్ పదవులు ఇచ్చేటప్పుడు పార్టీ కోసం 40 ఏళ్ల నుంచి కష్టపడి పనిచేసిన సీనియర్ నాయకులకు కనీస సమాచారం ఇవ్వకుండానే పదవులు పందేరం చేస్తున్నారని వాపోయారు. సొసైటీ అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేస్తే ఒప్పుకోమని, స్థానిక నాయకులతో సంప్రదింపులు జరిపిన తరువాతే సొసైటీ అధ్యక్షుడిని నియమించాలని కేంద్ర మంత్రి కార్యాలయంకు తెలియజేశారు. అయితే సోమవారం ఉదయం 10 గంటలకు సొసైటీ అధ్యక్షుడిగా ప్రమాణస్వీకారం చేసి బాధ్యతలు స్వీకరించాలని గుంటుపల్లి పానయ్య వర్గం నిర్ణయించుకుంది. విషయం తెలిసిన మరో వర్గం నాయకులు,కార్యకర్తలు సొసైటీ కార్యాలయం వద్దకు చేరుకొని ఆందోళనలు చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్, వైసీపీ ప్రభుత్వాలు ఉన్నప్పుడు తమపై కేసు పెట్టించి, జైలుకు పంపిన వ్యక్తికి సొసైటీ చైర్మన్ పదవి ఎలా ఇస్తారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రూ. 20 లక్షల పెట్టి పదవిని కొనుకున్నారని గ్రామంలో ప్రచారం జరుగుతుందని తెలిపారు. మా ఎమ్మెల్యే డబ్బులు తీసుకునే వ్యక్తి కాదని పేర్కొన్నారు. ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్ అందుబాటులో లేరని, వారితో మాట్లాడిన తరువాత మాత్రమే ప్రమాణ స్వీకారం చేయాలని డిమాండ్ చేశారు. అయితే ఇరువర్గాలతో టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి గుంటుపల్లి మదుసూదనరావు చర్చలు జరిపి ప్రమాణ స్వీకారాన్ని వాయిదా వెయించారు. రెండు మూడు రోజుల్లో సమస్య పరిష్కరిస్తామని తెలిపారు. అయితే టీడీపీలో రెండు వర్గాల మధ్య వివాదం జరుగుతుందనే సమాచా రంతో ముందుస్తుగా గ్రామంలో పోలీసులు పికెటింగ్ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పీ శేషయ్య, సొసైటీ మాజీ చైర్మన్ దండమూడి సాంబశివరావు, పార్టీ మండల మాజీ అధ్యక్షులు మానుకొండ శివరామకృష్ణ, పార్టీ గ్రామ మాజీ అధ్యక్షులు దండమూడి వెంకట్రావు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దివ్యాంగ పింఛన్లలో అనర్హుల గుర్తింపు

సర్వేంద్రియాల్లో.. వైకల్యం బయట పడింది

- పల్నాడులో 3,217 మందికి నోటీసులు
- ప్రత్యేక సర్వేలో గుర్తించిన ప్రభుత్వం
- అర్హతుంటే 30 రోజుల్లో అప్పీలుకు అవకాశం



సత్తెనపల్లి, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో ఇష్టారాజ్యంగా పెన్షన్‌లు ఇచ్చేశారు. కొందరు వైద్యులను ప్రసన్నం చేసుకొని.. ఒత్తిడి తెచ్చి సదరన్ సర్టిఫికెట్లు పొందారు. ప్రస్తుతం దివ్యాంగ పింఛన్లు తీసుకుంటున్న వారికి కూటమి ప్రభుత్వం చెక్ పెడుతోంది. ప్రభుత్వం వచ్చిన తర్వాత పింఛన్‌ల సొమ్మును పెంచింది. దివ్యాంగులకు రూ.3వేల నుంచి రూ.6 వేల పింఛను చేసింది. మరో వైపు మంచానికే పరిమితమైన వారికి పెన్షన్‌ను రూ.10వేలు నుంచి రూ.15 వేలకు పెంచింది. గత ప్రభుత్వంలో అనర్హులు కూడా పెన్షన్లు పొందుతున్నారని ఫిర్యాదులు అందాయి. ఎక్కువగా వైసీపీ సానుభూతిపరులు, కార్యకర్తలు ఇటువంటి పింఛన్లు పొందిన వారిలో ఉన్నారు. అనర్హులకు లబ్ధి చేకూరుతుందని ఫిర్యాదులు వెల్లువెత్తడంతో కూటమి ప్రభుత్వం దీనిపై సర్వే చేపట్టింది. అనర్హులుగా కొంత మందిని వైద్య బృందం సర్వే చేసి గుర్తించింది.

3,217 మంది అనర్హులు..

పల్నాడు జిల్లా వ్యాప్తంగా 35,542 మంది దివ్యాంగులు పింఛన్లు పొందుతున్నారు. వీరిలో 3,217 మందిని అనర్హులుగా గుర్తించి సచివాలయాల ద్వారా నోటీసులు జారీ చేస్తున్నారు. ఈ ఏడాది జనవరి 6 నుంచి 31వ తేదీ వరకు పింఛన్‌ల వెరిఫికేషన్ చేశారు. వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. దివ్యాంగులకు ప్రత్యేక సద రన్ క్యాంపులు ఏర్పాటు చేసి.. వారి సర్టిఫికెట్లు కరెక్టుగా ఉన్నాయా? లేదా? అనే అంశాన్ని పరిశీలించారు. అనర్హులను గుర్తించి.. సచివాలయాల వారీగా నోటీసులు జారీ చేస్తున్నారు. మరోసారి సదరన్ సర్టిఫికెట్ చేయించుకొని రావాలని, అప్పుడు పింఛను ఇస్తారని వారికి చెబుతున్నారు. ఇలా అనర్హులకు జూలై నెల పింఛన్ నిలుపుదల చేశారు. నోటీసులు అందుకున్న పింఛనుదారులు సచివాలయాల చుట్టూ తిరుగుతున్నారు.

30 రోజుల్లో అప్పీలు చేసుకోవాలి

ఈ విషయంపై డీఆర్‌డీఏ పీడీ ఝాన్సీరాణి స్పందిస్తూ.. పల్నాడు జిల్లాలో నోటీసులు అందుకున్న పింఛన్‌దారులు పాత సదరన్ సర్టిఫికెట్, తాజాగా అందిన నోటీసు తీసుకొని ఏరియా వైద్యశాలకు వెళ్లి సంబంధిత డాక్టర్‌తో పరీక్ష చేయించుకోవాలన్నారు. నిబంధనల ప్రకారం ఉన్న ప్రొఫార్మాలో మాన్యువల్ సర్టిఫికెట్ పొందాలన్నారు. నోటీసులు అందుకున్న వారంతా 30 రోజుల్లోపు అప్పీలు చేసుకోవాలని ఆమె సూచించారు.

పింఛన్లలో.. మార్పులు

దివ్యాంగత్వం 85 శాతానికి పైబడి ఉండి మంచానికే పరిమిత మైన వారికి రూ15వేలు, అంత కంటే తక్కువ 40 శాతం కంటే ఎక్కువ ఉంటే మెడికల్ పింఛన్ నుంచి రూ.6 వేలకు మార్పు చేస్తున్నారు. 40 శాతానికి కంటే అంగవైకల్యం తక్కువగా ఉండి 60 సంవత్సరాల పైబడి ఉంటే రూ.4 వేలు వృద్ధాప్య పింఛన్‌కు బదిలీ చేస్తారు. 60 ఏళ్ల కంటే తక్కువ వయస్సు ఉంటే పింఛన్ తొలగి స్తారు. 40 శాతం కంటే ఎక్కువ దివ్యాంగత్వం ఉంటే రూ.6వేలు పింఛన్ యథావిధిగా మంజూరు చేస్తారు.

పెరిగిన ప్రయాణాలు

- విజయవంతంగా స్త్రీ శక్తి పథకం
- పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్‌లలో జీరో ఫేర్ టిక్కెట్ల జారీలే అత్యధికం
- 45 నుంచి 60 శాతానికి పెరిగిన మహిళల ఆక్యుపెన్సీ



కిక్కిరిసిన బస్సులో తోచుకుంటూ ఎక్కుతున్న మహిళా ప్రయాణికులు



గుంటూరులోని ఎన్‌టీఆర్ బస్టాండ్‌లో ప్రయాణికుల కోలాహలం

గుంటూరు, తెనాలి రూరల్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న స్త్రీ శక్తి పథకంపై మహిళల్లో సంతోషాన్ని నింపుతోంది. ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఆర్టీసీలో మహిళల ఉచిత ప్రయాణ పథకం విజయవంతంగా సాగుతోంది. రోజురోజుకు మహిళా ప్రయాణీకుల సంఖ్య పెరుగుతోన్నట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఎటువంటి ఇబ్బంది ల్లేకుండా పథకం అమలు జరుగుతోందని నెల్లూరు జోన్ డిప్యూటీ సీటీఎం రవికాంత్ తెలిపారు.

45 నుంచి 60 శాతానికి పెరిగిన ఆక్యుపెన్సీ

స్త్రీ శక్తి పథకం అమలుతో ఆర్టీసీ ఉమ్మడి గుంటూరు జిల్లాలో 45 నుంచి 60 శాతానికి మహిళా ప్రయాణీకుల ఆక్యుపెన్సీ పెరిగినట్లు గణాంకాలు చెబుతున్నాయి. పథకాన్ని ప్రారం భించిన తొలి రోజు ఈనెల 15న విభజిత గుంటూరు జిల్లాలో 4800 మంది మహిళా ప్రయాణీకులు వారి వారి గమ్యస్థానాలకు చేరుకున్నా రని, పల్నాడు జిల్లాలో 5,293 మంది మహిళా ప్రయాణీకులు సద్విని యోగం చేసుకొన్నారని, బాపట్ల జిల్లాలో 4200 మంది జీరో ఫేర్ టిక్కెట్ల తో ప్రయాణించారని గణాంకాలు తెలియజేస్తున్నాయి. అలానే మూడో రోజు 17వ తేదీకి మహిళా ప్రయాణీకుల సంఖ్య మరింత పెరిగింది. పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ సర్వీసుల్లో మహిళా ప్రయాణీకుల సంఖ్యే అత్యి ధికంగా ఉంటోందని చెబుతున్నారు. మూడో రోజున గుంటూరు జిల్లాలో 90 వేల మంది మహిళా ప్రయాణీకులు కాగా, పల్నాడు జిల్లాలో లక్షా 10వేల మంది, బాపట్ల జిల్లాలో 55 వేల మంది మహిళా ప్రయాణీకులు జీరో ఫేర్ టిక్కెట్‌తో ప్రయాణించినట్లు గణాంకాలు చెబుతున్నాయి.

ఫలించిన ముందస్తు ప్రణాళికలు....

స్త్రీ శక్తి పథకం అమలు నేపథ్యంలో అధికారుల ముందస్తు ప్రణాళికలు సత్ఫలితాలనిస్తున్నాయని చెబుతున్నారు. ఎక్కడా ఎటువంటి ఇబ్బందు ల్లేకుండా పథకం అమలు జరుగుతోందని చెబుతున్నారు. పల్లె వెలుగు బస్సుల్లో ఫుట్ బోర్డు విస్తరణ, లోపల నిల్చొన్న మహిళలు పట్టుకునేలా హ్యాండిల్ స్లింగ్స్, అత్యవసర ద్వారం వంటి ఏర్పాట్లు చేశారు.

కొరవడిన పర్యవేక్షణ

సోమవారం తెనాలి పాత బస్టాండ్ వద్ద బస్సులు నిలిపే సమయంలో వందల సంఖ్యలో మహిళలు బస్సుల కోసం బారులు తీరి ఉన్నారు. ప్రతి పదినిముషాలకు ఒక బస్సు వస్తున్నా ఆయా బస్సులలో మహిళలతో కిక్కిరిసి ఉంటున్నారు. ఈ క్రమంలోనే పాత బస్టాండ్ వద్దకు బస్సు రాగానే అందులో ఎక్కి ప్రయాణం చేసేందుకు మహిళలు పోటీపడ్డారు. ఈక్రమంలో ఓ వృద్ధుడు బస్సు ఎక్కుతుండగా తోపులాట చోటుచేసుకుని కిందపడిపోయాడు. సమీపంలోని మహిళలు అతడిని పైకిలేపి సపర్యాలు చేశారు. గతంలో ఆ ప్రాంతంలో ప్రయాణీకులను ఎక్కించేందుకు ఆర్టీసీ డిపోకి చెందిన పలువురు అధికారులను, సిబ్బందిని నియమించేవారు. వారు బస్సును నిలపుదల చేయడం, ప్రయాణీకులు ఎక్కిన తరువాత పంపించడం వంటివి చేసేవారు. ప్రస్తుతం అటువంటి వారు కనబడటంలేదు. ఫలితంగా బస్సు ఎక్కెసమయంలో ప్రమాదాల బారిన పడుతున్నారు. పెరిగిన బస్సు ప్రయాణీకులకు తగ్గట్టుగా ఎటువంటి ప్రమాదాలు జరగకుండా సిబ్బందిని ఏర్పాటు చేసి ప్రయాణీకులు సురక్షితంగా గమ్యస్థానాలకు చేరేలా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

కృష్ణానదికి పెరిగిన వరద ప్రవాహం

అప్రమత్తమైన అధికార యంత్రాంగం

26 క్రస్ట్‌గేట్ల ద్వారా నీటి విడుదల

విజయపురిసౌత్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ జలాశయానికి శ్రీశైలం నుంచి భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. సోమవారం శ్రీశైలం నుంచి 3,31,699 క్యూసెక్కుల వరద నీరు వస్తుండడంతో ప్రాజెక్ట్ అధికారులు 26 క్రస్ట్‌గేట్ల ద్వారా దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్ జలాశయం నీటిమట్టం 585.80 అడుగులు ఉంది. ఇది 299.74 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 6006, ఎడమ కాలువ ద్వారా 4949, ప్రధాన జల విద్యుత్ కేంద్రం ద్వారా 28,826, 8 క్రస్ట్ గేట్లను 10 అడుగులు, 18 క్రస్ట్‌గేట్లను 5 అడుగుల మేర ఎత్తి 2,51,182 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 2400, ఎల్ఎల్‌సీ ద్వారా 300 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 2,93,663 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.



26 క్రస్ట్‌గేట్ల ద్వారా విడుదలవుతున్న నీరు

తీర గ్రామాల్లో అప్రమత్తం

అచ్చంపేట, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కృష్ణానదికి వరద ఉధృతి పెరిగింది. గత కొన్ని రోజులుగా కృష్ణానదికి సుమారు రెండు లక్షల క్యూసెక్కుల నీరు రావటంతో నదీ తీర గ్రామాలన్నీ అప్రమత్తమయ్యాయి. ఈ నేపథ్యంలో మత్స్యకారుల వేట పూర్తిగా స్తంభించి పోయింది. తీర గ్రామాల్లోని మత్స్య కారులు వారి పడవలను ఒడ్డుకు చేర్చుకొని నిత్యం కాపలా కాస్తు న్నారు. వరద ఉధృతి రాబోయే రోజుల్లో మరింత పెరిగే అవకాశం ఉంది. నదీ తీర గ్రామాలు ప్రతి నిత్యం అప్రమత్తంగా ఉండాలని అధికారులు కోరుతున్నారు.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : పులి చింతల ప్రాజెక్టులో సోమవారం 38.17 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. ఎగువ నుంచి 2,31,641 క్యూసె క్కుల నీరు ప్రాజెక్టుకు చేరుతుంది. ప్రాజెక్టు వద్ద పవర్ జనరేషన్ ద్వారా 16వేల క్యూసెక్కుల నీరు, లీకుల ద్వారా నాలుగు వందల క్యూసె క్కులు, తొమ్మిది గేట్ల ద్వారా 2,64,807 క్యూసె క్కులు, మొత్తం 2,81,807 క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల అవుతుంది.



ఒడ్డుకు చేరిన మత్స్యకారుల పడవలు



అరవింద వారధి వద్ద పెరిగిన వరద ప్రవాహం

కొల్లూరు ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): కృష్ణా నదికి మళ్లీ వరద ప్రవాహం పెరిగింది. దీంతో అధికారులు అప్రమత్తమయ్యారు. అల్ప పీడన ప్రభావంతో రాష్ట్ర వ్యాప్తంగా భారీ వర్షాల వల్ల.. కృష్ణానది పరీవాహక ఎగువ ప్రాంతం నుంచి భారీ వరద నీరు కృష్ణా నదికి చేరుతోంది. ఈ నేపథ్యంలో బాపట్ల జిల్లా కలెక్టర్ వెంకటమురళి ఆదివారమే అధికారులను అప్రమత్తం చేశారు. సోమవారం రెవెన్యూ కార్యాలయాల్లో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికను కూడా రద్దు చేసి వరదల పట్ల అప్రమత్తం కావాలని, వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్లేందుకు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

పిల్లల ఆహారం

ఒకటి నుంచి మూడేళ్ల వయసు పిల్లలకు ఘనాహారంగా అన్నాన్నే ఎంచుకుంటూ ఉంటాం. కానీ పిల్లల ఎదుగుదలకు సూక్ష్మ పోషకాల మీద దృష్టి పెట్టడం అత్యవసరం. అందుకోసం చిరుధాన్యాలను ఎంచుకోవాలి. వీటిలో బియ్యం, గోధుమల్లో లేని విటమిన్లు, ఖనిజ లవణాలు ఉంటాయి. కాబట్టి అందుబాటులో ఉన్న పలురకాల చిరుధాన్యాలను పిల్లలకు తినిపిస్తూ ఉండాలి.

చిరు ధాన్యాల్లో ఉండే ఇనుము, క్యాల్షియం, మెగ్నీషియం, బి విటమిన్లు పిల్లలు శక్తిని ఖర్చు చేసుకునే వేగాన్నీ, ఎముకల సాంద్రతనూ, రోగనిరోధకశక్తినీ పెంచుతాయి. వీటిలో గ్లూటెన్, అత్యధిక పీచు ఉంటుంది కాబట్టి పిల్లలకు తేలికగా జీర్ణమవుతాయి. వీటిలోని ఇనుము హార్మోన్ల పనితీరుకూ, ఎర్ర రక్తకణాల పెరుగుదలకూ తోడ్పడుతుంది. కాబట్టి పిల్లల ఆహారంలో చిరుధాన్యాలను చేర్చుకుంటే, ఎదుగుదల ఆరోగ్యకరంగా సాగుతుంది. అయితే చిరుధాన్యాలను పిల్లలకు తినిపించడం ఇబ్బందిగా మారితే, వాటిని ఇలా కొత్తగా కూడా వండి తినిపించవచ్చు.

రమ్యమైన రాగి బంతులు



కావలసిన పదార్థాలు:
- **రాగి పిండి:** ఒక కప్పు
- **నీళ్లు:** ఒకటిన్నర కప్పు
- **ఎండుమిరప:** 2
- **కరివేపాకు:** ఒక రెమ్మ
- **ఆవాలు:** అర టీస్పూను
- **మినపప్పు:** ఒక టీస్పూను
- **ఉప్పు:** అవసరమైనంత
- **నూనె:** రెండు టీస్పూన్లు

వంట సమయం: 20 నిమిషాలు

ఇలా వండుకోవాలి:
- ప్యాన్‌లో నూనె వేడి చేసి, ఆవాలు, మినపప్పు వేయించుకోవాలి. తర్వాత ఎండు మిరపకాయలు, కరివేపాకు వేసి, వేగిన తర్వాత, నీళ్లు, ఉప్పు వేసి కలపాలి.
- నీళ్లు మరిగిన తర్వాత, మంట తగ్గించి, నెమ్మదిగా రాగి పిండి పోస్తూ ఉండలు లేకుండా కలుపుకోవాలి. రాగి పిండి పోయగానే అది ముద్ద కడుతుంది. అప్పుడు మంట తీసేసి, మిశ్రమాన్ని చల్లారబెట్టి, పొడిబారిపోకుండా వస్త్రం కప్పి ఉంచాలి.
- ఇడ్లీ కుక్కర్‌లో నీళ్లు వేడి చేసి, ప్లేటుకు నూనె పూసుకోవాలి. చేతులకు కూడా నూనె పట్టించి, పిండి ముద్ద వేడిగా ఉన్నప్పుడే, గుండ్రని బంతుల్లా చుట్టుకోవాలి.
- ఈ రాగి బంతులను ఇడ్లీ ప్లేట్‌లో ఉంచి, 15 నిమిషాల పాటు ఆవిరి మీద ఉడికించుకోవాలి. ఉడికిన తర్వాత, క్యారెట్, లేదా టమాటో చట్నీతో కలిపి పిల్లలకు తినిపించాలి.

పిల్లలకూ చిరుధాన్యాలు

అరికల పాయసం



కావలసిన పదార్థాలు:
- **అరికలు:** పావు కప్పు
- **చక్కెర/బెల్లం:** పావు కప్పు
- **చిక్కని పాలు:** రెండు కప్పులు
- **జీడిపప్పు:** పది
- **ఎండు ద్రాక్ష:** 10
- **పాలు:** అరకప్పు
- **యాలకుల పొడి:** అర టీస్పూను
- **నెయ్యి:** రెండు టేబుల్ స్పూన్లు

వంట సమయం: 25 నిమిషాలు

ఇలా వండుకోవాలి:
- ప్యాన్‌లో నెయ్యి వేడి చేసి, జీడిపప్పు, ఎండు ద్రాక్షలను దోరగా వేయించి పక్కన పెట్టుకోవాలి. అదే నెయ్యిలో అరికలను కమ్మని వాసన వచ్చేవరకూ వేయించుకోవాలి. తర్వాత నీళ్లు పోసి కలుపుకోవాలి. తర్వాత ప్యాన్ మీద మూత పెట్టి, అరికలు మెత్తబడేవరకూ ఉడికించుకోవాలి. చివర్లో అర కప్పు పాలు, బెల్లం, యాలకుల పొడి కలిపి, 5 నుంచి 8 నిమిషాల పాటు ఉడికించుకోవాలి. తర్వాత, వేయించి పెట్టుకున్న జీడిపప్పు, ఎండు ద్రాక్ష కలిపి పిల్లలకు తినిపించాలి.

పిల్లలకు చిరుధాన్యాలు ఇలా అలవాటు చేయాలి

పిల్లలకు అలవాటు చేసే ప్రతి పదార్థం విషయంలో కొన్ని మార్గదర్శకాలు పాటించాలి. చిరుధాన్యాలకూ ఈ సూత్రం వర్తిస్తుంది. కాబట్టి చిరుధాన్యాలపరంగా అనుసరించవలసిన, అనుసరించకూడని అంశాల గురించి తెలుసుకుందాం!

ఇలా చేయాలి?


- అలర్జీ తత్వాన్ని కనిపెట్టడం కోసం మూడు రోజుల నియమంలో భాగంగా మూడు రోజుల పాటు ఒకే ఆహారం తినిపించాలి. మొదట్లో చిన్న పరిమాణాల్లో తినిపించి, పిల్లల జీర్ణ వ్యవస్థ ఆ పదార్థానికి అలవాటు పడేలా చేయాలి. పోరిడ్జ్, కిచిడి, లేదా దోసె రూపాల్లో క్రమేపీ పిల్లలకు వాటిని అలవాటు చేయాలి.
- **సరైన రకం:** రాగుల్లో క్యాల్షియం, ఖనిజ లవణాలు ఎక్కువ కాబట్టి పిల్లలకు మొదట వీటిని అలవాటు చేయాలి. తర్వాత కొర్రలు, ఊదలను పరిచయం చేయాలి
- **వండే విధానం:** చిరుధాన్యాలను నానబెట్టి లేదా వేయించి వండుకోవాలి. ఇలా చేయడం వల్ల పోషకాల నష్టం తగ్గడంతో పాటు తేలికగా జీర్ణమవుతాయి. చిరుధాన్యాలను ప్రెషర్ కుక్కర్‌లో వండుకోవచ్చు. లేదా చిన్న మంట మీద మెత్తబడేవరకూ నెమ్మదిగా ఉడికించుకోవచ్చు
- **పదార్థాలతో కలిపి:** పెరుగు, నెయ్యి, కూరగాయలతో కలిపి తినిపిస్తే, రుచి పెరుగుతుంది. అదనపు పోషకాలు అందుతాయి
- **ఆకర్షణీయమైన ఆకారాల్లో:** కుకీస్, ప్యాన్‌కేక్స్, లడ్డు, పాయసం, ఇడ్లీ.. ఇలా ఆకర్షణీయమైన ఆకారాల్లో వండి తినిపిస్తే, పిల్లలు ఇష్టంగా తింటారు.

ఇవి కూడదు

- **అన్నం, గోధుమలకు బదులుగా:** అన్నం, గోధుమలను పూర్తిగా తొలగించి చిరుధాన్యాలే తినిపించకూడదు. ప్రతి ధాన్యంలో ప్రత్యేకమైన పోషక నాణ్యతలుంటాయి. ప్రత్యేకించి చిన్న పిల్లలకు క్యాలరీల అవసరం ఎక్కువ కాబట్టి బరువు పెరగడం కోసం ఎదుగుదల కోసం భిన్నమైన పదార్థాలు తినిపిస్తూ ఉండాలి
- **భారీ పరిమాణాల్లో:** తింటున్నారు కదా అని భారీ పరిమాణాల్లో తినిపిస్తే కడుపుబ్బరం, అసౌకర్యంతో పిల్లలు బాధపడతారు
- **నీరు సరిపడా:** చిరుధాన్యాల్లో పీచు ఎక్కువ కాబట్టి పిల్లలకు సరిపడా నీళ్లు తాగిస్తూ ఉండాలి.

• **హరిప్రియ ఎన్,** క్లినికల్ న్యూట్రిషనిస్ట్,
క్లౌడ్ నైన్ హాస్పిటల్, టి నగర్.

గైనకాలజీ



మహిళల మానసిక ఆరోగ్యం అంతర్గత హార్మోన్ల మీదే ఆధారపడి ఉంటుంది. కాబట్టి జీవితంలోని వేర్వేరు దశల్లో హెచ్చుతగ్గులకు లోనయ్యే హార్మోన్ల ప్రభావాలు, వాళ్ల మానసిక ఆరోగ్యాన్ని ప్రభావితం చేస్తూ ఉంటాయి. ఉన్నట్టుండి విరుచుకుపడడం, చికాకు ప్రదర్శించడం, తీవ్రంగా కుంగిపోవడం... ఇలాంటి భావోద్వేగాలు అయోమయానికీ, గందరగోళానికీ గురి చేస్తుంటే, అందుకు కారణమైన అస్తవ్యస్థ హార్మోన్లను అదుపులోకి తెచ్చుకోవాలంటున్నారు వైద్యులు.

భావోద్వేగాల పగ్గాలు హార్మోన్ల చేతుల్లో...

నెలసరికి 15 రోజుల ముందు నుంచే శరీరంలో మార్పులు చోటు చేసుకుంటాయి. ఆ సమయంలో ఈస్ట్రోజన్ మోతాదు తగ్గుతూ ప్రొజెస్టరాన్ మోతాదు పెరుగుతుంది. ఈస్ట్రోజన్‌కూ సెరటోనిన్ అనే హ్యాపీ హార్మోన్‌కూ సంబంధం ఉంటుంది. ఈ సమయంలో సెరటోనిన్ కూడా తగ్గడంతో శరీరం బరువు పెరగడం, రొమ్ముల్లో సలపరం, చిన్న విషయానికే కోపం తెచ్చుకోవడం, కుంగిపోవడం లాంటి లక్షణాలు మొదలవుతాయి. అయితే ఈ పరిస్థితి కొందర్లో తీవ్రంగా ఉంటుంది. అలాంటివాళ్లు ప్రొటీన్ ఆధారిత ఆహారంతో పాటు ఫైటోఈస్ట్రోజన్స్ కలిగి ఉండే సోయా, మొలకలు తీసుకోవాలి. అలాగే ధ్యానం, యోగా వల్ల కూడా ఉపయోగం ఉంటుంది. అరుదుగా కొందర్లో భావోద్వేగాల తీవ్రత ఉధృతంగా ఉంటుంది. ఆత్మహత్య ఆలోచనలు కూడా వాళ్లను వేధిస్తాయి. ఇలాంటి వాళ్లు హార్మోన్ల ఉధృతిని తగ్గించే మందులు తీసుకోవాల్సి ఉంటుంది. శారీరక అసౌకర్యంతో పాటు, నెలసరి స్రావంలో సమస్యలు, భావోద్వేగాల సమస్యలు ఉంటే, వారికి వైద్యులు, కొన్ని రోజుల పాటు గర్భనిరోధక నోటి మాత్రలను సూచిస్తారు. వీటిలో ఈస్ట్రోజన్, ప్రొజెస్టరాన్ హార్మోన్లు స్వల్పంగా ఉంటాయి. కాబట్టి పరిస్థితి సర్దుకుంటుంది. భావోద్వేగాల తీవ్రత ఎక్కువగా ఉంటే, అందుకు ఉద్దేశించిన యాంటీ డిప్రెసెంట్స్‌ను వాడుకోవాలి. అలాగే హ్యాపీ హార్మోన్ అయిన సెరటోనిన్‌ను పెంచుకుని మానసిక స్థితిని సరిదిద్దుకోవడం కోసం రోజుకు కనీసం అరగంట పాటైనా నడుస్తూ ఉండాలి లేదా వ్యాయామం చేయాలి.

గర్భిణులు, బాలింతల్లో ఇలా...

పునరుత్పత్తి సమయంలో కూడా శరీరంలో ప్రొజెస్టరాన్ హార్మోన్ పెరుగుతుంది. దాంతో భావోద్వేగాలు అదుపు తప్పుతాయి. కుంగుబాటు వేధిస్తుంది. కాబట్టి ఈ సమయంలో గర్భిణులకు కుటుంబ తోడ్పాటు ఎంతో అవసరం. మరీ ముఖ్యంగా ప్రసవమైన వెంటనే ఈస్ట్రోజన్‌తో పాటు ప్రొజెస్టరాన్ హార్మోన్ కూడా అకస్మాత్తుగా తగ్గిపోతుంది. దాంతో భావోద్వేగాల్లో మార్పులొస్తాయి. ఈ పరిస్థితికి తోడు ప్రసవానంతరం శరీరంలో చోటుచేసుకునే మార్పులు, అసౌకర్యం, నిద్రలేమి, సర్జరీ సంబంధిత నొప్పులు, ప్రతి రెండు గంటలకూ బిడ్డకు పాలు పట్టించడం లాంటివన్నీ తోడై మానసిక ఆరోగ్యం మరింత కుదేలవుతూ ఉంటుంది. అరుదుగా కొందర్లో ఆత్మహత్య ఆలోచనలు, ప్రతికూల ఆలోచనలు తలెత్తుతాయి. బిడ్డకు హాని తలపెట్టాలనే ఆలోచనలు కూడా కొందర్ని వేధిస్తాయి. ఈ పరిస్థితే... 'పోస్ట్‌పార్టమ్ డిప్రెషన్'. ఈ పరిస్థితి తలెత్తకుండా ఉండాలంటే తల్లి, అత్త, భర్త... ఇలా కుటుంబంలోని ప్రతి ఒక్కరూ కొత్త తల్లికి ఆసరా అందించాలి. అవసరాన్ని బట్టి వైద్యుల చేత కౌన్సెలింగ్ ఇప్పించాలి. అలాగే బిడ్డకు పాలివ్వడం వల్ల నిద్రాభంగమవుతూ ఉంటే, పాలు నిల్వ చేసుకుని కుటుంబసభ్యుల సహాయంతో బిడ్డకు పట్టించవచ్చు. ప్రసవంతో కెరీర్‌కు ఆటంకం ఏర్పడిందనే భయాలు కూడా బాలింతలను వేధిస్తూ ఉంటాయి. వీటిని తొలగించే బాధ్యత భర్తలు తీసుకోవాలి. అలాగే జంక్‌ఫుడ్, తీపి పదార్థాలకు బదులుగా సమతులాహారం తీసుకోగలిగితే, ఈ పరిస్థితి సర్దుకుంటుంది. అలాగే కంటి నిండా నిద్రపోవాలి. కోలుకున్న వెంటనే వ్యాయామాలు మొదలుపెట్టుకోవాలి. తల్లి బిడ్డకు పాలివ్వకుండా, పట్టించుకోకుండా వదిలేస్తూ ఉంటే, పరిస్థితిని పోస్ట్‌పార్టమ్ డిప్రెషన్ ముందరి స్థితిగా పరిగణించి వైద్యుల దృష్టికి తీసుకువెళ్లాలి. తాత్కాలిక చికిత్సతో ఈ సమస్యను సరిదిద్దుకోవచ్చు.

అత్యవసర గర్భనిరోధక మాత్రలతో...

ఈ మాత్రల్లో ప్రొజెస్టరాన్ అత్యధిక మోతాదులో ఉంటుంది. కాబట్టి సంబంధిత దుష్ప్రభావాలను కూడా భరించవలసి వస్తుంది. పిల్ తీసుకున్న వారం రోజుల వరకూ చికాకు, కోపం, కుంగుబాటు లాంటి భావోద్వేగాలు వేధిస్తాయి. కాబట్టి ఇలాంటి మాత్రలను కేవలం అత్యవసర సమయాల్లోనే వాడుకోవాలి. కానీ తేలికగా కొనుక్కునే వీలుండడంతో వీటిని ఇష్టారాజ్యంగా వాడుకున్న సందర్భాలు పెరుగుతున్నాయి. ఫలితంగా నెలసరి క్రమం తప్పి, తిరిగి గాడిలో పడడానికి ఎంతో కాలం పడుతుంది. గర్భధారణ కూడా క్లిష్టంగా మారుతుంది. కొందరు ఎమర్జెన్సీ పిల్స్‌కు బదులుగా అదే ప్రభావంతో కూడిన ఇంజెక్షన్లు కూడా తీసుకుంటూ ఉంటారు. వీటితో రక్తం గడ్డలు ఏర్పడే ప్రమాదం ఉంటుంది.

మెనోపాజ్‌లో...

టీనేజీ వయసులో నెలసరి సమయంలో ప్రిమెన్‌స్ట్రువల్ సిండ్రోమ్‌తో బాధపడిన అమ్మాయిలు మెనోపాజ్‌లో కూడా తీవ్రమైన భావోద్వేగాలకు లోనవుతారు. అలాగే మెనోపాజ్‌లోకి ప్రవేశించి, ఆ దశకు చేరుకునే క్రమంలో మహిళల్లో ఎన్నో మార్పులు చోటుచేసుకుంటాయి. కోడళ్ల మీద విరుచుకుపడుతూ, అడపాదడపా ఏడుస్తూ, అసహనాన్ని ప్రదర్శించే అధిక శాతం అత్తల్లో మనం చూసిన భావోద్వేగాల వెనకుండే అసలు కారణం ఇదే! కానీ ఈ భావోద్వేగాలన్నీ హార్మోన్ అవకతవకల ప్రభావాలే అనే విషయాన్ని అందరూ గ్రహించలేరు. అయితే ఇలాంటి దశలో ఉన్న మహిళలకు మానసిక ఆలంబన ఎంతో అవసరం. కుటుంబ సభ్యులందరూ ఆమెకు అండగా ఉండి, తోడ్పాటును అందించాలి. అలాగే వ్యాయామంతో ఈ పరిస్థితిని అదుపులోకి తీసుకురావచ్చు. కాబట్టి 40 ఏళ్లకు చేరుకున్న ప్రతి మహిళా దైనందిన జీవితంలో వ్యాయామానికి చోటు కల్పించాలి. కుటుంబసభ్యులతో కాలక్షేప సమయాన్ని పెంచుకోవాలి. వీలైనంత వరకూ మనసును ఆహ్లాదంగా ఉంచే పనులు ఎంచుకోవాలి. ఈ దశలో కండరాలు, ఎముకల నష్టం ఉంటుంది కాబట్టి క్యాల్షియం సప్లిమెంట్లు తీసుకోవడంతో పాటు, బరువులెత్తే వ్యాయామాలు చేయాలి. పరిస్థితి తీవ్రతను బట్టి సురక్షితమైన హార్మోన్ థెరపీ చికిత్సను కూడా ఆశ్రయించవచ్చు.



అర్థం లేని కుంగుబాటు

వ్యక్తిగత, వృత్తిగత జీవితాల్లో ఉన్నత స్థితిలో ఉన్న విజయవంతమైన మహిళలు కూడా కుంగుబాటుకు లోనవుతూ ఉంటారు. ఇందుకు కూడా హార్మోన్లే కారణం. ఇలాంటి పరిస్థితిని ఎదుర్కొనే మహిళలు హార్మోన్లను పరీక్షించుకుని, లక్షణాల ఆధారంగా చికిత్సను ఎంచుకోవాలి.

డాక్టర్ స్వప్న పూస్కూరు
కన్సల్టెంట్ అబ్‌స్టెట్రిక్స్ అండ్ గైనకాలజీ,
బర్త్‌రైట్ బై రెయిన్‌బో హాస్పిటల్స్,
హైదరాబాద్.



మందులు - పదార్థాలు

కొన్ని పదార్థాలు మందుల ప్రభావాన్ని పక్కదోవ పటిస్తాయి. ఇంకొన్ని ఆరోగ్య సమస్యలను తెచ్చి పెడతాయి. కాబట్టి కొన్ని మందులను నిర్దిష్ట పదార్థాలతో కలిపి తీసుకోకూడదు. అవేంటో తెలుసుకుందాం!

దుష్ప్రభావాలు



- మాక్సిఫ్లాక్సాసిన్, సిప్రోఫ్లాక్సాసిన్, లివోఫ్లాక్సాసిన్ మొదలైన ఫ్లోరోక్వినోలోన్స్ కలిగిన కొన్ని యాంటీబయాటిక్స్‌ను పాలు, పెరుగు, జున్నులతో కలిపి తీసుకోకూడదు. ఈ పాల ఉత్పత్తులు యాంటీబయాటిక్స్‌తో కలిసిపోయి, వాటి శోషణను కుంటుపరుస్తాయి
- కొన్ని టెట్రాసైక్లిన్ మందులు కూడా పాల ఉత్పత్తులతో కలిసి ప్రతికూల ప్రభావాన్ని కనబరుస్తాయి. కాబట్టి ఈ మందులు తీసుకోడానికి రెండు గంటల ముందు నుంచి పాల ఉత్పత్తులకు దూరంగా ఉండాలి
- హ్యాంగోవర్‌కు విరుగుడుగా అసిటమినోఫిన్ లేదా పారాసిటమాల్ తీసుకోకూడదు. మద్యం, అసిటమినోఫిన్ లేదా పారాసిటమాల్ మిశ్రమం కాలేయ టాక్సిసిటీని పెంచుతుంది
- వార్ఫారిన్ రక్తాన్ని పలుచబరిచే మందు. విటమిన్ కె సమృద్ధిగా ఉండే పాలకూర, బ్రొకొలిలతో కలిపి వార్ఫారిన్‌ను తీసుకుంటే, ఈ మందు ప్రభావం తగ్గుతుంది. వీటితో పాటు మయొనిస్, ఆలివ్ నూనె, సోయా నూనె, కనోలా నూనెలు కూడా ఈ మందు ప్రభావాన్ని తగ్గిస్తాయి.
- మద్యం, ఇన్సులిన్‌తో పాటు ఇతర మధుమేహ మందుల మీద ప్రభావం కనబరుస్తుంది. ఈ మందులను మద్యంతో కలిపి తీసుకోవడం వల్ల రక్తంలో చక్కెర తగ్గిపోయి హైపోగ్లైసీమియాకు గురి కావచ్చు లేదా పెరిగిపోయి హైపర్‌గ్లైసీమియాకు లోను కావచ్చు.

మీకు తెలుసా?

శుద్ధి చేసిన చిరుతిండ్లతో క్యాన్సర్

అంతర్జాతీయ క్యాన్సర్ పరిశోధన ఏజెన్సీ ఐఎఆర్‌సి, శుద్ధి చేసిన మాంసాన్ని గ్రూప్ 1 క్యాన్సర్ కారకంగా గుర్తించింది. దీని తర్వాతి స్థానం చక్కెరదే! ఏదో ఒక చిరుతిండి తినాలనే కోరికతో మనం అందుకునే ప్యాకేజ్డ్ ఫుడ్స్ క్యాన్సర్ కారకాలుగా మారుతున్నాయి. ఆ పదార్థాలు వాటిలోని విషపూరితాల గురించి తెలుసుకుందాం!

అదనపు చక్కెర స్థూలకాయంతో పాటు, రొమ్ము, కాలేయం, పెద్దపేగు క్యాన్సర్లకు దారి తీస్తుంది. అలాగే ఇన్సులిన్ రెసిస్టెన్స్‌కు దారి తీసి, తీవ్రమైన ఇన్‌ఫ్లమేషన్‌ను పెంచుతుంది. శుద్ధి చేసిన పదార్థాలను ఎక్కువగా తిన్నవాళ్లలో క్యాన్సర్ ముప్పు ప్రత్యేకించి రొమ్ము క్యాన్సర్ ముప్పు మరింత ఎక్కువనే ఒక పరిశోధనాత్మక వ్యాసం బ్రిటిష్ మెడికల్ జోర్నల్‌లో తాజాగ ప్రచురితమైంది. శుద్ధి చేసిన పదార్థాల్లో కొవ్వు, చక్కెర, ఉప్పులు ఎక్కువగా ఉండడంతో పాటు పీచు, కీలకమైన పోషకాలు ఎంతో తక్కువగా ఉంటాయి. శుద్ధి చేసిన పదార్థాల అసహజ నిర్మాణాలు శక్తిని ఖర్చు చేసేకునే సాధారణ తత్వాన్ని కుంటుపరిచి, ఆక్సిడేటివ్ స్ట్రెస్‌కు గురి చేస్తాయనీ, ఫలితంగా క్యాన్సర్ సోకుతుందనీ వైద్యులు అంటున్నారు. ప్రొటీన్ బార్స్, గ్రనోలా బార్స్, తీయని పెరుగు లాంటి వాటిని మనం ఆరోగ్యకరమైన చిరుతిండ్లుగా పరిగణిస్తూ ఉంటాం. కానీ వీటన్నిట్లో చక్కెరలు, నూనెలు, రసాయనాలు దాగి ఉంటాయి. సేంద్రీయమైనవి, సహజసిద్ధమైనవిగా ప్రచారంలో ఉన్న ఉత్పత్తుల్లో సైతం క్యాన్సర్ కారకాలు ఉంటాయి కాబట్టి వాటికి కూడా దూరంగా ఉండడం మేలని వైద్యులు హెచ్చరిస్తున్నారు. అయితే శుద్ధి చేసిన చిరుతిండ్లను ఇష్టపడేవారు పొట్టు తీయని, శుద్ధి చేయని నట్స్, పాప్‌కార్న్ లేదా ఇంట్లో తయారుచేసిన చిరుతిండ్లను ఎంచుకోవచ్చు. అలాగే కొనే ప్రతి చిరుతిండి ప్యాకెట్ లేబుల్‌ను పరిశీలిస్తూ, కృత్రిమ రుచులు, రంగులు, అత్యధిక చక్కెరలు, హైడ్రోజినేటెడ్ కొవ్వులున్న వాటి జోలికి వెళ్లకుండా ఉండాలి.



రూమ్ ఫ్రెషనర్



వానాకాలం తేమ, తడి వల్ల ఇంట్లో ముక్కిపోయిన వాసనలు పేరుకుపోతూ ఉంటాయి. వీటిని వదిలించుకోవడం కోసం రూమ్ ఫ్రెషనర్స్ వాడుకుంటున్నారా? అయితే వాటి దుష్ప్రభావాల పట్ల అవగాహన పెంచుకుని, ప్రత్యామ్నాయ పద్ధతులను అనుసరించడం నేర్చుకుందాం!

ఇంట్లో ఆరోగ్యకరమైన పరిమళాలు

ఆహ్లాదకరమైన వాసనలు వెదజల్లే రూమ్ ఫ్రెషనర్స్‌లో ఆరోగ్యాన్ని దెబ్బతీసే ప్రమాదకరమైన రసాయనాలుంటాయి. ఇవి ఊపిరితిత్తులను నష్టపరచడమే కాకుండా హార్మోన్లను అస్తవ్యస్థం చేసేంత ప్రభావాన్ని కూడా కలిగి ఉంటాయి. వీటిని దీర్ఘకాలం పాటు వాడుకోవడం వల్ల ప్రత్యేకించి పెంపుడు జంతువులు, పిల్లలకు, శ్వాసకోస సమస్యలున్న వారికీ రెట్టింపు చేటు జరుగుతుంది. రూమ్ ఫ్రెషనర్స్‌లో దాగి ఉన్న ప్రమాదాలు ఏవంటే...

అస్థిర సేంద్రీయ సమ్మేళనాలు: గాల్లో కలిసిపోయే పరిమళాలు వెదజల్లే అస్థిర సేంద్రీయ సమ్మేళనాలు రూమ్ ఫ్రెషనర్స్‌లో ఉంటాయి. ఇవి గదులను పరిమళభరితం చేసినప్పటికీ, వీటిలోని అసిటోన్, ఇథనాల్, లైమోనిన్ రసాయనాలు కళ్లు, గొంతు, ఊపిరితిత్తులను ఇబ్బంది పెడతాయి. దీర్ఘకాలం పాటు వీటికి బహిర్గతం అవడం వల్ల కాలేయం, మూత్రపిండాలు దెబ్బతినే ప్రమాదం ఉంటుంది. ఈ అస్థిర సేంద్రీయ సమ్మేళనాలు గాలితో ప్రతిచర్య జరిపి ఫార్మాల్డిహైడ్ అనే క్యాన్సర్ కారకంగా మారతాయి.

హార్మోన్లు అస్తవ్యస్థం: సువాసన ఎక్కువ సమయం పాటు నిలిచి ఉండడం కోసం రూమ్ ఫ్రెషనర్స్‌లో థాలేట్స్ కలుపుతారు. ఈ రసాయనాలు అంతఃస్రావ వ్యవస్థను చిన్నాభిన్నం చేస్తాయి. వీటికి క్రమం తప్పక బహిర్గతం కావడం వల్ల, పునరుత్పత్తి వ్యవస్థ దెబ్బతింటుంది. మరీ ముఖ్యంగా గర్భిణులు, పసికందులకు వీటితో ప్రమాదం ఎక్కువ. 'సహజసిద్ధ' లేదా 'అన్‌సెంటెడ్' అని పేర్కొనే ఉత్పత్తుల్లో సైతం థాలేట్స్ ఉంటాయి.

ఉబ్బసం: ఉబ్బసం లేదా శ్వాసకు సంబంధించిన సమస్యలున్నవారు రూమ్ ఫ్రెషనర్స్‌కు బహిర్గతమైనప్పుడు, వారి లక్షణాలు మరింత తీవ్రమవుతాయి. వాటిలోని పరిమళాలు, రసాయనాల వల్ల దగ్గు, పిల్లికూతలు, శ్వాసలో ఇబ్బందులు తలెత్తవచ్చు. వీటికి అల్పస్థాయిలో బహిర్గతమైనప్పటికీ, పిల్లలు, పెద్దల్లో ఉబ్బసం ముప్పు పెరిగే అవకాశం ఉంటుందని పరిశోధనల్లో తేలింది.

ఇంటి కాలుష్యం: బయటి కాలుష్యంలాగే ఇంటి కాలుష్యం కూడా ప్రమాదకరమైనదే! బెంజీన్, టోలిన్, ఫార్మాల్డిహైడ్‌లను ఇళ్లలో విడుదల చేయడం ద్వారా రూమ్ ఫ్రెషనర్స్ ఇంటిని కలుషితం చేస్తాయి. ఇంట్లోకి ధారాళంగా గాలి చొరబడే వీలు లేనప్పుడు, ఈ రసాయనాలు గాల్లో అదృశ్యమైపోకుండా, అక్కడే నిలిచి ఉండి, వాతావరణాన్ని కలుషితం చేస్తాయి.

పెంపుడు జంతువులు: గాల్లో కలిసే రసాయనాలు పెంపుడు జంతువులకు రెట్టింపు ప్రమాదకరమైనవి. కుక్కలు, పిల్లులు ప్రత్యేకించి పక్షులు ఈ రసాయన సమ్మేళనాల ప్రభావానికి ఎక్కువగా గురవుతాయి. తుమ్ములు, దగ్గులు, చర్మపు దురదలు లేదా ప్రవర్తనల్లో మార్పులు పెంపుడు జంతువుల్లో కనిపిస్తాయి.

ప్రత్యామ్నాయాలు: రూమ్ ఫ్రెషనర్స్ చెడు వాసనలను కప్పేస్తాయి తప్ప, వాటిని తొలగించవు. బూజు, పొగ, పెంపుడు జంతువుల విసర్జకాల వాసనలు ఇంట్లోని గాలి నాణ్యతను దెబ్బతీస్తాయి. ఇవన్నీ దీర్ఘకాలంలో ఆరోగ్యాన్ని పాడు చేస్తాయి. కాబట్టి దుర్వాసనలకు మూల కారణాలను కనిపెట్టే ప్రయత్నం చేయాలి. గాలి, వెలుతురు ధారాళంగా చొరబడేలా కిటికీలు, తలుపులను తెరచి ఉంచాలి. వెడల్పాటి పాత్రలో నీళ్లు నింపి, గులాబీలు లాంటి సువాసన వెదజల్లే పూలతో నింపుకుంటే, గదిలో పరిమళాలు పరుచుకుంటాయి. లెమన్, లావెండర్, యూకలిప్టస్ ఎసెన్షియల్ ఆయిల్స్, బేకింగ్ సోడా, నీళ్లు కలిపి, రూమ్ ఫ్రెషనర్‌లా స్ప్రే చేసుకోవచ్చు.

రద్దయిన పాలసీల పునరుద్ధరణ

అక్టోబరు 17 వరకు అవకాశం: ఎల్ఐసీ

న్యూఢిల్లీ: ఏవైనా కారణాలతో ప్రీమియం చెల్లించలేక మధ్యలోనే రద్దయిన పాలసీల పునరుద్ధరణకు భారతీయ జీవిత బీమా కార్పొరేషన్ (ఎల్ఐసీ) గడువు ఇచ్చింది. ఇందుకోసం ఈ నెల 18 నుంచి అక్టోబరు 17 వరకు ప్రత్యేక ప్రచార కార్యక్రమం చేపడుతోంది. పాలసీ షరతులకు లోబడి ఇంకా పాలసీ గడువు ఉండి, ప్రీమియం చెల్లింపులు ఆపేసిన ఐదేళ్ల లోపు పాలసీలకు మాత్రమే ఈ పునరుద్ధరణ వర్తిస్తుంది. ఇందుకోసం చెల్లించాల్సిన లేటు ఫీజుల్లోనూ రూ.5,000 పరిమితికి లోబడి 30 శాతం వరకు రాయితీ ఇస్తారు. ఇంకా పాలసీ గడువు ఉండి, మధ్యలో ప్రీమియం చెల్లించడం ఆపేసిన అన్ని నాన్-లింక్డ్ బీమా పాలసీలను ఈ గడువులోగా పునరుద్ధరించుకోవచ్చని ఎల్ఐసీ తెలిపింది.

హైదరాబాద్ జినోమ్ వ్యాలీలో జింజర్ హోటల్

న్యూఢిల్లీ: టాటా గ్రూప్ హోటల్స్ సంస్థ ఇండియన్ హోటల్స్ కంపెనీ (ఐహెచ్‌సీఎల్) తన జింజర్ హోటల్స్‌ను హైదరాబాద్ జినోమ్ వ్యాలీకి విస్తరిస్తోంది. ఇందులో భాగంగా జినోమ్ వ్యాలీలో 'జింజర్ జినోమ్ వ్యాలీ' పేరుతో ఒక స్టార్ హోటల్ నిర్మిస్తోంది. మాడిసన్ గ్రూప్‌తో కలిసి ఐహెచ్‌సీఎల్ ఈ 75 గదుల హోటల్ నిర్మించనుంది. జినోమ్ వ్యాలీ ప్రాంత వ్యాపార, సామాజిక కార్యక్రమాలకు ఈ హోటల్ ఉపయోగపడుతుందని భావిస్తున్నారు.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,01,130	92,700	1,27,000
విజయవాడ	1,02,800	97,000	1,17,500
విశాఖపట్నం	1,02,690	92,750	1,27,000
రాజమండ్రి	1,01,180	92,750	1,17,600
ప్రొద్దుటూరు	1,00,700	92,640	1,17,300
ముంబై	99,623	91,255	1,14,050

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

19 తేదీ			
హైదరాబాద్	495	విజయవాడ	520
వరంగల్	497	గోదావరి	520
చిత్తూరు	558	విశాఖపట్నం	520
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	102	విజయవాడ	119
వరంగల్	102	గుంటూరు	121
కరీంనగర్	102	ఒంగోలు	121
మహబూబ్‌నగర్	102	చిత్తూరు	98
కర్నూలు	102	నెల్లూరు	103
విశాఖపట్నం	113	అనంతపురం	103
గోదావరి	119		

'భారత్‌లో తయారీ'పై జర జాగ్రత్త



పోటీతత్వమే మనకు శ్రీరామ రక్ష ● ట్రంప్ సుంకాలతో మనకు ముప్పే ● ఆర్‌బీఐ మాజీ గవర్నర్ సుబ్బారావు

న్యూఢిల్లీ: మేకిన్ ఇండియా (భారత్‌లో తయారీ) కార్యక్రమంపై ప్రభుత్వం ఆచితూచి వ్యవహరించాలని భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) మాజీ గవర్నర్ దువ్వూరి సుబ్బారావు హెచ్చరించారు. ఈ పథకం 'మనకు అవసరమైన ఉత్పత్తులన్నీ దేశంలోనే తయారీ పథకం'గా మారకుండా చూడాలన్నారు. అలా చేస్తే చైనా+1 వ్యూహంలో భాగంగా మన దేశంలో పెట్టుబడులు పెట్టాలనుకునే కంపెనీల పెట్టుబడులకు గండి పడే ప్రమాదం ఉందని హెచ్చరించారు. మేకిన్ ఇండియా పథకం విజయం మన దేశ కంపెనీల పోటీతత్వాన్ని పెంచడంపై ఆధార పడి ఉందే తప్ప, వాటికి పోటీ నుంచి రక్షణ కల్పించడంలో కాదని గుర్తించాలన్నారు. అలా చేస్తే మన కంపెనీల ఉత్పాదక శక్తి కూడా దెబ్బతినే ప్రమాదం ఉందన్నారు. ప్రధాని మోదీ చెబుతున్న 'ఆత్మనిర్భరత'కు అసలు అర్థం రక్షణ, ఇంధనం వంటి కొన్ని కీలక రంగాల్లో వ్యూహాత్మక స్వయం సమృద్ధే తప్ప, అన్ని రంగాల్లో పూర్తి స్వయం సమృద్ధి కాదని అర్థం చేసుకోవాలని సుబ్బారావు కోరారు.

సుంకాల పోటు తప్పదు: అమెరికా మన దేశంపై విధిస్తున్న సుంకాలపైనా ఆర్‌బీఐ మాజీ గవర్నర్ తన అభిప్రాయం వ్యక్తం చేశారు. అవునన్నా కాదన్నా అమెరికా మనకు అతిపెద్ద ఎగుమతి మార్కెట్ అనే విషయాన్ని మర్చిపోవద్దన్నారు. ఈ సుంకాల పోటుతో 'మేకిన్ ఇండియా' ద్వారా మన దేశాన్ని ప్రపంచ తయారీ కేంద్రంగా తీర్చిదిద్దాలన్న ప్రధాని మోదీ లక్ష్యానికీ గండి పడే ప్రమాదం ఉందన్నారు. దీంతో చైనా+1 వ్యూహంలో భాగంగా మన దేశంలో తమ యూనిట్లు ఏర్పాటు చేయాలనుకునే విదేశీ కంపెనీలు వెనక్కి తగ్గే ప్రమాదం ఉందన్నారు. ఈ నెల 27 నుంచి ట్రంప్ విధించిన 25 శాతం అదనపు సుంకంతో కలిపి 50 శాతం సుంకాలు అమల్లోకి వస్తే, ఆసియాలో మన దేశంపైనే అత్యధిక సుంకాలు ఉన్నట్టవుతుందన్నారు. అలాంటి స్థితిలో ఏ కంపెనీ కూడా మన దేశంలో తమ యూనిట్ పెట్టి అమెరికాకు ఎగుమతి చేయలేదని సుబ్బారావు స్పష్టం చేశారు.

సగం ఎగుమతులపై ప్రభావం

ట్రంప్ సుంకాల ప్రభావం అమెరికాకు మన దేశం ఎగుమతి చేసే కనీసం సగం ఎగుమతులపై ఉంటుందని సుబ్బారావు స్పష్టం చేశారు. ఈ సుంకాలతో ముఖ్యంగా ఉద్యోగావకాశాలు ఎక్కువగా ఉన్న వస్త్ర, రత్నాభరణాలు, తోలు ఉత్పత్తుల కంపెనీలు ఎక్కువగా దెబ్బతింటాయన్నారు. ఫార్మా, ఎలక్ట్రానిక్ పరికరాల దిగుమతులను ప్రస్తుతానికి సుంకాల నుంచి మినహాయించడం తాత్కాలిక ఉపశమనంగానే చూడాలని సుబ్బారావు కోరారు. భవిష్యత్‌లో వీటిపైనా సుంకాల పోటు తప్పక పోవచ్చన్నారు. ఈ సుంకాల నేపథ్యంలో మరో ఐదేళ్లలో భారత-అమెరికా ద్వైపాక్షిక వాణిజ్యాన్ని మూడింతలు పెంచి 50,000 కోట్ల డాలర్లకు పెంచాలనే లక్ష్యమూ సాధ్యం కాదని స్పష్టం చేశారు.

చైనా డంపింగ్

అమెరికా సుంకాల పోటుతో చైనా తన వస్తువులను ఇతర దేశాల మార్కెట్లలో కుమ్మరించే ప్రమాదమూ ఉందని సుబ్బారావు హెచ్చరించారు. ఈ మార్కెట్లు కూడా భారత ఎగుమతులకు అమెరికా తర్వాత ప్రధాన మార్కెట్లన్నారు. అదే జరిగితే ఇతర దేశాలకూ మన ఎగుమతులు దెబ్బతినే ప్రమాదం ఉందన్నారు. అమెరికా నుంచి వ్యవసాయ, పాడి ఉత్పత్తుల దిగుమతుల కోసం ట్రంప్ చేస్తున్న ఒత్తిళ్లపై జాగ్రత్తగా ఉండక తప్పదన్నారు. మరీ తప్పదనుకుంటే తలుపులు బార్లా తెరవకుండా ఆచితూచి వ్యవహరించాలని కోరారు. అమెరికా ఒత్తిళ్లకు లొంగి ఉన్న పళంగా రష్యా చమురు దిగుమతులను ఆపేయడం కూడా భారత్‌కు అంత శ్రేయస్కరం కాదని సుబ్బారావు స్పష్టం చేశారు. అలా చేస్తే చమురు ధరలు పెరిగి మన ఆర్థిక పునాదులు దెబ్బతినే ప్రమాదం ఉందని హెచ్చరించారు. అప్పుడు దేశంలో ద్రవ్యోల్బణం కూడా భగ్గుమనే ప్రమాదం ఉందని సుబ్బారావు అన్నారు.

10 ఏళ్లలో రూ.1,000 కోట్ల అద్దె

బెంగళూరులో 2.7 లక్షల చదరపు అడుగుల కార్యాలయ స్థలాన్ని లీజుకు తీసుకున్న యాపిల్

న్యూఢిల్లీ: భారత్‌లో ఐఫోన్ల తయారీని భారీగా పెంచడంపై దృష్టి సారించిన యాపిల్.. మన దేశంలో కార్యకలాపాలను అదే స్థాయిలో విస్తరిస్తోంది. ఇందుకోసం బెంగళూరులో ఎంబసీ గ్రూప్‌నకు చెందిన కమర్షియల్ ప్రాజెక్టు ఎంబసీ జెనిత్‌లో దాదాపు 2.7 లక్షల చదరపు అడుగుల భారీ కార్యాలయ స్థలాన్ని యాపిల్ 10 ఏళ్ల కాలానికి లీజుకు తీసుకుంది. 9 అంతస్తుల్లో (5 నుంచి 13వ అంతస్తు వరకు) విస్తరించి ఉన్న ఈ ఆఫీస్ స్పేస్ కోసం చదరపు అడుగుకు రూ.235 చొప్పున సంస్థ నెలకు మొత్తం రూ.6.3 కోట్ల అద్దె చెల్లించనుంది. ఈ అద్దె ఏటా 4.5 శాతం చొప్పున పెరగనుందని.. అద్దెతో పాటు పార్కింగ్, మెయింటెనెన్స్ చార్జీలతో కలిపి పదేళ్లకు మొత్తం రూ.1,000 కోట్లకు పైగా ముట్టజెప్పనుందని డేటా అనలిటిక్స్ కంపెనీ ప్రాప్‌స్టాక్ సోమవారం వెల్లడించింది. 2025 ఏప్రిల్ 3 నుంచి అమలులోకి వచ్చిన ఈ లీజు ఒప్పందంలో భాగంగా యాపిల్ రూ.31.57 కోట్లు డిపాజిట్ కూడా చేసిందని ప్రాప్‌స్టాక్ పేర్కొంది. అయితే, ఈ విషయంపై స్పందించేందుకు యాపిల్ నిరాకరించింది.

ఐపీఓ మార్కెట్లో మరిన్ని సంస్కరణలు: సెబీ

న్యూఢిల్లీ: పబ్లిక్ ఇష్యూ (ఐపీఓ) మార్కెట్లో మరిన్ని సంస్కరణలకు సెబీ సిద్ధమవుతోంది. ఇందుకోసం సోమవారం ఒక చర్చా పత్రం విడుదల చేసింది. సంబంధిత వర్గాలు ఈ చర్చా పత్రంపై తమ అభిప్రాయాలు, సూచనలు సెప్టెంబరు 8 లోగా తెలియజేయాలని కోరింది. ఐపీఓల్లో రిటైల్ మదుపరుల వాటాను 35 శాతం వద్ద కొనసాగిస్తూనే పెద్ద కంపెనీలు పబ్లిక్ ఇష్యూల ద్వారా జారీ చేయాల్సిన కనీస పబ్లిక్ ఆఫర్ (ఎంపీఓ)ను తగ్గించాలని సెబీ ప్రతిపాదించింది. దీంతో భారీ స్థాయిలో మార్కెట్ క్యాప్ ఉండే కంపెనీలు ఐపీఓల ద్వారా ఒకేసారి తమ షేర్లను మార్కెట్లో కుమ్మరించాల్సిన అవసరం ఉండదు. మార్కెట్ పరిస్థితులను బట్టి ఐదు నుంచి పదేళ్లలో దశల వారీగా తమ ఈక్విటీలో 25 శాతం వాటాను రిటైల్ మదుపరులు, సంస్థాగత మదుపరులకు జారీ చేస్తే సరిపోతుంది.

మరింత గడువు: వచ్చే నెల 1 నుంచి అమలు చేయతలపెట్టిన మార్జిన్ ఆబ్లిగేషన్ల గడువును కూడా సెబీ అక్టోబరు 10 వరకు పొడిగించింది. ఈ నిబంధన చేసేందుకు సమయం పడుతుందని డిపాజిటరీ సంస్థలు కోరడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్టు సెబీ తెలిపింది. ఈ చర్యతో బ్రోకర్లు.. ఖాతాదారులకు తెలియకుండా వారి సెక్యూరిటీలను కుదువ పెట్టే దుర్వినియోగానికి అడ్డుకట్ట వేయవచ్చని భావిస్తున్నారు.

విస్తరణ బాటలో మోంట్రా ఎలక్ట్రిక్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): మురుగప్పా గ్రూప్‌నకు చెందిన క్లీన్ మొబిలిటీ సంస్థ మోంట్రా ఎలక్ట్రిక్.. హైదరాబాద్‌కు తన కార్యకలాపాలు విస్తరించింది. ఇందులో భాగంగా సోమవారం నాడిక్కడ ఎలక్ట్రిక్ స్మాల్ కమర్షియల్ వెహికల్ (ఈ-ఎస్‌సీవీ) కోసం ప్రత్యేక డీలర్‌షిప్‌ను ప్రారంభించింది. శ్రీరామ్ హర్ష భాగస్వామ్యంలో ఏర్పాటు చేసిన ఈ డీలర్‌షిప్ కేంద్రాన్ని టీఐ క్లీన్ మొబిలిటీ (మోంట్రా ఎలక్ట్రిక్) చైర్మన్ అరుణ్ మురుగప్పన్, ఎండీ జలజ్ గుప్తా, హర్ష గ్రూప్ చైర్మన్ హర్షవర్ధన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా జలజ్ గుప్తా మాట్లాడుతూ.. వాణిజ్య ఎలక్ట్రిక్ వాహన (ఈవీ) మార్కెట్లలో హైదరాబాద్ కీలకంగా ఉండటమే కాకుండా లాజిస్టిక్ హబ్‌గా ఎదుగుతోందన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని హైదరాబాద్‌లో తొలి షోరూమ్‌ను ప్రారంభించామని, ఈ షోరూమ్‌లో మోంట్రా ఎలక్ట్రిక్ ఏవియేటర్ శ్రేణి వాహనాలు అందుబాటులో ఉంటాయన్నారు. కాగా విస్తరణలో భాగంగా రానున్న రోజుల్లో హర్ష గ్రూప్‌తో కలిసి ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ, విశాఖపట్నంలలో డీలర్‌షిప్‌లను ఏర్పాటు చేయనున్నట్లు గుప్తా చెప్పారు.

మార్కెట్‌కు జీఎస్‌టీ జోష్

- ఇంట్రాడేలో సెన్సెక్స్ 1,168 పాయింట్లు అప్
- చివరికి 676 పాయింట్ల లాభంతో 81,273 వద్ద ముగింపు
- మళ్లీ 25,000 స్థాయిని తాకిన నిఫ్టీ
- వాహన, వినియోగ రంగ షేర్లలో ర్యాలీ

రూ.6.17 లక్షల కోట్ల సంపద వృద్ధి

ముంబై: జీఎస్‌టీ రేట్లు తగ్గించనున్నట్లు స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ప్రధాని మోదీ ప్రకటించడంతో పాటు ఎస్ అండ్ పీ 18 ఏళ్ల తర్వాత భారత పరపతి రేటింగ్‌ను పెంచడం స్టాక్ మార్కెట్ వర్గాల్లో భారీ ఉత్సాహాన్ని నింపింది. జీఎస్‌టీ రేట్ల తగ్గుదలతో భారీగా లబ్ధి పొందనున్న వాహనం, వినియోగ రంగాల షేర్లలో ఇన్వెస్టర్లు కొనుగోళ్లు పోటెత్తించడంతో ప్రామాణిక ఈక్విటీ సూచీలు సోమవారం ఉవ్వెత్తున ఎగిశాయి. సెన్సెక్స్ ఒక దశలో 1,168.11 పాయింట్లు పెరిగి 81,765.77 వద్ద ఇంట్రాడే గరిష్ఠాన్ని నమోదు చేసింది. మధ్యాహ్నం నుంచి కాస్త తగ్గిన సూచీ చివరకు 676.09 పాయింట్ల లాభంతో 81,273.75 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం ఇంట్రాడేలో 390 పాయింట్లు పెరిగి 25,000 స్థాయిని అధిగమించినప్పటికీ, చివరికి 245.65 పాయింట్ల వృద్ధితో 24,876.95 వద్ద స్థిరపడింది. ఈక్విటీ వర్గాల సంపదగా భావించే బీఎస్ఈ నమోదిత కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ ఒక్కరోజే రూ.6.71 లక్షల కోట్లు పెరిగి రూ.450.96 లక్షల కోట్లకు చేరుకుంది.

- సెన్సెక్స్‌లోని 30 నమోదిత కంపెనీల్లో 20 రాణించాయి. మారుతి సుజుకీ షేరు ఏకంగా 8.94 శాతం ఎగబాకి సూచీ టాప్ గెయినర్‌గా నిలిచింది. బజాజ్ ఫైనాన్స్ 5.02 శాతం వృద్ధి చెందగా.. అల్ట్రాటెక్ సిమెంట్, బజాజ్ ఫిన్‌సర్వ్, ఎం అండ్ ఎం, హిందుస్థాన్ యూనిలీవర్ షేర్లు 3 శాతానికి పైగా పుంజుకున్నాయి. కాగా, ఐటీసీ 1.26 శాతం క్షీణించి సూచీ టాప్ లూజర్‌గా మిగిలింది. ఐటీ రంగ షేర్లూ నష్టాల్లో పయనించాయి.
- బీఎస్ఈలోని చిన్న, మధ్య స్థాయి కంపెనీల ప్రాతినిధ్య సూచీలైన స్మాల్‌క్యాప్ 1.39 శాతం, మిడ్‌క్యాప్ ఒక శాతం వృద్ధి చెందాయి. రంగాల వారీ సూచీల్లో ఆటో ఏకంగా 4.26 శాతం ఎగబాకింది. కన్స్యూమర్ డ్యూరబుల్స్ 3.08 శాతం, కన్స్యూమర్ డిస్‌క్రెషనరీ 2.74 శాతం, రియల్టీ 2.19 శాతం లాభపడ్డాయి. కమోడిటీస్, మెటల్, సర్వీసెస్ ఇండెక్స్‌లు 1.96 శాతం వరకు పెరిగాయి. ఐటీ, పవర్, టెక్, ఫోకస్డ్ ఐటీ సూచీలు మాత్రం నష్టాల్లో ముగిశాయి.
- బీఎస్ఈలో మొత్తం 4,365 కంపెనీల షేర్లు ట్రేడవగా.. 2,499 లాభపడ్డాయి. 1,696 నష్టపోగా.. 170 యథాతథంగా ముగిశాయి. 156 కంపెనీల స్టాక్స్ సరికొత్త ఏడాది గరిష్ఠాన్ని తాకాయి.

హెర్బల్ బెవరేజెస్‌లోకి రిలయన్స్

న్యూఢిల్లీ: రిలయన్స్ ఇండస్ట్రీస్ (ఆర్ఐఎల్) తన శీతల పానియాల వ్యాపారాన్ని విస్తరిస్తోంది. ఇందులో భాగంగా ఆయుర్వేద మూలికలతో తయారు చేసే పానీయాల రంగంలోకి ప్రవేశిస్తోంది. ఇందుకోసం రిలయన్స్ అనుబంధ సంస్థ రిలయన్స్ కన్స్యూమర్ ప్రొడక్ట్స్, నేచర్‌ఎడ్జ్ బెవరేజెస్ ప్రైవేట్ లిమిటెడ్ అనే కంపెనీతో కలిసి ఒక జాయింట్ వెంచర్ (జేవీ)ను ఏర్పాటు చేస్తోంది. ఈ జేవీలో రిలయన్స్‌కే మెజారిటీ వాటా ఉంటుంది. 2018లో సిద్దేవ్ శర్మ ఏర్పాటు చేసిన నేచర్‌ఎడ్జ్ ఇప్పటికే ఏ మాత్రం చక్కెర, క్యాలరీలు లేకుండా అశ్వగంధ, బ్రహ్మి, కుస్, కోకుమ్, గ్రీన్ టీలతో తయారు చేసిన పానీయాలను మార్కెట్ చేస్తోంది.

గిల్‌కు చోటు దక్కేనా?

ఆసియాకప్ జట్టు ఎంపిక నేడు



న్యూఢిల్లీ: వచ్చేనెలలో జరిగే ఆసియాకప్ టీ20 టోర్నీ కోసం మంగళవారం భారత జట్టును ప్రకటించనున్నారు. ఈ నేపథ్యంలో టెస్టు కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌కు బెర్త్ దక్కుతుందా? లేదా? అనే ఆసక్తి సర్వత్రా వ్యక్తమవుతోంది. ఇంగ్లండ్‌తో ఐదు టెస్టుల సిరీస్‌లో పరుగుల వరద పారించిన గిల్ అద్భుత ఫామ్‌లో ఉన్నాడు. అలాగే ఐపీఎల్‌లోనూ రాణించాడు. అయితే గిల్‌ను ఎవరి స్థానంలో భర్తీ చేయాలనేదే సెలెక్టర్లకు ఇప్పుడు సమస్యగా మారింది. కొంతకాలంగా టాప్-3లో అభిషేక్, శాంసన్, తిలక్ మెరుగ్గానే రాణిస్తున్నారు. ఇప్పుడు వారికి పోటీగా జైస్వాల్, గిల్, సుదర్శన్ సిద్ధంగా ఉన్నారు. కానీ వీరు లేకుండానే సూర్యకుమార్ నేతృత్వంలోని టీ20 జట్టు చివరి 20 మ్యాచ్‌ల్లో 17 విజయాలతో అదరగొట్టింది. ఒకవేళ 15 మందితో కూడిన భారత జట్టులో గిల్‌కు చోటిస్తే అతడిని కచ్చితంగా బరిలోకి దింపాల్సి ఉంటుంది. అదే జరిగితే శాంసన్, అభిషేక్, తిలక్‌లలో ఒకరు తమ స్లాట్‌ను త్యాగం చేయాల్సిందే. అటు గిల్ కోసం రింకూ సింగ్‌పై వేటు పడే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. మిడిలార్డర్‌లో శ్రేయాస్ అయ్యర్ చోటుపైనా సస్పెన్స్ కొనసాగుతోంది. బౌలింగ్ విభాగంలో పేసర్ బుమ్రా అందుబాటులో ఉంటాడని సమాచారం. అతడికి జతగా అర్ష్‌దీప్, హార్దిక్ ఉంటారు. హర్షిత్ రిజర్వ్ పేసర్. ప్రసిద్ధ్, సిరాజ్‌లను సెలెక్టర్లు టెస్టు పేసర్లుగానే పరిగణిస్తున్నారు కాబట్టి అక్టోబరులో వెస్టిండీస్‌తో టెస్టు సిరీస్‌కు వీరిద్దరు తాజాగా బరిలోకి దిగవచ్చు. స్పిన్నర్లుగా అక్షర్, కుల్దీప్, వరుణ్ చక్రవర్తి మొదటి ప్రాధాన్యంలో ఉన్నారు. అయితే ఆల్‌రౌండర్ కావాలనుకుంటే వాషింగ్టన్ సుందర్‌ను తీసుకున్నా ఆశ్చర్యం లేదు. రెండో సీమ్ ఆల్‌రౌండర్‌గా శివమ్ దూబేతో పాటు రిజర్వ్ కీపర్‌గా జితేశ్, జురెల్‌ల మధ్య పోటీ నెలకొంది.

మహిళల వన్డే వరల్డ్ కప్

టీమిండియా ఎంపిక నేడు

మహిళల వన్డే వరల్డ్ కప్‌నకు భారత జట్టును మంగళవారం ఎంపిక చేయనున్నారు. నీతూ డేవిడ్ ఆధ్వర్యంలోని సెలెక్షన్ కమిటీ డ్యాషింగ్ బ్యాటర్ షఫాలీ వర్మ, పేసర్ రేణుకా సింగ్ విషయంలో ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందోననే ఆసక్తి వ్యక్తమవుతోంది. మెగా టోర్నీ వచ్చేనెల 30 నుంచి భారత్‌లో జరగనుంది.

ఆటే ముఖ్యమని.. ప్రధానిని కూడా కలవలేదు

గవాస్కర్‌పై కర్సన్ ఘావ్రీ ప్రశంస



న్యూఢిల్లీ: మ్యాచ్‌కు ముందు ఓ దేశ ప్రధాని ఆటగాళ్లను కలుసుకునేందుకు వస్తే.. ఎవరైనా ఉద్వేగంతో ఎదురుచూస్తారు. కానీ భారత బ్యాటింగ్ దిగ్గజం సునీల్ గవాస్కర్ మాత్రం తనకు ఆటే ముఖ్యమంటూ మైదానంలోకి వెళ్లాడట. ఈ విషయాన్ని సన్నీ సహచరుడు, మాజీ పేసర్ కర్సన్ ఘావ్రీ వెల్లడించాడు. "ఢిల్లీలో ఆస్ట్రేలియాతో టెస్టు మ్యాచ్‌కు ముందు అప్పటి ప్రధాని మొరార్జీ దేశాయ్ ఆటగాళ్లను కలుస్తారని సమాచారం వచ్చింది. కానీ ఆయన రావడం ఆలస్యం కాగా అప్పటికే టాస్ పూర్తయి భారత్ బ్యాటింగ్ చేసేందుకు సిద్ధమైంది. గవాస్కర్ ప్యాడ్లు కట్టుకుని సిద్ధంగా ఉన్నాడు. అప్పుడే డ్రెస్సింగ్ రూమ్‌లోకి వచ్చిన రాజ్‌సింగ్ దుంగార్పూర్ 'ప్రధాని వచ్చారు. మీరందరూ రండి. మూడు నిమిషాల్లో వచ్చేద్దాం' అని చెప్పాడు. అయితే సన్నీ మాత్రం 'మీరెళ్లండి.. నాకు నా బ్యాటింగ్, టీమ్ ముఖ్యం' అని అన్నాడు. బరిలోకి దిగి టీ బ్రేక్ వరకు ఆడాడు. అయితే ఆ రోజు ఆట చివర్లో ప్రధాని స్వయంగా గవాస్కర్‌ను కలుసుకునేందుకు మరోసారి రావడం విశేషం' అని ఘావ్రీ వివరించాడు.

ఇక.. ఆర్చరీ లీగ్

- అక్టోబరులో నిర్వహణ
- సురేఖ, దీరజ్ సహా ఐదుగురు తెలుగు ఆర్చర్లకు చోటు

న్యూఢిల్లీ: ప్రధాన క్రీడల్లో మాదిరే ఆర్చరీలోనూ 'ఫ్రాంచైజీ' అడుగుపెట్టింది. మొట్టమొదటి ఆర్చరీ ప్రీమియర్ లీగ్ (ఏపీఎల్) అక్టోబరులో జరగనుంది. ఆరు జట్లు ఇందులో తలపడుతున్నట్టు జాతీయ ఆర్చరీ సంఘం (ఏఏఐ) సోమవారం వెల్లడించింది. జ్యోతి సురేఖ, దీపికా కుమారి, ధీరజ్ బొమ్మదేవర, అభిషేక్ వర్మలాంటి స్టార్లు ఏపీఎల్ బరిలో దిగనున్నారు. సురేఖ, ధీరజ్ సహా మరో ముగ్గురు తెలుగు ఆర్చర్లు చికితా రావు, జిగ్నేష్, హంస కూడా లీగ్‌లో పోటీపడతారు. ఫ్రాంచైజీల పేర్లను ఖరారు చేయాల్సి ఉంది. తొలి సీజన్‌కు వేలంలో కాకుండా డ్రాఫ్ట్ విధానంలో ఆర్చర్లను జట్లు ఎంపిక చేసుకోనున్నాయి. ఒక్కో జట్టులో 8 మంది ఆర్చర్లుంటారు. ఇందులో నలుగురు పురుషులు, నలుగురు మహిళా ఆర్చర్లుంటారు. ప్రతి జట్టు ఇద్దరు విదేశీ ఆర్చర్లను చేర్చుకోవచ్చు.

మిక్స్‌డ్ మజా

- బరిలో అల్కారజ్-రదుకాను, జొకోవిచ్-డానిలోవిచ్ జోడీలు
- మొత్తం 16 జంటల మధ్య పోటీ
- నేడు, రేపు యూఎస్ ఓపెన్ మిక్స్‌డ్ చాంపియన్‌షిప్

రాత్రి 8.30 నుంచి స్టార్ నెట్‌వర్క్‌లో



అల్కారజ్



డానిలోవిచ్ జొకోవిచ్



ప్రాక్టీస్‌లో ఎమ్మా రదుకాను

న్యూయార్క్: టెన్నిస్ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా వినూత్నంగా గ్రాండ్‌స్లామ్ మిక్స్‌డ్ డబుల్స్ పోటీలకు ఆతిథ్యమిచ్చేందుకు యూఎస్ ఓపెన్ సిద్ధమైంది. ఈ సీజన్ చివరి గ్రాండ్‌స్లామ్ యూఎస్ ఓపెన్ సింగిల్స్, డబుల్స్ పోటీలు ఈనెల 24న ఆరంభం కానుండగా.. ఐదురోజుల ముందే 19, 20వ తేదీల్లో మిక్స్‌డ్ డబుల్స్ పోటీలు నిర్వహిస్తున్నారు. కేవలం రెండ్రోజుల్లో మెరుపులా ముగిసే ఈ మిక్స్‌డ్ చాంపియన్‌షిప్‌లో స్టార్ క్రీడాకారులు పోటీపడుతుండడం టోర్నీకి మరింత ఆకర్షణ కానుంది. ముఖ్యంగా యువ కెరటం కార్లోస్ అల్కారజ్, బ్రిటన్ బ్యూటీ ఎమ్మా రదుకాను జోడీగా బరిలోకి దిగుతుండడంతో అభిమానుల దృష్టంతా వీళ్లపైనే నెలకొంది. తొలి రౌండ్‌లో టాప్ సీడ్ జాక్ డ్రేపర్-జెస్సికా పెగుల జంటతో అల్కారజ్ జోడీ తలపడనుంది. సింగిల్స్ వరల్డ్ నెం.1 జానిక్ సినర్..సినియకోవాతో జత కట్టాడు. ఇగా స్వియటెక్-కాస్పర్ రూడ్, జొకోవిచ్-డానిలోవిచ్, ఒసాకా-మోన్‌ఫిల్స్ జంటలు మిక్స్‌డ్ బరిలోకి ఉన్నాయి. డిఫెండింగ్ చాంప్‌గా సారా ఎర్రాని-ఆండ్రియా వవస్సోరి జోడీ మరోసారి టైటిల్ నెగ్గాలనే పట్టుదలతో ఉంది. 45 ఏళ్ల వీనస్ విలియమ్స్, ఒపెల్కాతో కలిసి పోటీపడుతోంది. మంగళవారం రౌండ్-1, క్వార్టర్స్ జరగనుండగా.. సెమీస్, ఫైనల్ మ్యాచ్‌లను బుధవారం నిర్వహిస్తారు.

ఫార్మాట్ విశేషాలు

- మొత్తం 16 జంటలు పోటీపడుతున్నాయి. కంబైన్డ్ సింగిల్స్ ర్యాంకుల ఆధారంగా ఎనిమిది జంటలకు నేరుగా ఎంట్రీ దక్కగా, మిగతా ఎనిమిది జోడీలను వైల్డ్‌కార్డ్ ద్వారా ఎంపిక చేశారు.
- ఒక సెట్‌లో ఆరు గేమ్‌లకు బదులు నాలుగు గేమ్‌లు మాత్రమే ఉంటాయి. నాలుగు పాయింట్లు ముందుగా ఎవరు గెలుస్తారో వారిదే సెట్. మూడో సెట్ లేకుండా 10 పాయింట్ల టైబ్రేక్‌ను నిర్వహిస్తారు.
- విజేత ప్రైజ్‌మనీ రూ. 8.76 కోట్లు కాగా.. రన్నరప్ జోడీకి రూ. 3.50 కోట్లు దక్కుతాయి.

చుట్టుముట్టిన విమర్శలు

ప్రధాన టోర్నీకి ముందు మిక్స్‌డ్ డబుల్స్‌ను ప్రత్యేకంగా నిర్వహించడం వివాదాస్పదంగా మారింది. సింగిల్స్ టాప్ ప్లేయర్లకు పెద్ద పీట వేయడంతోపాటు టోర్నీ ప్రైజ్‌మనీని రెండు లక్షల నుంచి పది లక్షల డాలర్లకు (రూ. 1.74 కోట్ల నుంచి 8.73 కోట్లు) పెంచడంపై డిఫెండింగ్ చాంప్ ఎర్రాని తీవ్ర విమర్శలు చేసింది. కేవలం సింగిల్స్ ప్లేయర్లకు లాభం చేకూర్చేలా టోర్నీ ఫార్మాట్, షెడ్యూల్‌ను కూడా మార్చారని ఆరోపించింది. వారిలో డబుల్స్ స్పెషలిస్టులే లేరని తెలిపింది. అయితే, ఎక్కువ మంది సింగిల్స్ ప్లేయర్లను ఆకర్షించడానికే ఇలా చేసినట్టు నిర్వాహకులు తెలిపారు. దీంతోపాటు టోర్నీ పాపులారిటీ కూడా పెరుగుతుందనే ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

అథ్లెట్ షీనాపై నిషేధం



న్యూఢిల్లీ: భారత ట్రిపుల్ జంపర్ షీనా వర్కేపై జాతీయ డోపింగ్ నిరోధక ఏజెన్సీ (నాడా) నిషేధం విధించింది. కేరళకు చెందిన ఈ 32 ఏళ్ల అథ్లెట్ డోప్ పరీక్షలో పాజిటివ్‌గా తేలింది. 2023 ఆసియాగేమ్స్‌లో ప్రాతినిధ్యం వహించిన షీనా.. ఇటీవలి జాతీయ క్రీడల్లో రజతం, ఫెడరేషన్ కప్‌లో కాంస్యం గెలుచుకుంది.

ఆసియా షూటింగ్‌లో భారత్‌కు రజతం

షిమ్కెంట్ (కజకిస్థాన్): ఆసియా షూటింగ్ చాంపియన్‌షిప్ పిస్టల్ విభాగంలో భారత పురుషుల జట్టు రజత పతకంతో బోణీ చేసింది. సోమవారం జరిగిన 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ టీమ్ విభాగంలో అన్మోల్, అదిత్య, సౌరభ్ చౌధరితో కూడిన భారత త్రయం రెండోస్థానంతో రజతం అందుకుంది. చైనా స్వర్ణం, ఇరాన్ కాంస్యం నెగ్గాయి. ఇక, జూనియర్ పురుషుల 10 మీ. ఎయిర్ పిస్టల్ వ్యక్తిగత విభాగంలో కపిల్ స్వర్ణం, గవిన్ కాంస్యం అందుకున్నారు. ఇదే విభాగం టీమ్ ఈవెంట్‌లో భారత్ రజతం దక్కించుకుంది.

శశికాంత్ ఆల్‌రౌండ్ షో

ఏపీఎల్‌లో సన్‌షైనర్స్‌పై వారియర్స్ గెలుపు



శశికాంత్

విశాఖపట్నం స్పోర్ట్స్ (ఆంధ్రజ్యోతి): కోడి శశికాంత్ (3/41, 21 రన్స్) తొలుత బంతితో, తర్వాత బ్యాట్‌తో సత్తా చాటి తుంగభద్ర వారియర్స్ గెలుపులో కీలకపాత్ర పోషించాడు. ఆంధ్ర ప్రీమియర్ లీగ్ (ఏపీఎల్)లో సోమవారం ఇక్కడ జరిగిన తొలి మ్యాచ్‌లో తుంగభద్ర 4 వికెట్లతో విజయవాడ సన్‌షైనర్స్‌పై నెగ్గింది. తొలుత విజయవాడ 20 ఓవర్లలో 7 వికెట్లకు 161 పరుగులు చేసింది. ఓపెనర్ అభినవ్ అర్ధ సెంచరీ (51), అశ్విన్ హెబ్బర్ (33) రాణించారు. తుంగభద్ర బౌలర్లలో శశికాంత్ 3, స్టీఫెన్ 2 వికెట్లు పడగొట్టారు. ఛేదనలో తుంగభద్ర 19 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 167 పరుగులు చేసి గెలిచింది. ఆనంద జోసయ్య (42 నాటౌట్), మహీప్‌కుమార్ (36), శశికాంత్ (21) రాణించారు. ఆల్‌రౌండ్ షోతో ఆకట్టుకున్న శశికాంత్ ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా నిలిచాడు.

అమరావతి అదుర్స్: అనంతరం జరిగిన రెండో మ్యాచ్‌లో అమరావతి రాయల్స్ 7 వికెట్లతో రాయల్స్ ఆఫ్ రాయలసీమను ఓడించింది. మొదట రాయలసీమ 20 ఓవర్లలో 5 వికెట్లకు 161 రన్స్ చేసింది. కెప్టెన్ రషీద్ (96 నాటౌట్)కు కొద్దిలో సెంచరీ చేజారగా, హర్షవర్ధన్ (42) రాణించాడు. ఛేదనలో కరణ్ షిండే (56 నాటౌట్), కెప్టెన్ విహారి (47) అదరగొట్టడంతో అమరావతి జట్టు 17.3 ఓవర్లలోనే 163/3 స్కోరు చేసి నెగ్గింది.

షూటర్ శ్రీధర్ డబుల్ ధమాకా



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): పుణెలో జరిగిన జాతీయ పారా ఓపెన్ షూటింగ్ చాంపియన్‌షిప్‌లో కాకినాడ షూటర్ శ్రీధర్ రాయల రెండు పతకాలు కొల్లగొట్టాడు. 50 మీటర్ల రైఫిల్-ఆర్ 9 విభాగంలో స్వర్ణం నెగ్గిన శ్రీధర్.. 10 మీటర్ల ఎయిర్ రైఫిల్-ఆర్5 కేటగిరీలో కాంస్యం సాధించాడు.

ఈసీ సభ్యుడిగా ఒకసారి సరిపోతుంది!

న్యూఢిల్లీ: జాతీయ క్రీడా సమాఖ్యల అధ్యక్ష, కార్యదర్శి, కోశాధికారి పదవులకు పోటీ చేయాలంటే..గతంలో ఆయా సమాఖ్యల ఎగ్జిక్యూటివ్ కమిటీలలో రెండుసార్లు సభ్యుడిగా ఉండాల్సి వచ్చేది. కానీ పార్లమెంట్ ఆమోదించిన నూతన జాతీయ క్రీడా పరిపాలన బిల్లు ప్రకారం ఒక్కసారి ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యుడిగా వ్యవహరిస్తే చాలు. యువ క్రీడా పరిపాలకులు, నాయకత్వ లక్షణాలు కలిగిన అథ్లెట్లను ప్రోత్సహించేందుకే 'రెండు టర్మ్‌'లను ఒకటికి కుదించినట్టు కేంద్ర క్రీడల మంత్రి మన్‌సుఖ్ మాండవ్య వెల్లడించారు. జాతీయ క్రీడా పరిపాలన బిల్లును ప్రస్తుతం రాష్ట్రపతి ఆమోదం కోసం పంపారు. రాష్ట్రపతి సంతకం చేశాక 'కొత్త బిల్లు' చట్టంగా మారనుంది.



ముంబైలో రెడ్ అలర్ట్

▸▸ భారీ వర్షాలతో నగరం అతలాకుతలం

ముంబై, ఆగస్టు 18: భారీ వర్షాలు ముంబై నగరాన్ని ముంచెత్తుతున్నాయి. ముంబైతోపాటు మహారాష్ట్రలోని అనేక ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఎడతెరపిలేని వానల కారణంగా నాందేడ్ జిల్లా ముఖేడ్ తాలూకాలో ఐదుగురు గల్లంతయ్యారు. 200 మందికిపైగా వరదల్లో చిక్కుకుపోయారు. దీంతో సహాయక చర్యల కోసం సైన్యాన్ని రంగంలోకి దింపినట్టు మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ తెలిపారు. కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మహారాష్ట్ర, తెలంగాణ మధ్య ఉన్న ప్రాజెక్టుల్లో నీటిమట్టం గణనీయంగా పెరిగిందని, మరోవైపు లాతూర్, ఉద్గిర్‌తోపాటు కర్ణాటక నుంచి కూడా భారీగా వరద నీరు ఈ ప్రాజెక్టుల్లోకి వచ్చి చేరుతోందని ఆయన చెప్పారు. ముంబైలో సోమవారం 17.7 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైందని ఫడ్నవీస్ తెలిపారు. కాగా.. ముంబై, ఠాణె, రాయగడ్‌తోపాటు రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో మరో మూడు రోజులు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) రెడ్ అలర్ట్ జారీచేసింది. దీంతో అధికారులు సోమవారం మధ్యాహ్నం నుంచి పాఠశాలలు, కళాశాలలకు సెలవు ప్రకటించారు.

కృష్ణాష్టమి రథయాత్ర విషాదాంతం

▸▸ హైదరాబాద్‌లో ఇనుప రథానికి తగిలిన విద్యుత్ వైరు

▸▸ విద్యుదాఘాతంతో ఐదుగురి మృతి.. నలుగురికి గాయాలు

హైదరాబాద్ సిటీ/రామాంతపూర్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని రామాంతపూర్ గోకుల్‌నగర్‌లో ఆదివారం జరిగిన కృష్ణాష్టమి వేడుకల్లో దారుణం చోటు చేసుకుంది. యాదవ సంఘం తరఫున శ్రీకృష్ణుడి రథయాత్ర నిర్వహిస్తుండగా పైన 11కేవీ హైటెన్షన్ విద్యుత్తు వైరు నుంచి ఇనుప రథానికి విద్యుత్తు ప్రసరణ జరిగింది. ఫలితంగా రథాన్ని లాగుతున్న భక్తులు తీవ్ర విద్యుదాఘాతానికి గురయ్యారు. ఉప్పల్ పోలీసులు, స్థానికుల వివరాల ప్రకారం.. కురుస్తున్న వర్షాన్ని లెక్క చేయకుండా గోకుల్‌నగర్ నుంచి మొదలైన రథయాత్ర అర్ధరాత్రి 12:30 గంటలకు తిరిగి గోకుల్‌నగర్‌లోని యాదవసంఘం భవన సమీపంలోకి చేరుకుంది. మరో 100 మీటర్ల దూరం వెళితే యాత్ర ముగిసేదే! అయితే ఆ రథాన్ని లాగుతున్న వాహనం మొరాయించింది. ఫలితంగా రథం ముందుకు కదలకపోవడంతో కొందరు యువకులు ఆ వాహనాన్ని పక్కకు తీసి.. చేతులతోనే రథాన్ని లాగేందుకు సిద్ధమయ్యారు. రథాన్ని లాగుతుండగా పైన విద్యుత్తు తీగలు రథానికి అడ్డుగా ఉన్నాయని గుర్తించారు. ఆ వైర్లను కర్రతో పైకి లేపడానికి ప్రయత్నించారు. ఈ క్రమంలో విద్యుత్తు తీగ నుంచి కిందకు వేలాడుతున్న ఒక కేబుల్ వైరు ముక్క ఇనుప రథానికి తగిలింది. ఆ ముక్కలోని కాపర్ వైరు.. అటు 11కేవీ హైటెన్షన్ వైరుకు, ఇటు రథానికి తగలడంతో విద్యుదాఘాతం సంభవించింది. రథాన్ని లాగుతున్న తొమ్మిది మంది దూరంగా ఎగిరిపడ్డారు. వారిలో కృష్ణ యాదవ్ (21), సురేశ్ యాదవ్ (34), శ్రీకాంత్ రెడ్డి (35), రుద్ర వికాస్ (39), రాజేంద్ర రెడ్డి (45) విద్యుదాఘాతంతో అక్కడికక్కడే మృతిచెందారు. మహేశ్, రవీందర్ యాదవ్, గణేశ్, శ్రీనివాస్‌కు గాయాలయ్యాయి.

అవసరమైతే ఉక్రెయిన్‌కు.. అమెరికా దళాలు!

భద్రతకు కట్టుబడి ఉంటాం.. శ్వేతసౌధంలో జెలెన్‌స్కీతో భేటీలో ట్రంప్

▸▸ తర్వాత యూరప్ నేతలతో కలసి భేటీ

వాషింగ్టన్, ఆగస్టు 18: ఉక్రెయిన్‌కు రక్షణగా నిలుస్తామని.. శాంతి కోసం అవసరమైతే అమెరికా దళాలను పంపించడానికి సిద్ధంగా ఉన్నామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సంకేతాలు ఇచ్చారు. యూరప్ దేశాలు ముందు నిలుస్తాయని, తాము వీలైనంత సహాయం చేస్తామని చెప్పారు. యూరప్ దేశాలతో చర్చలు, సంప్రదింపుల తర్వాత దీనిపై స్పష్టత వస్తుందన్నారు. నిజానికి కాల్పుల విరమణ పాటించాలని తాను కోరానని, కానీ రష్యా అధ్యక్షుడు పుతిన్ అందుకు సిద్ధంగా లేరని పేర్కొన్నారు. సోమవారం అమెరికా అధ్యక్ష భవనం శ్వేతసౌధంలో జెలెన్‌స్కీ, యూరప్ దేశాల నేతలతో జరిగిన చర్చల్లో ట్రంప్ ఈ వివరాలు వెల్లడించారు. ఈ చర్చల తర్వాత పుతిన్‌కు ఫోన్ చేసి మాట్లాడనున్నట్టు చెప్పారు. ఇక శాంతి ఒప్పందంలో భాగంగా తమ భద్రతకు అవసరమైన అన్ని రకాల సహాయం చేయాలని అమెరికా, యూరప్ దేశాలను జెలెన్‌స్కీ కోరారు. బలమైన సైన్యం, ఆయుధాలు, శిక్షణ, నిఘా వ్యవస్థలు ఉక్రెయిన్‌కు అవసరమని.. ఇదంతా అమెరికా, యూరప్ దేశాల చేతిలో ఉందని పేర్కొన్నారు. యూరప్‌లో ఒక్క దేశంలో శాంతికోసం చర్చించడమంటే.. మొత్తం యూరప్ శాంతి కోసమని జెలెన్‌స్కీ అభివర్ణించారు. తాము యుద్ధం నిలిపివేయడంపై దృష్టిపెడితే.. రష్యా దాడులు చేస్తూ, ప్రజల ప్రాణాలను బలితీసుకుంటోందని మండిపడ్డారు. ట్రంప్‌తో భేటీ కోసం ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతోపాటు ఫ్రాన్స్, ఫిన్లాండ్ అధ్యక్షులు మేక్రాన్, అలెగ్జాండర్ స్టబ్, బ్రిటన్, ఇటలీ ప్రధానులు కీర్ స్టార్మర్, జార్జియా మెలోనీ, జర్మనీ చాన్సలర్ ఫ్రెడరిక్ మెర్జ్, నాటో జనరల్ సెక్రెటరీ మార్క్ రూట్, యూరోపియన్ కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా లెయెన్ శ్వేతసౌధానికి వచ్చారు. ఒక దేశం విషయంలో ఇంత మంది ప్రపంచ నేతలు ఇలా తమ పనులన్నీ వదులుకుని వచ్చి భేటీకావడం అరుదైన ఘటన అని అమెరికా అధికారవర్గాలు పేర్కొన్నాయి.



సోమవారం జెలెన్‌స్కీతో సమావేశమైన ట్రంప్

పతుల ద్వారా సతుల లేఖలు!

ఉక్రెయిన్‌లో యుద్ధం ఆపాలంటూ రష్యా అధ్యక్షుడు పుతిన్‌కు ట్రంప్ సతీమణి మెలనియా లేఖ రాసిన సంగతి తెలిసిందే. అలాస్కాలో జరిగిన చర్చల సందర్భంగా ట్రంప్ స్వయంగా ఆ లేఖను పుతిన్‌కు అందజేశారు. తాజాగా చర్చల కోసం శ్వేతసౌధానికి వచ్చిన జెలెన్‌స్కీ.. ట్రంప్ సతీమణి మెలనియాకు తన సతీమణి ఒలెనా జెలెన్‌స్కా రాసిన లేఖను ట్రంప్‌కు అందించారు. మరోవైపు, యుద్ధ విరమణ కోసం వాషింగ్టన్‌లో ట్రంప్, జెలెన్‌స్కీ, యూరప్ నేతలు భేటీ అవుతున్న తరుణంలోనే.. ఉక్రెయిన్‌పై రష్యా దాడులు కొనసాగాయి. ఈ దాడుల్లో ఏడుగురు చనిపోయారని ఉక్రెయిన్ ప్రకటించింది.

ఆ రెండూ వదులుకోవాల్సిందే!

జెలెన్‌స్కీ, యూరప్ దేశాల నేతలతో భేటీకి ముందు యుద్ధ విరమణ కోసం ఉక్రెయిన్ తన డిమాండ్లను వదులుకోవాల్సిందేనంటూ ట్రంప్ ట్రూత్ వేదికగా పోస్టు పెట్టారు. 12 ఏళ్ల క్రితం రష్యా చేతిలోకి వెళ్లిన క్రిమియా ద్వీపకల్పం తిరిగి రాదని, నాటోలోకి ఉక్రెయిన్‌కు ప్రవేశం ఉండదని ట్రంప్ స్పష్టం చేశారు. అయితే రష్యాకు ఉక్రెయిన్ భూభాగాల అప్పగింత అంశాన్ని మాత్రం ఆయన ప్రస్తావించలేదు.

సూట్‌లో బాగున్నారు జెలెన్‌స్కీ!

ట్రంప్‌తో, ఇతర దేశాధినేతలతో భేటీల సమయంలో జెలెన్‌స్కీ సాధారణ టీషర్టులు ధరించి వస్తుంటారు. అధికారిక భేటీలకు ఇలా రావడం ఏమిటన్న విమర్శలు ఉన్నాయి. గతంలో ట్రంప్‌తో భేటీలో ఓ జర్నలిస్టు దీనిపై ప్రశ్నించడం, ఆ భేటీలో ట్రంప్‌తో జెలెన్‌స్కీ వాగ్వాదం చర్చనీయాంశంగా మారాయి కూడా. తాజాగా ట్రంప్ భేటీకి వచ్చే ముందు కాస్త పద్ధతిగా దుస్తులు ధరించి రావాలని అమెరికా అధికారులు జెలెన్‌స్కీని కోరినట్టు సమాచారం. సోమవారం ట్రంప్‌తో భేటీలో జెలెన్‌స్కీ నలుపు రంగు ఫార్మల్ సూట్ ధరించి కనిపించారు. 'మీరు ఈ సూట్‌లో చాలా బాగున్నారు' అని ట్రంప్ ఈ సందర్భంగా పేర్కొనడం గమనార్హం.

మోదీకి పుతిన్ ఫోన్

ప్రధాని మోదీకి సోమవారం పుతిన్ ఫోన్ చేశారు. అలాస్కాలో ఈ నెల 15న అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌తో జరిగిన సమావేశం వివరాలను పంచుకున్నారు. ఉక్రెయిన్‌తో సంక్షోభం శాంతియుతంగా ముగియాలన్న మోదీ.. ఈ దిశగా జరుగుతున్న యత్నాలకు భారత్ అన్ని విధాలుగా సహకరిస్తుందని మోదీ ఈ సందర్భంగా పుతిన్‌తో చెప్పినట్లు పీఎంవో కార్యాలయం వెల్లడించింది.

భారత్ నుంచి అమెరికాకు 7 రెట్లు పెరిగిన ఎగుమతులు

న్యూఢిల్లీ, ఆగస్టు 18: ట్రంప్ ప్రతీకార సుంకాల హెచ్చరికల నేపథ్యంలో.. భారతీయ ఎగుమతిదారులు 'ఫ్రంట్ లోడింగ్' పెంచారు! ఫ్రంట్‌లోడింగ్ అంటే.. సుంకాలు పెరుగుతాయని తెలిసినప్పుడు ముందే పెద్ద ఎత్తున ఎగుమతులను పెంచడం. ఎంతగా పెంచారంటే.. ఏప్రిల్-జూలై నెలల మధ్య అమెరికాకు మన ఎగుమతులు ఏకంగా 21 శాతం పెరిగి 33.5 బిలియన్ డాలర్లకు (రూ.2.92 లక్షల కోట్లకు) చేరింది. ఇదే సమయంలో.. భారత్ నుంచి మొత్తం ఎగుమతులు కేవలం 3 శాతం మాత్రమే పెరిగి 149.2 బిలియన్ డాలర్లకు (దాదాపు రూ.13 లక్షల కోట్లకు) చేరాయి. అంటే.. మనదేశం నుంచి పెరిగిన మొత్తం ఎగుమతులతో (3%) పోలిస్తే.. అమెరికాకు (21%) ఏడు రెట్లు ఎక్కువ పెరిగాయని గణాంకాలను ఉటంకిస్తూ 'టైమ్స్ ఆఫ్ ఇండియా' వార్తాసంస్థ ఒక కథనాన్ని ప్రచురించింది. కాగా, ఏప్రిల్-జూలై నడుమ ఎగుమతులతో పోలిస్తే.. ఒక్క జూలై నెలలో భారత్ నుంచి ఎగుమతులు భారీగా పెరిగాయని గణాంకాలు చెబుతున్నాయి. ఉదాహరణకు.. జెమ్స్ అండ్ జువెలరీ రంగంలో ఎగుమతులు జూలైలో 28% మేర పెరిగాయి. ఫార్మా ఉత్పత్తుల ఎగుమతులు.. ఏప్రిల్-జూలై నడుమ 7.4% పెరిగితే, ఒక్క జూలైలోనే 14% మేర పెరిగాయి. ఇంజనీరింగ్ ఉత్పత్తులు ఏప్రిల్-జూలై నడుమ 6% పెరిగితే.. ఒక్క జూలైలోనే 13.8% పెరిగాయి. ప్లాస్టిక్ ఉత్పత్తుల ఎగుమతులు జూలైలో 4.4% మేర పెరిగాయి.

పుతిన్‌తో పాటు 'పూప్ సూట్‌కేస్'

▸▸ అలాస్కాకు తీసుకెళ్లిన భద్రతా సిబ్బంది


న్యూఢిల్లీ, ఆగస్టు 18: రష్యా అధ్యక్షుడు పుతిన్ భద్రతకు ఆ దేశం ఎంత ప్రాధాన్యత ఇస్తుందో చెప్పడానికి 'పూప్ (మలవ్యర్థాల) సూట్‌కేస్' ఓ ఉదాహరణ. ఇటీవల అలాస్కాలో ట్రంప్‌తో పుతిన్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన వ్యక్తిగత భద్రతా సిబ్బంది ఓ ప్రత్యేక బాధ్యతలో కనిపించారు. అదేమిటి అంటే ఆయన కాలకృత్యాల తర్వాత ఆ మల మూత్రాలను సేకరించే పని. సేకరించిన వ్యర్థాలను ఓ సూట్‌కేసులో భద్రపరిచి తిరిగి మాస్కోకు తీసుకెళ్లిపోయారు. ఇలా ఎందుకంటే, విదేశీ శక్తులు ఎవరూ ఆ వ్యర్థాలతో పుతిన్ ఆరోగ్య వివరాలేవీ కనిపెట్టకుండా ఉండటానికని తెలుస్తోంది. చాలా ఏళ్ల నుంచి భద్రతా సిబ్బంది ఇదే విధంగా చేస్తున్నారు.

బెంబేలెత్తి యుద్ధనౌకలను దాచిన పాక్

సిందూర్ వేళ దాయాది పిరికిచర్య

గ్వదార్ పోర్టుకు పలు యుద్ధనౌకలు

న్యూఢిల్లీ, ఆగస్టు 18: ఆపరేషన్ సిందూర్‌తో భారత్ విరుచుకుపడుతున్న సమయంలో పాకిస్థాన్ బెంబేలెత్తి దాక్కున్న సంగతి తాజాగా రుజువులతో సహా బయటపడింది. భారత్ క్షిపణులు ప్రయోగిస్తుందేమోనన్న భయంతో పాకిస్థాన్ తన నౌకాదళానికి చెందిన ప్రధానమైన, అత్యాధునిక యుద్ధనౌకలను నౌకాదళ స్థావరాల నుంచి తరలించి, వాణిజ్య నౌకలను నిలిపే పోర్టులకు తరలించింది. ఆ విధంగా ఆ వాణిజ్య నౌకల మధ్య వాటిని దాచి పెట్టింది. ఈ వివరాలు ఉపగ్రహ ఛాయాచిత్రాల ద్వారా వెల్లడైందని ఇండియాటుడే తెలిపింది. పాకిస్థాన్‌లోని కరాచీ, గ్వదార్ పోర్టుల తాలూకు ఉపగ్రహ ఛాయాచిత్రాలను 'ఓపెన్‌సోర్స్ ఇంటెలిజెన్స్ టీమ్' విశ్లేషించింది. చైనా-పాకిస్థాన్ ఎకనామిక్ కారిడార్‌లో కీలకమైన గ్వదార్ వాణిజ్య పోర్టులో వాణిజ్య నౌకల మధ్య పలు యుద్ధనౌకలున్నట్లు తేలింది. వీటిలో పాక్ ఎంతో ఘనంగా చెప్పుకొనే జుల్ఫికర్ క్లాస్ నౌకలు రెండు, పాక్‌లో అతిపెద్ద యుద్ధ నౌకలుగా పేరొందిన తుఘ్రిల్ క్లాస్ నౌకలు రెండు, అమెరికా నుంచి కొనుగోలు చేసిన ఏకైక యుద్ధనౌక ఒలివర్ హజార్డ్ పెర్రీ క్లాస్ నౌక, రెండు తీరప్రాంత గస్తీ నౌకలు ఉన్నాయని తెలిసింది. ఇక కరాచీలోని పాక్ నౌకాదళ స్థావరం కూడా ఈ ఉపగ్రహ ఛాయా చిత్రాల్లో బోసిపోయి కనిపించింది. అక్కడ ఉండాల్సిన యుద్ధనౌకలు.. కరాచీ వాణిజ్య పోర్టులో ఓ సరుకు రవాణానౌక సమీపంలో ఉన్నాయి. ఆ సరుకు రవాణానౌకలో లోడింగ్/అన్‌లోడింగ్ ప్రక్రియ జరుగుతుండటం, అక్కడ పలు కంటెయినర్లు ఉండటం కూడా ఈ చిత్రాల్లో వెల్లడైంది. మొత్తం నాలుగు యుద్ధనౌకలను, ఒక గస్తీ నౌకను ఇక్కడ దాచి పెట్టారు.



హడలెత్తించిన ఐఎన్ఎస్ విక్రాంత్

సిందూర్ సమయంలో భారత నౌకాదళానికి చెందిన ఐఎన్ఎస్ విక్రాంత్‌ను అరేబియా సముద్రంలో మోహరించటం, కరాచీ పోర్టును ధ్వంసం చేయటానికి భారత్ సిద్ధమవుతోందన్న వార్తల నేపథ్యంలోనే.. పాక్ తన యుద్ధనౌకలను ఇలా దాచి పెట్టి ఉంటుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

చిరంజీవి భరోసా ఇచ్చారు

ఫెడరేషన్ నాయకులు

కార్మికుల సమ్మె నేపథ్యంలో ఫిల్మ్ ఫెడరేషన్ నాయకులు సోమవారం మెగాస్టార్ చిరంజీవిని కలిశారు. వారి కష్టాలను ఆయనకు వివరించారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ అధ్యక్షులు వల్లభనేని అనిల్ మీడియాతో మాట్లాడుతూ '24 క్రాఫ్ట్ విభాగాల నుంచి 72 మంది వెళ్లి చిరంజీవితో మాట్లాడాము. నిర్మాతలు మాపై నిందలు వేస్తున్నారు. మాకు సాధ్యంకాని నిబంధనలు పెడుతున్నారు. నిర్మాతల రెండు షరతులను అంగీకరిస్తే ఏం నష్టపోతామో చిరంజీవికి వివరించాం. డబుల్ కాల్షీట్ గురించి కూడా ప్రస్తావించాం. 'ఏ సమస్య వచ్చినా నా దగ్గరకు రండి' అని చిరంజీవి భరోసా ఇచ్చారు. కార్మికులతోపాటు నిర్మాతలు బాగుండాలనేదే మా కోరిక. మంగళవారం జనరల్ బాడీ మీటింగ్ నిర్వహిస్తాం. అలాగే, ఛాంబర్‌తో కూడా సమావేశమవుతాం. చర్చలకు పిలిచారు కాబట్టి మేము నిరసనను కొనసాగించట్లేదు. చిరంజీవి అయినా, బాలకృష్ణ అయినా మా సమస్య పరిష్కారం కోసమే మాట్లాడతారు తప్ప ఒకరి వైపే ఉండరు' అని చెప్పారు. ఫెడరేషన్ కోఆర్డినేషన్ కమిటీ ఛైర్మన్ వీరశంకర్ మాట్లాడుతూ 'సినీ పరిశ్రమలో ఇలాంటి సమ్మెలు కొత్తకాదు. ఛాంబర్‌తో చర్చలు జరిగాక పరిష్కారం దొరుకుతుంది. నిర్మాతలు కూడా కార్మికుల పరిస్థితి అర్థం చేసుకోవాలి' అని అన్నారు.



ఆ రూల్స్‌తో సినిమాలు తీయలేం: ఎస్‌కేఎన్

50 ఏళ్ల కిందట యూనియన్లు రాసుకున్న నిబంధనల ప్రకారం ఇప్పటి నిర్మాతలు సినిమాలు నిర్మించలేరు అని నిర్మాత ఎస్కేఎన్ అన్నారు. ఈ నేపథ్యంలో ఓ పోస్ట్ ద్వారా నిర్మాతల అభిప్రాయాలను ఎస్కేఎన్ తెలిపారు. 'ఇతర చిత్ర పరిశ్రమల్లో ఉన్నట్లే టాలీవుడ్‌లోనే కార్మికుల పని గంటలు ఉండాలనేది నిర్మాతల కోరిక. అనేక కారణాల వల్ల నిర్మాతలకు సరైన ఆదాయం రావట్లేదు. ఇలాంటి పరిస్థితుల్లో కార్మికుల వేతనం పెంచడం మరింత భారమవుతుంది. సినీ కార్మికులకు వేతనాన్ని పెంచడాన్ని చిన్న నిర్మాతలు అంగీకరించట్లేదు. ఫిల్మ్ మేకింగ్‌ను మరింత సమర్థవంతంగా మార్చేందుకు నిర్మాతలు సరికొత్త మార్గాలను అన్వేషించాలి. సినిమా కోసం 24 విభాగాల్లోని కార్మికులు పనిచేసే విధానం మారాల్సి ఉంది. 50 ఏళ్ల కిందట యూనియన్లు రాసుకున్న నిబంధనల ప్రకారం ఇప్పటి నిర్మాతలు సినిమాలు నిర్మించలేరు. హైదరాబాద్ సినీ హబ్‌గా మారుతోంది. కార్మికులు ఇలాంటి నిబంధనలు విధించడం వల్ల ఇతర భాషల నుంచి మేకర్స్ నగరానికి రావడానికి ఆసక్తి చూపించరు' అని ఎస్‌కేఎన్ పేర్కొన్నారు.

ఆ సినిమాలపై ప్రభావం

సమ్మె కారణంగా షూటింగ్స్ క్యాన్సిల్ కావడం.. నిర్మాణంలో ఉన్న పలు సినిమాలకు తీవ్ర అడ్డంకిగా మారింది. ముఖ్యంగా దసరా, సంక్రాంతి పండగలకి విడుదల కావాల్సిన పలు సినిమాలపై ఈ సమ్మె ప్రభావం చూపుతోంది. రవితేజ కథానాయకుడిగా నటించిన 'మాస్ జాతర' ఈ నెల 27న విడుదల కావాల్సి ఉంది. అయితే, ఇంకా నాలుగు రోజుల షూటింగ్ మిగిలి ఉండడంతో పాటు సమ్మె కారణంగా అనుకున్న తేదీకి సినిమా విడుదల కాకపోవచ్చనే ప్రచారం జరుగుతోంది.



జాతీయ అవార్డు గ్రహీతలకు సీఎం సన్మానం

జాతీయ ఫిల్మ్ అవార్డులు అందుకున్న సినీ ప్రముఖులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోమవారం తన నివాసంలో సన్మానించారు. ఈ సందర్భంగా భారతీయ సినిమా నిర్మాణానికి కేంద్రంగా హైదరాబాద్‌ను నిలపాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. తెలుగు చలన చిత్రాల్లో వివిధ విభాగాలకు జాతీయ అవార్డులు రావటం రాష్ట్రానికి గర్వకారణమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నిర్మాతలు చైతన్యరెడ్డి, నిరంజన్‌రెడ్డి, సాహు గారపాటి, ఎస్కేఎన్, దర్శకులు అనిల్ రావిపూడి, ప్రశాంత్ వర్మ, సాయి రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి)

కొన్ని రోజులుగా విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న రిలేషన్‌లో ఉన్నట్లు వార్తలు వస్తున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఇటీవలె భారత స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా న్యూయార్క్‌లో నిర్వహించిన 'ద వరల్డ్ లార్జెస్ట్ ఇండియా డే' కవాతులో వారిద్దరూ పాల్గొనడం అందరి దృష్టినీ ఆకర్షించింది. ఈ వేడుకలో వారు తీసుకున్న ఫొటోలు ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతున్నాయి.





నా కెరీర్‌లో గొప్ప సినిమా

నరేశ్ వీకే

సుహాస్, శివానీ నగరం హీరో హీరోయిన్లుగా నూతన దర్శకుడు గోపీ అచ్చర దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రానికి 'హే భగవాన్' అనే టైటిల్‌ను మేకర్స్ ఖరారు చేశారు. త్రిశూల్ విజనరీ స్టూడియోస్ బేనర్‌పై బి.నరేంద్ర రెడ్డి నిర్మిస్తున్నారు. సుహాస్ పుట్టిన రోజు సందర్భంగా సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఈ చిత్రం టైటిల్ టీజర్‌ను లాంచ్ చేశారు. ఈ సందర్భంగా నరేశ్ వీకే మాట్లాడుతూ 'ఈ సినిమా నా కెరీర్‌లో మరచిపోలేని గొప్ప సినిమా అవుతుంది. కథ విన్నప్పుడు పగలబడి నవ్వాను. చాలా కొత్త బ్యాక్‌డ్రాప్ తీసుకున్నారు' అని అన్నారు. సుహాస్ మాట్లాడుతూ 'ప్రశాంత్ ఈ సినిమాకి అద్భుతమైన కథ ఇచ్చాడు. కచ్చితంగా మంచి హిట్ కొడతాం. నరేశ్ గారితో పనిచేయడం చాలా ఆనందాన్ని ఇచ్చింది' అని అన్నారు. హీరోయిన్ శివాని మాట్లాడుతూ 'ఈ సినిమాలో భాగం కావడం చాలా ఆనందంగా ఉంది' అని అన్నారు. చిత్ర దర్శకుడు గోపీ అచ్చర్ల మాట్లాడుతూ 'ఈ చిత్రంలో తండ్రి కొడుకుల ఎమోషన్ హృదయాలకు హత్తుకుంటుంది' అని అన్నారు. నిర్మాత వంశీ నందిపాటి మాట్లాడుతూ 'సుహాస్ సినీ ప్రయాణం చాలా స్ఫూర్తివంతంగా ఉంటుంది' అని అన్నారు.

అచ్చమైన తెలుగు చిత్రం

అగస్త్య, రబియా ఖతూన్ జంటగా దర్శకుడు విపిన్ తెరకెక్కించిన సినిమా 'మేఘాలు చెప్పిన ప్రేమ కథ'. సునేత్ర ఎంటర్‌టైన్‌మెంట్స్ బేనర్‌పై ఉమాదేవి కోట నిర్మించారు. ఈ నెల 22న విడుదలవుతోంది. ఈ సందర్భంగా ఉమాదేవి, విపిన్ విలేకరులతో చిత్ర విశేషాలు వివరించారు. 'సినిమా అంతా చక్కని తెలుగులో ఉంటుంది. మాటల ఉచ్చారణలో కూడా అచ్చమైన తెలుగుని వింటారు. ఒక మనిషి మరో మనిషిని చూసినప్పుడు ఎలా స్పందిస్తారు? ప్రేమ ఎలా పుడుతుందనేది ఈ కథలో మీరు చూస్తారు. సినిమాలో రాధిక పాత్ర అద్భుతంగా ఉంటుంది. ఆవిడ మంచి గాయకురాలు. కొన్ని కారణాల వల్ల పాడటం మానేసి సాధారణ కుటుంబ జీవితం గడుపుతారు. ఈ పాత్రలో రాధిక స్క్రీన్ ప్రెజెన్స్ అద్భుతంగా ఉంటుంది. ఈ సినిమాలో ట్రావెన్‌కోర్ ప్రిన్స్ కూడా నటించారు. ఆయన శాస్త్రీయ సంగీతం కోసం చేసిన సేవ మనం ఊహించలేం. అలాంటి ఒక క్యారెక్టర్‌ని పరిచయం చేయడం చాలా ఆనందాన్ని ఇచ్చింది. జస్టిన్ మంచి సంగీతాన్ని అందించారు. చాలా రోజుల తర్వాత తెలుగులో మంచి మ్యూజికల్ లవ్ స్టోరీ వచ్చిందని ప్రేక్షకులు ఫీల్ అవుతారు' అని వారు అన్నారు.





ఆ ఫొటోలు దాచుకున్నా

శ్రీదేవి విజయ్ కుమార్

'ఈ సినిమాలో స్కూల్ డ్రెస్ వేసుకునే అకాశం వచ్చింది. ఇది మరచిపోలేని అనుభవం. అందుకే చాలా ఫొటోలు తీసి దాచుకున్నా. నేను ఇప్పటి వరకు ఇలాంటి క్యారెక్టర్ చేయలేదు' అని అన్నారు హీరోయిన్ శ్రీదేవి విజయ్‌కుమార్. ఆమె నటించిన 'సుందరకాండ' సినిమా ఈనెల 27న విడుదలవుతోంది. ఈ సందర్భంగా మీడియాతో చిత్ర విశేషాలు పంచుకున్నారు.

- హీరోయిన్‌గా రీ ఎంట్రీ ఇవ్వడం చాలా సంతోషంగా ఉంది. ఏ యాక్టర్‌కైనా మంచి క్యారెక్టర్ చేయాలనే ఉంటుంది. 'సుందరకాండ'లో అలాంటి ఒక అర్థవంతమైన పాత్ర పోషిస్తున్నా
- నా క్యారెక్టర్‌లో చాలా భిన్నమైన భావోద్వేగాలున్నాయి. చాలా స్ట్రాంగ్ క్యారెక్టర్ చేశాను. ఈ సినిమాలో మహిళా పాత్రలన్నీ శక్తిమంతమైనవే
- చాలా కొత్త పాయింట్‌తో వస్తున్న ప్రాజెక్టు ఇది. ప్రేక్షకురాలిగా ఈ సినిమా నాకు చాలా నచ్చింది. కుటుంబ సభ్యులందరూ థియేటర్‌కి వెళ్లి చాలా ఎంజాయ్ చేయవచ్చు.
- నా వివాహం తర్వాత సినిమాలకి బ్రేక్ వచ్చింది. ఆ తర్వాత టీవీలో కొన్ని ప్రోగ్రామ్స్ చేశాను. ఇన్ని సంవత్సరాల తర్వాత స్క్రీన్ మీద చూసుకోవడం చాలా ఆసక్తి కలుగుతోంది.
- డైరెక్టర్ వెంకీకి ఇది మొదటి సినిమా. కానీ చాలా అనుభవం గడించిన దర్శకుడిలా తీశారు. ఆయన విజన్ చాలా క్లియర్‌గా ఉంటుంది. తనకి ఏం కావాలో స్పష్టత ఉంది.

కోట శ్రీనివాసరావు సతీమణి కన్నుమూత

కోట శ్రీనివాసరావు ఇంట మరో విషాదం చోటు చేసుకుంది. ఆయన భార్య రుక్మిణి(75) కన్నుమూశారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె సోమవారం తుది శ్వాస విడిచారు. కోట శ్రీనివాసరావు జూలై 13న తుది శ్వాస విడిచిన విషయం తెలిసిందే. కోట శ్రీనివాసరావుకు రుక్మిణితో 1966లో వివాహం జరిగింది. వీరికి ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు. కుమారుడు ఆంజనేయ ప్రసాద్ 2010లో రోడ్డు ప్రమాదంలో మరణించారు.



కృష్ణమ్మ ఉరుకులు.. గోదారమ్మ పరుగులు

నేడు ప్రకాశం బ్యారేజీకి భారీగా వరద

- శ్రీశైలం నుంచి 5.5లక్షల క్యూసెక్కులు రాక
- గోదావరికీ మరింత వరద..



శ్రీశైలం జలాశయం నుంచి పదిగేట్ల ద్వారా విడుదలవుతున్న నీరు

రాష్ట్రంలో కృష్ణా, గోదావరి, ఉత్తరాంధ్రలో వంశధార, నాగావళి నదులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. ఎగువ పరివాహక ప్రాంతాల నుంచి శ్రీశైలం జలాశయానికి భారీగా వరద కొనసాగుతోంది. జూరాల నుంచి 2,13,311 క్యూసెక్కులు, సుంకేసుల నుంచి 87,158 క్యూసెక్కులు, హంద్రీ నుంచి 3750 క్యూసెక్కులు వరద నీరు శ్రీశైలం జలాశయానికి చేరుతోంది. దీంతో సోమవారం జలాశయం 10 క్రస్టుగేట్లను ఎత్తి నీటిని నాగార్జున సాగర్‌కు విడుదల చేస్తున్నారు. జలాశయం నీటి మట్టం సోమవారం రాత్రి 9 గంటలకు 881.60 అడుగులు, నీటి లభ్యత..196.561 టీఎంసీలుగా నమోదైంది. నాగార్జున సాగర్ జలాశయానికి శ్రీశైలం నుంచి భారీగా వరద నీరు చేరుతోంది. శ్రీశైలం నుంచి 3,31,699 క్యూసెక్కుల వరద నీరు వస్తుండడంతో 26 క్రస్టుగేట్ల ద్వారా దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుత నీటిమట్టం 585.80 అడుగులు ఉంది. 2,93,663 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ఎన్టీఆర్ జిల్లాలోని పులిచింతల ప్రాజెక్టుకు నాగార్జునసాగర్ నుంచి 2,26,389 క్యూసెక్కుల నీరు వస్తోంది. కాగా, ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు కృష్ణానదికి వరద పోటెత్తనున్నదని విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ హెచ్చరించారు. శ్రీశైలం నుంచి మంగళవారం 5.5లక్షల క్యూసెక్కుల వరద నీరు విడుదల కానున్నదని ఆయన సోమవారం రాత్రి తెలిపారు. మరోవైపు గోదావరిలోనూ వరద ప్రవాహం పెరుగుతోంది.

కాగ్ అంకెలకూ వైసీపీ వక్రభాష్యం: విజయ్

అమరావతి, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): కాగ్ నివేదికలోని అంకెలనూ వైసీపీ తిమ్మినిబమ్మిని చేస్తోందని టీడీపీ అధికార ప్రతినిధి, ఏపీ బయోడైవర్సిటీ బోర్డు ఛైర్మన్ నీలాయపాలెం విజయకుమార్ విమర్శించారు. 'మాజీ ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ఈ ఏడాది ఆదాయాన్ని రెండేళ్ల క్రితం అంకెలతో పోల్చి కూటమి ప్రభుత్వం విఫలం అంటూ మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారు. 2023, జూలైలో వైసీపీ హయాంలో రూ.58 వేల కోట్లు ఆదాయం వచ్చింది. 2023 జూలైలో కేంద్ర నుంచి వచ్చిన రూ.20 వేల కోట్ల గ్రాంట్లను కూడా కలిపి చెప్పిన బుగ్గన... అదే 2025 జూలైలో కేంద్రం నుంచి ఎలాంటి గ్రాంట్లు లేకుండానే రాష్ట్రం సొంత ఆదాయం రూ.49 వేల కోట్లు అనే విషయాన్ని చెప్పడం లేదు. కేంద్రం గ్రాంట్స్‌ను మినహాయిస్తే 2023 జూలైలో వచ్చిన ఆదాయం కేవలం రూ.38 వేల కోట్లు మాత్రమే' అని నీలాయపాలెం వివరించారు.

జగన్.. ధైర్యముంటే రాజధానికి రా: దేవినేని ఉమ

అమరావతి, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): జగన్‌కు ధైర్యం ఉంటే రాజధాని అమరావతిలో పర్యటించాలని మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు సవాల్ చేశారు. 'కుంభకోణాలకు, అక్రమాలకు పాల్పడిన వారిని పరామర్శించడానికి జైలు యాత్రలు మానేసి, రాజధానికి రావాలి. అక్కడ జరుగుతున్న అభివృద్ధిని స్వయంగా చూడాలి. సీడ్ యాక్సెస్ రహదారి, సచివాలయం, విట్, ఎస్ఆర్ఎం... జగన్ ఎక్కడికి వచ్చినా సరే అమరావతి ఎక్కడా మునగలేదని నిరూపించేందుకు సిద్ధం' అని దేవినేని అన్నారు.

సీఎం కార్యక్రమాల సమన్వయకర్తగా 'మంతెన'

అమరావతి, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు కార్యక్రమాల సమన్వయకర్తగా మాజీ ఎమ్మెల్సీ మంతెన సత్యనారాయణ రాజును నియమిస్తూ సోమవారం ఉత్తర్వులిచ్చారు. ఆయనకు సహాయ మంత్రి హోదా కల్పించారు. ప్రస్తుతం పెందుర్తి వెంకటేశ్ సీఎం కార్యక్రమాల సమన్వయకర్తగా ఉన్నారు. మంతెన నియామకంతో సమన్వయకర్తల సంఖ్య రెండుకు చేరింది.

సాంకేతిక విద్యా బోర్డుకు ఎన్‌సీవీఈటీ గుర్తింపు

అమరావతి, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సాంకేతిక విద్యా శిక్షణ బోర్డు(ఎస్‌బీటీఈటీ)కు అరుదైన గుర్తింపు లభించింది. దక్షిణ భారతదేశంలో తొలిసారిగా ఏపీ ఎస్‌బీటీఈటీకి జాతీయ వృత్తి విద్య శిక్షణ మండలి(ఎన్‌సీవీఈటీ) గుర్తింపు లభించింది. దీంతో ఇకపై సాంకేతిక విద్య పరిధిలోని కోర్సులకు రాష్ట్ర బోర్డుతోపాటు, ఎన్‌సీవీఈటీ గుర్తింపుతో కలిపిన డ్యూయల్ సర్టిఫికేషన్ విద్యార్థులకు లభిస్తుంది. ఈ మేరకు ఎన్‌సీవీఈటీతో ఎస్‌బీటీఈటీ అధికారులు సోమవారం ఢిల్లీలో ఒప్పందం చేసుకున్నారు.

21న అంగన్వాడీల నిరసనలు

అమరావతి, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 21న రాష్ట్ర వ్యాప్తంగా ఐసీడీఎస్ ప్రాజెక్టులు, మండల కేంద్రాల్లో నిరసనలు తెలపనున్నట్లు ఏపీ అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ల నాయకులు సుబ్బరావమ్మ, లలితమ్మ, వీఆర్ జ్యోతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అంగన్వాడీలకు వేతనాలు పెంచాలని, ఎఫ్ఆర్ఎస్ రద్దు చేయాలని, మినీ అంగన్వాడీలను మెయిన్ అంగన్వాడీలుగా మార్చిన జీవోను వెంటనే విడుదల చేయాలని తదితర సమస్యల పరిష్కారం కోసం నిరసన తెలపనున్నట్లు తెలిపారు.

లిక్కర్ నిందితుల బెయిల్ పిటిషన్లు కొట్టివేత

విజయవాడ, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): మద్యం కుంభకోణంలో నిందితులు దాఖలు చేసిన బెయిల్ పిటిషన్లను కోర్టు కొట్టేసింది. జైలులో ఉన్న ఎంపీ పీవీ మిధున్‌రెడ్డి, కె.ధనుంజయ్‌రెడ్డి, పి.కృష్ణమోహన్‌రెడ్డి, బాలాజీ గోవిందప్ప తమకు బెయిల్ ఇవ్వాలని పిటిషన్లు దాఖలు చేశారు. వాటిపై వాదనలు ముగియడంతో న్యాయాధికారి పి.భాస్కరరావు సోమవారం తీర్పును వెలువరించారు. నిందితుల బెయిల్ పిటిషన్లను కొట్టేశారు. అదే విధంగా బేవరేజస్ కార్పొరేషన్ మాజీ ఎండీ డి.వాసుదేవరెడ్డి, మాజీ ప్రత్యేకాధికారి డి.సత్యప్రసాద్ దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్లను కోర్టు కొట్టేసింది.

పీసీబీ సభ్యులుగా 'పంచకర్ల', నాగలపాటి



నాగ సందీప్, నాగేశ్వరరాజును సత్కరించిన డా.పి.క్రిష్ణయ్య, నాగబాబు

అమరావతి, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలిలో అధికారేతర సభ్యులుగా నియమితులైన వారిలో ఇద్దరు సోమవారం బాధ్యతలు చేపట్టారు. భీమిలి నియోజకవర్గం జనసేన బాధ్యుడిగా ఉన్న పంచకర్ల నాగ సందీప్‌తోపాటు చిత్తూరు జిల్లా కార్వేటినగరం మండలం, రాజులకండ్రిగకు చెందిన టీడీపీ నేత నాగలపాటి నాగేశ్వరరాజు బాధ్యతలు స్వీకరించారు. విజయవాడలోని పీసీబీ కార్యాలయంలో ఛైర్మన్ డాక్టర్ పీ కృష్ణయ్య, సభ్య కార్యదర్శి శరవణన్ సమక్షంలో వీరు బోర్డు సభ్యులుగా చేరారు. కార్యక్రమానికి ఎమ్మెల్సీ కొణిదెల నాగబాబు హాజరయ్యారు. కాలుష్య నియంత్రణ మండలిలో నాన్-అఫీషియల్ సభ్యులను నియమించడం ద్వారా పర్యావరణ పరిరక్షణలో ప్రజల భాగస్వామ్యం మరింత బలోపేతం అవుతుందని పి.కృష్ణయ్య అన్నారు.







అనకాపల్లి జిల్లా చోడవరం మండలం అన్నవరం సమీపంలో నీటమునిగిన వరి పొలాలు, శ్రీకాకుళం సమీపంలో నీటమునిగిన వరిపైరు, కాకినాడ జిల్లా గొల్లప్రోలు వద్ద సుద్దగడ్డ కాలువకు గండి పడి ముంపునకు గురైన పంటపొలాలు

- నదులు.. వాగుల్లో వరద ప్రవాహం
- 'తూర్పు'లో పొంగిన సుద్దగడ్డ.. ముంపులో పంటలు
- నంద్యాల జిల్లాలో గ్రామాలకు నిలిచిన రాకపోకలు

వదలని వానలు..

నీటిలోనే పంటలు

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

రాష్ట్రాన్ని వర్షాలు, వరదలు ముంచెత్తుతున్నాయి. నదులు, కాల్వలు పొంగి ప్రవహిస్తున్నాయి. ఏజెన్సీ ప్రాంతం, నంద్యాల జిల్లాలోనూ రోడ్లు నీటమునిగి పలు గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. సుమారు రెండు లక్షల ఎకరాల్లోని పంటలు నీటమునిగాయి. అల్లూరి జిల్లా చింతూరు-భద్రాచలం నడుమ 30వ నంబరు జాతీయ రహదారి, ఏపీ- ఒడిసా మధ్య 326 నంబరు జాతీయ రహదారిపై వరద నీరు చేరడంతో రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పంటలు నీటమునిగి, రోడ్లపై నీరు చేరి రాకపోకలు స్తంభించగా.. మంగళవారం కూడా భారీ వర్షాలు హెచ్చరికలతో రైతులు, సాధారణ ప్రజానీకం ఆందోళన చెందుతున్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో కురుస్తున్న వర్షాలకు వేల ఎకరాల్లో పంటలు నీటమునిగాయి. ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలకు రాజమహేంద్రవరంలో గోదావరి పరవళ్లు తొక్కుతుండగా ఏజెన్సీ ప్రాంతంలో శబరి, సీలేరు నదులు పొంగి ప్రవహిస్తున్నాయి. దీంతో ఏపీ-ఒడిస్సా 326 హైవేపై చింతూరు కుయుగూరుల వద్ద వరద నీరు భారీగా చేరి రాకపోకలు నిలిచిపోయాయి. కాకినాడ జిల్లాలో తీవ్ర అల్పపీడనం కారణంగా సముద్రం అల్లకల్లోలంగా మారడంతో రెండు నౌకల్లోకి బియ్యం లోడింగ్‌ను నిలిపివేశారు. సుద్దగడ్డ కాలువ ఉప్పొంగడంతో గొల్లప్రోలులో వేలాది ఎకరాలు పంట పొలాలు చెరువుల్లా మారాయి. గొల్లప్రోలు మండలంలో కొత్తకాలనీకి వెళ్లే దారి నీటమునిగింది. ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. కాగా, గోదావరి ఉగ్రరూపం దాల్చడంతో వరద ఉధృతంగా ప్రవహిస్తోంది. కూనవరంవద్ద గోదావరి ఎగపోటుతో వాగులు, వంకలు నిండు కుండల్లా దర్శనమిస్తున్నాయి. దీంతో మన రాష్ట్రం మీదుగా ఒడిస్సా వెళ్లే 326 జాతీయ రహదారిపై చింతూరు కుయుగూరుల వద్ద వరద నీరు భారీగా చేరింది. ఈ హైవేపై రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. చింతూరు నుంచి భద్రాచలం వెళ్లే 30వ నంబరు జాతీయ రహదారిపై వరద నీరు భారీగా ప్రవహిస్తోంది. చింతూరు, వరరామచంద్రపురం మండలాల నడుమ సోకిలేరు, చీకటి వాగులు పొంగిపొర్లుతుండటంతో చింతూరు మండలంలో 16 గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. వేలేరుపాడు మండలం మీదుగా వెళ్లి గోదావరిలో కలిసే ఎద్దువాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. ఈ వాగుపై ఉన్న వంతెన నీటమునిగిపోయింది. దీంతో 15గ్రామాలకు రాకపోకలు స్తంభించిపోయాయి.

కొల్లేరుకు వరద... పెనుమాకలంక రోడ్డు మూసివేత

ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షం... ఎగువ నుంచి చేరుతున్న వరద నీటితో కొల్లేరులోకి భారీగా నీరు చేరుతోంది. దీంతో మండవల్లి మండలం పెద్దఎడ్లగాడి వంతెన నుంచి పెనుమాకలంకకు వెళ్లే రహదారి కిలోమీటరుమేర జల దిగ్బంధంలో చిక్కుకుంది.

నంద్యాలలో ఉప్పొంగిన వాగులు

నంద్యాల జిల్లావ్యాప్తంగా కురిసిన వర్షాలతో వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. ఆదివారం రాత్రి నుంచి సోమవారం సాయంత్రం వరకు జిల్లాలో ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. 400 హెక్టార్లలోని మొక్కజొన్న, అరటి,జొన్న పత్తి పంటలు దెబ్బతిన్నట్లు వ్యవసాయాధికారులు అంచనా వేశారు. జిల్లాలో 765.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

సిక్కోలులో నీటమునిగిన పొలాలు, రోడ్లు

శ్రీకాకుళం జిల్లాలో కుండపోతగా వర్షం కురిసింది. టెక్కలి, శ్రీకాకుళం, పాతపట్నం, ఎచ్చెర్ల, పలాస, నరసన్నపేట నియోజకవర్గాల్లో పంటపొలాలు, రోడ్లు నీటమునిగాయి. కాగా, విజయనగరం జిల్లాలో కురుస్తున్న భారీవర్షాలకు నదులు,గెడ్డలు, వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి .జలాశయాలు పూర్తిస్థాయిలో నిండాయి. మడ్డువలస నుంచి నీటిని నాగావళిలోకి విడిచిపెడుతున్నారు. గెడ్డల్లో పెరిగిన వరద నీటికి కొన్ని గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి.

బంగాళాఖాతంలో వాయుగుండం

విశాఖపట్నం, అమరావతి, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర, దక్షిణ ఒడిశాకు ఆనుకుని పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో కొనసాగుతున్న అల్పపీడనం సోమవారం వాయుగుండంగా బలపడింది. ఇది ప్రస్తుతం ఒడిశాలోని గోపాల్‌పూర్‌కు 40 కిలోమీటర్లు, దక్షిణ ఆగ్నేయంగా, కళింగపట్నానికి 110 కిలోమీటర్లు ఈశాన్యంగా కేంద్రీకృతమై ఉంది. వాయుగుండం ఉత్తరంగా పయనించే క్రమంలో అల్పపీడనంగా బలహీనపడి మంగళవారం ఉదయం గోపాల్‌పూర్‌కు సమీపంలో తీరం దాటుతుందని వాతావరణ శాఖ తెలిపింది. మరోవైపు రుతుపవన ద్రోణి తూర్పు భాగం జగదల్‌పూర్ మీదుగా బంగాళాఖాతం వరకూ విస్తరించింది. దీనికితోడు విజయనగరం, శ్రీకాకుళం సరిహద్దుల నుంచి షీర్‌జోన్ తూర్పు, పడమర దిశగా కొనసాగుతోంది. వీటి ప్రభావంతో సోమవారం ఉదయం నుంచి కోస్తాలో అనేకచోట్ల, రాయలసీమలో పలుచోట్ల వర్షాలు, అక్కడక్కడా భారీవర్షాలు కురిశాయి. వాయుగుండం ప్రభావంతో బంగాళాఖాతంలో అలలు ఎగిసిపడుతుండడం, కోస్తా తీరం వెంబడి బలమైన గాలులు వీస్తున్నందున మత్స్యకారులు చేపల వేటకు వెళ్లరాదని విశాఖ తుఫాన్ హెచ్చరిక కేంద్రం తెలిపింది.

భారీ వర్ష సూచన

కుంభవృష్టి: శ్రీకాకుళం, విజయనగరం, అల్లూరి, పార్వతీపురం మన్యం
భారీ నుంచి అతి భారీ వర్షాలు: విశాఖ, అనకాపల్లి, కాకినాడ, యానాం, తూర్పు, ఏలూరు జిల్లాల్లో
భారీ వర్షాలు: కృష్ణా జిల్లా నుంచి ప్రకాశం, కర్నూలు జిల్లా వరకూ



శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్‌లోకి వర్షపునీరు

73,274 హెక్టార్లలోని పంటలు నీటిలోనే!

అమరావతి, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలు, వరదలకు 14 జిల్లాల్లోని 106 మండలాలకు చెందిన 828గ్రామాల్లోని 73,274 హెక్టార్లలోని పంటలు ముంపు బారినపడినట్లు వ్యవసాయశాఖ అంచనావేసింది. వరి63,740,పత్తి7,667, మినుము 573, పెసర 397, వేరుశనగ 257, కంది 51, మొక్కజొన్న 565, సజ్జ 24 హెక్టార్లలోని పంటలు నీటముంపులో ఉన్నట్లు అంచనా. గుంటూరులో 28,645, బాపట్ల16,325, పశ్చిమగోదావరి7,555, ఎన్టీఆర్ 4,619, కృష్ణా6,786,పల్నాడు2,561, ఏలూరు 2,050, కోనసీమ1,283, కాకినాడ 1,782, కర్నూలు 649, నంద్యాల581, తూర్పుగోదావరి250, అనంత143, కడపలో45 హెక్టార్లలో పంట మునిగింది.

ఆస్తి, ప్రాణ నష్టం లేకుండా చూడాలి: సీఎం

అమరావతి, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలు, వరదలపై కలెక్టర్లను అప్రమత్తం చేయాలని సీఎం చంద్రబాబు సీఎస్‌ను ఆదేశించారు. ఉత్తరాంధ్రలో పలుచోట్ల నదులు, వాగులు ఉప్పొంగి ప్రవహించడం, కొండ ప్రాంతాలు కోతకు గురికాకుండా ముందస్తు జాగ్రత్తకు చర్యలు తీసుకోవాలని సూచించారు. వర్షాల పరిస్థితిపై సచివాలయంలో సీఎస్ విజయానంద్‌తో సీఎం సమీక్ష చేశారు. భారీ వర్షాలు కొనసాగితే విద్యా సంస్థలకు సెలవులు ఇవ్వాలని సూచించారు. ముందస్తు సన్నద్ధతతో అప్రమత్తమై, ప్రాణ, ఆస్తి నష్టం లేకుండా చూడాలని ఆదేశించారు.



జెమ్స్ అండ్ జ్యూయలరీ పార్కు (ఊహాచిత్రం)

మంగళగిరికి కొత్త మెరుపు

- 78 ఎకరాల్లో గోల్డ్ క్లస్టర్ ఏర్పాటు
- స్వర్ణకారులకు ఇక శాశ్వత ఉపాధి
- ఎన్నికల్లో హామీ ఇచ్చిన నారా లోకేశ్
- అన్నట్టే రూ.ఐదు కోట్లతో సర్కారు శ్రీకారం
- 20వేలమందికి ఉపాధి.. లక్ష్యం

(మంగళగిరి - ఆంధ్రజ్యోతి)

రాజధాని ప్రాంతంలోని మంగళగిరి మరోసారి తళుక్కున మెరవనుంది. సుమారు 78 ఎకరాల విస్తీర్ణంలో 20వేల మందికిపైగా ఉపాధి కల్పించేవిధంగా మంగళగిరిలోని ఆత్మకూరులో గోల్డ్ క్లస్టర్ ఏర్పాటు కానుంది. రూ.ఐదు కోట్లతో దీనికి రూపకల్పన చేయాలని సోమవారం సీఎం చంద్రబాబు సమక్షంలో జరిగిన సీఆర్డీయే 51వ అథారిటీ సమావేశంలో కీలక నిర్ణయం తీసుకున్నారు. మంగళగిరిలో చేనేత తరువాత ఎక్కువ మంది స్వర్ణకారవృత్తిపై ఆధారపడి జీవిస్తున్నారు. దాదాపు ఎనిమిదివేలమంది ఈ వృత్తిలో ఉన్నారని అంచనా! ఈ విషయాన్ని గుర్తించిన స్థానిక శాసనసభ్యుడు...ఐటీ మంత్రి నారా లోకేశ్ తొలిసారిగా గోల్డ్ క్లస్టర్ ఆలోచనను తెరపైకి తెచ్చారు. కూటమిని గెలిపిస్తే మంగళగిరిలో అతి భారీస్థాయిలో దీనిని ఏర్పాటుచేస్తామని హామీ ఇచ్చారు. మంగళగిరిని చేనేతకు, బంగారు వ్యాపారానికి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అతిపెద్ద కేంద్రంగా మలచాలన్న పట్టుదలను ఆయన ప్రదర్శించారు. దీనిపై 'ఆంధ్రజ్యోతి' ఈ ఏడాది ఫిబ్రవరి ఒకటో తేదీ ప్రధాన సంచికలో 'మంగళగిరిలో మినీ దుబాయ్' పేరిట ప్రత్యేక కథనాన్ని ప్రచురించింది. అప్పట్లో ఈ కథనం రాష్ట్రంలో ఓ హట్ టాపిక్‌గా మారింది. నేడది కార్యరూపాన్ని దాల్చబోతుంది. మంగళగిరిలోని తెనాలిరోడ్డు వెంబడి అక్షయపాత్ర భవన సముదాయానికి దక్షిణంగా ఆత్మకూరు ప్రాంత పరిధిలో సర్వేనంబర్లు 133, 134, 135, 136లలో ఉన్న ప్రభుత్వ ఖాళీ, అసైన్డ్ భూముల్లో గోల్డ్ క్లస్టర్‌లో భాగంగా జెమ్స్ అండ్ జ్యూయలరీ పార్కు రానుంది.

స్వర్ణకారులకు స్వర్గమే..

దేశంలో నవీముంబైతోపాటు కోల్‌కతా, సూరత్, కోయంబత్తూరు వంటి నగరాల్లో జెమ్స్ అండ్ జ్యూయలరీ పార్కులు ఉన్నాయి. వీటిలో ముంబైలోని పార్కు వ్యాపారరీత్యా అతి పెద్ద వాణిజ్యకేంద్రం. దానికి దీటుగా మంగళగిరిలోనూ ఈ పార్కు ఏర్పాటుచేసేలా ప్రతిపక్షంలో ఉండగానే.. నారా లోకేశ్ స్పష్టమైన ప్రణాళికను రూపొందించారు. మంగళగిరి ప్రాంత స్వర్ణకారులకు చేతినిండా పని ఉండేలా చేయడంతోపాటు ఆర్థికంగా వారంతా మంచి ఉచ్ఛస్థితికి చేరుకునేందుకు చర్యలు చేపట్టాలని తలిచారు. అధికారం చేతికొచ్చిన తొలిరోజు నుంచే కార్యచరణను లోకేశ్ ఆరంభించారు. ఈ పార్కుకోసం స్వర్ణకారులను సిద్దంచేసే పనిని లోకేశ్ తన భుజాలకు ఎత్తుకున్నారు. అయిదంతస్తుల భవనాన్ని అద్దెకు తీసుకుని సొంత ఖర్చులతో ఎల్ఎన్ గోల్డ్‌స్మిత్ ఫౌండేషన్‌ను ప్రారంభించారు. ఆ సంస్థ ఆధ్వర్యంలో మంగళగిరి పరిధిలోని స్వర్ణకారులందరికీ ఆధునిక డిజైన్ల తయారీపై శిక్షణ ఇప్పించనున్నారు. ఈ ఫౌండేషన్‌లో 77మంది సభ్యులు ఉండగా, 670 మంది స్వర్ణకారులకు ఇక్కడ ఆధునిక మోడళ్లలో ఆభరణాల తయారీకి శిక్షణ అందించనున్నారు. ఇక.. జెమ్స్ అండ్ జ్యూయలరీ పార్కులో రత్నాలు, బంగారంతో కూడిన ఆభరణాలను అత్యంత నైపుణ్యంతో, అంతర్జాతీయ ప్రమాణాలతో తయారుచేస్తారు.

1 నుంచి అమల్లోకి కొత్త బార్ పాలసీ

నోటిఫికేషన్ విడుదల

అమరావతి, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): నూతన బార్ పాలసీ నోటిఫికేషన్‌ను విడుదల చేసినట్లు ఎక్సైజ్ డైరెక్టర్ నిషాంత్ కుమార్ వెల్లడించారు. ఈనెల 26 వరకు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ రెండు రూపాల్లోనూ దరఖాస్తు చేసుకునేందుకు గడువు ఉందన్నారు. 28న ఉదయం లాటరీ ద్వారా లైసెన్సీలను ఎంపిక చేస్తామని, సెప్టెంబరు 1 నుంచి కొత్త బార్ పాలసీ అమల్లోకి వస్తుందని వివరించారు. మంగళగిలోని ఎక్సైజ్ కమిషనర్ కార్యాలయంలో సోమవారం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ రాహుల్‌దేవ్ శర్మతో కలిసి విలేకరులకు వివరాలను వెల్లడించారు. బార్ పాలసీలో అనేక మార్పులు తీసుకొచ్చామన్నారు. 840 బార్లకు ప్రస్తుతం నోటిఫికేషన్ జారీచేశామని, అందులో 10శాతం(84 బార్లను) గీత కులాలకు ప్రభుత్వం కేటాయించిందని వాటికి బుధవారం నోటిఫికేషన్ జారీచేసి, 30న లాటరీ నిర్వహిస్తామని తెలిపారు. గీత కులాల బార్లకు 50శాతం లైసెన్స్ ఫీజు ఉంటుందన్నారు. సాధారణ బార్లకు జనాభా ఆధారంగా రూ.35 లక్షలు, రూ.55 లక్షలు, రూ.75 లక్షలు చొప్పున లైసెన్స్ ఫీజులు నిర్ణయించామని చెప్పారు. గత బార్ పాలసీలో వేలం విధానం వల్ల చాలా ప్రాంతాల్లో లైసెన్స్ ఫీజు రూ.కోటి దాటిందన్నారు. ఈసారి ఒకే లైసెన్స్ ఫీజు ఉండేలా లాటరీ విధానం తెచ్చామని చెప్పారు. దరఖాస్తు రుసుం గతంలో మూడు కేటగిరీల్లో రూ.5లక్షల నుంచి రూ.10 లక్షలు ఉండగా, ఇప్పుడు అందరికీ ఒకే విధంగా రూ.5లక్షలు చేశామన్నారు. బార్ వ్యాపారంలోకి కొత్తవారు రావాలనే ఉద్దేశంతో ప్రతి బార్‌కు నాలుగు దరఖాస్తులు తప్పనిసరి చేశామని, దీనివల్ల గుత్తాధిపత్యం తగ్గుతుందని చెప్పారు. లైసెన్స్ ఫీజు ఆరు విడతల్లో చెల్లించే వెసులుబాటు కల్పించామన్నారు. బార్ల పనివేళలను ఉదయం 11 నుంచి రాత్రి 11 వరకు కాకుండా ఉదయం 10 నుంచి రాత్రి 12 గంటల వరకు మార్చామన్నారు.

ఏపీ మోడల్ విద్యా విధానాన్ని దేశానికి మార్గదర్శకం చేస్తాం

- పాఠశాల విద్య కార్యదర్శి కోన శశిధర్

ఏపీ మోడల్ విద్యా విధానం దేశానికి మార్గదర్శకంగా మారాలని, అదే అందరి లక్ష్యం కావాలని పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ స్పష్టం చేశారు. వికసిత్ భారత్-2047 ప్రణాళికలో భాగంగా పాఠశాల విద్యాశాఖ సోమవారం విజయవాడలో నిర్వహించిన 'స్కూలింగ్-బిల్డింగ్ బ్లాక్స్' సదస్సులో ఆయన మాట్లాడారు.

డిప్యూటీ సీఎంపై దర్యాప్తు జరిపించండి

- చిత్ర ప్రమోషన్‌లో అధికార దుర్వినియోగం
- హైకోర్టులో మాజీ ఐఏఎస్ విజయ్‌కుమార్ పిటిషన్
- నోటీసుల జారీకి కోర్టు నిరాకరణ.. విచారణ వాయిదా

అమరావతి, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ 'హరిహర వీరమల్లు' సినిమా ప్రమోషన్‌లో ప్రభుత్వ నిధులు, అధికార యంత్రాంగాన్ని వినియోగించారని, ఆయనపై స్వతంత్ర దర్యాప్తునకు ఆదేశించాలంటూ మాజీ ఐఏఎస్ అధికారి విజయ్‌కుమార్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ప్రభుత్వ భద్రతా సిబ్బంది, అధికారిక వాహనాలు, ఇతర వనరులను సినిమా కార్యక్రమాలకు వినియోగించడం ప్రజాధనాన్ని దుర్వినియోగం చేయడమే అవుతుందన్నారు. ఉపముఖ్యమంత్రి సినిమాల్లో నటన కొనసాగించడాన్ని అనైతికం, రాజ్యాంగవిరుద్ధమైన చర్యగా ప్రకటించాలని కోరారు. ఇకపై పవన్ కల్యాణ్ సినిమాల్లో నటించకుండా నిరోధించాలని అభ్యర్థించారు. ఈ వ్యాజ్యం సోమవారం హైకోర్టు ముందు విచారణకు వచ్చింది. విచారణ సందర్భంగా రాష్ట్ర హోంశాఖ తరఫు ప్రభుత్వ న్యాయవాది జయంతి స్పందిస్తూ...ఉపముఖ్యమంత్రిని వ్యక్తిగత హోదాలో ప్రతివాదిగా చేర్చడంపై అభ్యంతరం తెలిపారు. వ్యాజ్యం మొదటిసారి విచారణకు వచ్చిందని, అడ్వకేట్ జనరల్ వాదనలు వినిపిస్తారన్నారు. వ్యాజ్యాన్ని పరిశీలించిన న్యాయమూర్తి జస్టిస్ జోతిర్మయి ప్రతాప సీబీఐ, ఏసీబీ తరఫు పబ్లిక్ ప్రాసిక్యూటర్ల పేర్లను కేసుల విచారణ జాబితాలో (కాజ్‌లిస్ట్) పేర్కొనకపోవడాన్ని తప్పుపట్టారు. వారి పేర్లను చేర్చాలని రిజిస్ట్రీని ఆదేశిస్తూ విచారణను వాయిదా వేశారు. ప్రతివాదులకు నోటీసులు జారీ చేయాలని పిటిషనర్ తరఫు న్యాయవాది చేసిన అభ్యర్థనను తోసిపుచ్చారు. ఈ దశలో ఎలాంటి నోటీసులు జారీ చేయలేమని, ప్రాథమిక విచారణ అనంతరం తగిన ఉత్తర్వులు జారీ చేస్తామని పేర్కొన్నారు. విచారణను వారంరోజులకు వాయిదా వేశారు.

సిఫారసులతోనే రెండు జిల్లాల్లో ఎక్కువ బదిలీలు

- ఉమ్మడి కృష్ణా, కర్నూలులో మళ్లీ కౌన్సెలింగ్ నిర్వహించండి
- విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్స్ బదిలీలపై కలెక్టర్లకు హైకోర్టు ఆదేశం
- ఇతర జిల్లాల విషయంలో జోక్యానికి నిరాకరణ

ఉమ్మడి కృష్ణా, కర్నూలు జిల్లాల్లోని గ్రామ సచివాలయాల్లో పని చేసే విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్స్‌ను బదిలీ చేసిన విధానాన్ని హైకోర్టు తప్పుపట్టింది. ఈ రెండు జిల్లాల్లో ప్రజాప్రతినిధుల సిఫారసు ఆధారంగా ఎక్కువ బదిలీలు జరిగాయని చెప్పింది. కార్యనిర్వాహక ఆదేశాలు పక్కనపెట్టి సిఫారసుల ఆధారంగా బదిలీ చేయడమంటే సమాంతరపాలన భావన కలిగిస్తోందని తెలిపింది. నిబంధనల అమలులో అధికారులు విఫలమయ్యారని పేర్కొంది. ఆ రెండు జిల్లాల్లో మళ్లీ కౌన్సెలింగ్ నిర్వహించి బదిలీ ప్రక్రియను అమలు చేయాలని కలెక్టర్లను ఆదేశించింది. ఇతర జిల్లాల్లో సిఫారసులు పెద్దగా లేనందున జోక్యం చేసుకోబోమంది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్.విజయ్ ఇటీవల కీలక తీర్పు ఇచ్చారు.

కైలాసగిరికి మరో ఆకర్షణ

- 55 అడుగుల ఎత్తైన త్రిశూలం ఏర్పాటుకు శంకుస్థాపన
- బీచ్ రోడ్డులో హెలికాప్టర్ మ్యూజియం ప్రారంభం

విశాఖపట్నం, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలో ప్రముఖ పర్యాటక కేంద్రం కైలాసగిరికి విశాఖ మహా నగర ప్రాంత అభివృద్ధి సంస్థ (వీఎంఆర్‌డీఏ) మరిన్ని హంగులు సమకూరుస్తోంది. ఇక్కడ 55 అడుగుల ఎత్తైన త్రిశూలం నిర్మాణానికి జిల్లా ఇన్‌చార్జి మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి సోమవారం శంకుస్థాపన చేశారు. హోం మంత్రి వంగలపూడి అనిత పాల్గొన్నారు. కార్యక్రమంలో వీఎంఆర్‌డీఏ ఛైర్మన్ ప్రణవ్ గోపాల్ మాట్లాడుతూ 'ఈ త్రిశూలం హనుమంతవాక వైపు ఉంటుంది. చీకటి పడ్డాక వెలుగులు విరజిమ్ముతుంది. ఢమురకం కూడా ఉంటుంది. రూ.1.55 కోట్లు వెచ్చిస్తున్నాం' అని వివరించారు. ఆ తరువాత బీచ్ రోడ్డులో కొత్తగా ఏర్పాటు చేసిన యూహెచ్-3 హెచ్ హెలికాప్టర్ మ్యూజియాన్ని మంత్రులు డోలా, వంగలపూడి కలసి ప్రారంభించారు. దీనికి రూ.3.5 కోట్లు ఖర్చు చేశారు. ఇప్పటికే బీచ్ రోడ్డులో కురుసుర సబ్‌మెరైన్, టీయూ-142, సీ హ్యారియర్ యుద్ధ విమానాల మ్యూజియాలు ఉండగా వాటి సరసన కొత్తగా యుహెచ్-3 హెచ్ చేరింది. ఎమ్మెల్యేలు విష్ణుకుమార్‌రాజు, వంశీకృష్ణ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



త్రిశూలం నమూనా

ఉప రాష్ట్రపతి ఎన్నికలో
ఎన్డీఏకి జగన్ జై!

» తమ అభ్యర్థి రాధాకృష్ణన్‌కు మద్దతు కోసం రాజ్‌నాథ్ ఫోన్

» సానుకూలంగా స్పందించిన మాజీ సీఎం

అమరావతి, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో ఎన్డీఏకి వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి జై కొట్టారు. రక్షణ మంత్రి, బీజేపీ అగ్ర నేత రాజ్‌నాథ్‌సింగ్ సోమవారం ఆయనకు ఫోన్ చేశారు. ఈ ఎన్నికను ఏకగ్రీవం చేయాలని తాము భావించినా.. ఇండియా కూటమి తన అభ్యర్థిని బరిలోకి దింపాలని నిర్ణయించడంతో పోటీ అనివార్యమైందని తెలిపారు. ఎన్డీఏ అభ్యర్థిగా మహారాష్ట్ర గవర్నర్, తమిళనాడుకు చెందిన సీపీ రాధాకృష్ణన్‌ను రంగంలోకి దింపుతున్నామని, ఆయన్ను బలపరచాలని జగన్‌ను కోరారు. ఇందుకు మాజీ సీఎం సానుకూలంగా స్పందించారు. ప్రస్తుతం వైసీపీకి లోక్‌సభలో నలుగురు, రాజ్యసభలో ఏడుగురు.. మొత్తం 11 మంది సభ్యులు ఉన్నారు. తొలి నుంచి జగన్ ఎన్డీఏకే మద్దతిస్తూ వస్తున్నారు. గతంలో అధికారంలో ఉన్నప్పుడు.. రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి ఎన్నిక సమయాల్లో, పార్లమెంటులో కీలక బిల్లుల ప్రవేశపెట్టినప్పుడు అండగా నిలిచారు. ఇప్పుడు కూడా రాజ్‌నాథ్ కోరగానే.. రాధాకృష్ణన్‌కు వైసీపీ సభ్యులు ఓటు వేసేలా చూస్తానని హామీ ఇచ్చారు.


కొలనుభారతిలో జల సవ్వడులు

కొత్తపల్లి, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా కొత్తపల్లి మండలంలోని కొలనుభారతి పుణ్యక్షేత్రానికి అతి సమీపంలో ఉన్న నల్లమల అరణ్యంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు జలపాతాల హొయలు ఆకట్టుకుంటున్నాయి. ఎత్తయిన కొండపై నుంచి జాలువారుతున్న ఈ జలపాతం కొలనుభారతికి కిలోమీటరు దూరంలో ఉంది. ఈ జలపాతం వద్ద సేదదీరేందుకు యువత పెద్ద ఎత్తున తరలివస్తున్నారు.



గుమ్మితం అందాలు అదరహో..!

ఆత్మకూరు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా ఆత్మకూరు మండల పరిధిలోని నల్లమల అడవుల్లో గుమ్మితం జలపాతం ఎంతగానో ఆకట్టుకుంటోంది. ఎత్తయిన కొండలు, దుర్భేద్యమైన లోయల నుంచి ప్రవహిస్తూ ఒక్కసారిగా జాలువారే ఈ జలపాత అందాలను ఆకట్టుకుంటున్నాయి. అయితే గుమ్మితం జలపాతం అందాలను చూడాలంటే మాత్రం అంత సులువు కాదు. టైగర్ రిజర్వ్ ఫారెస్ట్ కావడంతో ఇక్కడ నిబంధనలు కఠినంగానే ఉంటాయి. అటవీశాఖ అధికారుల అనుమతి ఉంటేనే గుమ్మితం ప్రాంతానికి చేరుకోగలం.



దాతృత్వపు వెలుగులు



11 ఎకరాల భూమి పత్రాలు, రూ. 2 కోట్లు ఎమ్మెల్యేల చేతుల మీదుగా ఎల్‌వీ ప్రసాద్ ఆసుపత్రుల డైరెక్టర్ ప్రశాంత్ గార్గ్‌కు అందిస్తున్న దాత దమయంతి, మాజీ ఐఏఎస్ రాజు

» జన్మభూమి రుణం తీర్చుకునేందుకు భారీ విరాళాలు

» ఏలూరు జిల్లా లక్ష్మీపురంలో దాతల సాయంతో కంటి ఆస్పత్రి నిర్మాణం

దెందులూరు, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): పల్లెటూరులో పుట్టినా అకుంఠిత కృషితో ఉన్నత స్థానాలను అధిరోహించారు. జన్మభూమి రుణం తీర్చుకునేందుకు భూరి విరాళాలతో ఇప్పుడు ముందుకొచ్చారు. దాతృత్వపు వెలుగులతో ఎందరికో స్ఫూర్తిగా నిలిచారు. ఏలూరు జిల్లా పెదవేగి మండలం వంగూరు(లక్ష్మీపురం)లో పుట్టిన ఆ దాతలు, తమ గ్రామస్తులు ఎవరికీ కంటి సమస్యలు లేకుండా చూడాలని నిర్ణయించారు. దీనికోసం గ్రామానికి చెందిన కాసరనేని దమయంతి, మాజీ ఐఏఎస్ అధికారి కొప్పుల రాజు దంపతులు 11 ఎకరాల భూమి, రెండు కోట్ల నగదును విరాళంగా ఇచ్చారు. అలాగే గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐ వాణీ శ్రీరామ్ రూ. 2 కోట్లు, రిజర్వ్ బ్యాంక్ మాజీ గవర్నర్ దువ్వూరి సుబ్బారావు రూ.కోటి, వంశీ మొక్కజొన్న సీడ్స్ సంస్థల అధినేత ఆర్.రామారావు రూ. కోటి విరాళంగా ప్రకటించారు. ఇక ఆస్పత్రి నిర్మాణానికి ఎల్‌వీ ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్ ముందుకొచ్చింది. పేదలకు ఉచితంగా కంటి వైద్యం అందించేందుకు అంగీకరించింది. దీంతో ఆస్పత్రి నిర్మాణానికి సోమవారం దెందులూరు, ఏలూరు, కైకలూరు, తణుకు, విజయవాడ ఈస్ట్ ఎమ్మెల్యేలు చింతమనేని ప్రభాకర్, బడేటి చంటి, కామినేని శ్రీనివాస్, ఆరిమిల్లి రాధాకృష్ణ, గద్దే రామ్మోహన్‌రావు, కేంద్ర మాజీ మంత్రి జేడీ శీలంతో కలిసి దాతలు భూమి పూజ చేశారు. దీనికి 'కాసరనేని గోపాలకృష్ణయ్య ప్రాంగణం-కాసరనేని పరిపూర్ణ లక్ష్మీ నేత్ర సంరక్షణ కేంద్రం'గా నామకరణం చేశారు. ఆస్పత్రికి రోడ్డు కోసం రూ. 30 లక్షల విలువైన 61 సెంట్ల భూమిని మరో దాత, దమయంతి సోదరుడు, మాజీ జడ్పీటీసీ కాసరనేని విద్యాసాగర్ విరాళంగా అందించారు. దాతలను ఎమ్మెల్యేలు అభినందించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో పలువురు నేతలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఐదేళ్ల క్రితమే డాక్టర్ నమ్రత అరెస్ట్

» విశాఖలో ఆరుగురు శిశువుల విక్రయం కేసులో జైలుకు

» ఒక్కొక్కటిగా వెలుగుచూస్తున్న 'సృష్టి' ఎండీ ఆగడాలు



విశాఖపట్నం, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): 'సృష్టి' ఫెర్టిలిటీ సెంటర్ ఎండీ డాక్టర్ నమ్రత అరాచకాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. విశాఖపట్నం కేంద్రంగా ఐవీఎఫ్, సరోగసీ పేరుతో ఆమె గతంలోనూ అనేక అక్రమాలకు పాల్పడింది. ఆరుగురు నవజాత శిశువుల విక్రయం కేసులో 2020లో నమ్రతను విశాఖ పోలీసులు అరెస్టు చేశారు. ఆ కేసులో ఆమె మూడు నెలలపాటు జైలు జీవితాన్ని గడిపిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. 'సృష్టి' పేరుతో సాగించిన అక్రమాలపై అప్పట్లో కొందరు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మహారాణిపేట పోలీసులు కేసు నమోదుచేసి విచారణ అనంతరం నమ్రతను అరెస్టు చేసి జైలుకు పంపారు. ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలోని వి.మాడుగులలో యూనివర్సల్ సృష్టి పేరుతో ఒక సెంటర్‌ను ఏర్పాటుచేసి కొంతమంది చిన్నారులను అక్రమంగా విక్రయించినట్టు తేలింది. అవాంఛిత గర్భం దాల్చిన మహిళలకు అక్కడ ప్రసవం చేసి పుట్టిన పిల్లలను ఏజెంట్ల ద్వారా ఇతర ప్రాంతాల వారికి విక్రయించేవారు. అటువంటి మహిళలను గుర్తించేందుకు ప్రత్యేకంగా గ్రామీణ ప్రాంతాల్లో మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేసేవారు. దీనికోసం ఆమె ఆశా కార్యకర్తల సహకారం తీసుకునేవారు. అప్పటి కేసు విచారణ ఇంకా కొనసాగుతోంది. 2020లో అరెస్టయి బయటకు వచ్చిన తర్వాత కూడా డాక్టర్ నమ్రత అడ్డగోలు వ్యవహారాలను ఆపలేదు. తన అక్రమాలకు విశాఖను అడ్డాగా మలచుకున్నారు. ఐవీఎఫ్, సరోగసీ కోసం సికింద్రాబాద్ సెంటర్‌కు వచ్చే వారి నుంచి లక్షలాది రూపాయలు వసూలు చేసి, అవాంఛిత గర్భం దాల్చిన మహిళల నుంచి పిల్లలను సేకరించి వారికి అప్పగించేవారు. దీనికోసం ప్రభుత్వ ఆస్పత్రుల్లోని వైద్యులను కూడా ఆమె వినియోగించుకున్నారు. తాజా కేసులో నమ్రతతోపాటు 24 మంది అరెస్టయ్యారు. ఇందులో ఇద్దరు కేజీహెచ్ వైద్యులు, మరో ఆరుగురు ఏజెంట్లు, శ్రీకాకుళం జిల్లాకు చెందిన మరో వైద్యురాలు ఉన్నారు.

మీరు అడుగు పెడితే అలజడే!

» తాడిపత్రికి రావడానికి వీల్లేదు

» మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డికి తేల్చి చెప్పిన అనంత పోలీసులు



డీఎస్పీ వెంకటేశ్వర్లుతో మాట్లాడుతున్న పెద్దారెడ్డి

పుట్లూరు, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): "మీరు వస్తే అలజడి రేగుతుంది. శాంతి భద్రతల సమస్య వస్తుంది. కాబట్టి మీరు రావడానికి వీల్లేదు." అని అనంతపురం జిల్లా తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డికి పోలీసులు తేల్చి చెప్పారు. ఆయనను తాడిపత్రిలోకి అడుగు పెట్టకుండా అడ్డుకున్నారు. సోమవారం ఉదయం తన స్వగ్రామం యల్లనూరు మండలంలోని తిమ్మంపల్లి నుంచి పెద్దారెడ్డి తాడిపత్రికి బయలుదేరారు. పుట్లూరు మండలం నారాయణరెడ్డిపల్లి గ్రామ శివారులో పోలీసులు పెద్దారెడ్డి సహా ఆయన వెంట వస్తున్న వాహనాలను నిలిపివేశారు. పెద్దారెడ్డితో తాడిపత్రి రూరల్ డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐ సత్యబాబు మాట్లాడారు. శివుని విగ్రహావిష్కరణకు తాడిపత్రికి భారీ ఎత్తున టీడీపీ శ్రేణులు వచ్చాయని, అక్కడ సమస్య తలెత్తే ప్రమాదం ఉందని, వెనుదిరగాలని పెద్దారెడ్డికి నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. దీనికి పెద్దారెడ్డి ససేమిరా అన్నారు. తనకు కోర్టు అనుమతి ఉందంటూ పోలీసులతో వాగ్వాదానికి దిగారు. పోలీసులు అడ్డగింతతో సాయంత్రం వరకు అక్కడే ఉండిపోయారు. అక్కడకి వచ్చిన మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్ కూడా పోలీసులతో వాగ్వాదానికి దిగారు. పోలీసులు అనుమతించకపోవడంతో పెద్దారెడ్డి తిరిగి తిమ్మంపల్లికి వెళ్లిపోయారు.

రాష్ట్రాభివృద్ధికి సహకరించండి



కేంద్రమంత్రులు పీయూష్ గోయల్ , జై శంకర్, జేపీ నడ్డా, అశ్వినీ వైష్ణవ్, హర్దీప్‌సింగ్ పూరిలను సత్కరిస్తున్న మంత్రి లోకేశ్



ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో భేటీ అయిన మంత్రి లోకేశ్

(మొదటి పేజీ తరువాయి)

శాఖల మంత్రి అశ్వినీ వైష్ణవ్.. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌లతో వరుస భేటీలు నిర్వహించారు. కేంద్రం నుంచి అందాల్సిన సహకారం, అభివృద్ధి పనులు, పెండింగ్ ప్రాజెక్టులు తదితర అంశాలపై సమగ్రంగా చర్చించారు. ఇటీవల సీఎం చంద్రబాబు నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వ బృందం సింగపూర్‌లో పర్యటించిందని, వివిధ రంగాల్లో రాష్ట్రాభివృద్ధికి ఆ దేశ ప్రభుత్వంతో జరిగిన చర్చల గురించి వివరించారు. పెండింగ్ ప్రాజెక్టుల సాధనకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. కేంద్ర సహకారంతో రాష్ట్రానికి జీవనాడి అయిన పోలవరం, రాజధాని అమరావతి పనులు మళ్లీ పట్టాలెక్కాయని తెలిపారు. డబుల్ ఇంజన్ సర్కారుతో రాష్ట్రం వేగంగా అభివృద్ధి చెందుతోందన్నారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా తొలిసారిగా పార్లమెంటు ప్రాంగణంలోని టీడీపీ పార్లమెంటరీ పార్టీ కార్యాలయాన్ని లోకేశ్ సందర్శించారు. ఆయన్ను పౌరవిమానయాన మంత్రి రామ్మోహన్‌నాయుడు, టీడీపీ, జనసేన ఎంపీలు ఘనంగా సత్కరించారు. అలాగే నిర్మలా సీతారామన్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చాక ఉదారంగా ఆర్థిక సాయం అందిస్తున్నందుకు ధన్యవాదాలు తెలియజేశారు. కేంద్ర వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్‌ను కూడా లోకేశ్ కలిశారు. రాష్ట్రంలో జీడి, మామిడి, మిర్చి బోర్డులు ఏర్పాటుచేయాలని కోరారు.

ముమ్మరంగా సాగు పనులు..

ఖరీఫ్‌లో వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగుతున్నాయని, యూరియా కొరత ఉందని, వెంటనే కేటాయించాలని నడ్డాను లోకేశ్ విజ్ఞప్తి చేశారు. నడ్డా సానుకూలంగా స్పందించారు. బుధవారం (21వ తేదీ) నాటికి 29 వేల మెట్రిక్ టన్నుల యూరియా కేటాయిస్తామని హామీ ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక పరిశ్రమల అభివృద్ధి, యువతకు ఉపాధి కోసం ప్లాస్టిక్ పార్క్ ఏర్పాటుకు సహకరించాలని లోకేశ్ కోరారు. విశాఖ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాసూటికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ (నైపర్) శాశ్వత క్యాంపస్ ఏర్పాటు చేయాలని, ఇందుకు వందెకరాల భూమి సిద్ధంగా ఉందన్నారు.

వలస వెళ్లే కార్మికుల సంక్షేమానికి బీమా..

విశాఖలో ఏఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్, డేటా సిటీ ఏర్పాటుకు సహకరించాలని విదేశాంగ మంత్రి జైశంకర్‌ను లోకేశ్ కోరారు. 'సుమారు 35 లక్షల మంది ప్రవాసాంధ్రులు విదేశాల్లో ఉద్యోగ, వ్యాపార రంగాల్లో ఉన్నారు. అమెరికాలో 10 లక్షలు, గల్ఫ్ దేశాల్లో 8 లక్షలు, ఐరోపా దేశాల్లో 4 లక్షల మంది ప్రవాసాంధ్రులు ఉన్నారు. ఆంధ్రప్రదేశ్ నుంచి వలస వెళ్లే కార్మికుల సంక్షేమం, భద్రత, గౌరవం కల్పించేందుకు ప్రవాస భారతీయ బీమా యోజన వంటి పథకాలను విస్తరించండి. ఫిర్యాదుల పరిష్కారం కోసం ఏపీలో ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేయాలి. వలస కార్మికులకు ఓవర్సీస్ శిక్షణ, మైగ్రేషన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కోసం ఫాస్ట్‌ట్రాక్ అనుమతులు, నిధులు ఇవ్వండి. యువతకు మెరుగైన విదేశీ ఉద్యోగావకాశాల కల్పనకు కేంద్రం నుంచి డేటా షేరింగ్‌కు సహకరించండి' అని కోరారు.

జలరవాణాకు సహకరించండి..

మారిటైమ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, పోర్టుల ఆధారిత అభివృద్ధి, జల రవాణా ప్రాజెక్టులకు సహకారం అందించాలని కేంద్ర మంత్రి సోనోవాల్‌ను లోకేశ్ కోరారు. రాష్ట్ర విభజన చట్టం కింద హామీ ఇచ్చిన దుగరాజపట్నం ఓడరేవు నిర్మాణాన్ని వేగవంతం చేయాలన్నారు. అక్కడ ప్రధాన ఓడరేవుతోపాటు 2వేల ఎకరాల్లో రూ.3,500 కోట్ల పెట్టుబడితో నౌకా నిర్మాణం, మరమ్మతుల కేంద్రం నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధంగా ఉన్నాయని, పోర్టు అనుబంధ రంగాల్లో రూ.26 వేల కోట్ల పెట్టుబడులతో ఐదు వేల మందికి ప్రత్యక్ష ఉపాధి, 30 వేల మందికి పరోక్ష ఉపాధి లభిస్తుందని వివరించారు. సాగర్‌మాలలో రాష్ట్రంలో రూ.1.14 లక్షల కోట్ల విలువైన 110 ప్రాజెక్టులు వివిధ దశల్లో ఉన్నాయని, రామాయపట్నం, మచిలీపట్నం, మూలపేట, కాకినాడ యాంకరేజ్ పోర్టుల్లో వార్ఫులు, స్లిప్‌వేల అప్‌గ్రేడ్, జీవవైవిధ్యం కోసం రూ.200 కోట్లు మంజూరు చేయాలని కోరారు. గోదావరి-కృష్ణా నదులపై కొత్త జలరవాణా మార్గాలు, కార్గో టెర్మినల్స్, ఫ్లోటింగ్ జెట్టీల అభివృద్ధికి రూ.127.5 కోట్లు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

క్వాంటమ్ వ్యాలీకి ఆర్థిక సాయం..

అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ, డిజిటల్ మౌలిక సదుపాయాలు, క్వాంటమ్ ఆవిష్కరణల్లో ముందున్న ఆంధ్రప్రదేశ్‌కు సహకారం అందించాలని మంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను లోకేశ్ కోరారు. రాష్ట్రానికి ఇటీవల సెమీకండక్టర్ మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్ మంజూరు చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. మొట్టమొదటి జాతీయస్థాయి క్వాంటమ్ క్లస్టర్‌గా అమరావతి క్వాంటమ్ వ్యాలీ పార్కుకు, రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌కు నేషనల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌గా ఆమోదం తెలపాలని విజ్ఞప్తి చేశారు. క్వాంటమ్ వ్యాలీకి రూ.1,000 కోట్లు, రతన్ టాటా హబ్‌కు రూ.300 కోట్లు సాయం అందించాలని కోరారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్, ర్యాపిడ్ టెక్ ఇంక్యుబేషన్, క్వాంటమ్, బయోటెక్, గ్రీన్ టెక్నాలజీ రంగాల్లో ఎమ్ఎస్ఎంఈల ప్రోత్సాహానికి కేంద్ర మంత్రి అంగీకరించారు.

సత్వరమే రిఫైనరీ కార్యకలాపాలు

రాష్ట్రంలో బీపీసీఎల్ సంస్థ నిర్మించే రిఫైనరీ కమ్ పెట్రోకెమికల్ కాంప్లెక్స్ త్వరితగతిన కార్యకలాపాలను ప్రారంభించేందుకు సహకరించాలని పెట్రోలియం మంత్రి పురీని లోకేశ్ కోరారు. ఈ ఏడాది చివరికి బీపీసీఎల్ రిఫైనరీని ప్రారంభించేందుకు రాష్ట్రప్రభుత్వం తరఫున అన్నివిధాలా సహాయ, సహకారాలు అందిస్తున్నామని, కేంద్రం తన వంతుగా ప్రాజెక్టు త్వరితగతిన పూర్తిచేసేందుకు తోడ్పాటునివ్వాలని అభ్యర్థించారు. రాష్ట్రంలో దీపం-2 పథకం కింద బీపీఎల్ కుటుంబాలకు ప్రతిఏటా ఉచితంగా మూడు గ్యాస్ సిలెండర్లను అందజేస్తున్నామని, దీనిని ప్రధానమంత్రి ఉజ్వల యోజన (పీఎంయూవై)తో అనుసంధానం చేయాలని కోరారు.

హైదరాబాద్-గొల్లపూడి ప్రాజెక్టును అమరావతితో అనుసంధానించండి



కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీతో సమావేశమైన మంత్రి లోకేశ్

విజయవాడ బెంజ్ సర్కిల్ వద్ద ట్రాఫిక్ రద్దీ దృష్ట్యా కానూరు-మచిలీపట్నం నడుమ ఆరు లైన్ల రోడ్డు విస్తరణకు వెంటనే ఉత్తర్వులు జారీ చేయాలని గడ్కరీని లోకేశ్ అభ్యర్థించారు. 'హైదరాబాద్-అమరావతి మధ్య కనెక్టివిటీలో ఎన్‌హెచ్-65 జాతీయ రహదారిది కీలక పాత్ర. ఇప్పటికే మంజూరైన హైదరాబాద్-గొల్లపూడి రహదారి విస్తరణ ప్రాజెక్టును అమరావతితో అనుసంధానించేలా డీపీఆర్‌లో చేర్చండి. విజయవాడలో ట్రాఫిక్ రద్దీ తగ్గించడానికి తూర్పు బైపాస్ రోడ్డు నిర్మాణానికి సహకరించండి. ఎన్‌హెచ్-16 వెంబడి విశాఖలో 20 కిమీ, విజయవాడలో 14.7 కిమీ మేర డబుల్ డెక్కర్ ఫ్లైఓవర్ ప్లస్ మెట్రో కారిడార్ల కోసం నాగపూర్ మోడల్‌లో అభివృద్ధి ప్రణాళిక సిద్ధం చేశాం. కర్నూలు-ఎమ్మిగనూరు రహదారి విస్తరణ, బైపాస్ రోడ్డు నిర్మాణం, వినుకొండ-గుంటూరు మధ్య ఎన్‌హెచ్ 544డీ, కాకినాడ పోర్టు-ఎన్‌హెచ్ 216 మధ్య దక్షిణ రహదారి, కాణిపాకం వినాయక దేవాలయం లింక్ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టండి. బెంగళూరు-చెన్నై రహదారికి నేరుగా కనెక్టివిటీ కోసం రూ.3 వేల కోట్లతో కుప్పం-హోసూరు-బెంగళూరు మధ్య 56 కిలోమీటర్ల మేర గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణానికి వేగంగా అనుమతులు మంజూరు చేయండి' అని తెలిపారు.

రాధాకృష్ణన్ క్రమశిక్షణ, పట్టుదలకు మారుపేరు: లోకేశ్

ఎన్డీయే ఉపరాష్ట్రపతి అభ్యర్థి సీపీ రాధాకృష్ణన్‌కు రాష్ట్ర మంత్రి లోకేశ్ శుభాకాంక్షలు తెలిపారు. సోమవారం ఢిల్లీలో ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిశారు. మహారాష్ట్రతో పాటు పలు రాష్ట్రాలకు గవర్నర్‌గా పనిచేసిన అనుభవం రాబోయే రోజుల్లో దేశానికి సమర్థ సేవలు అందించడానికి ఆయనకు ఉపకరిస్తుందన్నారు. క్రమశిక్షణ, పట్టుదలకు మారుపేరైన రాధాకృష్ణన్ తమలాంటి కొత్తతరానికి ఆదర్శంగా నిలుస్తారని అన్నారు. రాధాకృష్ణన్‌కు శుభాకాంక్షలు తెలిపిన వారిలో కేంద్ర మంత్రులు రామ్మోహన్‌నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, టీడీపీపీ నేత లావు శ్రీకృష్ణదేవరాయలు, టీడీపీ ఎంపీలు ఉన్నారు.

అడవిలో అంతర్రాష్ట్ర దొంగల ముఠా

» 'వల'పన్ని.. డ్రోన్ల సాయంతో పట్టుకున్న పోలీసులు

» మారణాయుధాలు, బంగారం, నగదు స్వాధీనం

» అత్యాచారాలు, దోపిడీలు, హత్య కేసుల్లో నిందితులు

» నిందితులంతా నంద్యాల జిల్లాకు చెందినవారే

» శ్రీసత్యసాయి జిల్లా అటవీ ప్రాంతంలో ఆర్నెల్లుగా ఆవాసం



చెక్కవారిపల్లి అడవిలో దొంగల స్థావరాన్ని చుట్టుముట్టిన పోలీసు బలగాలు

తనకల్లు, నంద్యాల, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): శ్రీసత్యసాయి జిల్లా తనకల్లు మండలం చెక్కవారిపల్లి సమీప అటవీ ప్రాంతంలో ఆవాసముంటున్న అంతర్రాష్ట్ర దొంగల ముఠాను పోలీసులు సోమవారం అదుపులోకి తీసుకున్నారు. ఇందుకోసం 'వల'పన్ని.. డ్రోన్లు సైతం ఉపయోగించి పట్టుకున్నారు. నంద్యాల జిల్లా పాణ్యంలోని చెంచు కాలనీకి(ఇందిరమ్మ కాలనీ) చెందిన వీరు.. వివిధ నేరాలకు పాల్పడ్డారని, దోపిడీ దొంగలని పోలీసులు గుర్తించారు. బొగ్గులు కాల్చే పేరిట అటవీ ప్రాంతంలో స్థావరం ఏర్పరుచుకున్నారని నిర్ధారించారు. వీరిలో ఇద్దరు జీవిత ఖైదీలు కూడా ఉండడం గమనార్హం. వివరాలివీ.. తనకల్లు మండలం చెక్కవారిపల్లి సమీపంలోని తెల్ల గరుగుగుట్టపై ఏడు కుటుంబాలు ఆరునెలలుగా ఉంటున్నాయి. ఈ ముఠా కుటుంబాల్లో పలువురు చిన్నపిల్లలు కూడా ఉన్నారు. బొగ్గులు కాల్చుకుంటూ ఉపాధి పొందుతున్నట్లు స్థానికులు భావించారు. ఈ క్రమంలో చెంచుగాడు అనే ఈ ముఠా సభ్యుడొకరు ఇటీవల పాణ్యం పోలీసులకు చిక్కాడు. అతడిచ్చిన సమాచారంతో ఈ ముఠా గుట్టు బయటపడింది. చెంచుగాడిని వెంటబెట్టుకుని నాలుగు రోజుల క్రితం పాణ్యం పోలీసులు కదిరికి వచ్చారు. దొంగల స్థావరాన్ని కనిపెట్టేందుకు డ్రోన్ల సాయం తీసుకున్నారు. కదిరి రూరల్ సీఐ నాగేంద్ర ఆధ్వర్యంలో ముగ్గురు ఎస్ఐలు, 70మంది పోలీసులు, 50మంది స్థానిక యువకులు ఆదివారం రాత్రి వలలు తీసుకుని అటవీ ప్రాంతానికి వెళ్లారు. సోమవారం తెల్లవారుజామున ఆకస్మిక దాడులు నిర్వహించి.. ఏడుగురు దొంగలను అదుపులోకి తీసుకున్నారు. మారణాయుధాలు, నగదు, కొంత బంగారం స్వాధీనం చేసుకున్నారు.

కరడుగట్టిన ముఠా..

నిందితులు పల్నాడు, గుంటూరు, కర్నూలు, కడప, అనంతపురం, చిత్తూరు, తెలంగాణ, కర్ణాటక ప్రాంతాల్లో కూడా పలు నేరాలకు పాల్పడి అంతర్రాష్ట్ర ముఠాగా పోలీసు రికార్డుల్లో నమోదయ్యారు. పెద్ద ఎత్తున దారి దోపిడీలు, దొంగతనాలు చేశారని, అత్యాచారాలు, హత్యలకు పాల్పడ్డారని తెలుస్తోంది. ఇటీవల ఉమ్మడి అనంతపురం, కర్నూలు జిల్లాల్లో రెండు జంటలపై దాడిచేసి హత్య చేశారనే ఆరోపణలున్నాయి. ఒక్కొక్కరిపై 20 నుంచి 30 కేసులు నమోదైనట్లు సమాచారం. వీరిలో ఇద్దరు జీవిత ఖైదీలు ఉండగా, ఒకరు గుంటూరు జైలు నుంచి పారిపోయినట్లు సమాచారం. ఇందుకు సంబంధించి త్వరలోనే పోలీసులు మరిన్ని వివరాలు వెల్లడించే అవకాశాలు ఉన్నాయి.

పది తులాల బంగారం స్వాధీనం

దొంగల ముఠాను పోలీసులు అడవిలో పట్టుకున్నారని తెలియగానే సమీప గ్రామాల ప్రజలు, విలేకరులు ఆ ప్రాంతానికి వెళ్లారు. పోలీసులు ఎవరినీ అటవీ ప్రాంతంలోనికి రానివ్వలేదు. దొంగల స్థావరంలో మారణాయుధాలతోపాటు ఒక సంచి నిండా నగదు, బంగారాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారని వదంతులు వ్యాపించాయి. నిందితులను పోలీసు వాహనాల్లో కదిరికి తరలించారు. అనంతరం సున్నపుగుట్ట తండా వద్దకు తీసుకెళ్లి విచారించారు. అక్కడి నుంచి రాయచోటి మార్గంలో పాణ్యంకు తరలించారు. పాణ్యం పోలీసులకు సహకరించి, వివిధ కేసుల్లో ముద్దాయిలుగా ఉన్న అంతర్రాష్ట్ర దొంగలను అదుపులోకి తీసుకున్నామని కదిరి రూరల్ సీఐ నాగేంద్ర తెలిపారు. వారిని పాణ్యం పోలీసులకు అప్పగించామన్నారు. నిందితుల వద్ద పది తులాల బంగారం లభించిందని తెలిపారు.

నా హత్యకు 'పెద్దిరెడ్డి' కుట్ర

» నెల్లూరు టీడీపీ నేత అంకయ్యచౌదరి ఆరోపణ

» రామచంద్రారెడ్డి, మిథున్‌రెడ్డి, ద్వారకానాథరెడ్డిపై ఫిర్యాదు

ములకలచెరువు, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): 'పెద్దిరెడ్డి కుటుంబం నన్ను చంపాలని చూసింది. నాపై దాడి, కిడ్నాప్ విషయం టీవీల్లో రావడంతో చంద్రబాబు జోక్యం చేసుకున్నారు. ఎస్పీతో మాట్లాడారు. దాంతో నేను ప్రాణాలతో బయటపడ్డా' అని నెల్లూరుకు చెందిన టీడీపీ నేత, శ్రీకాళహస్తి నియోజకవర్గ పరిశీలకుడు మక్కెన అంకయ్య చౌదరి పేర్కొన్నారు. సోమవారం ఆయన తంబళ్లపల్లె నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి దాసరిపల్లి జయచంద్రారెడ్డితో కలసి ఎస్ఐ నరసింహుడుకు రాతపూర్వక ఫిర్యాదు చేశారు. పుంగనూరు ఎమ్మెల్యే, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకానాథరెడ్డి, రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డితో పాటు వైసీపీ నాయకులపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో కోరారు. అంతకుముందు విలేకరుల సమావేశంలో అంకయ్యచౌదరి మాట్లాడారు. '2023లో జరిగిన పట్టభద్రుల తూర్పు రాయలసీమ ఎమ్మెల్సీ అభ్యర్థిగా టీడీపీ అధిష్ఠానం ఆదేశాల మేరకు ఎమ్మెల్సీ శ్రీకాంత్ సూచనలతో పార్టీ అవసరాల కోసం స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేశా. 2023 మార్చి 13న పోలింగ్ సరళిని పరిశీలించేందుకు పుంగనూరు, తంబళ్లపల్లె నియోజకవర్గాలకు వచ్చా. అనంతరం కురబలకోట, పెద్దమండ్యం మండలాల్లో పోలింగ్ కేంద్రాల్లో రిగ్గింగ్ జరుగుతోందని, దొంగ ఓట్లు వేస్తున్నారని సమాచారం రావడంతో అక్కడికి వెళ్లా. గుర్తింపు కార్డులు లేకుండా ఓట్లు ఎలా వేయిస్తున్నారని పోలింగ్ అధికారులను ప్రశ్నించి, దొంగఓట్లు వేయకుండా అడ్డుకున్నా. అక్కడి నుంచి బయలుదేరుతుండగా వైసీపీ నాయకులు దాడిచేశారు. టీడీపీ నాయకులు, పోలీసులు రక్షించి కారులో ఎక్కించి అక్కడి నుంచి పంపారు. తంబళ్లపల్లె దాటక ముందే 10 నుంచి 15 కార్లలో వైసీపీ నాయకులు వెంబడించారు. ముదివేడు క్రాస్‌కు వచ్చేసరికి కార్లు అడ్డుపెట్టి నా కారును ధ్వంసం చేశారు. సెల్‌ఫోన్లు, ఉంగరాలు లాక్కుని కిడ్నాప్ చేసి అడవిలోకి తీసుకెళ్లారు. పెద్దిరెడ్డి కుటుంబం నన్ను చంపేయమని చెప్పినట్లు వైసీపీ నాయకులు చెప్పారు. ఈ ఘటన గురించి టీవీల్లో రావడంతో చంద్రబాబు జోక్యం చేసుకుని ఎస్పీతో మాట్లాడారు. దాంతో బయటపడ్డా' అని అంకయ్య చౌదరి వివరించారు.

జీఆర్ఎంబీ చైర్మన్‌గా బన్నుమణి ప్రసాద్ పాండే

అమరావతి, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): గోదావరి నదీ యాజమాన్య సంస్థ(జీఆర్ఎంబీ) చైర్మన్‌గా బన్నుమణి ప్రసాద్ పాండే బాధ్యతలు స్వీకరించారు. కృష్ణా నదీ యాజమాన్య సంస్థ(కేఆర్ఎంబీ) చైర్మన్‌గా అదనపు బాధ్యతను స్వీకరించారు. సోమవారం హైదరాబాద్ జలసౌధ కార్యాలయంలో ఆయన పై రెండు బాధ్యతలూ చేపట్టారు.

శాడిస్టు సైకోలు!



జగన్ సతీమణిపై అసభ్య వ్యాఖ్యలు చేసిన సొంత పార్టీ కార్యకర్తనే అరెస్టు చేశారు కదా... మరి, కూటమి నేతల కుటుంబ సభ్యులపై అసభ్య పోస్టులు పెడుతున్న ఈ 'ఉన్మాది' సంగతేమిటి? ఇది... టీడీపీ అభిమానుల ప్రశ్న.



ఎప్పుడో పశ్చిమ బెంగాల్‌లో జరిగిన ఎన్నికల రిగ్గింగ్ దృశ్యమిది. దీనిని పులివెందుల జడ్పీటీసీ ఎన్నికల్లో జరిగినట్లుగా చూపించేశారు.



రాజధాని మునిగిందంటూ రోత పత్రికలో ప్రచురించిన ఫొటో ఇది. ఇందులో... కట్టడాలున్న చోట చుక్క నీరు కూడా నిలవలేదని స్పష్టంగా తెలుస్తోంది. వర్షపు నీరు నిలిచిన చోటు... అచ్చంగా పొలాల్లో! భారీ వర్షాలు కురిసినప్పుడు పొలాల్లో నీరు నిలవడం అత్యంత సహజం. అయినా సరే... అమరావతి మునిగిపోయిందంటూ రోత మీడియా గోల చేస్తూనే ఉంది.



వాగులో నీళ్లు పొంగినా సరే... వైసీపీ బ్యాచ్ ఊరుకోదు. ఈ కొండవీటి వాగు ఫొటోను చూపిస్తూ దీని కారణంగా పొన్నూరు మొత్తం నీట మునిగిపోయిందని వైసీపీ ప్రచారం చేసింది. ఇక... జాతీయ రహదారిపై ఉన్న కాజా టోల్‌గేట్ వద్ద ఒకవైపున కొంత భాగాన్ని వర్షపు నీరు ముంచెత్తగా, రాజధానికి రాకపోకలు కట్ అంటూ పైశాచిక ఆనందం పొందింది.

ఫేక్ ప్రచారంతో రెచ్చిపోతున్నారు.. జగన్ రోత పత్రికలో తప్పుడు రాతలు.. సోషల్ మీడియాలో కుళ్లు పోస్టులు

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

ఒకవైపు జగన్ రోత మీడియా... మరోవైపు వైసీపీ సోషల్ మీడియా! తప్పుడు ప్రచారాలతో, అసత్యాలు, అర్ధసత్యాలు, వక్రీకరణలతో రెచ్చిపోతున్నాయి. రాజధాని అమరావతి మొదలుకొని విశాఖలో పెట్టుబడుల దాకా ప్రతి అంశంపైనా బురదజల్లడమే పనిగా పెట్టుకున్నాయి. తాము చెప్పేది అబద్ధమని తెలిసీ... ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నాయి. 'ఇదీ అసలు నిజం' అని ప్రభుత్వం పదేపదే చెబుతున్నా... తప్పుడు వార్తలను ప్రచారం చేస్తున్నాయి.

కూటమి నేతల వ్యక్తిత్వ హననం

కూటమి నేతలు లోకేశ్, బాలకృష్ణ, పవన్ కల్యాణ్ తదితరులతో పాటు వారి కుటుంబ సభ్యులనూ కించపరిచే పోస్టులూ ఇటీవల పెరిగిపోయాయి. సామాజిక మాధ్యమాల్లో ఫేక్ ఐడీలతో మహిళల మార్ఫింగ్ ఫొటోలతో అసభ్యకరమైన పద జాలంతో ఈ దుష్ప్రచారం చేస్తుండటం గమనార్హం. సీఎం సతీమణి, భువనేశ్వరి, లోకేశ్ సతీమణి బ్రాహ్మణిల మార్ఫ్‌డ్ ఫొటోలను పెట్టి విషప్రచారం చేస్తున్నారు.

మాజీ మంత్రులే...

ఇటీవల జరిగిన పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ ఎన్నికల్లో ఘోరపరాజయంతో వైసీపీ నేతలు అసత్య ప్రచారాలను మొదలుపెట్టారు. మాజీ మంత్రి, సీనియర్ నేత అంబటి రాంబాబు స్వయంగా ఈ దుష్ప్రచారంలో భాగం కావడం గమనార్హం. ఎక్కడో పశ్చిమ బెంగాల్‌లో జరిగిన పోలింగ్ వీడియోను చూపిస్తూ పులివెందులలో దొంగ ఓట్లు వేస్తున్నారంటూ అంబటి ప్రచారం చేశారు. పశ్చిమ బెంగాల్‌లో ఉపయోగించిన బ్యాలట్ రంగు, పులివెందులలో ఉపయోగించిన బ్యాలట్ రంగు వేర్వేరుగా ఉండటంతో ఇది ఫేక్ వీడియోగా నిర్ధారణ అయ్యింది. టీడీపీ నేతలు ఎదురుదాడి చేయడంతో వైసీపీ నేతలు అభాసుపాలయ్యారు. ఒంటిమిట్టలో టీడీపీ నేతలు డబ్బులు పంచుతున్నారంటూ వైసీపీ చూపిన వీడియో కూడా బిహార్‌లో చిత్రీకరించిందే!

మతపరమైన ఉద్రిక్తతలను రెచ్చగొట్టేలా...

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచీ రాష్ట్రంలో మతపరమైన, కులపరమైన ఉద్రిక్తతలను రెచ్చగొట్టేందుకు వైసీపీ బ్యాచ్ ప్రయత్నిస్తోంది. గతంలో శ్రీవారి పింక్ డైమండ్‌ను చంద్రబాబు ఎత్తుకెళ్లారని ఫేక్ ప్రచారం చేసిన వైసీపీ తాజాగా రాష్ట్రంలో ఏ సంఘటన జరిగినా దాన్ని మతపరమైన ఉద్రిక్తతలను రెచ్చగొట్టేందుకు ఉపయోగించుకునేందుకు ప్రయత్నిస్తోంది. పాస్టర్ ప్రవీణ్ మృతి, తిరుపతిలోని గోశాలలో ఆవులు చనిపోవడం, తిరుమల క్యూలైన్లలో ఆకలిదప్పులతో భక్తులు అల్లాడిపోతున్నారనడం... ఇలా ప్రతి అంశంపై విషం చిమ్మే ప్రయత్నం చేసింది. తాజాగా బస్సులో ప్రయాణిస్తున్న ఓ వ్యక్తి తన మతాన్ని సూచించే టోపీ చేతిలో పెట్టుకుంటే, పక్కనే ఉన్న వ్యక్తి ఎందుకు అలా పెట్టుకున్నావని అడిగినట్లు.. టోపీ పెట్టుకుంటే బస్సులో నుంచి గెంటేస్తారని ఆ వ్యక్తి చెబుతున్న వీడియోను సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేస్తోంది. రాష్ట్రంలో ముస్లింలు స్వేచ్ఛగా తిరిగే పరిస్థితి లేదంటూ వైసీపీ విషప్రచారం చేస్తోంది. కొందరు యూట్యూబర్లు చిత్రీకరించిన ఈ వీడియోను వైసీపీ తమ ఫేక్ ప్రచారానికి అస్త్రంగా వాడుకోవడం గమనార్హం.

మొదటి నుంచీ అదే తంతు..

వైసీపీ తొలి నుంచీ ఫేక్ ప్రచారాన్నే నమ్ముకుంది. 2014-19 మధ్య ఐ-ప్యాక్ డైరెక్షన్‌లో పెద్ద ఎత్తున విషప్రచారం చేసి అధికారంలోకి వచ్చింది. ఆ తర్వాతా ఫేక్ ప్రచారాన్ని వీడలేదు. వైసీపీ అధికారంలో ఉన్న సమయంలో తమకు వ్యతిరేక తీర్పులు ఇచ్చిన హైకోర్టు జడ్జీలపై తప్పుడు ప్రచారం చేశారు. జస్టిస్ ఎన్వీ రమణ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా నియమితులు కాకుండా ఆయనపై తప్పుడు లేఖలు రాశారు. ఇప్పుడు అధికారం కోల్పోయినా ఫేక్ బుద్ధులు మారలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొలి రోజుల్లో వైసీపీ హయాంలో రెచ్చిపోయిన సోషల్ మీడియా ఫేక్ ఐడీలను చాలా వరకు నియంత్రించారు. ఫేక్ ప్రచారాలు చేసే వారిపై కఠినంగా వ్యవహరించడం మొదలుపెట్టారు. సొంత పార్టీకి చెందిన వారైనా వదలకుండా కూటమి పెద్దలు కేసులు పెట్టడంతో చాలా వరకు ఫేక్ ప్రచారాలకు తెరపడింది. తాజాగా మళ్లీ వైసీపీ అనుకూల మీడియా ఫేక్ ప్రచారాలతో రెచ్చిపోతోంది. కూటమి ప్రభుత్వం ఇలాంటి బ్యాచ్‌లపై కఠినంగా వ్యవహరించకపోతే రాజకీయంగా నష్టం జరగడమే కాదు, రాష్ట్రాభివృద్ధి కూడా దెబ్బతినే ప్రమాదముంది!

పెట్టుబడులపైనా అక్కసు

అధికారంలో ఉండగా పెట్టుబడిదారులను బెదిరించి, భయపెట్టిన వైసీపీ నేతలు... ఇప్పుడు వస్తున్న పెట్టుబడులపైనా తప్పుడు ప్రచారం చేస్తున్నారు. టీసీఎస్‌కు విశాఖలో భూములు కేటాయిస్తే దానిపై ఫేక్ ప్రచారం చేయడమే కాకుండా తమకు అనుకూలమైన వ్యక్తులతో కోర్టుల్లో కేసులు వేయించారు. పిటిషన్ వేసిన వారిని కోర్టు తప్పుపట్టినా వైసీపీ తప్పుడు ప్రచారం మాత్రం ఆగడం లేదు. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించే 'స్త్రీశక్తి' పథకంపైనా వైసీపీ మీడియా ఫేక్ ప్రచారం చేస్తోంది. వైసీపీ అనుకూల మహిళలను ఉచిత పరిధిలోకి రాని డీలక్స్ బస్సులు, ఏసీ బస్సుల్లోకి ఎక్కించి, తమకు 'ఫ్రీటికెట్' ఇవ్వలేదని, తమను చంద్రబాబు మోసం చేశారంటూ తిట్టిపోయిస్తున్నారు.

వరదలనూ వదల్లేదు..

ఎగువ రాష్ట్రాల్లో కురుస్తున్న వర్షాలతో కొద్దిరోజులుగా కృష్ణా నదికి వరద పోటెత్తుతోంది. గుంటూరు, కృష్ణా జిల్లాల్లోనూ భారీగానే వర్షాలు కురిశాయి. ఇదే అదునుగా వైసీపీ ఫేక్ ప్రచారానికి తెరదీసింది. రాజధానిపై తమ అక్కసునంతా వెళ్లగక్కుతూ వరదలకు రాజధాని మునిగిపోయిందంటూ సొంత మీడియాతోపాటు అనుకూల మీడియాలో, సామాజిక మాధ్యమాల్లో దుష్ప్రచారానికి తెరదీశారు. రాజధాని ప్రాంతంలో కట్టడాలున్న ప్రాంతంలో ఒక్క చుక్క నీరు కూడా నిలవలేదు. ఖాళీ స్థలాలు, పొలాల్లో మాత్రం వర్షపు నీరు నిలిచింది. పంట పొలాల్లో వర్షపు నీరు చేరడం అత్యంత సహజం. ఇలా నిలిచిన నీళ్లను, దూరంగా ఉన్న కట్టడాలను కలిపి ఫొటో తీసి... 'అమరావతి మునిగిపోయింది' అని సైకోల్లా సంబరాలు చేసుకుంటున్నారు. రాజధాని ప్రాంతంలో ప్రస్తుతం రూ.52వేల కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. ఇది జీర్ణించుకోలేకనో... అమరావతిపై అక్కసుతోనో... రాజధాని మునిగిపోయిందంటూ ఫేక్ ఫొటోలు, మార్ఫింగ్ ఫొటోలతో ప్రచారం చేయడం ప్రారంభించారు. హైదరాబాద్‌లో ఉన్న కొంతమందితో అమరావతి మొత్తం మునిగిపోయిందంటూ డిబేట్లు పెట్టి మరీ దుష్ప్రచారం చేస్తున్నారు. ఇక అమరావతిని వరద నుంచి కాపాడేందుకు... గుంటూరు చానల్ నీటిని మళ్లించి పొన్నూరును ముంచేశారని మరో తప్పుడు ప్రచారానికి తెరలేపారు. అసలు గుంటూరు కాలువకు నీరే విడుదల చేయలేదని అధికారులు తేల్చి చెప్పి... ఈ ఫేక్ ప్రచారంపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. మరోవైపు ప్రకాశం బ్యారేజీ గేటు దెబ్బతినిందని, ఈ కారణంగా బ్యారేజీ మనుగడకే ముప్పు పొంచి ఉందని, ఏ క్షణాన్నైనా బ్యారేజీ గేట్లు కొట్టుకుపోయి విజయవాడ మునిగిపోతుందంటూ వైసీపీ అనుకూల మీడియా ప్రచారం చేసింది. 2009 సెప్టెంబరులో ప్రకాశం బ్యారేజీకి 11.06 లక్షల క్యూసెక్కుల వరద నీరు వచ్చింది. అయినా బ్యారేజీ చెక్కుచెదరలేదు. ప్రస్తుతం అందులో నాలుగో వంతు కూడా వరద లేదు. అయినా బ్యారేజీపై నీలి మీడియా దుష్ప్రచారం చేసింది.

విషం చిమ్మేవారితో జాగ్రత్త!



"మనం చేసే మంచి ఒక్కటే చెబితే సరిపోదు. చెడు చేసే వారి గురించి కూడా ప్రజలను చైతన్యపరచాలి. రాజధాని కోసం పొన్నూరును ముంచారని, కొండవీటి వాగు ఎత్తిపోతల పంపులు పనిచేయడం లేదని , గేటు పనిచేయక ప్రకాశం బ్యారేజీ ప్రమాదంలో పడిందని వైసీపీ తన సొంత టీవీ, పత్రికలతోపాటు అనుబంధ మీడియా, సోషల్ మీడియాల్లో అసత్యాలు ప్రచారం చేయిస్తోంది. తప్పుడు వార్తలతో ప్రభుత్వాన్ని అప్రతిష్ఠపాల్జేసే లక్ష్యంతో రోజూ పనిచేస్తున్నారు." - చంద్రబాబు

» టెలికాన్ఫరెన్స్‌లో టీడీపీ నేతలకు చంద్రబాబు దిశానిర్దేశం

అమరావతి, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): "రాష్ట్రంలో నేరచరిత్ర కలిగిన ఒక పార్టీ ఉంది. వాళ్ల పని నిత్యం విషం చిమ్మడమే. తప్పుడు ప్రచారాలను ఎప్పటికప్పుడు ఖండించాలి. మంత్రులు, పార్టీ నేతలు ఈ విషయంలో మరింత చొరవ చూపాలి. లేకపోతే ప్రజలు ఆ తప్పుడు ప్రచారాలనే నిజమని నమ్మే ప్రమాదం ఉంది" అని ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యాఖ్యానించారు. టీడీపీ ఎమ్మెల్యేలు, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, పార్లమెంటు అధ్యక్షులు, కో-ఆర్డినేటర్లు, జోనల్ కో-ఆర్డినేటర్లు, గ్రామ, మండల స్థాయి కార్యకర్తలతో చంద్రబాబు సోమవారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా రాజధానిలో వరద అంటూ, 'స్త్రీశక్తి'ని పరిమితం చేశారంటూ వైసీపీ, ఆ పార్టీ అనుకూల మీడియా చేస్తున్న దుష్ప్రచారాన్ని సీఎం ప్రస్తావించారు. వైసీపీ తన సొంత టీవీ, పత్రికలతోపాటు అనుబంధ మీడియా, సోషల్ మీడియాల్లో అసత్యాలు ప్రచారం చేయిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మనం చేసే మంచి గురించి మాట్లాడడమే కాదు.. చెడు చేసే వారి గురించీ ప్రజలను చైతన్యపరచాలన్నారు. రాజకీయ ముసుగులో ఉండే రౌడీలను కట్టడి చేయాలని.. వారిపట్ల కఠినంగా ఉంటామని స్పష్టం చేశారు. వైసీపీ అసత్య ప్రచారాలను దృష్టిలో పెట్టుకుని ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఇన్‌చార్జులు, కార్యకర్తలు మరింత క్రమశిక్షణతో ఉండాలని ఆదేశించారు. 'ఎమ్మెల్యేలు, ఎంపీలు, నేతలు మరింత బాధ్యతగా ఉండాలి. మీ మాట, మీ చర్య పార్టీకి, ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చేలా ఉండకూడదు. వివాదాలకు ఆస్కారం ఇవ్వకూడదు. అమలుచేస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు చేపట్టిన 'సుపరిపాలనలో తొలి అడుగు' విజయవంతమైంది. రాష్ట్రంలో 1.24 కోట్ల కుటుంబాలను నేరుగా కలిశాం. అన్ని ప్రాంతాల నుంచి వచ్చిన సమాచారం ఆధారంగా చూస్తే ప్రభుత్వ పథకాల పట్ల ప్రజల్లో సానుకూలత వ్యక్తమవుతోంది. ప్రభుత్వ పాలనపై ఇదొక పాజిటివ్ సైన్. ఎన్నికల్లో చెప్పిన విధంగా సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తున్నాం కాబట్టే ఈ స్థాయి సంతృప్తి వ్యక్తమైంది. ప్రభుత్వం చేస్తున్న మంచి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లండి. దీని కోసం నాయకులు ఎప్పుడూ ప్రజల్లోనే ఉండాలి' అని ఆదేశించారు.

కష్టపడిన వారికే పదవులు

'పార్టీ పదవులైనా.. నామినేటెడ్ పదవులైనా పార్టీ కోసం కష్టపడ్డ కార్యకర్తలతోనే భర్తీ చేస్తున్నాం. వ్యవసాయ మార్కెట్ కమిటీలు, కార్పొరేషన్లకు ఛైర్మన్లను నియమించాం. ఇతర పదవుల భర్తీ కూడా త్వరలోనే పూర్తి చేస్తాం. పార్టీ కమిటీలను సాధ్యమైనంతవరకు ఈ నెలాఖరుకు పూర్తి చేయాలి. ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జులతో ముఖాముఖి సమావేశాలు నిర్వహిస్తున్నాం. వారి మంచి చెడులను వివరించి, పొరపాట్లు ఉంటే సరిదిద్దుకోవాలని సూచిస్తున్నాం. పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ ఉప ఎన్నికల్లో పార్టీ విజయానికి కార్యకర్తలు, నేతలు కృషి చేశారు. వారికి అభినందనలు. టీడీపీ అభ్యర్థులను గెలిపించి కాలర్ ఎగరేసుకుని తిరిగేలా, గర్వపడేలా అంతా పనిచేశారు. 'వివేకానందరెడ్డికి న్యాయం చేయండి', '30 ఏళ్ల తర్వాత ఓటు వేసే అవకాశం కల్పించినందుకు దండాలు' అంటూ బ్యాలెట్ బాక్సుల్లో రాసి వేశారు. ఇది పులివెందులలో పరిస్థితికి అద్దం పడుతోంది. నామినేషన్ల నుంచి పోలింగ్ వరకు చట్టబద్ధంగా వ్యవస్థలు పనిచేశాయి. కాబట్టే అంతమంది పోటీ చేశారు. అంతమంది స్వేచ్ఛగా ఓట్లు వేశారు. రాబోయే రోజుల్లో ఏ ఎన్నిక వచ్చినా కూటమి అభ్యర్థులు గెలవాలి. ప్రజలతో మమేకమై, వారి అవసరాలు తీర్చి, సమస్యలు పరిష్కరిస్తే ప్రతి ఎన్నికల్లోనూ సునాయాసంగా గెలుస్తాం' అని చంద్రబాబు ధీమా వ్యక్తం చేశారు.

వారు తీవ్రవాదులతో సమానం

» దుష్ప్రచారం చేసేవారిపై నిమ్మల ఫైర్



అమరావతి/పాలకొల్లు అర్బన్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): అమరావతితో సహా రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లో ముంపు వదంతులు సృష్టిస్తే సహించేది లేదని, ప్రశాంత ప్రజా జీవనానికి భంగం కలిగిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని మంత్రి నిమ్మల రామానాయుడు హెచ్చరించారు. ప్రజలకు ముంపు భయం వద్దని, పరిస్థితి పూర్తి అదుపులో ఉందని భరోసా ఇచ్చారు. రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాలకు లోతట్టు ప్రాంతాల్లో ముంపు ముప్పు లేకుండా చర్యలు చేపడుతున్నామని స్పష్టం చేశారు. వరద వస్తోందంటూ దుష్ప్రచారం చేసేవారెవరైనా తీవ్రవాదులతో సమానమన్నారు. ఈ వదంతులను నమ్మవద్దని కోరారు. ప్రజల్లో లేనిపోని అపోహలు సృష్టించడం, ఆందోళనకు, భయభ్రాంతులకు గురి చేయడం క్షమించరాని నేరమని ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సోమవారం పాలకొల్లులోనూ మీడియాతో ఆయన మాట్లాడారు. రాజధాని నగర ప్రాంతంపై వైసీపీ వెనుకుండి వివిధ మాధ్యమాల ద్వారా విషప్రచారం చేయిస్తోందని విమర్శించారు. పోలవరం కాఫర్ డ్యామ్‌కు గండి పడిందని, బుడమేరు పొంగి ప్రవహిస్తోందని, విజయవాడకు మళ్లీ వరద ముప్పు ఉందని అభూత కల్పనలతో దుష్ప్రచారం చేస్తోందని విమర్శించారు. పొన్నూరులో పొలాల మునకకు కారణం కొండవీటి వాగు మళ్లింపు కాదని, 24 గంటల వ్యవధిలో 200 మిల్లీమీటర్ల వర్షపాతంతో వర్షపునీరు పొంగి ప్రవహించిందని వెల్లడించారు. కొండవీటివాగు వరద నీటిని పంపింగ్ ద్వారా నదిలోకి మళ్లిస్తున్నామని వివరించారు. కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువ, గుంటూరు చానల్, అప్పాపురం చానల్‌ను వర్షాల కారణంగా మూసివేసినట్టు వివరించారు. గుంటూరు చానల్‌కు కూడా కొండవీటివాగు నుంచే నీరందుతోందని, జగన్ హయాంలో యాజమాన్య నిర్వహణ లేకపోవడం వల్ల సమస్యలు తలెత్తాయని, వాటిని కూడా సరిచేశామని తెలిపారు. రాజధాని ప్రాంతానికి ముంపు ముప్పులేదని ప్రజలు గ్రహించాలని కోరారు. భద్రతా చర్యల్లో భాగంగా 80 టీఎంసీలు మాత్రమే నిల్వచేయాలని తుంగ భద్ర బోర్డు నిర్ణయం తీసుకుందని నిమ్మల వివరించారు. తుంగభద్ర ప్రాజెక్టు ప్రమాదంలో ఉందనటం పూర్తి అవాస్తవమని రామానాయుడు స్పష్టం చేశారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao,on behalf of Aamoda Publications Pvt.Ltd., Aamoda Press, Door no.1078, Vengalayapalem village, Guntur Rural Mandal,Guntur, Editor: N.Rahul Kumar Phone No: (0863)2512379,2512376 , RNI no.APTEL/2003/9781. Managing Director : Vemuri Radha Krishna. Founder: K.L.N.Prasad.